



# బోల్షివిక్

సంచిక: 4 సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.ఒ.బి. సమాచార పత్రిక జులై-డిసెంబర్ 2014

## లోపలి పేజీల్లో...


విలీన ప్రకటన..... .......... 03

బోల్షెవీకరణలో భాగంగా... .......... 05

రష్యా అక్టోబర్ విప్లవ.... .......... 09

బోల్షెవీకరణలో భాగంగా పి.ఎల్.జి.ఎ... .......... 13

కరపత్రం/పత్రిక ప్రకటన ..........14

సి.సి ప్రకటన ..........22

అమరుల చరిత్ర ..........34

పోరాట స్రవంతి ..........43

# మీ త్యాగాల వెలుగులో ప్రజాయుద్ధ మార్గం ప్రకాశవంతమైంది. లక్ష్యం చేరేదాక మీరు చూపిన మార్గాన్ని వదలం.

భారత దేశంలో ప్రస్తుతం నెలకొని వున్న అర్ధ భూస్వామ్య, అర్ధవలస సమాజాన్ని కూకటివేళ్ళతో పెళ్ళగించి నూతన ప్రజాస్వామిక వ్యవస్థనూ, ఈ క్రమంలో సోషలిజాన్ని, అంతిమంగా కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో సి.పి.ఐ మావోయిస్టు పార్టీ నేతృత్వంలో ప్రజలు వీరోచితంగా ఉద్యమిస్తున్నారు. ఈ ఉద్యమాన్ని అణచి వేసి తమ అధికారాన్ని సుస్థిరం చేసుకొనేందుకూ, దోపిడీ పీడనలను కొనసాగించేందుకు ఈ దేశ దోపిడీ పాలక వర్గాలైన దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు, వారి యజమానులైన సామ్రాజ్యవాదులు తమ రాజ్యాంగ యంత్రం ద్వారా పార్టీపైన, పి.ఎల్.జి.ఎ.పైన, ప్రజలపైన తీవ్రమైన సాయుధ అణిచివేతను కొనసాగిస్తున్నారు. ఈ అణచివేత 2009 సెప్టెంబర్ నుండి గ్రీన్‌హంట్ బహుముఖ, సైనిక దాడి రూపంలో మరింత తీవ్రతరం అయింది. ఈ దాడి అత్యంత పాశవికంగా, కౄరంగా, మోసపూరితంగా కొనసాగుతున్నది. విరుద్ధ ప్రయోజనాలకోసం జరుగుతున్న ఈ యుద్ధంలో ప్రజల రాజ్యాధికారాన్ని నెలకొల్పే లక్ష్యంతో దోపిడి వర్గాల రాజ్యంతో వీరోచితంగా పోరాడుతూ అనేక మంది ప్రజల ఉత్తమ పుత్రులు, పుత్రికలు తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తున్నారు. చరిత్ర పురోగమనానికి తమ వంతు కర్తవ్యంగా వీరోచితమైన త్యాగాలను చేస్తూ గొప్ప విప్లవ సాంప్రదాయాలను నెలకొల్పుతున్నారు. 2014 జూన్ నుండి డిసెంబర్ వరకు దేశవ్యాప్తంగా పదుల సంఖ్యలోనే పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజాసంఘాల సభ్యులు, నాయకత్వంతో పాటు సాధారణ ప్రజలు నేలకొరిగారు. ఎ.ఒ.బిలో కా॥ శరత్, కా॥ మంగరాజు, కా॥ లాలు, కా॥ పూర్ణొ, కా॥ గణపతిలు అమరులైనారు. వీరితో పాటు ఎ.పిలో కా॥ అశోక్, కా॥ భారతి, కా॥ విమలలు అమరులయ్యారు. మన ఈ కామ్రేడ్స్ అమరత్వం పార్టీకి, ఉద్యమానికి ఎనలేని నష్టాన్ని కల్పించింది. వారి కుటుంబాలకు, శ్రేయోభిలాషులకు తీవ్రమైన దు:ఖాన్ని నింపింది. ఈ పరిస్థితులలో అమరుల కుటుంబాల, శ్రేయోభిలాషుల దు:ఖంలో పాల్పంచుకుంటూ, వారికి ఎస్.జడ్.సి ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేస్తున్నది. అలాగే అమరుల ఆశయాలను సఫలీకృతం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ, వారికి తలవంచి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

మన అమరుల త్యాగాలు మన వెంటనే వున్నాయి. వారి త్యాగాలతో మన మార్గం ప్రకాశవంతమైంది. మన పురోగమనంలో వారు ఇస్తున్న ఉత్తేజం మనకు నూతన శక్తినీ, చైతన్యాన్ని అందిస్తున్నది. వారు అందుకే సదా చిరస్మరణీయులు.

## సి.పి.ఐ (మావోయిస్టు), సి.పి.ఐ (ఎమ్.ఎల్) నక్సల్బరీల విలీన ప్రకటన

# భారత దేశంలో మావోయిస్టు పార్టీలు ఒకే పార్టీగా విలీనం కావటాన్ని ఎత్తిపట్టండి!!

ప్రపంచ కార్మికవర్గ అంతర్జాతీయ దినం అయిన, ప్రతిష్టాత్మకమైన మేడే సందర్భంగా భారత కమ్యూనిస్టులం అయిన మేము గొప్ప బాధ్యతతో, దృఢమైన విశ్వాసంతో సి.పి.ఐ (మావోయిస్టు), సి.పి.ఐ (ఎమ్.ఎల్) నక్సల్బరీ పార్టీలు ఒకే పార్టీగా సి.పి.ఐ (మావోయిస్టు)లో విలీనాన్ని ప్రకటిస్తున్నాము. ఈ విలీనం ప్రపంచ కార్మికవర్గంలో అంతర్భాగంగా ఉన్న భారత కార్మికవర్గ అగ్రగామి దళాన్ని బలోపేతం చేస్తున్నది. మమ్మల్ని మేము మరింత దృఢంగా భారత విప్లవానికి, ప్రపంచ కార్మిక వర్గ విప్లవానికి అంకితమయ్యేలా చేస్తున్నది.

మావోయిస్టు ఉద్యమం 1967 నక్సల్బరీ వెల్లువతో ఆవిర్భవించింది. మన పార్టీ వ్యవస్థాపక నాయకులు కామ్రేడ్ చారుమజుందార్, కామ్రేడ్ కన్హాయ్‌ఛటర్జీల నాయకత్వంలో, ప్రేరణతో వేలాదిగా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకుపోవటానికీ, బలమైన పార్టీని నిర్మించటానికి తమ ప్రాణాలను అర్పించారు.

1970ల మొదట్లో విప్లవోద్యమ వెనకడుగు, కా॥ చారుమజుందార్ అమరత్వం తర్వాత కమ్యూనిస్టు విప్లవ శక్తులు అనేక గ్రూపులుగా విడిపోయారు. నిజమైన విప్లవకారులు తమ ప్రాంతాలలో ఉద్యమాన్ని నిర్మించడానికి ప్రయత్నిస్తూనే, విప్లవకారులందరినీ ఒకే పార్టీలో ఐక్యం చేయడానికి తీవ్రంగా కృషి చేసారు. ఇందులో భాగంగా గత నాలుగు దశాబ్దాల్లోని పురోగతి వల్ల రెండు ప్రధాన స్రవంతులకు ప్రతినిధులైన ఒకప్పటి సి.పి.ఐ (ఎమ్.ఎల్) పీపుల్స్‌వార్, ఎమ్.సి.సి.ఐలు 2004 సెప్టెంబర్ 21న విలీనమై ఐక్య పార్టీగా సి.పి.ఐ (మావోయిస్టు) ఆవిర్భవించింది. సోషలిజాన్ని, అంతిమంగా కమ్యూనిజాన్ని స్థాపించడంలో ముందడుగు వేయటానికీ, విజయం సాధించటానికీ, భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవానికి నాయకత్వం వహించటానికీ, ఒకే మార్గదర్శక కేంద్రాన్ని నిర్మించడానికీ, శ్రామికులు, రైతులు, ఇతర పీడిత ప్రజల ఆకాంక్షలను గుర్తించడంలో ఇది ఒక గుణాత్మక గెంతును సూచిస్తుంది.అదే విధంగా సి.పి.ఐ(ఎమ్.ఎల్)నక్సల్బరీ, ఒకప్పటి అవకాశవాది కె.ఎన్ రామచంద్రన్ నాయకత్వం వహించిన రెడ్‌ఫ్లాగ్, విచ్ఛిన్నకారుడు కె.వేణు నాయకత్వం వహించిన సి.పి.ఐ (ఎమ్.ఎల్), సి.ఆర్.సిల రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాడుతూనే నిజమైన మావోయిస్టు శక్తులను ఐక్యం చేయడానికి తీవ్రంగా కృషి చేసింది. ఈ కృషిలో భాగంగానే సి.పి.ఐ (మావోయిస్టు), సి.పి.ఐ (ఎమ్.ఎల్) నక్సల్బరీలు ఐక్యమయ్యాయి. దాంతో సి.పి.ఐ (మావోయిస్టు) మరింత బలోపేతమైంది. అది ఎంత సుదీర్ఘకాలం తీసుకున్నప్పటికీ, ఒకవైపు పాలక వర్గాలకు, సామ్రాజ్యవాదానికీ వ్యతిరేకంగా దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో పీడిత ప్రజారాశులను సమీకరించడం, మరోవైపు మా–లె–మాకు, పార్టీకి చెందిన విప్లవ పంథాకు అంటిపెట్టుకొని ఉండటం, రివిజనిస్టులకు, వ్యతిరేకంగా పట్టుదలతో పోరాడడం ద్వారా నిజమైన మావోయిస్టు శక్తులన్నీ ఒకే పార్టీగా ఐక్యం కాగలవని నిస్సందేహంగా ఈ ఐక్యత రుజువు చేసింది. మా పార్టీ వివిధ ఎమ్.ఎల్ గ్రూపులుగా పని చేస్తున్న నిజమైన విప్లవ శక్తులను అన్నింటినీ సమైక్యం చేసే కర్తవ్యాన్ని కొనసాగిస్తుంది.

ఐక్యపార్టీ మార్క్సిజం, లెనినిజం, మావోయిజాన్ని తన మార్గదర్శక భావజాలంగా స్వీకరించి దాన్ని సృజనాత్మకంగా అన్వయించటం, రక్షించుకోవటం, ఎత్తిపట్టడం ద్వారా తన అవగాహనను పెంచుకుంటుంది. నిరంతరాయంగా తన విప్లవ ఆచరణలోని గుణపాఠాలను క్రోడీకరించుకుంటూ, ప్రపంచ కార్మిక వర్గ విప్లవంలోని వివిధ డిటాచ్‌మెంట్‌ల అనుభవాల నుండీ, ప్రపంచ వ్యాప్తంగా పోరాడుతున్న ప్రజలనుండి నేర్చుకుంటూ తన పంథాను, ఆచరణను అభివృద్ధి పరచుకుంటుంది. భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక నూతన ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాలను తన భుజాలకెత్తుకున్నది. ఈ విప్లవం సాంస్కృతిక విప్లవాల గుండా కొనసాగుతూ సోషలిజానికి తర్వాత కమ్యూనిజానికి పురోగమిస్తుంది. సాయుధ వ్యవసాయ విప్లవం ఇరుసుగా ఉన్న నూతన ప్రజాస్వామిక విప్లవానికి సామ్రాజ్యవాదం, భూస్వామ్య విధానం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారి విధానాలు లక్ష్యాలుగా వుంటాయి. విప్లవ మార్గంగా దీర్ఘకాలిక ప్రజాయుద్ధంగా ఉంటుంది. భూస్వామ్యానికి, విశాల ప్రజా రాశులకు మధ్య ఉన్న వైరుధ్యం ప్రధాన వైరుధ్యంగా ఉంటుంది. ప్రపంచ స్థాయిలో సామ్రాజ్యవాదానికి, పీడిత జాతులు, ప్రజలకు మధ్య ఉన్న వైరుధ్యాన్ని ప్రధాన వైరుధ్యంగా పరిగణిస్తుంది. ఇది ప్రపంచంలోని ఇతర మౌలిక వైరుధ్యాలతో పాటు తీవ్రతరమవుతున్నది.

ఇప్పుడు సాధించిన ఐక్యత, భారత విప్లవానికి అగ్రగామి దళంగా తన పాత్రను పరిపూర్తి చేయటానికి సి.పి.ఐ (మావోయిస్టు) శక్తిని పెంపొందిస్తుంది. సి.పి.ఐ (మావోయిస్టు) భారతదేశంలో నాలుగు దశాబ్దాల కఠినమైన పోరాటంలో, వేలాదిగా గొప్ప కమ్యూనిస్టు నాయకుల, ఎర్రయోధుల, పీడిత ప్రజల త్యాగాలతో ప్రజాయుద్ధాన్ని గెరిల్లా బేస్‌ల, విప్లవ ప్రజా కమిటీల రూపంలో ఉన్న ఎర్ర రాజ్యాధికారం స్థాయికి అభివృద్ధి పరిచింది. తూర్పు, మధ్య భారతదేశంలో ఏర్పాటు చేసిన వీటిని పి.ఎల్.జి.ఎ, ప్రజా మిలీషియా రక్షిస్తున్నాయి. ఇది ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో కేంద్రీకరించిన క్రూరమైన అణచివేత క్యాంపెయిన్లకూ, ప్రజలపై యుద్ధానికి వ్యతిరేకంగా పోరాడటం ద్వారా సాధించబడింది. ఇందులో భాగంగా వేలాదిగా ప్రజలు క్రూరమైన దాడులకు గురయ్యారు. హత్యలు, అత్యాచారాలు, గృహ దహనాలు, పంటల ధ్వంసం, బలవంతంగా నిర్వాసితులను చేయడం ఇతర అనేక అమానుషమైన చర్యలు సాధారణమయ్యాయి. ఇప్పుడు భారత రాజ్యం తన వాయుసేన, పదాతి దళాలతో గగనతలం, భూతలం నుండి దాడులను వేగవంతం చేస్తున్నది. హంతకదాడి

ఉన్నప్పటికీ ప్రజాయుద్ధం అలలుగా పురోగమిస్తున్నది. కొద్దికాలం క్రితమే భారత ద్వీపకల్పపు పశ్చిమతీరం వెంటఉన్న పశ్చిమ కనుమలు దక్షిణ భాగంలోకి జరిగిన నూతన విస్తరణ, విప్లవ జ్వాలలు భారత రాజ్యానికంతటికీ వ్యాపించడం కొనసాగి, దక్షిణాసియాలోని సామ్రాజ్యవాద స్థంభం ధ్వంసం చేయబడుతుందని రుజువు చేస్తున్నది.

ప్రపంచ వ్యాపితంగా సామ్రాజ్యవాదులు, వారికి సేవ చేసే పాలకవర్గాలు కోలుకోలేని సంక్షోభంలోకి కూరుకొని పోవడంతో, ప్రపంచ వ్యాపితంగా నెలకొని ఉన్న విప్లవ అనుకూల పరిస్థితి సామ్రాజ్యవాద ప్రపంచంలో వర్గ పోరాటాలకూ, పీడిత దేశాలలో మావోయిస్టుల నాయకత్వంలో ప్రజాయుద్ధాలకూ, ఇతర శక్తుల నాయకత్వంలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలు తీవ్రతరం కావడానికి దారి తీసింది. భారతదేశంలోని తూర్పు మధ్య భారతంలో వర్గపోరాటం తీవ్రమైన విప్లవకర ప్రజాయుద్ధ స్థాయికి చేరడం, విప్లవ ప్రత్యామ్నాయంగా ఆవిర్భవించడంతో అది విశాల పీడిత ప్రజానీకాన్ని  విప్లవం వైపు ఉత్తేజపరుస్తున్నది. ప్రజా విముక్తి గెరిల్లా సైన్యంలోకి (పి.ఎల్.జి.ఎ) సంఘటిత పరిచింది. పిండ దశలో నూతన ప్రజాస్వామిక రాజ్యాన్ని నిర్మించింది. ఈ ప్రాంతమంతటా భారత పాలకవర్గాలు ఒక వైపున 4లక్షల మంది కిరాయి సాయుధ బలగాలను మొహరించారు. పశ్చిమ కనుమలలో మొగ్గ దశలో ఉన్న విప్లవ సాయుధ పోరాటాన్ని అణచివేసేందుకు సైనికీకరణను పెంచుతున్నారు. మరోవైపు కార్మికులు, రైతులు, ఆదివాసీలు, దళితులు, మహిళలు, ఇతర అణచివేయబడిన ప్రజలపై ప్రజావ్యతిరేక గ్లోబలైజేషన్ విధానాలను బలవంతంగా రుద్దడంతో సమరశీల పోరాటాలు పెరగటానికి దారి తీస్తున్నది. పార్టీ ఈ అనుకూల పరిస్థితిని ఉపయోగించుకొని, విప్లవోద్యమాన్ని ఉన్నత స్థాయికి అభివృద్ధి చేయడానికీ, అంతర్జాతీయ కర్తవ్యాలను పరిపూర్తి చేయడానికి గట్టిగా కృషి చేస్తుంది. విప్లవోద్యమం ఎదుర్కొంటున్న సవాళ్ళను అధిగ మించేందుకు లక్షలాది మంది ప్రజలను సమీకరించడంలోనూ, గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేయడంతో పాటు విస్తృత పరచడంలోనూ  సంపూర్ణమైన కృషిని చేస్తుంది.

భారత దేశంలోనూ, అమానవీయమైన సామ్రాజ్యవాద వ్యవస్థలోనూ విశాల ప్రజా రాశులు బలవంతంగా తీవ్రమైన బాధలలోకి, దారిద్ర్యంలోకి నెట్టబడుతున్నారు. భూమిపై జీవుల వునికిని, ప్రపంచ పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారు. కమ్యూనిజం కొరకు ప్రాణత్యాగం చేసిన వేలాది అమరుల స్మృతులతో, వారి నెత్తుటితో ఎరుపెక్కిన ఎర్రజెండా క్రింద సంఘటితం అవుతున్నాము. ఈ ఐక్యత శక్తివంతమైన విప్లవ ఆయుధాన్ని సాధించిందని మేము హామి ఇస్తున్నాము.

సంతకం
గణపతి
ప్రధాన కార్యదర్శి
**సి.పి.ఐ (మావోయిస్టు)**

సంతకం
అజిత్
ప్రధాన కార్యదర్శి
**సి.పి.ఐ(ఎమ్.ఎల్)నక్సల్బరీ**
11-18 డిసెంబర్, 2013

**వివిధ సందర్భాలలో ప్రజలు పార్టీకి స్వచ్ఛందగా అందజేసిన నిధుల వివరాలు**

| ఏరియా డివిజన్ | నగదు | ధాన్యం | రాగులు | సామలు | ఇతరములు |
|---|---|---|---|---|---|
| **అమరుల కుటుంబాల సహాయార్థాలు** | | | | | |
| కలిమెల | 1600 | - | - | - | బట్టలు |
| పొడియా | 12000 | - | - | - | - |
| **రాజకీయ ఖైదీల కుటుంబాల సహాయార్థం** | | | | | |
| శ్రీకాకుళం-కోరాపుట్ | 64570 | - | - | - | - |
| కటఆఫ్ | 11970 | 141 కె.జీలు | 218 కె.జీలు | 339 కె.జీలు | - |
| పొడియా | 6000 | - | - | - | - |
| **పార్టీ ఆవిర్భావ దశాబ్ధి ఉత్సవాల సందర్భంగా** | | | | | |
| కటఆఫ్ | 4400 | - | - | - | - |

# బోల్షివీకరణలో భాగంగా పార్టీ రూపొందించిన రాజకీయ, మిలటరీ, నిర్మాణ పంథాలను దృఢంగానూ, సృజనాత్మకంగానూ అమలు చేస్తూ విప్లవ కార్యాచరణను మెరుగు పరుచుకుందాము !

# నిప్పురవ్వలా చెలరేగుతున్న ప్రజా పోరాటాలను విప్లవ రాజకీయాలతో ప్రజ్వలనం చేసి ఎ.ఒ.బిలో మరో విప్లవ వెల్లువను సృష్టిద్దాం !!

నేడు దేశంలో పీడిత ప్రజానీకం రోజువారి సమస్యలు మొదలుకొని పలు ఆర్థిక, రాజకీయ సమస్యలతో సతమతమవుతున్నారు. మన జోన్‌లోనైతే పీడిత ఆదివాసీ రైతాంగం కూడు, గుడ్డ, విద్య, వైద్యం, త్రాగునీరు, సాగునీరు వంటి కనీస అవసరాలకు కూడా నోచుకోలేక పోతున్నారు. పండిన పంటకు, సేకరించిన అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించడం లేదు. షావుకార్ల దోపిడీతోపాటు ఉద్యోగుల అవినీతి, ఆజమాయిషీలు సర్వసాధారణమైపోయాయి. వీరు ఆదివాసీ రైతాంగాన్ని విపరీతంగా దోచుకుంటున్నారు. ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరి, కొరాపుట్ జిల్లాలకు చెందిన పలు గ్రామాలలో ఆదివాసేతర దోపిడీ దారులు ఆదివాసీ రైతాంగానికి చెందిన భూములను దౌర్జన్యంగానూ, వివిధ దోపిడీ పద్ధతుల ద్వారాను ఆక్రమించుకున్నారు. అంతే కాకుండా వారిచేత వెట్టిచాకిరీ చేయించుకుంటూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. దీనికి తోడు ఆదివాసీ తెగ పెత్తందార్లు అమలుచేస్తున్న కొన్ని రీతి రివాజులతో ఆదివాసీ పేదరైతాంగం కునారిల్లిపోతున్నది. ముఖ్యంగా ఆదివాసీ తెగపెద్దల పురుషాధిపత్య వ్యవస్థ మహిళల విషయంలో నిరంకుశంగా ఉంటూ వారిని తీవ్రంగా అణచివేస్తున్నది. ఈ సమస్యలన్నింటితో సరైన ఆహారం, వైద్యం అందక మన జోన్‌లో ప్రతి సంవత్సరం వందలాది మంది ఆదివాసీ ప్రజానీకం ఆకలి చావులకు, అనారోగ్య మరణాలకు గురిఅవుతున్నారు. ఈ సమస్యలకు తోడు 'గోరుచుట్టుపై రోకటి పోటులా' సామ్రాజ్యవాదుల బహుళజాతి సంస్థలతో మిలాఖతు అయిన భారత దళారీ, నిరంకుశ, బూర్జువావర్గం గనులు, విద్యుత్‌ప్లాంట్లు, సెజ్‌లు, హైవేరోడ్లు, వగైరా 'అభివృద్ధి కార్యక్రమాల' పేరిట అటవీ ప్రాంతాలను కబ్జా చేస్తూ ఆదివాసి ప్రజానీకాన్ని విస్తాపితుల్ని చేస్తున్నారు. ఈ సమస్యలను పరిష్కరించుకునేందుకు పోరాట మార్గం చేపడుతున్న పీడిత ప్రజానీకంపై రాజ్యం సాయుధ అణచివేత దాడిని కేంద్రంగా చేసుకొని మోసపూరితమైన బహుముఖ దాడిని కొనసాగిస్తున్నది. ఈ దాడి ప్రస్తుతం ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడిగా కొనసాగుతున్నది. ఈ దాడిని ప్రజలపై రాజ్యం కొనసాగిస్తున్న యుద్ధంగా సభ్యసమాజం గుర్తిస్తున్నది.

ప్రజలు ఎదుర్కొంటున్న పై సమస్యలన్నింటికీ నేడు అస్థిత్వంలో వున్న అర్ధభూస్వామ్య, అర్ధవలస సమాజమే కారణంగా ఉంది. శిథిలావస్థలో ఉన్న ఈ అర్ధభూస్వామ్య, అర్ధవలస సమాజాన్ని నూతన ప్రజాస్వామిక విప్లవం ద్వారా ధ్వంసం చేయాలి. అందుకు సామ్రాజ్యవాదానికి సేవచేస్తూ దాని రక్షణలో ఉంటున్న ఈ దేశ దళారీ, నిరంకుశ, బూర్జువా, భూస్వామ్య పాలక వర్గాలనూ వారి రాజ్యాంగ యంత్రాన్ని లక్ష్యంగా చేసుకొని ధ్వంసం చేసేందుకు కార్మికవర్గ నాయకత్వంలో, కార్మిక, కర్షక మైత్రి పునాదిగా నాలుగు వర్గాల (కార్మిక, కర్షక, పెటీబూర్జువా, జాతీయ బూర్జువా)తో విప్లవకర ఐక్యసంఘటనను నిర్మించాలని నిర్దేశిస్తూ మన పార్టీ రాజకీయ పంథాను రూపొందించింది. ఈ రాజకీయ పంథాను అమలు చేసేందుకు అసమానాభివృద్ధిగల మన దేశంలో భారత దోపిడీ పాలకవర్గాలు ముందుకు తెస్తున్న బూటకపు పార్లమెంటరీ ఎన్నికలను బహిష్కరిస్తూ, ప్రారంభం నుండే వ్యూహాత్మక ప్రాంతాలలో వర్గవైరుధ్యాల తీవ్రతను ఆసరా చేసుకొని సాయుధ పోరాటాన్ని ప్రారంభించాలనీ, అది ప్రజలపై ఆధారపడిన గెరిల్లాయుద్ధంగా వుండాలనీ, గెరిల్లాయుద్ధం క్రమంగా చలన, స్థావర యుద్ధాలుగా అభివృద్ధిచెంది శత్రు సాయుధ బలగాలను పూర్తిగా నిర్మూలించి స్థావర ప్రాంతాలను నిర్మించాలనీ, ఈ క్రమంలోనే మారుతున్న భౌతిక అనుకూల పరిస్థితులను ఉపయోగించుకొని పార్టీ నేతృత్వంలో ఎర్రసైన్యం మైదానాలనూ, పట్టణాలను ఆక్రమించుతూ అంతిమంగా దేశాన్ని విముక్తి చేసేందుకు దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను చేపట్టాలని మన పార్టీ నిర్దేశించింది. అంతే కాకుండా గత మూడున్నర దశాబ్దాలుగా దీర్ఘకాలిక ప్రజాయుద్ధ విప్లవ కార్యచరణలో వచ్చిన అనుభవాలను క్రోడికరించి భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు అనుగుణంగా మన మిలటరీ పంథాను అభివృద్ధి చేసింది.

మనపార్టీ రూపొందించిన రాజకీయ, మిలటరీ పంథాలను మార్గదర్శకంగా చేసుకొని గత రెండున్నర దశాబ్దాలకు పైగా మన జోన్‌లో విప్లవకార్యాచరణ కొనసాగుతున్నది. ఈ రెండున్నర దశాబ్దాలలో మన లక్ష్యానికి అనుగుణంగా మనం కొన్ని విజయాలను సాధించాము. ముఖ్యంగా దళారీ నిరంకుశ బూర్జువా, బడా భూస్వామ్య వర్గాలకూ వారి రాజ్యంగ యంత్రానికి వ్యతిరేకంగా పార్టీ నేతృత్వంలో రైతాంగాన్ని కదిలించి వ్యవసాయ విప్లవ పోరాటంతో పాటు అనేక ఇతర పోరాటాలు చేపట్టాము. ఈ వర్గపోరాటం తీవ్రతరమయ్యే క్రమంలో సైన్యం (పి.ఎల్.జి.ఎ) ప్రధాన నిర్మాణ రూపంగానూ, సాయుధ పోరాటం (గెరిల్లాయుద్ధం) ప్రధాన పోరాట రూపంగానూ నిర్మాణ, పోరాట రూపాలను అభివృద్ధి చేసాం. ఈ క్రమంలో ప్రజలు భూములతో పాటు ఇతర విజయాలను సాధించుకున్నారు. అనేక గ్రామాలలో శిథిలమైపోతున్న పాత అధికారాన్నీ, ఉత్పత్తి సంబంధాలను ధ్వంసం చేసి నూతన ప్రజాధికారాన్ని, ప్రజాస్వామిక సంబంధాలను నెలకొల్పుకునే దిశగా విప్లవ ప్రజాకమిటీలను నిర్మించుకున్నారు. ఈ విజయాలు మన

పంథా సరైనదేనని రుజువు చేస్తున్నాయి. అయితే మన ఎత్తుగడలను మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అన్వయించలేని సమయాలలో నష్టాలకు కూడా గురైనాము. ముఖ్యంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎల్.ఐ.సి వ్యూహంలో భాగంగా మన ఉద్యమాన్ని అణచివేసేందుకు బహుముఖ దాడిని చేపట్టినప్పుడు, ఆ దాడిని ఓడించేందుకు మన రాజకీయ, మిలిటరీ పంథాను సృజనాత్మకంగా ధీటుగా అమలు చేయలేక పోయాము.

ఫలితంగా 2006నాటికి ఎ.ఒ.బి జోన్‌లో మన ఉద్యమం తాత్కాలిక వెనకపట్టుకు గురైందనీ, విప్లవోద్యమంపై విప్లవ ప్రతిఘాతుకత్వానిది పైచేయి అయిందని గుర్తించాము. అప్పటినుండి మారిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మన స్వీయాత్మక శక్తుల బలంపై ఆధారపడి సరైన ఎత్తుగడలనూ, పని విధానాన్ని రూపొందించుకొని పని చేస్తున్నాము. పార్టీలో కొనసాగుతున్న కార్మికవర్గేతర ధోరణులను తొలగించుకొనేందుకు దిద్దుబాటు క్యాంపెయన్లను కూడా చేపట్టాము. ఈ సరైన నిర్ణయాల ఫలితంగా ప్రజలను దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా అనేక పోరాటాలలోకి కదిలించటం, ఇలా కదిలిన ప్రజలను విప్లవోద్యమంలోకి సమీకరించడం, శత్రువుపై ప్రజా ప్రతిఘటనతో పాటు సైనిక దాడులు నిర్వహించడం వంటి విప్లవ కార్యాచరణను చేపట్టగలిగాము. ఎ.పి భూభాగంలో శత్రువు మనల్ని పూర్తిగా నిర్మూలించి ఎ.పిని మావోయిస్టు రహిత రాష్ట్రంగా చేయాలనే ప్రయత్నాన్ని వమ్ము చేసాము. అయితే గత 8 సంవత్సరాల మన విప్లవ కార్యాచరణలో ఈ సకారాత్మక అంశాలు ఉన్నప్పటికీ, బలహీనతలు, లోపాలు తీవ్రంగానే కొనసాగాయి. ముఖ్యంగా పార్టీ నిర్మాణంలో గతం నుండి బలంగా కొనసాగుతున్న అన్యవర్గ ధోరణులు ఉద్యమానికి తీవ్రంగానే నష్టాన్ని కలిగించాయి. వివిధ స్థాయిలకు చెందిన పార్టీ శ్రేణులలో ఊగిసలాట, దిగజారుళ్ళు, క్రమశిక్షణ రాహిత్యం, చర్యలకు గురికావడం, పార్టీ కమిటీలలో అనైక్యత వంటి రూపాలలో అన్యవర్గ ధోరణులు వ్యక్తమైనాయి. మరోవైపు వాస్తవ పరిస్థితులపై సరైన అంచనాకు వచ్చి రాజకీయ, నిర్మాణ, మిలటరీ పంథాలను సృజనాత్మకంగా అన్వయించడంలో వైఫల్యాలు కూడా చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా ప్రజలపై ఆధారపడి గెరిల్లాయుద్ధ సూత్రాలను అన్వయింపు చేయడంలో తగినంత నిబ్బరం, త్యాగ సంసిద్ధత, మిలిటరీ నైపుణ్యాన్ని ప్రదర్శించలేక పోయాము. ఫలితంగా ఉద్యమం తాత్కాలిక వెనకబాటు స్థితిలోనే కొనసాగుతున్నది.

2013 లో జరిగిన 4వ సి.సి సమావేశంలో సి.సి దేశ వ్యాపిత వుద్యమ స్థితి గడ్డుకాలంలో (గడ్డుపరిస్థితిగా)ఉందని అంచనా వేసింది. అయితే అన్ని రాష్ట్రాలలో పరిస్థితి ఒకేలా లేదని చెప్పింది. అంతేకాకుండా ఆయా రాష్ట్రాల అనుకూల, ప్రతికూల పరిస్థితులను నిర్దిష్టంగా అంచనాకట్టి విప్లవోద్యమాన్ని పురోగమింప జేసేందుకు 16 ఎత్తుగడల అంశాలను రూపొందించింది. ఈ ఎత్తుగడలను అమలు చేసే విధంగా బోల్షివీకరణ క్యాంపెయిన్‌కు పిలుపునిచ్చింది. ఈ క్యాంపెయిన్‌కు 2 సంవత్సరాల కాల పరిమితి విధించింది. ఈ క్యాంపెయిన్ ద్వారా పార్టీని బోల్షివీకరించడం, ప్రజాపునాదిని పెంపొందించుకోవడం, పి.ఎల్.జి.ఎని పటిష్ట పరచుకొని శత్రువును దెబ్బతీసి పురోగమించగలమని తెలియజేసింది.

మన జోన్ ఉద్యమ విషయానికొస్తే పైన చెప్పుకొన్నట్లుగా పార్టీలో కార్మికవర్గేతర ధోరణులు బలంగా కొనసాగుతున్నాయి. ఇందుకు మూలం పార్టీ వర్గ సంపుటిలోనే ఉంది. పార్టీ నాయకత్వ శ్రేణుల్లో పెటీబూర్జువావర్గం నుండి వచ్చినవారు అధికంగా ఉంటే క్రింది శ్రేణుల్లో గ్రామీణ మధ్యతరగతి(గ్రామీణ పెటీబూర్జువా), వ్యవసాయకూలీ, పేదరైతాంగం నుండి వచ్చినవారు అధికంగా వున్నారు. పారిశ్రామిక కార్మికవర్గం నుండి వచ్చిన వారు లేరనే చెప్పాలి. దీంతో పార్టీలో పెటీబూర్జువావర్గ ధోరణులు ఆలోచనలు, అలవాట్లతో పాటు, ఫ్యూడల్ వెనకబాటుతనం, సంకుచితత్వం, తెగ, ఫ్యూడల్ సాంప్రదాయాలు కొనసాగుతున్నాయి. ఇవి స్వీయాత్మకత, వుదారవాదం, వ్యక్తివాదం, అతిప్రజాస్వామ్యం, బ్యూరాక్రసి, సెక్టేరియనిజం, పితృస్వామ్య ధోరణులుగా కొనసాగుతున్నాయి. ఈ ధోరణులనుండి బయటపడి విప్లవ కార్యాచరణను మెరుగుపరుచుకొనేందుకు సి.ఆర్.బి సర్క్యులర్‌లో చెప్పినట్లుగా మార్క్సిజం, లెనినిజం, మావోయిజం సిద్ధాంత అధ్యయనాన్ని మెరుగుపరుచుకొని పెటీబూర్జువావర్గ దృక్పథం స్థానంలో కార్మికవర్గ ప్రాపంచిక దృక్పథాన్ని అభివృద్ధి చేసుకోవాలి. సిద్ధాంతాన్ని ఆచరణతో జోడించే పని శైలినీ, నాయకత్వం పార్టీ శ్రేణులతోటి మొత్తం పార్టీ ప్రజలతో మమేకమయ్యే పనిశైలిని పెంపొందించుకోవాలి. స్వయం విమర్శ, విమర్శను నిజాయితీగా, బాధ్యతగా నిర్వహించాలి.

నేడు మన కేంద్రకమిటీ, సెంట్రల్ రీజనల్ బ్యూరోలు అందించిన మార్గదర్శకత్వంలో నాలుగు పని శైలిలనూ, 16 ఎత్తుగడలను అమలు చేసేందుకు ఎమ్.ఎల్.ఎమ్ సిద్ధాంత అధ్యయనంతో పాటు మన పార్టీ రూపొందించిన రాజకీయ నిర్మాణ, మిలటరీ పంథాలను లోతుగా అర్థం చేసుకొని నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించుకోవడం ఒక ముఖ్య కర్తవ్యంగా ఉంటుంది. మన విప్లవ కార్యాచరణ ఈ మూడు విప్లవ పంథాలపై ఆధారపడి కొనసాగుతున్నప్పటికీ వాటిని అర్థం చేసుకోవడంలోనూ, అమలు చేయడంలోనూ కొన్ని లోపాలు, బలహీనతలు కొనసాగుతున్నాయి. వాటిని ఇప్పుడు సంక్షిప్తంగా పరిశీలిద్దాం.

మన పార్టీ ఎదుర్కొంటున్న స్వీయాత్మకత, వ్యక్తివాదం, అతిప్రజాస్వామ్యం, బ్యూరాక్రసీ, సెక్టేరియనిజం వంటి ధోరణులను తొలగించుకొనేందుకు మన పార్టీ నిర్మాణ పంథాను లోతుగా అర్థం చేసుకొని దృఢంగా అమలు చేయాలి. ముఖ్యంగా మన పార్టీ ఐక్యతా ప్రయోజనాల రీత్యానూ, ప్రజలతో సజీవ సంబంధాలు నెరిపేందుకు పార్టీ నిర్మాణ పంథాను దృఢంగా అమలు పరచాలి. మన పార్టీ నిర్మాణ పంథాను కామ్రేడ్ లెనిన్, కామ్రేడ్ మావోల సూత్రీకరణలపై ఆధారపడి రూపొందించుకొన్నాము. మన పార్టీ నిర్మాణ పంథా ప్రకారం అది కార్మికవర్గ నాయకత్వాన్ని కలిగి ఉండి ప్రజలనుండి ప్రజలకు అనే మౌలిక సూత్రం (ప్రజాపంథా)పై ఆధారపడి పని చేస్తుంది. అంటే అది మొత్తంగా ప్రజల ప్రయోజనాల కోసమే పని చేస్తుంది. ఈ సూత్రాన్ని మన జోన్‌లో పార్టీ పరిస్థితికి అన్వయించుకొన్నప్పుడు, అది విప్లవకర కార్మికవర్గ పార్టీగా నాయకత్వం వహించేందుకు తనలో కొనసాగుతున్న పెటీబూర్జువా దృక్పథాన్ని, అలోచనలను, అలవాట్లనూ, ఫ్యూడల్, తెగ అవలక్షణాలను వదిలించుకొని కార్మికవర్గతత్వాన్ని, చైతన్యాన్ని మరింతగా అభివృద్ధి చేసుకోవాలి. అందుకు సిద్ధాంత అధ్యయనాన్నీ, లోతైన వర్గపోరాట కార్యాచరణను పెంపొందించు కోవాలి. అప్పుడే పార్టీలోకి కార్మికవర్గేతరుల నుండి వచ్చిన కామ్రేడ్స్ తమ పాత వర్గ

దృక్పథం, అలోచనలు, అలవాట్ల నుండి బయటపడి కార్మికవర్గ స్వభావాన్ని సంతరించుకోగల్గుతారు. మరో విషయంగా ప్రజల ప్రయోజనాలే మన ప్రయోజనాలుగా ఎంచుకోగల్గి, ప్రజాపంథాను అమలు చేయగల్గితే మనల్ని పట్టి పీడిస్తున్న స్వీయాత్మకత, వ్యక్తివాదం, బ్యూరాక్రసీ, సెక్టేరియనిజం వంటి అన్యవర్గ ధోరణులను అధిగమించ గలుగుతాము. పార్టీ నిర్మాణ పంథాలోని మరో ముఖ్యమైన విషయంగా పార్టీ ఐక్యతా ప్రయోజనాల దృష్ట్యా కా॥మావో చెప్పిన 'ఒకభాగం మొత్తం వ్యవస్థకు విధేయంగా వుండాలనే' విషయం ఒక ముఖ్యమైన సూత్రంగా ఉంటుంది. దీనిని కా॥లెనిన్, కా॥మావోలు ప్రజాస్వామిక కేంద్రీకరణ (కేంద్రీకృత ప్రజాస్వామ్యం) సూత్రంగా చెప్పారు. ప్రధానంగా ఈ సూత్రం ఆధారంగానే మన పార్టీ పనివిధానం వుంటుంది. ఈ సూత్రం ప్రకారం పార్టీలో ప్రజాస్వామ్యం పునాదిపై కేంద్రీకృతాన్ని అమలు చేయాలి. అంటే పార్టీలో వివిధ శ్రేణుల మధ్య రాజకీయ సమానత్వాన్ని పాటిస్తూ, వారి భావాల కేంద్రీకరణగా తీర్మాణాలు, పాలసీలు రూపొందించాలి. భావాల కేంద్రీకరణగా రూపొందించబడిన ఈ తీర్మాణాలనూ, పాలసీలను ఎటువంటి ఊగిసలాట లేకుండా వుమ్మడి కార్యాచరణలో భాగంగా దృఢంగా అమలు జరపాలి. మన జోన్‌లో కొద్దిమంది పార్టీ క్యాడర్లు ప్రజాస్వామ్యం స్థానంలో అతి ప్రజాస్వామ్యాన్నీ, వ్యకివాదాన్ని నిలుపుతూ పార్టీలో అనైక్యతకు కారణమవుతున్నారు. మరికొద్దిమంది పార్టీ క్యాడర్లు కేంద్రీకృతం స్థానంలో బ్యూరాక్రసీని నిలుపుతూ కింది శ్రేణులతో కలిసి పోలేకపోతున్నారు. ఈ రెండు రకాల ధోరణులు వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యత నిచ్చేవే. ఇవి పార్టీలో పట్టణ, గ్రామీణ పెటీబూర్జువా వర్గధోరణులుగా కొనసాగుతున్నాయి. కనుక పార్టీ ఐక్యతా ప్రయోజనాల రీత్యా ప్రజాస్వామిక కేంద్రీకరణను (కేంద్రీకృత ప్రజాస్వామ్యం) సరైన పద్ధతిలో అమలు చేయాలి. మన జోన్‌లో కేంద్రీకృత నిర్ణయాలకు ప్రాధాన్యత నివ్వకుండా వ్యక్తివాదంతో అతి ప్రజాస్వామిక పద్ధతులతో వ్యవహరించిన వాడిగా శ్రీరాములు శ్రీనివాస్‌ను ప్రధానంగా చెప్పుకోవచ్చు. శ్రీరాములు శ్రీనివాస్ 9వ ఐక్యాతా కాంగ్రెస్ రూపొందించిన పార్టీ రాజకీయ, మిలటరీ పంథాలను వ్యతిరేకిస్తూ, సారాంశంలో బూర్జువా వర్గాలకు సేవచేసే రాజకీయ, మిలటరీ పంథాలను పార్టీపై రుద్దేందుకు ప్రజాస్వామిక కేంద్రీకరణ సూత్రాన్ని ఏ మాత్రం లెక్కచేయకుండా పార్టీ నిర్మాణ పంథాకు వ్యతిరేకంగా నిలబడ్డాడు. ఇతని తప్పుడు రాజకీయ, మిలిటరీ పంథాలనూ, నిర్మాణ అరాచకత్వాన్నీ, వ్యక్తివాదాన్ని జోన్‌లోని పార్టీశ్రేణులు తీవ్రంగా వ్యతిరేకించి పార్టీ ఐక్యతను కాపాడారు. ఇక మన పార్టీ నిర్మాణ సూత్రాలలో అతి ముఖ్యమైనదిగా స్వయం విమర్శ-విమర్శ పద్ధతి ఉంటుంది. ఈ పద్ధతి ద్వారా పార్టీ విప్లవ కార్యాచరణలో దొర్లిన లోపాలను ఎప్పటికప్పుడు గుర్తించి సరిచేసుకోవడం ఉంటుంది. ఇలా చేయడం ద్వారా భవిష్యత్ కార్యాచరణలో ఆ తప్పులు తిరిగి జరగకుండా చూసుకొని ఉద్యమ కార్యాచరణలో పురోగతి సాధించ గల్గుతాము. కానీ కొన్ని సందర్భాలలో మన ఆచరణలో ఇందుకు భిన్నంగా జరుగుతున్నది. స్వయం విమర్శ-విమర్శ జరిగేటప్పుడు ఆయా కామ్రేడ్స్ కార్యాచరణలో వుద్యమ ప్రయోజనాలకూ, ప్రజల ప్రయోజనాలకు జరిగే నష్టాలపై విమర్శను కేంద్రీకరించకుండా సంకుచితమైన వ్యక్తిగత సమస్యలకు ఎక్కువ ప్రాధాన్యత నిస్తున్నారు. ఈ వైఖరి చేపట్టడం వల్ల కమిటీలలో ఐక్యత కన్నా అనైక్యత పెరుగుతున్నది. కనుక స్వయం విమర్శ-విమర్శ పద్ధతిని వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా, కార్మికవర్గ సిద్ధాంత, ఆచరణ పునాదిపై పార్టీలో ఐక్యత సాధించేలా నిర్వహించాలి. మొత్తంగా చూసినప్పుడు పార్టీని బోల్షివీకరించేందుకు పార్టీ నిర్మాణ పంథాను దృఢంగా అంటిపెట్టుకొని అమలు చేయడం కీలకమైన అంశంగా వుంటుందని గుర్తించాలి.

ఇక మన రాజకీయ, మిలటరీ పంథాల విషయానికి వస్తే వాటి అమలులో నిర్దిష్టత, సృజనాత్మకత లోపిస్తున్నది. కొన్ని సందర్భాలలో వాటికి భిన్నంగా వ్యవహరిస్తున్నాము. 2013 లో జరిగిన ఒడిశా స్థానిక ఎన్నికల సందర్భంగా కామ్రేడ్ లింగా మన రాజకీయ పంథాకు వ్యతిరేకంగానూ ఎన్నికలలో పాల్గొనాలనే ప్రతిపాదనను ముందుకు తెచ్చినప్పుడు శ్రీకాకుళం-కొరాపుట్ డివిజన్ కమిటీ తిరస్కరించలేదు. ఈ విషయంలో డివిజనల్ కమిటీ ఉదారవాదంగా వ్యవహరించడం వలన గ్రామస్థాయి పార్టీ, ప్రజాసంఘాలు ఎన్నికలలో పాల్గొన్నాయి. దీంతో గతంలో మనం చెప్పిన సాయుధపోరాట రాజకీయాలకు ఈ కార్యక్రమం భిన్నంగా ఉండటం వలన ప్రజలలో గందరగోళం ఏర్పడింది. దోపిడీ వర్గాలను సాయుధంగా కూలదోసి రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడం ద్వారానే భూమి, ప్రజాస్వామ్యం వంటి మౌళిక సమస్యలు పరిష్కారం అవుతాయనే చైతన్యం పెంపొందించుకుంటూ పురోగమిస్తున్న ఆదివాసీ రైతాంగాన్ని ఎన్నికల్లో భాగస్వాముల్ని చేయడం వలన, వాళ్ళ పోరాట శక్తిన్ని నిర్వీర్యపరిచినట్లయింది. తరువాత కాలంలో డివిజన్‌లో వచ్చిన మార్పులు ఈ విషయాన్ని రుజువు చేసాయి. ఎన్నికలలో గెలిచిన 'ప్రజాప్రతినిధులు' ప్రభుత్వ ఏజెంట్లుగా మారి ప్రజలకు కనుచూపు మేరలో లేకుండా పోయారు. ప్రజలలో ఏర్పడిన రాజకీయ గందరగోళం వారిని సమరశీల పోరాటానికి దూరం చేసింది. మనకు వచ్చిన ఈ చేదు అనుభవం ద్వారా ఈ దేశంలో పాలకవర్గాలు పార్లమెంటరిజాన్ని, గాంధీయిజాన్ని ప్రజల బుర్రలను మొద్దుపరిచేందుకు మత్తుపదార్థాల లాగా వాడుకొంటారని మరోసారి రుజువైంది. ఇటువంటి అనుభవాలతో పాటు, భారత విప్లవ నిర్దిష్ట స్వభావాన్ని దృష్టిలో ఉంచుకొని మన పార్టీ ఎన్నికలను వ్యూహాత్మక ప్రాధాన్యత కల్గిన ఎత్తుగడగా గుర్తిస్తూ, ఇది దీర్ఘకాలిక ప్రజాయుద్ధ వ్యూహానికి ఏ మాత్రం పొసగనిదని నిర్ధారించింది. ఇలాగే క్షేత్రస్థాయిలో మన ఆర్గనైజర్లు రాజకీయ మిలటరీ పంథాలకు అనుగుణంగా ప్రజలను తర్ఫీదు చేసి కార్యకలాపాలు నిర్వహించడంలో కొన్ని పరిమితులు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ, మిలటరీ పంథాలను సరిగా అన్వయించిన సందర్భాలలో అనేక విజయాలు సాధించి విప్లవోద్యమాన్ని పురోగమింప జేసాము. మనజోన్‌కు సంబంధించి గత రెండున్నర దశాబ్దాల ఉద్యమ చరిత్ర మనకు ఈ రెండు రకాల అనుభవాలనిచ్చింది. ప్రస్తుతం బోల్షివీకరణ క్యాంపెయిన్‌లో ఉన్న మనం గతంలో జరిగిన తప్పులను తిరిగి జరగకుండా చూసుకొనేందుకు మనం చేపట్టే ప్రతి పోరాటంలోనూ, కార్యక్రమంలోనూ పాల్గొనే అశేష పీడిత ప్రజానీకానికి మన రాజకీయ, మిలటరీ పంథాలను అర్థం చేయిస్తూ ఆచరణ ద్వారా వారికి తర్ఫీదు నందించాలి. అన్ని మార్గాలు రోమ్ నగరానికి దారితీస్తాయన్నట్లు, ప్రజలకు రాజకీయ తర్ఫీదు నందించడం ద్వారా మన అన్ని కార్యకలాపాలను సైన్యం, రాజ్యాధికారాన్ని లక్ష్యంగా చేసుకొని కొనసాగించాలి.

ఇక ప్రస్తుతం దేశంలో నెలకొన్న ఆర్థిక, రాజకీయ, సామాజిక

పరిస్థితులు చూసినట్లయితే దేశం బద్దలయ్యే అగ్నిపర్వతంలా వుంది. ముఖ్యంగా 2008లో సామ్రాజ్యవాద ద్రవ్య, ఆర్థిక మహాసంక్షోభం ప్రారంభమైనప్పటి నుండి దేశంలో కూడా ద్రవ్య ఆర్థిక సంక్షోభం సుడులు తిరుగుతున్నది. ఈ సంక్షోభం నుండి బయటపడి తమ లాభాల రేటును పెంచుకొనేందుకు దోపిడీ పాలకవర్గాలు దేశ ప్రజలపై ముందెన్నడూ లేనంత స్థాయిలో తమ దోపిడీ పీడనలను తీవ్రతరం చేసారు. ఫలితంగా దేశంలో మౌళిక వైరుధ్యాలు తీవ్రతరమై, ప్రజలు సామ్రాజ్యవాదులకూ, దళారీ, నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలలోకి దిగుతున్నారు. ముఖ్యంగా తూర్పు, మధ్య భారతంలో ప్రజలు మన పార్టీ నాయకత్వంలో రాజ్యాధికార లక్ష్యంగా సాయుధ పోరాటం నిర్వహిస్తుండటం పాలకవర్గాలకు పెను సవాలుగా మారింది. ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు, అంటే పోరాడుతున్న ప్రజలనూ, వారికి నాయకత్వం వహిస్తున్న మన పార్టీనీ, ఇతర ప్రజాస్వామిక సంస్థలనూ, వ్యక్తులనూ ఫాసిస్టు పద్ధతులలో అణచివేసి దోపిడీవర్గాల ప్రయోజనాలను కాపాడేందుకు అమెరికన్ సామ్రాజ్యవాదుల నేతృత్వంలో భారత పాలకవర్గాలలోని ఒక బలమైన ముఠా 16వ లోక్‌సభ ఎన్నికలలో మోడీ నేతృత్వంలోని బి.జె.పిని అధికారంలోకి తెచ్చాయి.

నేడు భారత పాలకవర్గాలకు బ్రాహ్మణవాదం, కులపీడనలతో పెనవేసుకుపోయిన అర్థభూస్వామ్య, అర్థవలస సామాజిక వ్యవస్థను యదాతథంగా నిలబెట్టడమే తక్షణ, ప్రధాన కర్తవ్యంగా మారింది. ఈ కర్తవ్యాన్ని నెరవేర్చేందుకే భారత దోపిడీ పాలకవర్గాలు మోడీని అధికారంలోకి తెచ్చాయి. మోడీ అధికారంలోకి వచ్చిన దగ్గరనుండి కార్పొరేట్ ప్రయోజనాలు నెరవేర్చడం ఒకవైపు, హిందూత్వ ఎజండాను ముందుకు తీసుకుపోవడం మరొకవైపుగా పాలన కొనసాగిస్తున్నాడు. తన ప్రయత్నాలకు ఆటంకంగా ఉన్న విప్లవోద్యమంపైనా, ప్రజా వుద్యమాల పైనా ఉక్కుపాదం మోపేందుకు రాజ్యాంగ యంత్రాన్ని మరింతగా పటిష్ట పరుస్తున్నాడు. మరోవైపు తన ఫాసిజీకరణలో భాగంగా 'భారత జాతీయత'ను రెచ్చగొడ్తూ ఆ ముసుగులో హిందూ ఫాసిస్టు మూకలను పోగేసి మత మైనారిటీలకు చెందిన ప్రజలపైనా, స్వయం నిర్ణయాధికారంతో పాటు విడిపోయే హక్కుకై పోరాడుతున్న కాశ్మీర్, ఈశాన్య రాష్ట్ర ప్రజలపైనా, ప్రజాస్వామిక వాదులపైనా దాడులు నిర్వహించేందుకు పథకాలు రూపొందిస్తున్నాడు. ఈ పథకాల రూపకల్పనలో ప్రముఖ కార్పొరేట్ సంస్థలతో పాటు ఆర్.ఎస్.ఎస్, వి.హెచ్.పి వంటి హిందూ మతోన్మాద సంస్థలున్నాయి.

పై రాజకీయార్థిక పరిస్థితుల నేపథ్యంలో ప్రజల సమస్యలు రోజురోజుకు తీవ్రతరం అవుతున్నాయి. ప్రజలు సమస్యలు పరిష్కరించుకొనేందుకు పోరాటాలకు సిద్ధమతున్నారు. అనేకచోట్ల యాదృచ్ఛికంగా పోరాటాలు బద్దలవుతున్నాయి. మన జోన్‌లో ఇప్పటికే నారాయణపట్నాలో ఆదివాసీ రైతాంగం భూమికోసం చేస్తున్న పోరాటం, విశాఖలో బాక్సైట్ గనులకు వ్యతిరేకంగానూ, కాఫీ ప్లాంటేషన్ల ఆక్రమణకై జరుగుతున్న పోరాటాలు, మల్కనగిరి జిల్లాలో కట్‌ఆఫ్ ఏరియా ప్రజలు భూమికోసమూ, బలిమెల డ్యాం ముంపుకు వ్యతిరేకంగానూ, ఇతర కనీస అవసరాలకోసం చేస్తున్న పోరాటాలు, కలిమెల, పొడియా ఏరియాలలో రైతాంగం గిట్టుబాటు ధరల కోసం, సాగునీరు కోసం చేస్తున్న పోరాటాలు ఆరని మంటలా రగులుతూనే ఉన్నాయి. ఈ ప్రముఖ పోరాటాలతో పాటు మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు తమ సమస్యలపై చేస్తున్న పోరాటాలూ, ప్రభుత్వ నిర్బంధానికి వ్యతిరేకంగా ముఖ్యంగా రాజకీయ ఖైదీల విడుదల కోసమూ, పోలీసు క్యాంపుల ఎత్తివేత కోసమూ ప్రజలు చేస్తున్న పోరాటాలు దినదినం తీవ్రతరం అవుతూనే ఉన్నాయి. ఈ ప్రజా పోరాటాలకు పార్టీ రూపొందించిన రాజకీయ, మిలటరీ పంథాల వెలుగులో దిశా నిర్దేశం కల్పించాలి. ముఖ్యంగా పోరాటాలలో పాల్గొంటున్న అశేష పీడిత ప్రజానీకానికి ఆచరణ నుండే రాజకీయ తర్ఫీదు నందించాలి. పోరాటం ప్రతి మలుపులోనూ ప్రజలను విప్లవం దిశగా జాగృతం చేసే రాజకీయ కృషిని చేపట్టాలి. అప్పుడే ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేసేందుకు తోడ్పడే ప్రజా పునాది బలపడ్తుంది. ఇటువంటి దృఢమైన ప్రజాపునాది మాత్రమే ఎర్రసైన్య నిర్మాణానికీ, అభివృద్ధికి హామినిస్తుంది. ఈ మధ్య మనం చేపట్టిన ఒక ప్రజా సమీకరణ కార్యక్రమాన్ని వుదాహరణగా తీసుకొని చేపట్టాల్సిన రాజకీయ కృషి గురించి నిర్దిష్టంగా చెప్పుకోవచ్చు. సెప్టెంబర్ 2014లో మల్కనగిరి జిల్లా కట్‌ఆఫ్ ఏరియాలోని రోళ్ళగడ్డ పంచాయితీలో అక్కడి మన పార్టీకమిటీ, ప్రజాసంఘాలు వేలాదిమంది ప్రజలను కదిలించి ప్రభుత్వ నిర్బంధానికి వ్యతిరేకంగా, ముఖ్యంగా రాజకీయ ఖైదీల విడుదలను డిమాండ్ చేస్తూ పెద్ద ర్యాలీ, సభ జరిపారు. ఈ కార్యక్రమం ప్రజలకు కొంతమేరకు ప్రభుత్వ వ్యతిరేక రాజకీయ చైతన్యాన్ని కల్గించేమాట వాస్తవమే. అయితే రాబోయే పరిణామాలను దృష్టిలో ఉంచుకొని, తదనుగుణంగా ప్రజలను రాజకీయంగా చైతన్యపరిచి ప్రభుత్వాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధపరచకపోతే ఆ సంఘటన ప్రజల ఆగ్రహపు యాదృచ్ఛిక సంఘటనగా మిగిలిపోతుంది. ఎందుకంటే ప్రజల ర్యాలీ తరువాత ప్రభుత్వం ప్రజల సమస్యను పరిష్కరించడానికి బదులు, ప్రజల కదలికకు ఆందోళనపడి అక్కడి వుద్యమాన్ని అణచివేసేందుకు కొత్త పోలీసుక్యాంపును ఏర్పాటు చేయవచ్చు. ప్రజలను మరింతగా అణచివేసే కార్యక్రమం చేయవచ్చు. కనుక అక్కడ పని చేస్తున్న పార్టీ, ప్రజాసంఘాల కార్యకర్తలు ప్రజలకు ప్రభుత్వ స్వభావాన్ని అర్థం చేయించి, మరింత ఉన్నతమైన మిలిటెంట్ పోరాటానికి సిద్ధపరచాలి. ఈ క్రమంలోనే దీర్ఘకాల ప్రజాయుద్ధం ద్వారా దోపిడీ వర్గాల రాజ్యాంగ యాంత్రాన్ని సంపూర్ణంగా ధ్వంసం చేసి నూతన ప్రజాస్వామిక రాజ్యాన్ని ఏర్పరిచేందుకు సాయుధమవ్వాలనే చైతన్యాన్ని పెంపొందించాలి. ఈ చైతన్యం ఒకేసారి ప్రజలకు ఏర్పడక పోయినప్పటికీ, మన కార్యకలాపాలన్నింటిలో విప్లవ రాజకీయ కృషి పూసల్లో దారంలా నిరంతరం కొనసాగినప్పుడే ప్రజల స్వీయ అనుభవం నుండి ఆ చైతన్యాన్ని క్రమంగా సమీకరించుకుంటారు. ఈ అనుభవం మనకు గతం నుండి ఉన్నదే అయినప్పటికీ ఈ బోల్షివీకరణ సందర్భంగా మనం, రాజకీయ కృషిని తీవ్రతరం చేసి ప్రజాపునాదిని బలోపేతం చేసుకోవాలి. నేడు భారత పాలకవర్గాలు అనుసరిస్తున్న దోపిడీ అణచివేత విధానాల వలన దేశ వ్యాపితంగా ప్రజా పోరాట నిప్పురవ్వలు అలుముకొని ఉన్నాయి. పైన చెప్పుకొన్నట్లు వాటిని కమ్మరివాని కొలిమిలోని జంటతిత్తుల వంటి సరైన విప్లవకర రాజకీయ, మిలటరీ పంథాలతో ఎగసన దోసినప్పుడు దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా విప్లవోద్యమం ప్రజ్వలనం చెందుతుంది. మన ఉద్యమం గడ్డు పరిస్థితినుండి బయటపడ్తుంది.

**సిద్ధాంత వ్యాసం**

# బోల్షివీకరణను ఒక ఉద్యమంగా చేపడదాం-దేశ విదేశాల విప్లవ చరిత్రలు అధ్యయనం చేద్దాం!

### రష్యా అక్టోబర్ విప్లవ చరిత్ర నుండి నేర్చుకుందాం!

సోవియట్ కమ్యూనిస్టు పార్టీ (బోల్షివిక్) చరిత్ర అంటే - 1) 1905 నాటి బూర్జువా ప్రజాతంత్ర విప్లవం 2) 1917 ఫిబ్రవరి నాటి బూర్జువా ప్రజాతంత్ర విప్లవం 3) 1917 అక్టోబర్ నాటి సోషలిస్టు విప్లవం - ఈ మూడు విప్లవాల చరిత్ర అన్నమాట.

సామాజిక అభివృద్ధి సూత్రాలు, రాజకీయ పోరాట సూత్రాలు, విప్లవ చలన శక్తుల పరిజ్ఞానాల సమన్వయాలలో బోల్షివిక్ ప్రావీణ్యత అర్థం కావడానికి ఈ చరిత్ర అధ్యయనం సహకరిస్తుంది.

**రష్యా పూర్వ చరిత్రను చూస్తే -**

19వ శతాబ్దంలో నాలుగు బలమైన ఫ్యూడల్ సామ్రాజ్యాలలో రష్యన్ (జారు) సామ్రాజ్యం ఒకటి. 1853 నుండి 1856ల మధ్య జరిగిన చరిత్ర ప్రసిద్ధి చెందిన క్రిమియన్ యుద్ధంలో జారు ప్రభుత్వం ఓడిపోయి బలహీనపడింది. దేశంలో అదేకాలంలో రైతులు భూస్వాములకు వ్యతిరేకంగా లేవదీసిన తిరుగుబాటు చూసి ప్రభుత్వం బేజారెత్తిపోయింది. ఈ కారణాల వల్ల జారు ప్రభుత్వం అర్థ-బానిస విధానాన్ని రద్దు చేసింది. ఇప్పుడు రైతు వ్యక్తి గతంగా స్వేచ్ఛను పొందాడు. అతడిని అమ్మడానికి, కొనడానికి వీలులేదు. ఇది తప్ప రైతు పరిస్థితిలో ఏమి మార్పు రాలేదు. రైతుల భూములను కలుపుకోవడం(ఓట్రిస్కీ)ధాన్యరూపంలో కౌలు చెల్లించడం (ఇస్పోలు), సష్టదాయకమైన షరతులతో భూస్వాముల పీడన కొనసాగుతూనే వుంది.

జారు రాజుల నాటి రష్యా వివిధ జాతులకు బందిఖానా. రష్యన్ జాతి మిగిలిన జాతులను అణచివేసింది. జాతులు, హక్కులు కోల్పోయి అవమానాలకు,పరాభవాలకు హత్యాకాండకు గురయ్యాయి. ఇతర జాతుల మాతృభాషలపై నిషేధం, జాతుల సంస్కృతిని చిదిపివేయడం, వివక్షలతో పాటు జారు రాజరికపు కసాయి పాలనలో పీడిత ప్రజలు, జాతులు దుర్భర దారిద్ర్యాన్ని, దోపిడీ అణచివేతలను అనుభవించారు. దీనికి తోడు స్త్రీలను, పిల్లలను దోపిడి చేసే పారిశ్రామిక పెట్టుబడిదారి విధానం త్వరగా (1865-90ల మధ్య) 25సంIIలలో అభివృద్ధి చెందింది. 12నుండి 15గంIIల పని అమలయ్యేది. జీతాలు తక్కువ, ధరలు ఎక్కువ. ఈ దుర్భర పరిస్థితులను నిరసిస్తూ సమ్మెలు మొదలయ్యాయి. కార్మిక సంఘాలు ఏర్పడ్డాయి. జారు ప్రభుత్వం సాయుధ బలగాలతో సమ్మెలను పాశవికంగా అణచివేసింది.

1890 నాటికి కూడా రష్యా వ్యవసాయక దేశమే. 1కోటి రైతు కుటుంబాలలో 35లక్షల రైతాంగానికి గుర్రాలు లేవు. వారంతా భూములు వదిలి బతుకు దెరువుకు శ్రామికులుగా మారారు. 15లక్షల భూస్వామ్య, ధనిక రైతాంగం (కులకలు) చేతిలో మిగిలిన 85లక్షల రైతాంగం భవిష్యత్ ఆధారపడింది.

**రష్యాలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణమైన చరిత్ర-**

రష్యాలో 1883లో మొట్టమొదటి మార్క్సిస్టు అధ్యయన కేంద్రం ఏర్పడింది. జారు ప్రభుత్వ నిర్బంధం కారణంగా ప్లెఖానోవ్ జెనీవాలో వుంటూ కార్మిక విమోచనా సమితిని ఏర్పరిచాడు. ఆనాటి మార్క్సిజం అభివృద్ధికి నరోడ్నిక్ భావాలు ఆటంకంగా నిలిచాయి. అవి 1. రష్యాలో పెట్టుబడిదారి విధానం యాదృచ్ఛికం కనుక శ్రామికవర్గం పెరిగి పెద్దది కాదు అన్నారు. 2. విప్లవంలో అగ్రగామిగా నిలిచేది రైతాంగమే. శ్రామికవర్గం లేకుండానే సోషలిజం విజయవంతం అవుతుంది. రైతాంగ కమ్యూన్ సోషలిజానికి బీజం, అవే పునాది. 3. చరిత్రను నిర్మించేది గొప్ప వ్యక్తులు. ఇది ప్రజలే చరిత్రను నిర్మిస్తారు కు వ్యతిరేకం. 'నరోడ్నిక్‌లపై ప్లెఖానోవ్ పోరాటం, రచనలు, సిద్ధాంత రీత్యా నరోడ్నిజాన్ని ఓడించాయి. లెనిన్ రాసిన' 'రష్యాలో పెట్టుబడిదారి విధాన అభివృద్ధి' రచన నరోడ్నిజంపై చివరి దెబ్బ కొట్టింది. శ్రామికవర్గ అభివృద్ధి క్రమాన్ని వివరించింది.

అయితే ప్లెఖానోవ్ గతంలో నర్నోడిక్‌గా పని చేయడం వలన ఆయనలో ఇంకా కొన్ని నర్నోడిక్ భావాలున్నాయి. అవి కార్మిక విమోచన సమితి ముసాయిదాల రచనలో వ్యక్తమయ్యాయి. అది వ్యక్తిగత దౌర్జన్యపు ఎత్తుగడలను ఆచరణలో సమర్థించడంగా ఉంది.

కామ్రేడ్ లెనిన్ 1895 నాటికి సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని మార్క్సిస్టు కార్మిక బృందాలన్నింటిని 'శ్రామిక విమోచనా సమితి' అనే సంస్థలో ఐక్యం చేసారు. ఇదే విప్లవకర మార్క్సిస్టు కార్మికవర్గ పార్టీ ఏర్పాటుకు పునాదిగా పని చేసింది. లెనిన్ ప్రవాసంలో ఉన్నప్పుడు 1898లో "రష్యన్ సోషల్ డెమొక్రటిక్ లేబర్ పార్టీ" ఏర్పడి మొదటి కాంగ్రెస్ జరుపుకుంది. మొదటి కాంగ్రెస్ నిర్వహణలోని బలహీనతల కారణంగా విడివిడిగా ఉన్న అన్ని మార్క్సిస్టు సమితులను, సర్కిల్స్‌ను పూర్తిగా ఐక్యం చేయలేదు. ఒకే కార్యాచరణ మార్గం, కార్యక్రమం, నిబంధనావళి, ఏకీకృత కేంద్ర నాయకత్వం ఏర్పడలేదు. ఆ కారణంగా పార్టీలో గందరగోళం, అర్థికవాదం పెరిగాయి.

లెనిన్ ప్రవాసంలోనే రాసిన "రష్యన్ డెమోక్రట్ల కర్తవ్యాలు" రాజకీయంగా పార్టీ కార్యక్రమాన్ని, ఎత్తుగడలను వివరించింది. మొదటి కాంగ్రెస్ దాటవేసిన రాజ్యాధికార సమస్యను, శ్రామిక వర్గ నాయకత్వ పాత్రను, శ్రామికవర్గానికి మిత్రులెవరనే విషయాన్ని స్పష్టపరచడానికీ, ఒకే రకమైన కార్యాచరణ కోసమూ "ఇస్క్రా" (అగ్నికణం) పత్రికను స్థాపించి అర్థికవాదాన్ని, అవకాశవాదాన్ని, బహిర్గతం చేస్తూ, సిద్ధాంత గందరగోళాన్ని లెనిన్ పరిష్కరించాడు. ఈ లక్ష్యంలో భాగంగానే "ఎక్కడ నుండి ప్రారంభించాలి?" అలాగే "ఏం చేయాలి" అనే రెండు రచనలను అందించాడు. ఇవి అర్థిక వాదుల అవకాశవాదాన్ని ఓడించే కార్యక్రమాన్ని అందిస్తూ విశేషంగా ఉపయోగపడ్డాయి. ఏం చేయాలి గ్రంథానికి చాలా చారిత్రక ప్రాధాన్యత వుంది. ఈ రచన మార్క్సిస్టు ఉద్యమ చరిత్రలో అవకాశవాదపు బీజాలను బహిర్గత పరిచి, స్పాంటేనిటిని పూజించడం, సోషలిస్టు చైతన్య అవసరాన్ని గుర్తించకపోవడం అర్థికవాద లక్షణం అని చెప్పింది. సిద్ధాంతం, చైతన్యం రెండింటి ప్రాధాన్యతను నొక్కి చెప్పింది. స్పాంటేనియస్‌గా బద్దలయిన ఉద్యమాలను

విప్లవోద్యమంగా మలచడం పార్టీ బాధ్యత అని చెప్పింది. కార్మికవర్గ ఉద్యమంతో సోషలిస్టు సిద్ధాంతాన్ని మేళవించడం మార్క్సిస్టు పార్టీ ప్రధాన కర్తవ్యం అని చెప్పింది. బోల్షివిక్ పార్టీకి ఇవే సిద్ధాంత పునాదిగా ఉన్నాయి. ఆ వెలుగులో ఆర్థిక వాదుల అవకాశతత్వంపై దాడి చేసి సమూలంగా నిర్మూలించారు. 1. జారు ప్రభుత్వాన్ని కూల్చడం కార్మికవర్గం యొక్క తక్షణ కర్తవ్యంగాను, 2. స్పాంటేనిటీని పూజిస్తూ, కార్మికవర్గానికి రాజకీయ చైతన్యాన్ని అందించే సిద్ధాంత ఆయుధం లేకుండా నిరాయుధం చేయడం ద్రోహమనీ, 3. పార్టీ సైద్ధాంతికంగా మార్గదర్శకత్వం అందించాలనీ, 4. సోషలిస్టు సిద్ధాంతం విజ్ఞానశాస్త్రాల నుండి ఉద్భవిస్తుందనీ, కార్మికవర్గ ఉద్యమాన్ని సోషలిజం ఐక్యం చేయాలనీ, 5. ఆర్థికవాదులు సామాజిక సంస్కరణల పేరుతో పెట్టుబడిదారి ప్రభుత్వాన్ని రక్షిస్తాయనీ, 6. ఆర్థికవాదం రష్యాలో అకస్మాత్తుగా వచ్చింది కాదని, అది పశ్చిమ యూరప్ సోషల్ డెమక్రటిక్ పార్టీలలోని అవకాశవాద ధోరణి అని, దానిలో రివిజనిస్టు 'బెర్నాస్టిన్' వాదనలు వున్నాయని, వీళ్ళ ధోరణి విప్లవాన్ని, సోషలిజాన్ని, శ్రామికవర్గ నియంతృత్వాన్ని అన్నింటిని వదులుకోవడమేనని వివరంగా తెలియజేసాడు.

1903 జూలై 17న జరిగిన రష్యా సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ రెండవ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని, నిబంధనావళిని ఆమోదించింది. ఆర్థికవాదాన్ని ఓడించగల్గింది. సోషల్ డెమోక్రటిక్ పార్టీ అనే ఏకపార్టీని నిర్మించగలిగింది. కానీ, అప్పుడే నిబంధనావళిని ఆమోదించే క్రమంలో నిర్మాణ సమస్యలు ముందుకు వచ్చాయి. మెజారిటీ లెనిన్‌ను సమర్థించే వాళ్ళుగా, మార్టోవ్‌ను సమర్థించే వాళ్ళు మైనారిటీగా విడిపోయారు. రష్యన్ భాషలో 'బోల్షిన్‌స్ట్వో' అంటే మెజారిటీ (అధికం)అనీ 'మెన్షిన్‌స్ట్వో' అంటే మైనారిటీ(తక్కువ సంఖ్య) అని అర్థం. అనాటి నుండి వీరిని బోల్షివిక్‌లు, మెన్షివిక్‌లు అనడం జరుగుతుంది. బోల్షివిక్‌లు నిర్మాణ సూత్రాల కోసం పోరాడారు. మెన్షివిక్‌లు నిర్మాణ రాహిత్యం అనే ఊబిలోకి, అవకాశవాదంలోకి దిగజారారు. పాత ఆర్థికవాదుల స్థానాన్ని ఈ కొత్త అవకాశవాదులు (మెన్షివిక్‌లు) ఆక్రమించారు. పార్టీ రెండవ కాంగ్రేస్ నిర్మాణ కర్తవ్యాలను సరిగా నిర్వహిచలేకపోయింది. అవకాశవాదాన్ని ఓడించడంలో ఊగిసలాడింది. రెండవ కాంగ్రెస్ అనంతరం పార్టీలో అంతరంగిక పోరాటం మరింత నిశితమైంది. మెన్షివిక్ నాయకులు విచ్ఛిన్న చర్యలు తీవ్రతరం చేసారు. మార్టోవ్, ట్రాట్స్కీ, ఆగ్జల్‌రాడ్ నాయకులుగా వుండి లెనినిజానికి వ్యతిరేకంగా తిరుగుబాటు లేవదీసారు. రాజీ ధోరణితో ప్లెఖనోవ్ వారికి సహకరించాడు. లెనిన్ వ్యతిరేకిస్తున్నప్పటికీ "ఇస్క్రా" పత్రిక సంపాదక వర్గంలో మెన్షివిక్ సభ్యులందరిని చేర్చుకొన్నాడు. దీంతో లెనిన్ "ఇస్క్రా" సంపాదక వర్గం నుండి రాజీనామా చేసాడు. అప్పటి నుండి లెనిన్ యొక్క బోల్షివిక్ పత్రిక "ఇస్క్రా"ను పాత 'ఇస్క్రా' అని పార్టీ పరి భాషలో పిలుస్తుండేవారు. మెన్షివిక్ అవకాశవాద "ఇస్క్రా"ను 'కొత్త ఇస్క్రా' అని పిలుస్తూ వచ్చారు. 52వ సంచిక నుండి ఏర్పడిన 'న్యూ ఇస్క్రా' లెనినిజానికి వ్యతిరేకంగా పని చేసింది. లెనిన్ "ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కి" అనే పుస్తకం ద్వారా మెన్షివిక్‌లను ఎదుర్కొన్నాడు. అందులోని ముఖ్య నిర్మాణ సూత్రాలు బోల్షివిక్ పార్టీ నిర్మాణానికి ప్రాతిపదికగా నిలిచాయి. అవి 1. మార్క్సిస్టు పార్టీ కార్మికవర్గంలో భాగం, ఒకదళం. కార్మికవర్గ ఇతర దళాలకు పార్టీకి తేడా ఉంది. పార్టీ సాధారణ దళం కాదు, అగ్రగామి దళం, వర్గ చైతన్యంగల దళం, కార్మికవర్గ మార్క్సిస్టు దళం. 2. సంఘటిత కార్మికవర్గ దళం క్రమశిక్షణ గల బాధ్యతాయుతమైన సభ్యులతో కూడినది. కార్మికవర్గ ప్రత్యక్ష పోరాటాన్ని నడిపే, ఒక ఆశయంవైపు తీసుకువెళ్ళేదే పార్టీ. 3. కార్మికవర్గ నిర్మాణ రూపాలన్నింటిలోకీ వుత్తమమైనది పార్టీ. ఇతర అన్ని నిర్మాణ రూపాలను నడపవలసిన కర్తవ్యం దానికి ఉంది. సిద్ధాంత జ్ఞానం, వర్గపోరాట చైతన్యం, విప్లవోద్యమ అనుభవం వుండటం వలన పార్టీ ఇతర నిర్మాణ స్వరూపాలన్నింటికన్నా అతి ఉన్నతమైనది. అధికారం చేపట్టడానికి చేసే పోరాటంలో శ్రామిక వర్గానికి పార్టీ నిర్మాణం తప్ప మరొక ఆయుధం లేదు. 4. పార్టీ ఎంతమంచి అగ్రగామి అయినప్పటికీ, ఎంత బాగా సంఘటిత పడినప్పటికీ, పార్టీ సభ్యులు ఇతర ప్రజాసామాన్యంతో సంబంధం పెట్టుకోకపోతే పార్టీ బతకదు, అభివృద్ధి కాజాలదు. 5. పని సరిగా నిర్వహించాలంటే, జన సామాన్యాన్ని క్రమపద్ధతిలో నడపాలంటే కేంద్రీకృత ప్రజాస్వామ్యం అమలు చేయాలి. పార్టీకి నిబంధనావళి, అందరికీ వర్తించే క్రమశిక్షణ, ఒక నాయకసంస్థ (పార్టీ కాంగ్రేస్) ఉండాలి. ఈ షరతులను తప్పినట్టయితే అది నిజమైన పార్టీగా మనజాలదు. కర్తవ్యాలను నెరవేర్చజాలదు. 6. నిత్య జీవితంలో పార్టీ తన అనుచరుల మధ్య ఐక్యతను కాపాడాలి. క్రమశిక్షణ అందరికీ సమానంగా ఉండాలి.

1904 ఆగష్టులో బోల్షివిక్ గ్రూపు కార్యక్రమం రూపొందింది. 1905 జనవరి 4న 'ముందడుగు' పత్రిక మొదటి సంచిక వెలువడింది. అలా పార్టీలో రెండు గ్రూపులు, రెండు కేంద్ర సంఘాలు, రెండు పత్రికలు పని చేసాయి.

1904 జనవరిలో ప్రారంభమయిన రష్యా-జపాన్ యుద్ధం 1905 ఆగష్టు 23న రష్యా జారు ప్రభుత్వం ఓటమితో ఒక అవమాన కరమైన ఒప్పందంగా ముగిసింది. గతం నుండి కొనసాగుతున్న ఆర్థిక సంక్షోభం, యుద్ధనష్టాలు, ఓటములు జారు రాచరికం బలహీనపడటానికీ, విప్లవ పరిస్థితి బలపడటానికి తోడ్పడినాయి. ప్రజల్లో ఉన్న జారు వ్యతిరేకత, ఆగ్రహం 1905 నాటి మహత్తర విప్లవంలో ప్రస్ఫుటంగా కనబడింది.

1904 డిసెంబర్‌లో బాకూలో బోల్షివిక్ పార్టీ నాయకత్వాన పెద్ద సమ్మె విజయవంతమై, 1905 జనవరి 9న సెయింట్ పీటర్స్ బర్గ్‌లో విప్లవ తుఫాన్ ప్రారంభమయ్యింది. జనవరి, ఫిబ్రవరి నెలలో రష్యా అంతటా విప్లవ పోరాటాలు చెలరేగాయి. జనవరి 9న ఒకలక్ష 40వేల మంది నిరాయుధులైన ప్రజలు జారు చిత్రపటాలతో, చర్చి జెండాలతో, మత గీతాలతో మత గురువు గేసన్ నాయకత్వంలో వింటర్ ప్యాలెస్‌కు విజ్ఞాపన పత్రం ఇవ్వడానికి వెళ్ళారు. రెండవ నికోలస్(జారు)కాల్పులు జరపమని ఆదేశించాడు. వెయ్యిమంది కార్మికులు చనిపోగా, రెండువేల మంది గాయపడ్డారు. జనవరి 9న "బ్లడీ సండే"గా చరిత్రలో నిలిచిపోయింది. ఈ సంఘటన కార్మికులకు విలువైన గుణపాఠం నేర్పింది. ఈ వార్త నలుదిశలా వ్యాపించి రష్యా దేశం అంతా ద్వేషంతో, క్రోధంతో "నిరంకుశ ప్రభుత్వం నశించాలి" అనే నినాదంతో లక్షలాదిగా కార్మికులు వీధుల్లోకి వచ్చారు. రష్యా విప్లవం ప్రారంభమయింది. 1905 జూన్‌లో నల్లసముద్రం నౌకాదళంలోని 'పొటెంకిన్' అనే యుద్ధనౌకలో తిరుగుబాటు వచ్చింది. అణచడానికి జారు పంపిన యుద్ధ నౌకలు కాల్పులు జరపడానికి నిరాకరించాయి. ఆ తిరుగుబాటు విప్లవ

శ్రేణుల్ని గొప్పగా ఉత్సాహపరిచింది. రైతు ఉద్యమం విస్తరించి అభివృద్ధి చెందింది. మన తలకాయలు పోయేకన్న మన భూములు కొన్ని పోతే పోనియ్యండి అని భూస్వాములు అన్నారు. ఇవన్నీ ప్రజల సాయుధ తిరుగుబాటుకు పరిస్థితులు పరిపక్వమయ్యాయని తెలియజేసాయి. లిబరల్ బూర్జువాజీ కూడా కదలక తప్పని స్థితి వచ్చింది. విప్లవ పెనుభూతాన్ని చూసి జారు భయపడ్డాడు. సంస్కరణలు తెచ్చి రాజమార్గాన్ని అనుసరించాలని అనుకున్నాడు. నిర్బంధం ప్రతిఘటనను పెంచడం వలన కుట్ర పద్ధతులకు దిగాడు. జారు ప్రభుత్వం గూఢచార విభాగాల సహాయంతో జాతుల మధ్య చిచ్చు పెట్టింది. విద్వేషాలను రెచ్చగొట్టింది. జారు ప్రభుత్వం యూదులను వేటాడింది. ఆర్మేనియన్లు, తార్తారులు ఒకరి గొంతులు ఒకరు కోసుకునేలా చేసింది. తాత్కాలిక ప్రభుత్వ శాసన సభను ఏర్పాటు చేసింది. విప్లవ శక్తులను చీల్చడానికి, మితవాద పక్షాలను గెలుచుకోవడానికి ఈ రకమైన కుట్రలు పన్ని సఫలత పొందారు. బోల్షివిక్‌లు డ్యూమాను(శాసనసభ)బహిష్కరించారు. కాని మెన్షివిక్‌లు అందులో పాల్గొన్నారు. మెన్షివిక్‌లు రాజీ ధోరణితో బూర్జువా ఏజెంట్లుగా తయారయ్యారు. పార్టీలోనూ, దేశంలోను బోల్షివిక్‌లు ఒక్కరే మార్క్సిస్టు విప్లవశక్తి అని నిరూపించబడింది.

లిబరల్ బూర్జువాజీ ప్రజలతో కాకుండా జారుతో సమ్మేళనం కోరుకుంది. ప్రజాస్వామిక విప్లవానికి, ప్రజలకు ద్రోహం చేసింది. దీంతో బూర్జువా ప్రజాతంత్ర విప్లవానికి కార్మికవర్గం నాయకత్వం వహించి భూస్వామ్యాన్ని తొలగించి, సోషలిజానికి మార్గాన్ని ఏర్పరిచే చారిత్రక సందర్భం ఏర్పడింది. రైతాంగం కార్మికవర్గంతో ఐక్యమయ్యే ప్రధానశక్తిగా నిలిచింది. బోల్షివిక్‌లు విప్లవాన్ని విస్తరింపజేయడం, సాయుధ తిరుగుబాటు ద్వారా జారు పాలనను కూలదోయడం, కార్మికవర్గం నాయకత్వం వహించి బూర్జువా వర్గాన్ని ఏకాకులను చేయడం, కార్మిక, కర్షక ప్రతినిధులతో తాత్కాలిక విప్లవ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ద్వారా విప్లవాన్ని విజయవంతం చేయడం అనే కార్యక్రమాన్ని చేపట్టింది. దీనికి భిన్నంగా మెన్షివిక్‌లు విప్లవాన్ని రద్దుపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు. జారు ప్రభుత్వాన్ని సంస్కరించి బాగుచేయాలన్నారు. లిబరల్ బూర్జువా నాయకత్వం ఉండాలనీ, లిబరల్ బూర్జువాతో ఐక్యం కావాలని డ్యూమా కేంద్రంగా ఎన్నికల్లో పాల్గొనాలన్నారు. పార్టీలో అంతర్గత పరిస్థితిని 4వ కాంగ్రెస్ మార్చలేదు. 5వ కాంగ్రెస్ బోల్షివిక్‌ల మార్గం మార్క్సిస్టు విప్లవ మార్గం అని చెప్పింది. డిసెంబర్, 1905లో బోల్షివిక్ మహసభ ఫిన్‌లాండ్‌లోని టామర్‌పర్స్‌లో జరిగింది. ఇక్కడే మొదటిసారిగా లెనిన్, స్టాలిన్‌లు కలుసుకున్నారు. రైతు తిరుగుబాట్లు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వం "మార్షల్‌లా" ప్రకటించింది. 'ఖైదీలుగా తీసుకోవద్దు, తూటాలు మిగిల్చవద్దు' అని ఘోరమైన ఆర్డర్లు జారుప్రభుత్వం ఇచ్చింది. డిసెంబర్ 7న మాస్కోలో రాజకీయ సమ్మె ప్రారంభమైంది. దాన్ని దేశవ్యాప్త సమ్మెగా మార్చలేకపోయారు. జారు ప్రభుత్వం తిరుగుబాటు దారులకు మించిన బలాన్ని ప్రయోగించి 9 రోజులు ఆణచివేత చర్యలు కొనసాగించింది. తిరుగుబాటును అణచివేసింది. ఇతర పట్టణాలలో, జిల్లాలలో పెద్ద ఎత్తున జరిగిన తిరుగుబాట్లను జారు నిరంకుశ ప్రభుత్వం అత్యంత క్రూరంగా అణచివేసింది. కా॥ లెనిన్ 1905 మొదటి రష్యన్ బూర్జువా విప్లవం ఓటమికి కారణాలను విశ్లేషించాడు. అవి 1. కార్మిక-కర్షక ఐక్యత స్థిరంగా ఏర్పడలేదు. రైతుల్లో ఇంకా జారుపైనా, సోషలిస్టు రివల్యూషనరీల మీద నమ్మకం వుంది. అందుకే రైతు పోరాటాలు తీవ్రం కాలేదు. 2. సైనికులలో చాలా మంది రైతు బిడ్డలు అయినప్పటికీ వారిపై విప్లవం ప్రభావంచూపకపోవడంతో వారు తిరుగుబాట్లను అణచడంలో జారుకు సహకరించారు. 3. కార్మికవర్గ పోరాటాలు ఏకీకృతం కాలేదు. 4. పార్టీ లోపల ఐక్యత లేదు. భిన్న ఎత్తుగడలు, చీలికలు గందరగోళ పరిచాయి. జారుకు యూరోపియన్ సామ్రాజ్యవాదులు సహకరించి ఉద్యమాన్ని అణచివేసారు. 6. 1905 సెప్టెంబర్‌లో యుద్ధంలో ఓడిపోయిన తరువాత జపాన్‌తో సంధి జారుకు సహకరించింది. విప్లవ సంక్షోభాన్ని అణచడానికి వెసులుబాటు దొరికింది. ఆ విధంగా లెనిన్ ఆనాటి ఓటమికి సబంధించిన రాజకీయ, నిర్మాణ అంశాలు పేర్కొన్నాడు. సాధారణ పరిస్థితుల్లో 30సం॥లలో పొందలేని అనుభవాన్ని (1905-07)మూడు సంవత్సరాల కాలం ఇచ్చిందన్నాడు. 1905 విప్లవ అనుభవాన్ని 1917 అక్టోబర్ విప్లవానికి డ్రెస్ రిహార్సల్స్‌గా చెప్పాడు. 1905 విప్లవ గుణపాఠాలు లేకుంటే 1917 అక్టోబర్ విప్లవం విజయవంతం అయి ఉండేది కాదని కూడా బలంగా విశ్వసించాడు. 1905 మొదటి విప్లవ కాలంలోనూ, ఆ వెనువెంటనే 1907 నుండి 12 వరకు అమలు జరిగిన స్టోలోపిన్ నిర్బంధ కాలంలోనూ పార్టీ గొప్పగా సమీకృతమయ్యింది.(స్టోలోఫిన్ నిర్బంధకాలంపై ప్రత్యేక వ్యాసం ఉంది చూడగలరు). 1906 నవంబర్ 9న స్టోలోపిన్(మంత్రి) కొత్త వ్యవసాయ చట్టాన్ని ప్రకటించాడు. దానితో కొన్ని సంవత్సరాల కాలంలోనే 10లక్షల మంది రైతాంగం భూములు కోల్పోయి పూర్తిగా నాశనమయ్యారు. 20లక్షల మంది గ్రామాలను విడిచి వెళ్ళారు. రష్యాలోకి విదేశీ పెట్టుబడులు పెద్దఎత్తున వచ్చి చేరాయి. దేశంలో పెట్టుబడిదారి విధానం, గుత్త, వ్యాపార పెట్టుబడిదారి విధానంగానూ, సామ్రాజ్యవాద పెట్టుబడిదారి విధానంగానూ పెద్ద ఎత్తున మార్పు చెందింది.

దీంతో రష్యన్ పాలక వర్గాలు విప్లవాన్ని ఒంటరి చేసి నాశనం చేయ పూనుకున్నారు. మార్క్సిజాన్ని విమర్శించడానికి, సంస్కరించడానికి కపట శాస్త్రీయ సిద్ధాంతాలు అనేక రకాల మత ధోరణులు ప్రబలంగా ముందుకు వచ్చాయి. సంశయవాదం, పతనం రెండూ కలగలిసి మార్క్సిస్టు సిద్ధాంత పునాదులను కూలదోయడానికి ప్రయత్నించాయి. వాళ్ళు గతితార్కిక భౌతికవాదంపై దాడిని కేంద్రీకరించి 6నెలల్లో 4పుస్తకాలు తెచ్చారు. వాటికి సమాధానంగా "భౌతికవాదం-అనుభవవాద విమర్శ" అనే తత్వశాస్త్ర సమస్యలపై లెనిన్ గ్రంథం, వారి విమర్శలను శాస్త్రీయంగా ఖండించింది.

ఈ గ్రంథంలో కా॥ లెనిన్ అనుభవవాదులు-మాక్, అవినారస్, ఇతరులు తెచ్చిన వాదాలను ఖండించి శాస్త్రీయ విశ్లేషణ చేసాడు. భౌతికశాస్త్ర పరిశోధన ఫలితంగా పదార్థం మరింత లోతుగా, విస్తృతంగా అర్థం కావడంతో ఎలక్ట్రాన్, ప్రోటాన్, న్యూట్రాన్, పాజిట్రాన్ లాంటి 30 మూలకాలు గుర్తించారు. అలా పదార్థం విచ్ఛిన్నమై అనేక భాగాలు కావడాన్ని వాళ్ళు పదార్థ నాశనంగా వక్రీకరించి "పదార్థం లేదు, పదార్థవాదన తప్పు. మార్క్సిజమే సరైనది కాదు" అంటూ విమర్శించారు. దానికి సమాధానమే లెనిన్ గ్రంథం. పదార్థం ఉనికిలో మార్పులేదు. మరింత లోతు విస్తృతి తెలియడం, 30భాగాలుగా అర్థం కావడం అన్ని రుజువులేనని స్పష్టపరుస్తూ లెనిన్ పదార్థ, భావాలను "మానవ మెదడుకు బయట అస్థిత్వంలో ఉ

ండేదే పదార్థం" అని పునర్నిర్వచించాడు. ఈ పరిస్థితులలో కా॥ లెనిన్ కొత్త పార్టీని, సోషల్ డెమోక్రటిక్ పార్టీ కంటే భిన్నమైన పార్టీని, అవకాశవాదవ్యక్తులు లేనటువంటి పార్టీని, రాజ్యాధికార లక్ష్యంతో శ్రామికవర్గాన్ని నడపగల శక్తివంతమైన పార్టీని ఏర్పరిచేందుకు కృషి చేసాడు. నిజమైన మార్క్సిస్టు పార్టీ అవకాశవాదుల పట్ల, రాజీ పడకుండా, బూర్జువాల పట్ల విప్లవకరంగా ఉండాలి. అది సామాజిక విప్లవ పార్టీగానూ, శ్రామికవర్గ నియంతృత్వ పార్టీగానూ, ఆర్థిక వాదులు, మెన్షివిక్‌లు, ట్రాట్స్కీవాదులు, అట్జోవిస్టులు(లీగల్ పోరాటాలను కాదనే వాళ్ళు) అన్ని రకాల భావవాదులు మొదలుకొని, అనుభవాద విమర్శకుల వరకు అన్ని రకాల విప్లవ వ్యతిరేక భావజాలలను ఓడించేదిగానూ ఉండాలి. ఈ విషయాలలో బోల్షివిక్‌ల మధ్య ఐక్యతను సాధించాడు.

మరోవైపు కార్మికవర్గ పార్టీ నిర్మాణానికి సైద్ధాంతిక సన్నాహాలు "ఏం చేయాలి" గ్రంథ రచనల నుండి మొదలయ్యాయి. నిర్మాణ సన్నాహాలు "ఒక అడుగు ముందుకు-ఒక రెండడుగులు వెనక్కి" అనే గ్రంథం చేసింది. "ప్రజాతంత్ర విప్లవంలో సోషల్ డెమొక్రసీ అనుసరించాల్సిన రెండు ఎత్తుగడలు" అనే గ్రంథం రాజకీయ సన్నాహాన్ని చేసింది. ఇంకా "భౌతికవాదం-అనుభవవాద విమర్శ" పార్టీకి తాత్విక సన్నాహాన్ని చేసింది. ఈ సన్నాహాలు చేస్తునే శ్రామికవర్గ పార్టీని ఒక కార్యక్రమం, ఎత్తుగడలు గల వర్గ సంస్థగా పునరుద్దరించేందుకు మెన్షివిక్‌లతో నిర్మాణరీత్యా తెగదెంపులు చేసుకోవడం అవసరమని కా॥లెనిన్ భావించాడు.

పరిస్థితులు పరిపక్వమై, సన్నాహాలు పూర్తయి, విప్లవకర శ్రామికవర్గ పార్టీ ఏర్పాటు బాధ్యత 1912 జనవరి ప్రాగ్(జకొస్లోవేకియా)లో జరిగిన ఆరవ అఖిల రష్యా మహసభ నెరవేర్చింది. అనాటి నుండి పార్టీని రష్యన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ(బోల్షివిక్)అని పిలుస్తున్నారు. బోల్షివిక్‌లు చైతన్యానికి, దృఢత్వానికి, పట్టుదలకు, బాధ్యతకు, విజయానికి మారు పేరుగా మారారు. అటువంటి చైతన్యయుతమైన దృఢత్వమే బోల్షివిజం.

మెన్షివిక్‌లతో విభజన రేఖ గీయబడిన ఆ మహసభ చరిత్రలో కీలకమైనది. బోల్షివిక్ పార్టీ ఆ తరువాత మరింత గట్టిపడింది, బలపడింది. శ్రామికవర్గ పార్టీ నుండి అవకాశవాదం అనే చెత్తను తుడిచివేసారు.

ఇటువంటి ఒక నూతన కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం లేకుంటే రాజ్యాధికారాన్ని స్వాధీనపరుచుకోవడం, శ్రామికవర్గ నియంతృత్వాన్ని నెలకొల్పడం, అంతర్యుద్ధం నుండి బయటపడటం, సోషలిజం నిర్మించడం సాధ్యమయ్యేవి కావు. 1912-14మధ్య కార్మికవర్గ జనసామాన్యాన్ని విప్లవోద్యమంలో నూతన ఉత్సాహంతో నడపగలిగి ఉండేది కాదు.

కా॥ లెనిన్ నాయకత్వంలో బోల్షివిక్ పార్టీ మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో సామ్రాజ్యవాదం గురించి లోతుగా విశ్లేషించి పెట్టుబడిదారీ విధానం యొక్క అత్యున్నత దశగా, ప్రపంచ యుద్ధానికి ప్రధాన కారణంగా, ఆ యుద్ధం విప్లవాలకు తొలి సంధ్య అని గుర్తించారు. సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చి రష్యాలోని విప్లవ పరిస్థితులను వినియోగించుకొని ఫిబ్రవరి విప్లవాన్ని, ఆ వెనువెంటనే అక్టోబర్ సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేసారు. భూమి, రొట్టె, శాంతి అనే నినాదాలు జారుప్రభుత్వాన్ని, తాత్కాలిక ప్రభుత్వాన్ని (లిబరల్ బూర్జువా నాయకత్వం)కూల్చాయి. బోల్షివిక్‌ల నాయకత్వంలోని సోవియట్లకే సర్వాధికారాలు అన్న నినాదం బోల్షివిక్ పార్టీ నాయకత్వంలో 1917 అక్టోబర్‌లో కార్మికవర్గానికి రాజ్యాధికారాన్ని సాధించి పెట్టింది. కార్మికవర్గ నాయకత్వంలో ఏర్పడిన రాజ్యాన్ని నాశనం చేయడానికి 18 సామ్రాజ్యవాద దేశాలు దురాక్రమణ యుద్ధాలు చేస్తే, రష్యా ప్రజలు ఒక్క మనిషిగా 'యుద్ధ కమ్యూనిజాన్ని' అమలు చేసి (1918-20)అంతర్జాతీయ శ్రామికవర్గ సహకారంతో ఆ యుద్ధాలను ఓడించారు. 1921లో నూతన ఆర్థిక విధానం (ఎన్.ఇ.పి), 1924లో నూతన పారిశ్రామిక విధానం అమలు చేసి, పంచవర్ష ప్రణాళికల సహకారంతో దేశాన్ని సోషలిజంలోకి నడిపించారు. ప్రగతిని సాధించారు. ప్రపంచమంతా 1930 నాటి సంక్షోభం ప్రభావితమయినా గాని రష్యాలోని సోషలిస్టు విధానం ప్రభావితం కాలేదు. స్థిరంగా సోషలిస్టు విధానం కొనసాగింది. 1919లో లెనిన్ సారధ్యంలో 3వ ఇంటర్నేషల్ ఏర్పడి ప్రపంచ సోషలిస్టు విప్లవానికి ఎంతగానో సహకరించి, సోషలిస్టు కర్తవ్యాలను నెరవేర్చింది.

1939-45 మధ్య కాలంలో జరిగిన రెండవ ప్రపంచ యుద్ధకాలంలో సామ్రాజ్యవాదులు సంక్షోభ తీవ్రత నుండి ఫాసిజాన్ని పెంచి పోషించాయి. జర్మనీని సోవియట్ రష్యాను నాశనం చేయడానికి ఉసిగొల్పాయి. అయితే స్టాలిన్ ముందుగానే ఈ కుట్రలను పసిగట్టి జర్మనీతో సంధి ఒప్పందం చేసుకొని (ఎత్తుగడగానే) కొంత సమయం సంపాదించ గలిగాడు. ఆ తర్వాత పూర్తి రష్యన్ ప్రజలు, ఎర్రసైన్యం సంసిద్ధతతో జర్మన్ సైన్యాలను ఓడించి, జర్మనీ వరకు వెనక్కి తరిమారు. తూర్పు యూరప్ దేశాలను విముక్తి చేసారు. కా॥ స్టాలిన్ నాయకత్వంలో కార్మికవర్గ ప్రభుత్వం చైనా విప్లవానికి సహకరిస్తూ ఫాసిస్టు జపాన్‌పై దెబ్బ తీసి చైనా విముక్తికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగాను సహకరించింది. ప్రపంచంలో 3వ వంతు భూభాగంలో సోషలిస్టు శిభిరాన్ని ఏర్పరిచింది.

ఇంతటి మహత్తర చరిత్ర నిర్మాణానికి, బోల్షివిక్ పార్టీ విజయానికి దారితీసిన కారణాలు మనం అర్థం చేసుకొని లోతుగా అధ్యయనం చేయాలి.

**సోవియట్ విప్లవం నిర్ధారించిన ముఖ్యమైన గుణపాఠాలు :**

1. మార్క్సిజం-లెనినిజం సిద్ధాంత మార్గదర్శకంగా ఉండాలి.

2. విప్లవ శ్రామికవర్గ పార్టీ లేనిదే శ్రామికవర్గ నియంతృత్వాన్ని సాధించలేం. అటువంటి నూతన పార్టీ లెనినిస్టు పార్టీనే.

3. కార్మికవర్గ ఐక్యతను చీల్చే మధ్య తరగతి పార్టీలను నాశనం చేయాలి.

4. పార్టీలో అవకాశవాదులు లొంగుబాటు దారులతో పోరాడి నాశనం చేయకుండా ఐక్యతను సాధించలేం.

5. తన తప్పులను నిష్కపటంగా అంగీకరించడం, సరిదిద్దుకోవడం తప్పనిసరి అని గుర్తించాలి.

6. పార్టీకి ప్రజాసామాన్యంతో విశాలమైన సంబంధాలు లేకపోయినట్లైతే, బలపరుచుకోనట్లైతే, నేర్చుకోనట్లైతే పార్టీ నాశనమవుతుందని గుర్తించాలి.

# బోల్షివీకరణ సాధించడానికి కొన్ని మౌలిక షరతులు

**- స్టాలిన్**

**(జర్మన్ కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు హెర్జోగ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కామ్రేడ్ స్టాలిన్ చెప్పిన అంశాలివి. 'జర్మన్ కమ్యూనిస్టు పార్టీకి గల అవకాశాలూ, బోల్షివీకరణ సమస్య' అనే పేరిట ఈ ఇంటర్వ్యూ 'ప్రావ్దా' పత్రిక నెంబర్ 27లో, 1925 ఫిబ్రవరి 3న ప్రచురితమైనది.)**

బోల్షివీకరణను సాధించాలంటే కనీసం కొన్ని మౌలిక షరతులను పరిపూర్తి చేయాలి. ఇవి లేకుండా కమ్యూనిస్టు పార్టీల బోల్షివీకరణ సాధ్యం కాదు.

1. పార్టీ తనను తాను పార్లమెంటరీ ఎన్నికల యంత్రాంగానికి ఉపాంగంగా భావించుకోరాదు. నిజానికి సోషల్ డెమొక్రటిక్ పార్టీ తనను తాను ట్రేడ్ యూనియన్లకు పనికిమాలిన ఒక అనుబంధంగా భావించుకోరాదు. కొన్ని అరాచకవాద శక్తులు కొన్నిసార్లు తాము అలాంటివారమని చెప్పుకుంటాయి. పార్టీ తనను తాను కార్మిక వర్గ అత్యున్నత వర్గసంస్థగా భావించుకోవాలి. దాని కర్తవ్యం ఇతర అన్ని రూపాల కార్మిక వర్గ సంస్థలనూ, అంటే ట్రేడ్ యూనియన్ల నుండి మొదలుకొని పార్లమెంటులోని పార్టీ బృందం వరకూ అన్నిటికీ నాయకత్వం వహించడం.

2. పార్టీ, ముఖ్యంగా దాని నాయకత్వ శక్తులు విప్లవాచరణతో విడదీయరాని సంబంధాన్ని కలిగి ఉన్న మార్క్సిజం విప్లవ సిద్ధాంతంపై కూలంకషమైన పట్టు సంపాదించాలి.

3. తయారుగా ఉన్న పార్ములాల మీదా, చారిత్రకంగా ఉన్న పోలికల మీదా ఆధారపడి పార్టీ తన నినాదాలనూ, ఆదేశాలనూ రూపొందించకూడదు. విప్లవోద్యమ నిర్దిష్ట అంతర్గత, అంతర్జాతీయ పరిస్థితుల మీద నిశితంగా చేసిన విశ్లేషణల ఫలితంగా అవి రూపొందాలి. అలాగే అది తప్పనిసరిగా అన్ని దేశాల విప్లవాల అనుభవాలను దృష్టిలో ఉంచుకోవాలి.

4. పార్టీ ఈ నినాదాలు, ఆదేశాలు ఎంత సరైనవనేదాన్ని విప్లవ ప్రజానీకం చేసే పోరాటాల కొలిమిలోనే నిగ్గుదేల్చాలి.

5. పార్టీ మొత్తం పని అంతటినీ, ప్రత్యేకించి దానిలో ఇప్పటికీ సోషల్ డెమొక్రటిక్ సంప్రదాయాలు నిర్మూలన కాకుండా యింకా మిగిలి ఉన్నప్పుడు, పార్టీ వేసే ప్రతి అడుగూ, తీసుకునే ప్రతి చర్యా విశాల కార్మిక ప్రజారాశులను విప్లవస్ఫూర్తితో విప్లవీకరించడానికీ, వారికి శిక్షణ గరపడానికీ, వారిని విద్యావంతం చేయడానికీ, సహజంగా దోహదపడేలా నూతన విప్లవ పద్ధతుల్లో తిరిగి సంఘటితం చేయాల్సి ఉంటుంది.

6. పార్టీ తన పనిలో సూత్రాలను కచ్చితంగా కట్టుబడి ఉండడాన్ని (దీన్ని సెక్టేరియనిజంతో గందరగోళపరచరాదు!) ప్రజలతో అత్యధిక సంబంధాలనూ, బంధాలనూ కలిగి ఉండటంతో (తోక పట్టుకొని పోయే ధోరణితో దీన్ని గందరగోళ పరచరాదు) జోడించాలి. ఇలా చేయకపోతే పార్టీ ప్రజలకు ఏమీ నేర్పలేకపోవడమే కాదు వారి నుండి ఏమీ నేర్చుకోలేదు కూడా, అది ప్రజలకు నాయకత్వం వహించి వారిని తన స్థాయికి ఎదిగించలేక పోవడమే కాక, వారి అభిప్రాయాలను పట్టించుకొని వారి తక్షణ అవసరాలను ముందే అంచనా కట్టలేకపోతుంది కూడా.

7. పార్టీ తన పనిలో రాజీలేని విప్లవస్ఫూర్తిని (దీన్ని విప్లవ దుందుడుకువాదంతో గందరగోళ పరచరాదు!) అత్యధికమైన పట్టువిడుపులతో, విన్యాసాలు చేయగల సామర్థ్యంతో (దీన్ని అవకాశవాదంతో గందరగోళ పరచరాదు) జోడించాలి. ఇలా చేయకపోతే పార్టీ అన్ని రకాల పోరాట, నిర్మాణ రూపాలపై పట్టు సాధించలేక పోతుంది, కార్మిక వర్గ రోజువారి సమస్యలను కార్మిక వర్గ విప్లవ మౌలిక ప్రయోజనాలతో జోడించలేక పోతుంది, అలాగే తన పనిలో చట్టబద్ధ, చట్టవ్యతిరేక పోరాటాలను జోడించలేకపోతుంది.

8. పార్టీ తన తప్పులను కప్పిపుచ్చుకోకూడదు, అది విమర్శలకు వెరవకూడదు. అది తన తప్పుల నుండి నేర్చుకోవడం ద్వారా తన కార్యకర్తలను మెరుగుపరిచి వారిని విద్యావంతం చేయాలి.

9. పార్టీ తన ముఖ్యమైన బృందంలోకి పురోగామి యోధుల నుండి అత్యున్నత శక్తులను భర్తీ చేసుకోవాలి. వారు విప్లవ కార్మికవర్గ ఆకాంక్షలకు అసలైన ప్రతినిధులుగా ఉండేలా ఆశయం పట్ల తగినంత అంకితభావం కలిగినవారై ఉండాలి. కార్మికవర్గ విప్లవానికి నిజమైన నాయకులుగా మారడానికి తగినంత అనుభవం కలిగిన వారై వుండాలి. వారు లెనినిజం వ్యూహం, ఎత్తుగడలను అన్వయించ గలిగిన వారై వుండాలి.

10. అత్యున్నత సమైక్యతను సాధించే లక్ష్యంతో పార్టీ తన సంస్థల సామాజిక పొందికను ప్రణాళికా బద్ధంగా మెరుగుపర్చుకుంటూ, చెడగొట్టే అవకాశవాద శక్తులను తన నుండి ఏరి పారేయాలి.

11. సైద్ధాంతిక (ఐడియాలాజికల్)సమైక్యత, ఉద్యమ లక్ష్యం పట్ల స్పష్టత, ఆచరణాత్మక చర్యలో సమైక్యత, పార్టీ సభ్యుల విశాల రాశులకు పార్టీ కర్తవ్యాల పట్ల ఉన్న అవగాహనల ప్రతిపాదికన పార్టీ ఉక్కు క్రమశిక్షణను సాధించాలి.

12. పార్టీ ప్రణాళికబద్ధంగా తన నిర్ణయాల, ఆదేశాల అమలు తీరుతెన్నులను తెలుసుకోవాలి ఇది జరగకుంటే ఈ నిర్ణయాలూ, ఆదేశాలూ ఒట్టి వాగ్దానాలుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ఇది పార్టీపై విశాల కార్మికరాసుల కున్న విశ్వాసాన్ని వమ్ము చేస్తుంది.

# బోల్షివీకరణ క్యాంపెయిన్‌లో భాగంగా పార్టీ, పిఎల్‌జిఎలలో

# కార్మికవర్గ క్రమశిక్షణను అమలు చేద్దాం !

ప్రియమైన కామ్రేడ్స్

పి.ఎల్.జి.ఎకు ప్రజల ప్రయోజనాలే సర్వస్వం. అది ప్రజల విముక్తి కోసం, తన సర్వస్వాన్ని ఒడ్డి పోరాడుతుంది. ప్రజల రాజ్యాధికారమే తన లక్ష్యంగా పని చేస్తుంది. ఈ లక్ష్యం సాధించడానికి పి.ఎల్.జి.ఎ దోపిడీ పాలక వర్గాలైన దళారీ, నిరంకుశ బూర్జువా బడా భూస్వామ్య వర్గాలపై విజయం సాధిస్తుంది.

అయితే 'దోపిడీ పాలక వర్గంపై విజయం సాధించడానికి సంపూర్ణ కేంద్రీకరణ, ఖచ్చితమైన శ్రామికవర్గ క్రమశిక్షణ ఉండటం ఒక మౌళిక షరతు' అని కా॥ లెనిన్ అన్నాడు. అదే విధంగా 'మన పార్టీ పంథాను అమలు చేయడానికి క్రమశిక్షణ హామి పడుతుందని' కా॥ మావో చెప్పాడు. ఆ రెండు సూత్రీకరణలు రష్యా, చైనా దేశాల విప్లవాల నుండి చేసిన తిరుగులేని నిర్ధారణలు.

పై సూత్రీకరణల ఆధారంగానే చైనా విప్లవంలో కా॥ మావో ఎర్రసైన్యానికి మూడు క్రమశిక్షణ నియమాలు, 8 గమనించవలసిన అంశాలను రూపొందించాడు.

**1. మూడు క్రమశిక్షణ నియమాలు :**

అ. అన్ని కార్యక్రమాలలోని ఆజ్ఞలను పాటించు.

ఆ. ప్రజల నుండి ఒక సూదిని కానీ, దారపు పోగును కానీ తీసుకోవద్దు.

ఇ. స్వాధీన పరుచుకున్న వాటిని అప్పగించు.

**2. గమనించవలసిన అంశాలు :**

అ. మర్యాదగా మాట్లాడు.

ఆ. నీవు కొన్న దానికి న్యాయమైన ధర చెల్లించు.

ఇ. ఎరువు తెచ్చుకున్న దాన్ని తిరిగి ఇచ్చివేయి.

ఈ. చెడగొట్టిన వాటికి నష్టపరిహారం చెల్లించు.

ఉ. ప్రజలను తిట్టవద్దు, కొట్టవద్దు.

ఊ. పంటలకు నష్టం కలుగజేయవద్దు.

ఋ. స్త్రీలతో చిత్తం వచ్చినట్లు ప్రవర్తించవద్దు.

ౠ. బంధీలను అమర్యాదగా చూడవద్దు. అవమాన పరచవద్దు.

పై 3 క్రమశిక్షణ నియమాలు, 8 పాటించవలసిన అంశాలను ఎర్రసైన్యం తన కార్యాచరణలో దృఢంగా అమలు చేయడం ద్వారానే ప్రజలకు అతి చేరువ కాగలిగింది. ప్రజల చేతిలో ఒక ఆయుధంగా మారింది. ప్రజల క్రియాశీల మద్దతును ఉపయోగించుకొని శత్రువుపై వీరోచితమైన దాడులు నిర్వహిస్తూ, విజయాలు సాధిస్తూ అజేయంగా ఎదిగింది.

మన దేశంలో కూడా పి.ఎల్.జి.ఎ కా॥ మావో రూపొందించిన మూడు క్రమశిక్షణ సూత్రాలను, గమనించవలసిన 8 అంశాలను తన కార్యచరణలో దృఢంగా అమలు చేస్తూ వచ్చింది. ఇంకా మన పార్టీకి చెందిన కేంద్రకమిటీ, సి.ఎమ్.సిలు రూపొందించిన 9 స్టాండింగ్ ఆర్డర్‌లను, 6 క్రమశిక్షణా సూత్రాలను తన కార్యచరణలో భాగం చేసుకుంటూ ఎదిగింది. ఈ క్రమంలోనే ప్రజలకు చేరువయి, ప్రజల విశ్వాసాన్ని చూరగొంటూ శత్రువుపై అనేక గెరిల్లా దాడులు నిర్వహించి విజయాలు సాధించింది.

**స్టాండింగ్ ఆర్డర్స్ :**

1. పి.ఎల్.జి.ఎ క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలి. ఇష్టమున్నట్లు వ్యవహరించరాదు.

2. నిర్ణయించుకున్న ఫార్మేషన్‌లోనే ప్రతి గెరిల్లా యూనిట్ ప్రయాణించాలి.

3. గెరిల్లా యూనిట్ మకాం చేరగానే వెంటనే సెంట్రీని నియమించి, రక్షణ కవర్స్ తీసుకోవాలి.

4. ప్రతి రోజు తుపాకులను పద్ధతి ప్రకారం శుభ్రం చేసుకోవాలి.

5. ప్రతి రోజు రోల్‌కాల్ చేసి అవసరమైన విషయాలన్నీ బ్రీఫింగ్ చేయాలి.

6. ప్రతి రోజు మకాం చుట్టూ ప్రొటెక్టివ్ పాట్రోలింగ్ చేయించాలి.

7. ఎవరి ఆయుధాలు వారి వద్దనే ఉండాలి. పౌరులకు ఇవ్వరాదు.

8. 20 మీటర్లకు పైబడి విసరగలిగిన వారికి మాత్రమే గ్రెనేడ్స్ ఇవ్వాలి.

9. అవామీ జంగ్ పత్రికను చదవాలి – చదివించుకోవాలి.

**ప్రజా గెరిల్లాలు పాటించవలసిన ఆరు క్రమశిక్షణా సూత్రాలు :**

1. కార్యకలాపాలన్నింటిలోనూ పై కమిటీ ఉత్తర్వులు పాటించాలి.

2. ప్లాన్ వేసుకునే సమయంలో అభిప్రాయాలను స్పష్టం చేయాలి.

3. యాక్షన్ జరిగే సమయంలో గెరిల్లా కమాండర్ ఆజ్ఞల్ని విధిగా పాటించాలి.

4. శత్రువు నుండి స్వాధీనపర్చుకున్నదంతా పార్టీకి అప్పగించాలి.

5. ఆయుధాన్ని ప్రాణంతో సమానంగా కాపాడుకోవాలి.

6. యాక్షన్ సమయంలో నియమించిన పనికి మాత్రమే కట్టుబడాలి.

అయితే శత్రువు 2009 ఆగస్టు/సెప్టెంబర్ మాసం నుండి విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతో ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడిని ప్రారంభించాడు. ఈసారి శత్రువు మునుపెన్నడూ లేనంత స్థాయిలో తన సాయుధ బలగాలను మనపై కేంద్రీకరిస్తున్నాడు. తనకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని, అత్యంత ఆధునికమైన ఆయుధాలను తన బలగాలకు అందిస్తున్నాడు. యుద్ధంలో అత్యంత కౄరమైన, మోసపూరితమైన పద్ధతులు అనుసరిస్తున్నాడు. ఈ దాడి ఎల్.ఐ.సి

వ్యూహంలో భాగంగా బహుముఖంగా జరుగుతున్నది.

ఈసారి శత్రువు చేపట్టిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడిలో మనం కొంత మేరకు నష్టపోయాము. ప్రస్తుతం మన ఉద్యమం గడ్డుస్థితికి చేరుకుందని కేంద్రకమిటీ పేర్కొంది. ఉద్యమంలో ఈ పరిస్థితి తలెత్తడానికి శత్రువు బలాధిక్యత ఒక కారణంగా ఉంది. మరొక కారణంగా మన స్వీయ బలహీనతలు ఉన్నాయి. ఈ బలహీనతలు పెటీబూర్జువా దృక్పథానికీ, ఆలోచనలకూ, అలవాట్లకు చెందినవి. ఇవి మొత్తం ప్రజల విప్లవ ప్రయోజనాలకు వ్యతిరేకమైనవి. వ్యక్తి ప్రయోజనాలకూ, ఆలోచనలకూ, అభిరుచులకూ, అలవాట్లకూ ప్రాధాన్యత నిచ్చేవి. ఈ పెటీబూర్జువా వర్గ ధోరణులు మన పి.ఎల్.జి.ఎలో ఐక్యతనూ, పోరాట మానసికతను దెబ్బతీస్తున్నాయి. ప్రస్తుతం శత్రువు మనపై యుద్ధం తీవ్రతరం చేసిన నేపథ్యంలో ఈ బలహీనతలు ఉద్యమం గడ్డుస్థితికి చేరడానికి ఒక బలమైన కారణంగా ఉన్నాయి.

ఈ నేపథ్యంలో పార్టీ, పి.ఎల్.జి.ఎలో కొనసాగుతున్న పెటీబూర్జువా వర్గ ధోరణులను పోగొట్టుకునేందుకు కార్మికవర్గ క్రమశిక్షణను మరింత దృఢంగా అమలు చేయాల్సి వుంటుంది. ఎప్పుడైతే మనం రోజువారి కార్యాచరణ నుండి మొదలుకొని మొత్తం మన కార్యచరణలో కార్మికవర్గ క్రమశిక్షణను దృఢంగా అమలుచేయగల్గుతామో, అప్పుడే మన పార్టీ, పి.ఎల్.జి.ఎల నుండి పెటీబూర్జువా వర్గ ధోరణులను దూరం చేసుకోగలుగుతాము. అప్పుడే పి.ఎల్.జి.ఎలో బలమైన శత్రువును ఎదుర్కోగలిగే ఐక్యతా, ప్రజల విముక్తి ఎడల అంకితభావం, పోరాట సామర్థ్యం పెరుగుతాయి.

పైన చెప్పినట్లుగా కార్మికవర్గ క్రమశిక్షణను దృఢంగా అమలు చేయడం ద్వారానే విప్లవ విజయానికీ, పంథా అమలుకు హామి పడగల్గుతాము. కనుక పార్టీ నిర్వహించే క్యాంపుల సందర్భంగా కార్మికవర్గ క్రమశిక్షణను అమలు చేయడంలో భాగంగా ఈ క్రింది క్రమశిక్షణ నియమాలను పాటించాలి. (ఆయా క్యాంపుల సందర్భంగా స్థల, కాలాలను దృష్టిలో వుంచుకొని, చిన్న చిన్న మార్పులు చేసినప్పుడు వాటినే పాటించాలి).

**పి.ఎల్.జి.ఎ రోజువారి కార్యకలాపాలు :**

1. నిద్రలేవడం : ఉదయం 5 గం॥లకు లేవాలి.

2. రోల్‌కాల్ : ఉదయం 6 గం॥లకు

- 5 నిమిషాలు ముందు రావాలి.
- వచ్చేముందే కాలకృత్యాలు తీర్చుకోవాలి.
- లైన్‌లో నిలబడిన తరువాత మాట్లాడకూడదు.
- రోల్‌కాల్‌కు బ్రష్‌లు, దువ్వెనలు వంటివి పట్టుకు రాకూడదు.
- సాధ్యమైన మేరకు యూనిఫాంలో రావాలి. (షూ, క్యాప్ ధరించాలి)
- మఫ్లర్‌లు, కర్చీఫ్‌లు మెడపై ఉండరాదు.
- సమయానికి రానివారు బయట వరుసలో నిలబడాలి.

3. పనులు నిర్వహించే దగ్గర (కిచెన్, సమిష్టి పనులు, స్నానాలు) అల్లరి (మొర్ర) చేయరాదు. అల్లరి చేయడం ద్వారా శబ్దాలు దూరం వెళ్ళి క్యాంపు బహిర్గతం అయ్యే అవకాశం ఉంటుంది. ఈ విషయాన్ని ప్రతి ఒక్క కామ్రేడ్ దృష్టిలో వుంచుకోవాలి.

4. స్త్రీలుగానీ, పురుషులుగానీ స్నానాలకు కేటాయించిన రోజే పోవాలి. (ప్రత్యేక అవసరాలు ఉన్నప్పుడు మహిళలకు మినహాయింపు). ఆరేసిన బట్టలు సాయంత్రం 4 గంటల లోపు తెచ్చుకోవాలి. రంగురంగుల బట్టలు కేమోఫ్లేజ్‌కు భంగం కలిగేలా ఆరుబయట వేయరాదు. స్నానాలు చేసేదగ్గర సబ్బు కవర్లు, ఇతర వస్తువులు వదలరాదు. గంటలోపే బట్టలు ఉతకడం, స్నానం చేయడం పూర్తిచేయాలి.

5. డేరా వద్ద చెత్త (కాగితాలు, మందు బిళ్లల కవర్లు, రెక్జిన్ ముక్కలు) పోగేయరాదు. డేరా వద్ద గొయ్యి తవ్వి అందులో చెత్తను పడేయాలి. డేరా ఖాళీ చేసేటప్పుడు సాధ్యమైనంత కేమోఫ్లేజ్ అయ్యేలా చూడాలి.

6. కిచెన్ వద్ద తినే పదార్థాలపై కామెంట్లు చేయరాదు. వంటకాలపై ఏదైనా అభిప్రాయాలుంటే నిర్వహణ కమిటీకి తెలియచేయాలి. తినగా మిగిలిన వ్యర్థ పదార్థాలను గొయ్యిలో పడేయాలి. పరిశుభ్రతను పాటించాలి.

7. సమిష్టి పనులు (కట్టెలు తేవడం, నీళ్ళు తేవడం...వగైరా) లో ప్రతి ఒక్కరు తమ శక్తి మేరకు కృషి చేయాలి.

8. టిఫిన్ తినగానే తుపాకులు శుభ్రపరుచుకోవాలి. శుభ్రపరుచుకునేటప్పుడు బేరల్స్ క్యాంపుకు వ్యతిరేక దిశలో ఉండాలి. ఎప్పుడు పడితే అప్పుడు తుపాకులు విప్పదీయడం గానీ, శుభ్రపర్చడం గానీ చేయరాదు.

9. తుపాకులను ఎల్లవేళలా అందుబాటులో వుంచుకోవాలి. ఎక్కడ పడితే అక్కడ వదిలి దూరంగా సంచరించరాదు.

10. పి.టి, డ్రిల్స్ చేసేదగ్గర కమాండర్ కాషన్లు ఫాలో అవ్వాలి. మాట్లాడటం, నవ్వటం చేయరాదు.

11. రోజువారి మన కర్తవ్యాలు, విధులు, నిర్వహిస్తే మనకు ఇతరులతో గొట్టి (కాలక్షేపం) చేసే సమయం ఉండదు. కానీ కొద్దిమంది తమ విధులను, కర్తవ్యాలను వదిలి ఇతరులతో గొట్టికి ప్రాధాన్యతనిస్తారు. వీరు నిర్మాణరాహిత్యంగా అన్ని విషయాలు మాట్లాడుకుంటారు. ఇది చాలా తీవ్రమైన తప్పుడు పద్ధతి.

12. సెంట్రీ, పెట్రోలింగ్ చేసేటప్పుడు మిలటరీ నియమాలను, పద్ధతులను తప్పక పాటించాలి. యదాలాపంగా, మొక్కుబడిగా చేయరాదు. రక్షణకున్న ప్రాధాన్యత రీత్యా రోజులో 3 సెంట్రీలు వచ్చినా చేయడానికి సిద్ధపడాలి. శక్తి మేరకు ప్రతి కామ్రేడ్ బరువులు మోసేందుకు సిద్ధంగా ఉండాలి. పగలు డిప్యూటీ కమాండర్లు, రాత్రిపూట కమాండర్లు సెంట్రీలను చెక్ చేయాలి.

13. అనారోగ్యం పాలైనప్పుడు వెంటనే క్యాంపు డాక్టర్‌కు తెలియజేసి మందులు తీసుకోవాలి. డాక్టర్ సూచనల ప్రకారం మందులు తప్పనిసరిగా వాడాలి.

14. క్యాంపు అవసరాల నిమిత్తం గ్రామం నుండి తీసుకొచ్చే పనిముట్ల (పలుగు, పారా...వగైరా)ను భద్రంగా వారికి అప్పజెప్పాలి. ఈ విషయంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా మెలగాలి.

15. స్కూలు, సమిష్టి అధ్యయానాలకు హాజరు కావాలి. సమయపాలన పాటించాలి.

16. చీకటి పడకముందే సాయంత్రం భోజనం ముగించాలి. లైట్ రాత్రిపూట గెరిల్లాలకు శత్రువు కనుక మనం టార్చిలైట్‌లను విచ్చలవిడిగా వాడరాదు. అవసరమైనప్పుడు మాత్రమే ఫోకస్ తగ్గించి కింది వైపు లైట్‌ను వాడాలి.

17. కిట్‌లోని వస్తువులను చెల్లాచెదురుగా పడేయరాదు. అవసరమైన వస్తువుల్ని మాత్రమే బయట పెట్టుకొని కిట్టునెప్పుడూ సర్ది ఉంచుకోవాలి. కేటాయించిన వస్తువుల కాల పరిమితిని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా వాడుకోవాలి. దుబారా చేయరాదు. ముఖ్యంగా ఇతరుల వస్తువులనూ, సమిష్టి వస్తువులను సంబంధిత బాధ్యులకు తెలియకుండా తీయరాదు. ఒకవేళ అవసరముండి తీసుకుంటే బాధ్యతగా అప్పచెప్పాలి.

18. మొత్తంగా రోజువారి పనిలో (టైమ్ టేబుల్) సమయ పాలనను పాటించడం, పనిని వాయిదా వేయకుండా వుండటం, పనిని పూర్తి చేయడం అనే మూడు కార్యాచరణ సూత్రాలను అందరు విధిగా పాటించాలి.

పైన చెప్పుకున్న క్రమశిక్షణా సూత్రాలన్ని మిలటరీ జీవితంలో చాలా విలువైనవి. ఈ సూత్రాలను ఎవరికి వారు స్వచ్ఛందంగా అమలు చేసినప్పుడు మన పి.ఎల్.జి.ఎ శక్తి సామర్థ్యాలు మరింతగా పెరిగి ఏ క్షణమైనా శత్రువును ఎదుర్కొనే బలమైన ఎర్రసైన్యంగా తయారవుతుంది

విప్లవాభివందనాలతో

ఎ.ఒ.బి ఎస్‌జడ్‌సి

**25-12-14**

## సామ్రాజ్యవాద దేశంగా మారుతున్న చైనా (డ్రాగన్)

**1. ఘనా లోని బంగారం అక్రమ తవ్వకాల్లో గుత్తాధిపత్యం చైనాదే**

**2. మాందేబ్ (పాకిస్థాన్)**

**హెూర్ముజ్ (శ్రీలంక) - కీలక జల సంధులలో సైనిక స్థావరాలు నిర్మించుకుంది.**

**మలక్కా (బంగ్లాదేశ్)**

**3. మరావ్ (మాల్దీవులు)**

**గ్వడార్ (పాకిస్థాన్)**

**చిట్టగాంగ్ (బంగ్లాదేశ్) - రేవులను నిర్మిస్తున్నది.**

**సిట్వే (మయన్మార్)**

**లాము (కెన్యా)**

**హంబన్‌టోట (శ్రీలంక)**

**4. కచ్ఛా తీవు (శ్రీలంక)లో చైనా సైనిక గుడారాలున్నాయని వార్తలు వస్తున్నాయి. ఇది కూడా ముత్యాలదండ (పెర్ల్ గార్లెండ్) వ్యూహంలో భాగంగా చెప్తున్నారు. (ద స్ట్రింగ్ ఆఫ్ పెరల్స్)**

**బ్రహ్మపుత్రపై నిర్మించే (జూంగ్ము)- ప్రాజెక్టు ప్రపంచంలోనే అతి పెద్దది. ఈ ప్రాజెక్టు బ్రహ్మపుత్ర నదీ జలాలను భారత్ లోకి రాకుండా అడ్డుకొంటుంది.**

**5. ఫసిపిక్ మహా సముద్రంలో జపాన్ ఆధీనంలో వున్న 'సెంకాకు' దీవుల విషయంలో చైనా ఘర్షణ పడ్తున్నది. ఆ దీవులు తమవేనంటూ రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో జపాన్ ఆక్రమించిందని వాదిస్తున్నారు.**

**6. చైనా రక్షణ రంగం బడ్జెట్ 6 లక్షల కోట్లు**

**7. చైనా సాయుధ దళాల సంఖ్య 22,85000**

కరపత్రం/పత్రికా ప్రకటన

# పాలక వర్గాల ప్రజా వ్యతిరేక, స్వార్థ పూరిత ఆర్థిక విధానాల ఫలితమే హుదూద్ తుఫాను-దాని విధ్వంసం

**ప్రియమైన ప్రజలారా !**

హుదూద్ తుఫాను కారణంగా ఆస్తులను, ఆప్తులను కోల్పోయిన ఉత్తరాంధ్ర, తూర్పు గోదావరి, విశాఖ నగర ప్రజానీకానికి ఎ.ఒ.బి ఎస్.జడ్.సి(సి.పి.ఐ మావోయిస్టు) తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తున్నది. ఈ కష్టకాలంలో మీకు పార్టీ అండగా ఉంటుందనే హామినిస్తూ ఈ ప్రకృతి విధ్వంసాలకు కారణమవుతున్న కొన్ని వాస్తవాలను మీ ముందుకు తెస్తున్నది. వాటిని పరిశీలించి భవిష్యత్ కార్యాచరణకు పూనుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నది.

12-10-2014 తేది ఆదివారం నాడు విశాఖ నగరం వద్ద తీరాన్ని తాకిన హుదూద్ పై నాలుగు జిల్లాలలో భారీ విధ్వంసాన్ని సృష్టించింది. ప్రభుత్వ ప్రాథమిక అంచనాల ప్రకారం 60 మంది మృతి చెందగా అనేక మంది క్షతగాత్రులయ్యారు. 4 లక్షల హెక్టార్లలోని (వరి, కొబ్బరి, అరటీ, కాఫీ...) పంటలు నేలమట్టమయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు 70వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. లక్షలాదిమంది నిరాశ్రయులయ్యారు. దేశంలో పేరెన్నికగన్న పారిశ్రామిక నగరాల్లో ఒకటైన విశాఖ ఈ తుఫాను తాకిడితో అపార నష్టాన్ని చవిచూసింది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన భారీ పరిశ్రమలు, సెజ్‌లు, సంస్థలు లఘు పరిశ్రమల ఆస్తులకు నష్టం వాటిల్లింది. మధ్య తరగతి, బలహీన వర్గాలకు చెందిన 2 లక్షల ఇళ్ళు ధ్వంసమయ్యాయి. ఫుట్‌పాత్‌లపై చిరువ్యాపారాలు చేసుకునే 80 వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. మత్స్యకారుల ఇళ్ళు, పడవలు, వలలు నాశనమయ్యాయి. సుమారుగా 20 లక్షల మంది తుఫాను బారినపడగా 6 లక్షల మందికి పైగా పునరావాస శిబిరాలలో తలదాచుకున్నారు. "ఆస్తుల నష్టం ఎన్ని వేల కోట్లో ఎవరు చెప్పగలరు" అంటూ ప్రభుత్వం చేతులెత్తేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుంది.

తుఫాను ప్రమాదం గురించి వారం రోజులు ముందుగానే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. తుఫానును ఎదుర్కోవడానికి అన్ని విధాల (సాంకేతిక, రక్షణా సిబ్బంది, సామాగ్రి, హెలికాప్టర్లు, విమానాలతో) సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం చేసిన ప్రకటనలలోని నిజం ఎంతో తుఫాను దాటిన మరుక్షణమే అర్థం అయింది. ముఖ్యమంత్రి, ప్రజా ప్రతినిధులు, 30 మంది ఐఎఎస్‌లు విశాఖలోనే ఉండి బాధితులను అన్ని రకాలుగా ఆదుకొంటున్నట్లు మీడియాలో జరిగిన ప్రచారానికి వాస్తవాలకు అసలు పొంతనే లేదు. రెండు రోజుల వరకు మంత్రులు, అధికారులు ప్రజల వద్దకు పోలేదు. ప్రజలు గొంతు తడుపుకునేందుకు గుక్కెడు నీళ్ళకోసం, పిల్లలు పాల కోసం అలమటించి పోయారు. మార్కెట్ శక్తులు పాల పాకెట్ 140 రూపాయాలు, నీళ్ళ బాటిల్ 100 రూపాయల చొప్పున ధరలను పెంచి వేసాయి. వారం గడిచిన తరువాత కూడా ప్రజలకు త్రాగు నీరు, విద్యుత్....వంటి మౌళిక అవసరాలను తీర్చలేక పోయిన చంద్రబాబు ప్రజల ఆగ్రహం నుండి తప్పించుకునేందుకూ, తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు గత ప్రభుత్వాలను, ఉద్యోగులను దోషులుగా చిత్రించేందుకు ప్రయత్నించాడు. ఇటువంటి తుఫానులు ఒక తరం యొక్క జీవన ప్రమాణాలను దిగజార్చి శాశ్వాతంగా కోలుకోలేని దెబ్బ తీస్తాయని దివిసీమ, 1996 కోనసీమ, 2004 సునామీలు నిరూపించాయి. ఈ కోణంలో చూసినప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించే నష్ట పరిహారాలు బాధితులను ఏ మేరకు ఆదుకుంటాయో ఊహించవచ్చు. తుఫానుల కారణంగా సంభవించే ఆస్తుల, ప్రాణ నష్టాల నివారణకు ముందస్తు ప్రణాళికలు, బడ్జెట్ కేటాయింపులు అవసరం. దూరదృష్టి లేని, ప్రజల సంక్షేమం పట్టని ప్రభుత్వాల బాధ్యతారాహిత్యం, అసమర్థతలను హుదూద్ నిరూపించింది. మీడియాలో తుఫాను నష్టాన్ని చెప్పడంలో కూడా ప్రజా దృష్టి కోణం లోపించి పాలక వర్గాల దృక్పథం కన్పిస్తున్నది. పత్రికలన్నీ ధనవంతుల నష్టాన్ని గురించి గగ్గోలు పెట్టి పీడిత ప్రజల నష్టాన్ని చెప్పేటపుడు స్వరం తగ్గిస్తున్నాయి. దేశంలో తీవ్ర ఆర్థిక సంక్షోభాలు వచ్చి పరిశ్రమాధిపతులు, పెద్ద వ్యాపారవేత్తలు, ధనాడ్యులు దివాలా తీస్తే ఉద్దీపన పథకాల పేరుతో ప్రజల డబ్బును ఫలహారంగా వారికి పంచుతున్నారు. సమాజ పురోగమనానికి ఛోదక శక్తులుగా ఉన్న శ్రామికులు (రైతులు, చేతి వృత్తులు, కార్మికులు) నష్టపోతే ప్రభుత్వాలు కంటి తుడుపు సహాయాన్ని అందిస్తున్నాయి. ఈ వివక్ష ఈ సందర్భంగా కూడా లేకపోలేదు. కనుక పాలక వర్గాలు చూపిస్తున్న ఈ వర్గ వివక్షను ప్రజలంతా ముక్త కంఠంతో ఖండిస్తూ, ప్రధానంగా శ్రామిక ప్రజలకు హుదూద్ తుఫాను సందర్భంగా జరిగిన నష్టానికి అన్ని విధాలుగా సహకరించాలి.

ఈ మధ్య కాలంలో సంభవిస్తున్న వరదలు, తుఫానుల యొక్క తీవ్రత గతంలో కన్నా అనేక రెట్లు పెరిగింది. దీనికి కారణం పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం కారణమని శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు తెలియజేస్తున్నారు. వారు రూపొందించిన నివేదికలలోని కొన్ని అంశాలు.....1. తీర ప్రాంతంలో విచ్చలవిడిగా నెలకొల్పిన థర్మల్ విద్యుత్ ప్రాజెక్టులు, పరిశ్రమలు, సెజ్‌లు తమ కాలుష్యాన్ని సముద్రంలోకి వదలటం ద్వారా ప్రతి ఏటా 10కి॥మీ తీర ప్రాంతం కోతకు గురవ్వటం. 2. విచక్షణా రహితంగా అడవుల నరికివేత వలన భూతాపం పెరిగి, హిమశిలలు కరిగి సముద్ర మట్టాలు పెరగడం, పరిమితికి మించి గ్యాస్, ముడి చమురు, ఖనిజాల వెలికితీత

వల్ల భూమి పొరలు క్రుంగి సముద్ర జలాలు ముందుకు చొచ్చుకు రావడం. 3. తీర ప్రాంతంలో పరిశ్రమల స్థాపనకై మడ అడవుల, సరుగుడు చెట్ల నరికివేత, కొండల విధ్వంసం. 4. తీర ప్రాంతం నుండి 500 మీటర్లలోపు ఎటువంటి శాశ్వత నిర్మాణాలను చేపట్టరాదనే సిఆర్‌జడ్ (తీరప్రాంత నియంత్రణ క్షేత్రం) నిబంధనల ఉల్లంఘన.

ప్రపంచీకరణ అభివృద్ధి పేరుతో జరుగుతున్న ఈ చర్యల కారణంగానే పర్యావరణంలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. పర్యావరణాన్ని, ప్రపంచ ప్రజానీకాన్ని విపత్తులలోకి, విధ్వంసంలోకి నెట్టివేస్తున్న సామ్రాజ్యవాద దేశమైన అమెరికాలో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో " పర్యావరణ పరిరక్షణ" పేరుతో ర్యాలీ చేపట్టడం "దయ్యాలు వేదాలు వల్లించడం" వంటిది. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఉన్న దోపిడి పాలక వర్గాలు సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాల ప్రయోజనాల కోసం 90% ప్రజానీకపు భవితవ్యాన్ని బలి పెడుతున్నారు. ఎ.పిలో తీరప్రాంతంలో లక్షలాది మంది మత్సకారులను, ఇతర ప్రజానీకాన్ని నిరాశ్రయులను చేసి దీనిని రిలయన్స్ అంబానీలకు, సెజ్‌లకు, కట్టబెట్టిన ఘనత చంద్రబాబు, రాజశేఖర్‌రెడ్డిలదే. పోర్టుల, సెజ్‌ల, అంబానీల రాకతో లక్షలాది మంది ప్రజలు సొంత నేలపై పరాయివాళ్ళయ్యారు. గంగవరం, సోంపేటలలో పోలీసు తూటాలకు బలయ్యారు. ఉభయ గోదావరి జిల్లాలోని ఆక్వా కల్చర్ సాగుతో లక్షలాది ఎకరాల పంట భూములు, తీర ప్రాంత భూములు బడా భూస్వామ్య వర్గాల చేతుల్లో బంధించబడ్డాయి. ఇప్పటికే ఈ విషఫలితాలను అనుభవిస్తున్న ప్రజలు హుదూద్ తుఫానుతో మరింత సంక్షోభంలోకి నెట్టబడ్డారు. ఇంత జరిగిన తరువాత కూడా తుఫాను విధ్వంసానికి గల కారణాలను, పరిష్కారాలను చర్చించకుండా "తుఫానులే అసూయ పడేలా కొత్త విశాఖను నిర్మిస్తానని చెప్పడం ప్రజలు అజ్ఞానులనీ, ఏం చెప్పినా చెల్లుతుందనే చంద్రబాబు అహంకారాన్ని, ప్రపంచ దేశాల అనుభవాల నుండి గుణపాఠాలు తీసుకునేందుకు సిద్ధంగా లేని అతని ఒంటెత్తు పోకడని తెలియజేస్తున్నది. అంతటితో ఆగకుండా మత్స్యకారులకు "సురక్షిత ప్రాంతంలో 10 వేల మంది ఒకే చోట నివసించే టౌన్‌షిప్‌లు" నిర్మిస్తాననీ, గిరిజనులు "కొండలు దిగి రావాలనీ వారికి కూడా సురక్షిత ప్రాంతంలో కాలనీలు" నిర్మిస్తాననీ ప్రకటించడం వెనుక అసలు ఉద్దేశ్యం తీర ప్రాంతాన్నీ, మన్యంలోని కాఫీ, బాక్సైట్‌లను దేశ విదేశీ బహుళ జాతి కంపెనీలకు కట్టబెట్టేందుకే. అదే జరిగితే భవిష్యత్‌లో మరిన్ని విధ్వంసాలకు, సంక్షోభాలకు తెర లేస్తుంది.

తుఫాను తాకిడి అనంతరం ఆస్తుల నష్టం, నీటి ఎద్దడి ఎంత భయంకరంగా ఉంటుందో ప్రత్యక్షంగా అనుభవించిన నాలుగు జిల్లాల ప్రజానీకం మన్యంలో బాక్సైట్ వెలికితీత ద్వారా జీవనదులు (తాండవ, శారద, గోస్తని...) శాశ్వతంగా కనుమరుగై పోతాయనే సత్యాన్ని గ్రహించాలి. బాక్సైట్ వెలికితీతకు వ్యతిరేకంగా పోరాడుతున్న మన్యం ఆదివాసీలకు అండగా నిలవాలి. ప్రజలను తమ భూములు, అడవులు, తీరప్రాంతాల నుండి తరిమివేసి నిరాశ్రయులుగా, బిచ్చగాళ్ళుగా మారుస్తున్న దోపిడీ పాలక వర్గాల విధ్వంసక అభివృద్ధి నమూనాకు వ్యతిరేకంగా పోరాడాలి. జల్, జంగల్, జమీన్‌లపై హక్కు ఆదివాసీలది-పీడిత ప్రజలదేనని చాటి చెప్పాలి. ఈ రోజు ఎక్కడైనా దోపిడివర్గాల స్వార్థ ప్రయోజనాలకు బలి అయ్యేది పీడిత ప్రజానీకమే. హుదూద్ తుఫాను వల్ల పీడిత ప్రజలకు జరిగిన నష్టమంతా పాలక వర్గాల నిర్వాకమేనని తెలుసుకుంటూ మరోవైపు బాక్సైట్ తవ్వకాల ప్రమాదం ఆదివాసీ ప్రజానీకాన్ని సునామీలా ముంచుకొస్తుందని గుర్తించాలి. ఈ పరిస్థితులలో ప్రజలు ఒకరికొకరు పూర్తి సహాయ సహకారాలు అందించుకోవాలి. మద్దతుగా నిలబడాలి. దోపిడి వర్గాలకు వ్యతిరేకంగా సమైక్యంగా పోరాడాలి. ఈ క్రమంలోనే అశేష పీడిత ప్రజానీకం విప్లవ పార్టీ నాయకత్వంలో సంఘటితపడి దోపిడి పాలక వర్గాలు ముందుకు తెస్తున్న బూటకపు పార్లమెంటరీ ఎన్నికలను తిరస్కరించి దీర్ఘకాలిక ప్రజాయుద్ధం ద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయాలి. అప్పుడే కార్మికవర్గ నాయకత్వంలో కార్మిక, కర్షక, పెటీబూర్జువా, జాతీయ బూర్జువా వర్గాల ఐక్యసంఘటనగా ప్రభుత్వం ఏర్పడి, ప్రజల సంపూర్ణ మద్ధతుతో హుదూద్‌లను, సునామీలను, ఎటువంటి సమస్యలనైనా పరిష్కరించుకోగలుగుతుంది. ఇక చివరిగా హుదూద్ తుఫాను వచ్చి అల్లకల్లోలమైన పీడిత ప్రజానీకానికి ప్రజలంతా ఆర్థికంగా, హార్దికంగా సంపూర్ణ సహకారం అందించాలనీ, క్రింది కర్తవ్యాల, డిమాండ్ల సాధనకు దృఢంగా పోరాడాలని ఎఒబి ఎస్‌జడ్‌సి మరొక్కమారు విజ్ఞప్తి చేస్తున్నది.

1. తుఫాను నష్టం అంచనాకై ప్రజా సంఘాలు, పౌరులతో కూడిన నిజనిర్ధారణ బృందాలు ఏర్పడాలి.

2. తుఫాను వల్ల ప్రజలకు తక్షణం జరిగిన నష్టాన్నీ, దీర్ఘకాలికంగా అది వేసే దుష్ప్రభావాన్ని వాస్తవ పరిస్థితులపై ఆధారపడి అంచనా కట్టాలి.

3. నిర్దిష్ట పరిస్థితులపై ఆధారపడి నష్ట పరిహారాన్ని డిమాండ్ చేస్తూ చెల్లింపులలో జరిగే జాప్యానికి, అవినీతికి వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటాలు చేపట్టాలి.

3. బాధితులకు ఇతర ప్రాంతాల ప్రజానీకం స్వచ్ఛందంగా విరాళాలు, చందాలు సేకరించి ఇవ్వాలి.

4. పర్యావరణ పరిరక్షణకై కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావులతో కూడిన ఐక్య కార్యాచరణ కమిటీలు ఏర్పర్చాలి.

**విప్లవాభివందనాలతో**

**ఎ.ఒ.బి-ఎస్.జడ్.సి**

**1-11-2014** **సి.పి.ఐ (మావోయిస్టు)**

# విప్లవ ప్రజా నాయకులు కా॥ శరత్, గణపతిలను హత్య చేసింది 'కల్కి భగవాన్' ముసుగులో వున్న ఎస్.ఐ.బి ఏజెంట్లే ! 'మావోయిస్టులపై ప్రజల దాడి' అంటూ విశాఖ ఎస్.పి కోయ ప్రవీణ్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండించండి !!

ప్రియమైన ప్రజలారా !

మన్యంలోని ఆదివాసీల చరిత్ర అంటే అది పోరాటాల చరిత్రే. తరతరాలుగా భూస్వాములు, పెత్తందార్లు, తెగపెద్దలు, షావుకార్లు, ప్రభుత్వ, ఫారెస్టు, ఎ.పి.ఎఫ్.డి.సి మొదలైన దోపిడీ సంస్థలు సాగిస్తున్న దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా ఆదివాసీలు జీవన్మరణ పోరాటం చేస్తున్నారు. 80వ దశకంలో మన్యంలోని ఆదివాసీల జీవితాల్లోకి ప్రవేశించిన మా పార్టీ వారి కష్టాలనూ, కడగండ్లనూ సొంతం చేసుకొని, ప్రజారాజ్యాధికార సాధన ద్వారానే పీడిత వర్గాలు విముక్తి గావించబడతాయనీ, అది సాయుధ పోరాటం ద్వారా మాత్రమే సాధ్యమవుతుందనీ, నిరంతరం చైతన్యపరుస్తూ వారు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాడేందుకు మార్గదర్శకత్వాన్ని అందిస్తూ, వారిని సాయుధం చేస్తూ వారి పోరాటానికి నాయకత్వం వహిస్తున్నది.

గ్రామ స్థాయి నుండి తెగ అంతరాలనూ, వర్గ వైరుధ్యాలను పరిష్కరించి ప్రజా రాజ్యాధికారాన్ని స్థాపించేందుకు నిశితమైన వర్గపోరాటాన్ని నడుపుతున్నది. ఈ క్రమంలో ప్రజా ప్రతిఘటనకు సైతం లొంగక, ప్రజా కోర్టులను ధిక్కరిస్తూ రాజ్యం అండతో తమ దోపిడీ పీడనలను కొనసాగించేందుకు ప్రయత్నించిన ప్రజా వ్యతిరేకులనూ, శత్రు పక్షాన చేరి ప్రజా ద్రోహులుగా, విప్లవ ప్రతిఘాతుకులుగా పరిణమించిన వారిని వివిధ సందర్భాల్లో ప్రజలు, ప్రజా సంఘాలు, పార్టీ శిక్షించాయి, నిర్మూలించాయి. అదే సమయంలో ఈ వర్గ పోరాటంలో దోపిడీ పాలక వర్గాలకు రక్షణగా నిలిచి ప్రజలపై, వారికి నాయకత్వం వహిస్తున్న మా పార్టీపై కిరాయి సాయుధ బలగాలు, వారు పెంచి పోషిస్తున్న నల్లదండు ముఠాలు, విప్లవ ప్రతిఘాతుక గ్యాంగులు జరిపిన దాడుల్లో దాదాపు 200 మందికి పైగా ప్రజలు, ప్రజా సంఘనాయకులు, పార్టీ, పి.ఎల్.జి.ఎ కామ్రేడ్స్ అమరులయ్యారు.

2014 అక్టోబర్ 19న కోరుకొండలో కూడా అటువంటి విప్లవ ప్రతీఘాతుక హంతక ముఠా జరిపిన దాడిలోనే మా పార్టీ ఈస్ట్ డివిజన్ కమిటీ సభ్యుడు కా॥ శరత్, కాఫీ పోరాట కమిటీ అధ్యక్షుడు కా॥ గణపతిలు అమరులయ్యారు. వివరాల్లోకి వెళితే–గెమ్మెలి సంజీవరావు బలపం పంచాయితీ వీరవరం గ్రామ మునసబు. గ్రామంలో విప్లవ ప్రజా సంఘాల నేతృత్వంలో జరుగుతున్న వర్గపోరాటంలో తన ఆధిపత్యాన్ని కోల్పోయి, విప్లవ వ్యతిరేకిగా పరిణమించాడు. ఈ క్రమంలోనే పోలీసు సంబంధాల్లోకి వెళ్ళాడు. 2011లో కాఫీ తోటల ఆక్రమణ పోరాటంలో చురుగ్గా కదులుతున్న 5 గ్రామాల ప్రజలను వ్యక్తిగతంగా కలిసి కాఫీ పోరాటం నుండి వైదొలిగి పోలీసులకు లొంగిపోవాలనీ, లేకుంటే తీవ్ర పరిణామాలుంటాయనీ హెచ్చరించి కాఫీ పోరాటాన్ని నీరుగార్చే ప్రయత్నం చేశాడు. ఈ విషయమై వాడిని ప్రజాకోర్టులో విచారించి, హెచ్చరించడం జరిగింది. అయినప్పటికీ అతని వైఖరిలో మార్పు రాలేదు. కాఫీ పోరాట కమిటీ ప్రజల సమస్యలపై చర్చించేందుకు ఆర్.డి.ఒను పిలిపిస్తే, ఈ విషయాన్ని డి.ఎస్.పికి తెలియచేసాడు. ఈ విషయంపై ప్రజలలో పెట్టి విచారిస్తే తన తప్పును ఆమోదించి, ఇకనుండి పోలీసులతో సంబంధాలు కొనసాగించనని చెప్పాడు. కానీ ఆ తరువాత విప్లవ ప్రతిఘాతుక కార్యాచరణను తీవ్రతరం చేసాడు. ఎ.పిలో నరహంతక ముఠాగా కొనసాగుతున్న ఎస్.ఐ.బి పోలీసులతో ప్రత్యక్ష సంబంధాలను ఏర్పరచుకున్నాడు. అప్పటికే కల్కి భగవాన్ ముసుగులో ఉండి పోలీసు ఏజెంటుగా పని చేస్తున్న గుదలంవీధి సింహాచలం(గురువు)తో సంబంధాలు ఏర్పర్చుకొని, తన విచ్ఛిన్న కార్యకలాపాలను తీవ్రతరం చేసాడు. ఇద్దరూ కలిసి వీరవరం దాని పరిసర గ్రామాలలో ఇన్‌ఫార్మర్లను తయారు చేయడంతో పాటు, పార్టీ పి.ఎల్.జి.ఎ, ప్రజా సంఘాల శ్రేణుల గురించి పోలీసులకు సమాచారం ఇవ్వడం ప్రారంభించారు. 2012లో ప్రజల కాఫీ తోటల్లో చెట్లు నరికినందుకు మరోసారి ప్రజాకోర్టులో హెచ్చరించి 30వేలు జరిమానా కూడా విధించడం జరిగింది. దీంతో ప్రజా సంఘనాయకులపై తీవ్ర వ్యతిరేకత పెంచుకొని, వారిపై ప్రజల్లో తప్పుడు అభిప్రాయాలు కల్పించేందుకు కాఫీ కమిటీ సభ్యులపై అవినీతి ఆరోపణలు చేస్తూ దుష్ప్రచారం చేసాడు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు వాస్తవాలు తెలియపరిచేందుకు కాఫీ పోరాట కమిటీ 2013లో ఒక కరపత్రం కూడా విడుదల చేసింది. ఇదే సమయంలో సంజీవరావు ముఠాలోని కొంతమంది తిరుపతి యాత్ర పేరుతో విశాఖ వెళ్ళి అక్కడే హోంగార్డు శిక్షణ పొంది రహస్య హోంగార్డులుగా పని చేయనారంభించారు. సంజీవరావు కూడా ఎస్.పి సూచన మేరకు కాఫీ కమిటీ సభ్యులు తనతో వస్తే నేరుగా ఎస్.పి, డి.ఐ.జిల వద్దకు తీసుకువెళ్ళి ఏ కేసులు లేకుండా సరెండర్ చేయిస్తాననీ, లేని పక్షంలో తదుపరి శత్రువు దాడిలో తీవ్రంగా నష్టపోతారనీ మధ్యవర్తులతో కాఫీ కమిటీ నాయకత్వానికి రాయబారం పంపాడు. ఈ విషయంలో స్థానిక పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజా నిర్మాణాలు కలిసి అతడిని ప్రజాకోర్టులో విచారించి మరోమారు తీవ్రంగా హెచ్చరించి విడిచిపెట్టడమైంది.

రోజురోజుకు ప్రజలలో తన అసలు రంగు బహిర్గతమై పోతుండటంతో బెంబేలెత్తిన సంజీవరావు ప్రజా సంఘాలు, పార్టీ తనను చంపేందుకు ప్రయత్నిస్తున్నాయనీ, తనను గానీ చంపినట్లయితే ప్రజా సంఘనాయకులకు కూడా ఇదేగతి పడుతుందని ప్రతి హెచ్చరికలు జారీ చేస్తూ, పోలీసుల ప్రోద్బలంతో ప్రజాసంఘ నాయకులపై, అవకాశం దొరికితే పార్టీపై కూడా దాడి చేసి నిర్మూలించేందుకు పథకం పన్ని, అందుకు ముఠాను సంసిద్ధపరిచి అదను కొరకు ఎదురు చూడసాగాడు.

ఈ క్రమంలోనే ప్రజల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ విప్లవ ప్రతీఘాతుకునిగా కొనసాగుతున్న సంజీవరావును ప్రజల నిర్ణయం

మేరకు అక్టోబర్ 19న మా కామ్రేడ్స్ నిర్మూలించారు. సంజీవరావుతో పాటు అదుపులోకి తీసుకున్న గురువు సింహాచలంను ప్రజాకోర్టులో విచారించేందుకు కోరుకొండ తీసుకువచ్చిన మా కామ్రేడ్స్ తక్కువ మంది ఉండటం, ఒకే ఆయుధంతో ఉండటం, అప్రమత్తంగా ఉండకపోవడం చూసి అప్పటికే దాడి చేసేందుకు అదను కొరకు ఎదురుచూస్తున్న సంజీవరావు ముఠా ఒక్కసారిగా కా॥ శరత్, కా॥ గణపతిల మీదపడి పట్టుకుని తీవ్రంగా కొట్టి చంపారు. మరొకరు తీవ్రంగా గాయపడి ప్రాణాలతో బయటపడ్డాడు. ఆయుధం కూడా స్వాధీనపరుచుకొని పోలీసులకు అప్పగించారు. అప్పటి నుండి వారు పోలీసులతోనే ఉంటున్నారు. ఈ ఘటనలో వీరవరం, తూరుమామిడి, దిగువ వలసపల్లి గ్రామాల నుండి సంజీవ రావు తయారు చేసిన విప్లవ ప్రతిఘాతుకులు పాల్గొన్నారనేది ప్రజలందరికీ స్పష్టంగా తెలుసు. ఈ హంతక ముఠాను పార్టీ, ప్రజలు ఎన్నటికీ క్షమించరు. వీరు తప్పకుండా ప్రజలచే శిక్షించబడతారు.

అయితే ఈ ఘటనతో సంబంధం లేని కొద్ది మంది సాధారణ ప్రజలు పోలీసుల దుష్ప్రచారంతో గ్రామాలు వదిలి వెళ్తున్నారు. అలా వెళ్లవలసిన అవసరం లేదు. వారు నిర్భయంగా తమ గ్రామాలలోనే నివశించవచ్చు. ఈ ఘటనలో పాల్గొన్న ప్రజా ద్రోహులను మాత్రం గ్రామాలకు రానివ్వకండి, ఆశ్రయం ఇవ్వకండి. వారి స్థిర, చర ఆస్తులన్నీ పీడిత ప్రజలకే చెందుతాయి. ఈ ప్రజా ద్రోహులకు అన్ని రకాలుగా బుద్ధి చెప్పి, ఇంకా మిగిలి ఉన్న ఇటువంటి విప్లవ ప్రతీఘాతుకులను నిర్వీర్యపరిచేందుకు నిశితమైన వర్గపోరాటాన్ని మరింత పట్టుదలతో కొనసాగిస్తారనీ, ప్రాణాలొడ్డి ప్రజల కోసం పని చేస్తున్న ప్రజా సంఘాలను, పి.ఎల్.జి.ఎనీ, పార్టీనీ ఆదరిస్తారనీ అడవి, నీరు, భూమి, ఆత్మగౌరవం కొరకు పార్టీ నాయకత్వంలో మరింత సంఘటితంగా పోరాడి శతృ దుష్ప్రచారానికి ధీటైన సమాధానం చెబుతారని ఆశిస్తున్నాం.

**బాక్సైట్ తవ్వకాలకు మార్గం సుగమం చేసేందుకే ప్రభుత్వం "ప్రజలపై యుద్ధాన్ని" (ఆపరేషన్ గ్రీన్‌హంట్) తీవ్రతరం చేస్తున్నది !**

కేంద్రంలో మోడి, రాష్ట్రంలో చంద్రబాబులు సామ్రాజ్యవాదులకు, అందునా అమెరికా సామ్రాజ్యవాదులకు విశ్వాసపాత్రులుగా, పాదసేవకులుగా వ్యవహరిస్తూ మన దేశ సంపదను బహుళజాతి సంస్థలకు కట్టబెట్టేందుకే అహర్నిశలు శ్రమిస్తున్నారు. మరోపక్క ప్రభుత్వం నుండి కనీస సదుపాయాలకు సైతం నోచుకోక అడవిపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది అదివాసీలు బాక్సైట్ తవ్వకాలు జరిగితే తాము సర్వస్వం కోల్పోతామనీ, కనుక తమ ప్రాణాలొడ్డయినా బాక్సైట్ తవ్వకాలను అడ్డుకుంటామనీ మా పార్టీ నాయకత్వంలో సంఘటితమై బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఈ బాక్సైట్ తవ్వకాలను అడ్డుకుంటున్న ప్రజలనూ, వారికి నాయకత్వం వహిస్తున్న మా పార్టీని నిర్మూలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ సాయుధ బలగాలతో ప్రజలపై, పార్టీపై బహుముఖ దాడి సాగిస్తున్నాయి. అందులో భాగంగానే విప్లవ ప్రజానాయకులను భౌతికంగా నిర్మూలించడం, గ్రామాలపై దాడులు చేసి హత్యలు, అత్యాచారాలు, గృహ దహనాలు, లూటీలకు పాల్పడటం, సర్వం నాశనం చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం, వందలాది మంది ప్రజలను, ప్రజా సంఘనాయకులనూ, విప్లవ కారులనూ జైళ్ళలో నిర్బంధించడం, పార్టీని ఆదరిస్తున్న ప్రజలను అన్ని రకాలుగా హింసించడం, వీటన్నింటినీ కప్పిపుచ్చుకునేందుకూ, ఒక సెక్షన్ ప్రజలను భ్రమలలో ముంచేందుకూ సివిక్ ఆక్షన్ ప్రోగ్రాంల పేరుతో వాలీబాల్ కిట్లు, టోపీలు, గొడుగులు, రేడియోలు, టీ.విలు మొదలైనవి పంపిణీ చేయడం, సహపంక్తి భోజనాలు, వాలీబాల్ పోటీలు నిర్వహించడం చేస్తున్నారు.

అదే సమయంలో మావోయిస్టు పార్టీ అమాయకులను చంపుతుందనీ, వారు ప్రజల మద్దతు కోల్పోయారనీ, ప్రజలే మావోయిస్టులపై తిరగబడుతున్నారనీ, మావోయిస్టులకు ఇక మనుగడ లేదనీ ఇలా రోజుకో వ్యాఖ్యతో డి.జి.పి నుండి సి.ఐ, ఎస్.ఐల వరకూ పోలీసు అధికారులంతా పని గట్టుకుని మా పార్టీపై దుష్ప్రచారం సాగిస్తున్నారు. వీటిలో ఏ మాత్రం వాస్తవం లేదు. దాదాపు మూడు దశాబ్దాలకు పైగా మా పార్టీ చరిత్రలో ఏనాడు ఉద్దేశపూర్వకంగా అమాయకులకు ఏ హానీ తలపెట్టలేదు. సాయుధ చర్యల్లో సైతం సాధారణ ప్రజలకు ఏ విధమైన నష్టం జరగకుండా జాగ్రత్తలు పాటించాలనీ మా పార్టీ విధానంలోనే ఉంది. పొరపాటున ప్రజలకు నష్టం వాటిల్లిన సందర్భాలలో మా పార్టీనే స్వయంగా ఆ విషయాలను ప్రకటించి నిజాయితీగా తన పొరపాట్లను అంగీకరించి, మరోమారు అటువంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చూసుకుంటామనీ హామి ఇచ్చి తిరిగి ప్రజల విశ్వాసాన్నీ, ఆదరణను పొందిందే తప్ప ఏనాడు ప్రజలకు ఇబ్బంది కలిగించలేదు. అయితే ప్రజల నిర్ణయం మేరకు ప్రజా ద్రోహులను శిక్షించిన సందర్భాలను అవకాశంగా తీసుకొని, వాస్తవాలను వక్రీకరించి పోలీసులు ఇలా అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారు. ఒక పక్క ఇలా పార్టీపై దుష్ప్రచారం సాగిస్తూనే మరోపక్క మావోయిస్టుల నుండి పోలీసు ఠాణాలకు ముప్పు ఉందనీ, మన్యంలో ఒక్కొక్క పోలీసు ఠాణాను రెండేసి కోట్ల రూపాయలతో ఆధునీకరించడం, భద్రతా బలగాలను పెంచడం, ఏటా వేలాది మంది యువకులను సి.ఆర్.పి.ఎఫ్, ఎ.పి.ఎస్.పిల్లోకి భర్తీ చేసుకోవడం, నూతనంగా 200 హోంగార్డుల నియమకాలను ప్రకటించడం చూస్తే ప్రజలనూ, పార్టీనీ వేరు చేసి ప్రజా ఉద్యమాలనూ, పార్టీనీ విడివిడిగా దెబ్బతీసి బాక్సైట్ తవ్వకాలకు మార్గం సుగమం చేసేందుకు ప్రభుత్వం, పోలీసు వర్గాలు అనుసరిస్తున్న కుటిల ఎత్తుగడలుగా స్పష్టమవుతున్నాయి.

**పోలీసు ఇన్‌ఫార్మర్‌లుగా మారి ప్రాణాలు కోల్పోయిన ఆదివాసుల మృతికి ప్రభుత్వం, పోలీసులే బాధ్యత వహించాలి !**

తీవ్రమైన పోలీసు నిర్బంధంలోనూ ప్రజల్లో నీళ్ళలో చేపల్లా కలిసిపోయి, ప్రజల రక్షణలోనే విప్లవ కార్యకలాపాలు నిర్వహిస్తున్న మా పార్టీని కోవర్టు కుట్రలతో, ఇన్‌ఫార్మర్‌ల సాయంతో దెబ్బతీసేందుకు ఆదివాసీ యువకులను పలు విధాలుగా ప్రలోభపెట్టి ఇన్‌ఫార్మర్‌లుగా మార్చుకుని ప్రజలపై యుద్ధానికి ప్రజలనే పావులుగా ఉపయోగిస్తున్నారు. చివరికి అటువంటి ఇన్‌ఫార్మర్లు ప్రజల చేతుల్లోనే ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ విధంగా ప్రభుత్వం, పోలీసు వ్యవస్థలు ప్రజల వేళ్ళతోనే ప్రజల కళ్ళను పొడిచే కుటిల నీతిని అవలంభిస్తున్నారు. కనుక పోలీసులు సృష్టిస్తున్న విషవలయంలో చిక్కుకుని ఇన్‌ఫార్మర్‌లుగా, హోంగార్డులుగా మారి ప్రాణాలు కోల్పోతున్న ఆదివాసులందరి మృతికి ప్రభుత్వం, పోలీసులే నైతిక బాధ్యత వహించాలి.

**విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు, ఇతర పట్టణ ప్రజలకు మా విజ్ఞప్తి :**

దోపిడీ పాలక వర్గాలు తమపై సాగిస్తున్న తీవ్రమైన దోపిడీ అణచివేతలకు వ్యతిరేకంగా మన్యంలో ఆదివాసీలు, పేదప్రజలు జీవన్మరణ పోరాటం చేస్తున్నారు. తమ న్యాయమైన హక్కుల కొరకు వారు ఉద్యమిస్తున్నారు. తమ బతుకుల్ని కబళించివేసే బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా వారు పోరాడుతున్నారు. వారికి నిత్యం అండదండగా వుంటూ మా పార్టీ వారి ఉద్యమాలకు నాయకత్వం వహిస్తున్నది. ఈ వర్గ పోరాట వాస్తవాలను మీరు తెలుసుకోవాలి. వారికి మద్దతు ఇవ్వాలి. అంతే కాకుండా మీ సమస్యలపై కూడా పార్టీ నాయకత్వంలో ఈ దోపిడీ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటం ఎక్కుపెట్టాలి. అంతేగానీ పోలీసుల దుష్ప్రచారాన్ని నమ్మకండి. వాళ్ళు నిర్వహిస్తున్న బూటకపు శాంతి ర్యాలీలు, మానవహారాలు, సివిక్ ఆక్షన్ కార్యక్రమాలను బహిష్కరించండి. ఈ దేశ ప్రజల విముక్తి కోసం జరుగుతున్న ప్రజా యుద్ధంలో చురుకైన భాగస్వాములు కండి. ఈ సందర్భంగా 'కల్కి భగవాన్‌ల' ముసుగులో ఉన్న గుదలంవీధి సింహాచలం, సంజీవరావు లాంటి ప్రజా ద్రోహులు ప్రభుత్వ గ్రీన్‌హంట్ పథకంలో భాగంగా తయారైన వాళ్ళన్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని కోరుచున్నాము. న్యాయమైన ప్రజాయుద్ధంలో అంతిమ విజయం ప్రజలదే !

- విప్లవ ప్రతీఘాతుకులు నశించాలి ! విప్లవం వర్ధిల్లాలి !
- విప్లవ ప్రజా సంఘాలు వర్ధిల్లాలి !
- భారత కమ్యునిస్టు పార్టీ(మావోయిస్టు) వర్ధిల్లాలి !

**విప్లవాభివందనాలతో**

**ఈస్ట్ డివిజన్ కమిటీ**

**1-11-2014** **సి.పి.ఐ (మావోయిస్టు)**

---

**"మన శతృవులు సోషలిజం యొక్క దివాలాకోరుతనాన్ని గూర్చి నోరు చించుకొని మాట్లాడారు. అది చాలా తొందరపాటే అనిపించుకుంటుంది. అయినప్పటికీ వారు చెప్పిన మాట పూర్తిగా తప్పు అని ఘంటాపథంగా చెప్పడానికి ఎవరు సాహసిస్తారు ? ప్రస్తుతం చచ్చిపోతున్నది సోషలిజం కానేకాదు. అది వేరే విధమైన సోషలిజం - సిద్ధాంత బలం లేని, సాధనా వాంఛలేని తియ్యని సోషలిజం, బొజ్జ దిగిన అధికార పద్ధతులలో, పుట్టెడు సంతానం గల తండ్రి పద్ధతులలో వున్న సోషలిజం, ధైర్యంగాని ప్రగాఢమైన ఉత్సాహంగాని లేని సోషలిజం, పెట్టుబడిదారి విధానంతో స్నేహపూరిత వాదనలతో మునిగి తేలుతూ లెక్కలు వల్లించే సోషలిజం, సంస్కరణలతో ముందే పూర్తిగా నిమగ్నమై గుక్కెడు గంజి కోసం తన జన్మహక్కును అమ్ముకున్న సోషలిజం - బూర్జువాల దృష్టిలో ప్రజలను జోకొట్టే శ్రామిక వర్గ సాహసానికి బ్రేకు వేసే సోషలిజం.**

**గోలె**

**(ఫ్రెంచ్ కమ్యూనిస్టు నాయకుడు)**

# సామ్రాజ్యవాద, భూస్వామ్య శృంఖలాలను బద్దలు కొట్టండి !

# ఈ కుళ్లు వ్యవస్థను ధ్వంసం చేయండి !!

# మీ చేతులతోనే మీ భవిష్యత్తును, ఈ దేశ భవిష్యత్తును నిర్మించండి !!!

**ప్రియమైన ప్రజలారా,**

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) 10వ స్థాపనా వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ తరఫు నుండి మీకు హార్దికాభినందనలు.

పదేళ్ల క్రితం, ఒక ఉత్సాహకరమైన ఘటన – రెండు విప్లవ స్రవంతుల విలీనం గురించి ప్రకటించేందుకు మేం మీ ముందుకు వచ్చాం. విప్లవ కర్తవ్యాలను భుజస్కందాలపై మోపుకొని 2004 సెప్టెంబర్ 21న ఒకే ఒక మావోయిస్టు పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆవిర్భవించింది. ఈ మహత్వపూర్ణ సంవత్సరాల గురించిన ఒక నివేదికను నేడు మీ ముందుంచుతున్నాం. ఈ మట్టి నుంచి పుట్టిన ఉత్తమ పుత్రికలు, పుత్రులు సాగించే వీరోచిత ఉద్యమానికి, వారి త్యాగాలకు ఒక దశాబ్దం పూర్తయ్యింది. ఈ కాలంలో దండకారణ్యం (ఛత్తీస్‌గఢ్), బీహార్, ఝార్ఖండ్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమ బంగ్, కర్నాటక, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, అసోంకు చెందిన దాదాపు 2,500 మంది తమ విలువైన జీవితాలను ధారపోశారు. ఇందులో విప్లవానికి నాయకత్వం వహించిన మహత్తర ఉన్నత స్థాయి నాయకత్వం నుంచి పార్టీకి చెందిన పునాది స్థాయిల వరకూ ఉన్నారు. పీడక హంతక మూకలతో సాగించిన సమరాలలో ప్రజా విముక్తి గెరిల్లా సైన్యానికి చెందిన అనేక మంది సాహసోపేతమైన యోధులు తమ నెత్తురు వరదలా పారించారు. అనేక మంది ప్రజలు సైతం అత్యున్నత త్యాగాలు చేశారు.

ఆ నెత్తురు ఎన్నటికీ వృధా పోదు. ఇప్పటి వరకూ సాధించిన విజయాలతోనూ, విలువైన అనుభవాలతోనూ అది పెనవేసుకొనిపోయింది. అది రాజకీయ, సైనిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో ఒక దశాబ్ద కాలం పాటు సాగించిన నిర్ణయాత్మకమైన ఉద్యమానికి ఇంధనాన్ని అందించింది. అనాదిగా ప్రజలపై పెద్ద భారంగా ఉన్న దోపిడి, పీడనలను ధ్వంసం చేసేందుకై మునుపెన్నడూ లేని విధంగా బ్రహ్మాండంగా తిరగబడిన లక్షలాది ప్రజల, సమాజంలోని పునాది స్థాయిల ప్రజల సమరశీల సమీకరణలు ఈ కాలంలో జరిగాయి. ఈ మహత్తర కాలంలో పాత అధికారాన్ని ధ్వంసం చేయడం ద్వారా మొలకెత్తుతున్న నూతన రాజకీయాధికారానికి మరింత ప్రోత్సాహం లభించింది. ప్రాథమిక స్థాయిలో మరింత విస్తారంగా ఒక నూతన సమాజం నిర్మాణం అవుతున్నది. ఈ క్రమంలో, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పిఎల్‌జిఏ) పోరాట సామర్థ్యం మరింత బలోపేతమయ్యింది. దాని పునాది బలగమైన ప్రజా మిలీషియా ప్రస్తుతం వేలాదిగా ఉంది. ధీరోదాత్తమైన ప్రజలు రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, పర్యావరణ రంగాలలో ప్రత్యేకించి తాము చేపట్టిన నూతన సమాజ నిర్మాణంలో సాధించుకున్న ప్రతి విజయాన్ని కాపాడేందుకై మహిళలు, పురుషులు ఆయుధాలు చేబూని దృఢంగా నిలబడ్డారు.

అవును, మేము మీకు ఇచ్చిన వాగ్దానాన్ని పరిపూర్తి చేసేందుకై తీవ్రంగా కృషి చేశాం, ముందుకు పురోగమించాం. మేం కమ్యూనిస్టులం కావడం వల్లనే ఇలా చేయగలిగాం. ప్రజలకు సేవ చేయడంలో మా మాటలు–ఆచరణ ఒక్కటే అయ్యాయి. స్థానిక, విదేశీ పీడకులకు వ్యతిరేకంగా ప్రజలు శతాబ్దాల తరబడి సాగించిన అసంఖ్యాకమైన తిరుగుబాట్ల నుంచి లభించిన గొప్ప సంప్రదాయాలను వారసత్వంగా చేపట్టారు. బ్రిటిష్ వలసవాదం నుంచి నిజమైన స్వాతంత్ర్యం కోసం సుదీర్ఘ కాలం వీరోచిత పోరాటాల నుంచి ఉత్తేజాన్ని పొందుతూ, తెలంగాణ సాయుధ పోరాటం, తెభాగా, పున్నప్రా–వాయలార్ వంటి మహత్తర పోరాటాలలో ఎర్ర యోధులు సాయుధ పోరాట పతాకను ధైర్యంగా ఎత్తిపడుతూ ఆ వారసత్వాన్ని మాకు అందించారు. మన ప్రియతమ దేశాన్ని సామ్రాజ్యవాదం, వారి తొత్తుల శృంఖలాల నుంచి విముక్తి చేసేంత వరకూ ప్రపంచవ్యాప్తంగా నేలకొరిగిన లక్షలాది అమరుల నెత్తురుతో ఎరుపెక్కిన ఆ అరుణారుణ పతాకను మేం సమున్నతంగా ఎత్తిపడతాం. మన దేశాన్ని ప్రపంచ సోషలిస్టు విప్లవానికి ఒక స్థావరంగా తయారు చేస్తాం. సోషలిజం ద్వారా ఉజ్వల కమ్యూనిజం వైపు పురోగమిస్తాం. ఒక అంతర్జాతీయ కార్మికవర్గ దళంగా, సకల పీడిత జాతులు, పీడిత ప్రజలతో, పెట్టుబడిదారీ దేశాలలోని విశాల ప్రజారాశులతో కదం కలుపుతూ సహ యోధుల వలే మేం పోరాడుతాం. ఎందుకంటే, భారతదేశాన్నంతటినీ కుదిపివేసిన వసంత మేఘగర్జన – 1967 మహత్తర నక్సల్బరీ సాయుధ రైతాంగ తిరుగుబాటుకు వారసులం మేం. మా పార్టీ మహత్తర సంస్థాపక నాయకులు కామ్రేడ్స్ చారుమజుందార్, కన్హాయ్ చటర్జీలు, అనేక మంది ఇతర ప్రియతమ నాయకులు మాకు బోధన గరిపి, మమ్మల్ని సుశిక్షితుల్ని చేశారు. కార్మికవర్గ అంతర్జాతీయ సిద్ధాంతం మార్క్సిజం- లెనినిజం–మావోయిజం మాకు మార్గదర్శకత్వం అందిస్తోంది.

**ప్రియమైన ప్రజలారా,**

1947లో మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని మనల్ని నమ్మించారు. అవును, అసహ్య వలసవాద పాలన ముగిసింది. కాని దుర్భరమైన మన బతుకులు ఒక చేదు వాస్తవాన్ని గుర్తించాల్సిందిగా మనల్ని ఒత్తిడి చేస్తున్నాయి – విదేశీ ప్రభువులు కేవలం తెర వెనక్కి వెళ్లారు. కీలకమైన నియంత్రణలన్నీ వారి చేతిలోనే ఉన్నాయి. బడా బహుళజాతి కంపెనీలలో వారి ఉనికిని మనం చూస్తున్నాం. హంతక భోపాల్ గాస్ సంఘటనలో చూసినట్లుగా వాటి దృష్టిలో మన జీవితాలకు పెద్ద విలువ లేదు. అవి మన శ్రమను దోపిడి చేస్తున్నాయి. మన వనరుల్ని కొల్లగొడుతున్నాయి. మన దేశమంతటిపై వెయ్యిన్నొక్క విధాలుగా విదేశీ శక్తుల నియంత్రణను మనం చూస్తున్నాం.

వినిమయ సంస్కృతిని, స్వార్థపర వ్యక్తివాదాన్ని పెద్దెత్తున ప్రోత్సహించడంలో దీనిని మనం చూస్తున్నాం. సంపద్వంతమైన, వైవిధ్యపూరితమైన మన నాగరికతని, సంస్కృతిని అవమానపరుస్తూ, వాటి స్థానంలో తమ దిగజారిన విలువలను బలవంతంగా రుద్దే రూపంలో మనం దీన్ని అనుభూతిచెందుతున్నాం. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, డబ్లుటిఓ వంటి సంస్థల ద్వారా రుద్దబడుతున్న వినాశకరమైన ఆర్థిక విధానాలలోని అణచివేత భారం మనకు అర్థమవుతోంది. ఈ విధానాలు ప్రజలను కకావికలం చేస్తున్నాయి. నూతన బానిస సంకెళ్లను సృష్టిస్తున్నాయి. గాలి, నీరు, భూమిని కలుషితం చేస్తున్నాయి. సాయుధ వ్యవసాయ విప్లవ యుద్ధానికి వ్యతిరేకంగా విప్లవ ప్రతీఘాతుక 'ప్రజలపై యుద్ధం'లో భారత రాజ్యాన్ని సాయుధం చేయడం, దానికి శిక్షణనందించడంలో వాటి దుష్ట హస్తాలను మనం చూస్తున్నాం. ఇది సామ్రాజ్యవాదం. మన మూపులపై ఎక్కితొక్కుతున్న పెద్ద పర్వతాల్లో ఇది ఒకటి.

ఇలాంటివి మరో రెండు పర్వతాలున్నాయి.

సమాచారం, హైవేలు, బుల్లెట్ ట్రైన్లు, హై-టెక్ నగరాలు, ఇలా ప్రతి ఒక్కదాన్ని గురించి పాలకులు మనకు చిలవలు పలవలుగా చెబుతూ మనం వేగంగా పురోగమిస్తున్నామంటున్నారు. ఇలా ఎన్నెన్నో వదరుతున్నారు. కానీ మీ చుట్టూ, మీ జీవితాల చుట్టూ ఒకసారి తిరిగి చూడండి. గాడ్జెట్లు, స్మార్ట్ ఫోన్లు, కేబుల్ టివిలు, మోటారు సైకిళ్లు, జిగేలుమనిపించే డ్రస్సులు అన్నీ ఉన్నప్పటికీ సంకుచిత సాంప్రదాయ సంకెళ్లు ఎందుకు ఎక్కితొక్కుతున్నాయి? పాత లేదా కొత్త భూస్వాములు, దురాశపరులైన వడ్డీ వ్యాపారులు రైతుల మిగులులో అధిక భాగాన్ని ఎలా స్వంతం చేసుకుంటున్నారు? మనమంతా సమానమైతే వారి కోరికలు నిరాఘాటంగా ఎలా నెరవేరుతున్నాయి, వారి మాట చట్టంగా ఎలా చెలామణి అవుతోంది? విశాల ప్రజానీకం శ్రమను అమ్ముకుంటూ లేదా చిన్న మడిచెక్కలలో కాళ్లీడ్చుకు తిరుగుతూ దుర్భర జీవితాలను వెళ్లదీస్తుండగా కొద్దిమంది చేతిలో భూమి అధికంగా ఎందుకు ఉంది? మహిళలు అసహ్యకరమైన ఆచారాలతో ఎందుకు బంధించబడుతున్నారు? దళితులు ఇంకా ఎందుకు కాళ్లకు మొక్కాల్సి వస్తోంది? ఆదివాసులు ఎందుకు ఉపేక్షకు గురవుతున్నారు? మతపరమైన దృష్టితో చూసే బ్రాహ్మణ సాంప్రదాయవాదులు హై-టెక్ స్పేస్ వెహికిల్స్ ప్రయోగాలను ఎందుకు స్వాగతిస్తున్నారు? అమానవీయ కుల వ్యవస్థ ఇంకా ఎందుకు బలంగా ఉంది? గతంలో చూడని అనేక మార్పులు, నూతన అంశాలను ఇప్పుడు చూస్తున్నాం. కానీ, కుల వ్యవస్థ, పితృస్వామ్యం, భూస్వామ్య విధానానికి చెందిన పాత వ్యవస్థలు, విలువలు ఇంకా సమాజంలో ఉన్నాయి. ఈ భూస్వామ్య విధానం కుల వ్యవస్థతో విడదీయలేని సంబంధాన్ని కలిగి ఉంటుంది. మనల్ని అణగదొక్కుతున్న మరో పెద్ద పర్వతం ఇది.

అవును, పాత అవశేషాలు ఉన్నాయని పాలకులు ఆయా సందర్భాల్లో ఆమోదిస్తూ ఉంటారు. కానీ, వారు వేగంగా వృద్ధి చెందుతున్న నగరాలు, భారీ కర్మాగారాలు, బడా కార్పొరేట్లు, వీటిలో విదేశాలకు సైతం వ్యాపించి ఉన్న కొన్నింటి తళుకుబెళుకుల వైపు మన దృష్టిని మళ్లిస్తారు. మంచిదే, కానీ, ఆ తళుకుబెళుకుల నగరాల మధ్యనే మురికి కూపాల్లో బతుకులు వెళ్లదీస్తూ, వాటి వల్ల మీరు ఎన్ని ఇబ్బందులు పడ్డారు? ఇది మీకు నిజంగా గుర్తు చేయాల్సిన అవసరం ఉందా? అవి భూ కబ్జాలు చేస్తాయని, వనరుల్ని కొల్లగొట్టుకుపోతాయని, దురాశ కలిగినవని, మీ పూర్వీకుల భూముల నుంచే మిమ్మల్ని తరిమివేస్తున్నాయనీ మీకు ఇప్పటికే తెలియదా? వాటి వినాశకరమైన దోపిడి గురించి మీకు తెలియదా? మీరు ప్రాథమిక హక్కుల నుంచి వంచితులు కావడం, వాటిని అమలు చేయాలని డిమాండ్ చేస్తే అవి హంతక దాడులు చేస్తాయనీ మీ అనుభవంలోకి రాలేదా? ఇంతటితో అయిపోలేదు. వారు బడా పెట్టుబడిదారులు. ఇందులో సందేహం లేదు. వినాశకరమైన వాటి వ్యవహారాన్నంతా చూస్తే అవి కేవలం విదేశీ ప్రయోజనాలను, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను నెరవేర్చేవి మాత్రమేననేది స్పష్టం. వలసవాద పాలకుల కమీషన్ ఏజెంట్లుగానే అవి పుట్టాయి. తమ ఉనికి, పెరుగుదల కోసం అన్ని కోణాలలోనూ అవి వారిపైనే ఎప్పటికీ ఆధారపడతాయి. ఈ పరాధీనతపైనే అవి వర్ధిల్లుతాయి. అవి మన దేశాన్ని, దేశ ప్రజలను, వనరులను విదేశీ దోపిడిదార్లకు తెగనమ్ముతాయి. అవి ఎంతగా ఆధునిక టెక్నాలజీని వినియోగించినప్పటికీ ప్రధానంగా బ్రాహ్మణవాద ఫ్యూడల్ విలువలను నిలిపి ఉంచుతాయి. పుట్టుక నుంచే అవి భూస్వామ్య విధానానికి కట్టివేయబడి ఉన్నాయి. నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికి ప్రాతినిధ్యం వహించే దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు వీరు. మనపై ఎక్కి తొక్కుతున్న మరో పెద్ద పర్వతం వీరే.

మనల్ని అణగదొక్కుతున్న మూడు మహా పర్వతాలు అవి. అవి మనల్ని ఊపిరాడకుండా చేస్తున్నాయి. మన వెన్నెముకల్ని ముక్కలు చేస్తున్నాయి. అవి మన దేశ అభివృద్ధిని, ప్రగతిని నిరోధిస్తున్నాయి. మన భవిష్యత్తును మన చేతుల్లోకి తీసుకునేందుకు; మనం స్వతంత్రంగా నిలబడేందుకు; ప్రజాస్వామ్యపు, సమానత్వపు స్వేచ్ఛా వాయువులను పీల్చేందుకు; మన శ్రమ ఫలితాలను మనమే అనుభవించేందుకు; గాలి, నీరు, భూమి పరిశుభ్రపరిచేందుకు; కులం, పితృస్వామ్యం, మతతత్వం, అత్యంత హానికరమైన బ్రాహ్మణవాదాల వల్ల ఏర్పడే అరిష్టాలను సమాజం నుంచి, అంటే, భారతదేశంలో సారంలో అభివృద్ధినిరోధకమైన ప్రతి ఒక్కదానినీ తొలగించేందుకు; మానవులంగా బతికేందుకు వాటిని మనం తప్పక కూలదోయాల్సి ఉంటుంది. అందుకోసమే మేం పోరాడుతున్నాం. మేం సాగిస్తున్న నూతన ప్రజాస్వామిక విప్లవానికి అర్థం ఇదే. ఈ విప్లవం సామ్రాజ్యవాద బానిసత్వాన్ని, దోపిడి, నియంత్రణలను కూకటివేళ్లతో పెకలించి జాతీయ స్వాతంత్ర్యాన్ని అందిస్తుంది. ఫ్యూడల్ ఆధిపత్యాన్ని కూలదోసి ప్రజా ప్రజాస్వామ్యాన్ని స్థాపిస్తుంది. అది కార్మికవర్గ నాయకత్వంలో కార్మికులు, కర్షకులు, పట్టణ పెట్టీ బూర్జువా వర్గం, జాతీయ బూర్జువా వర్గాల పాలనను స్థాపిస్తుంది. ఈ నూతన ప్రజాస్వామిక రాజ్యం నిస్సందేహంగా జాతులకు విడిపోయే హక్కుతో సహా స్వయంనిర్ణయాధికార హక్కును గుర్తిస్తుంది.

వాళ్లు భారతదేశాన్ని గణతంత్ర, లౌకిక ప్రజాస్వామ్య దేశంగా చెబుతారు. అది 'సోషలిస్టు' వ్యవస్థ అని కూడా రాజ్యాంగం చెబుతుంది. కోట్లాది రూపాయల సొమ్ము ఉండగా రోజుకు 20 రూపాయలతో బతకడం అత్యంత హాస్యాస్పదంగా లేదా? ఇది లౌకికత్వమా? 1947 నాటి నుంచీ మతపరమైన దాడులు ప్రధానంగా ముస్లిం మైనారిటీలపై సాగకుండా ఒక్క సంవత్సరమైనా గడిచిందా? 1984లో కాంగ్రెస్

పాలనలో వేలాది సిక్కులు, గుజరాత్‌లో 2002లో బిజెపి పాలనలో ముస్లిములు ఊచకోతకు గురైన విషయం ఎవరు మర్చిపోగలరు? భారతదేశం బలం దాని 'వైవిధ్యంలోని ఐక్యత'లోనే ఉందని పాలకులు చెబుతుంటారు. కాని, ఈ జాతీయ, సాంస్కృతిక వైవిధ్యాలు ఎంత వరకూ గౌరవించబడ్డాయి? అహంకారం, జాత్యహంకారం, కులతత్వంతో తిట్లు, శాపనార్థాలు, దాడులు చేయడం తప్ప. ఈ దుస్థితి కేవలం ఆదివాసులు, దళితులదే కాదు. భారతదేశంలో ఈశాన్య రాష్ట్రాలలోని అన్ని జాతుల ప్రజల చేదు అనుభవం ఇది. దశాబ్దాల తరబడి భారత సైన్య ఉక్కుపాదాల కింద నలిగిపోతున్న కాశ్మీరీలు, నాగాలు, మణిపురీలు వంటి అనేక జాతులు స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నాయి. వాళ్లు ఘోరమైన అత్యాచారాలకు గురయ్యారు. చట్టాలు సైన్యాన్ని ఎటువంటి విచారణ నుంచి అయినా పరిరక్షించే విధంగా వారు అన్ని రకాల చట్టాల నుంచి వంచితులయ్యారు. అది సాగించే హత్యలు, లైంగిక అత్యాచారాలు, ప్రతిదీ, అవును! ప్రతిదీ రాజ్యాంగబద్ధమైనవే! ఊహించలేని పరిస్థితులలో బంధించబడిన వేలాది ఖైదీల దురవస్థ భారత ప్రజాస్వామ్యపు దుష్ట చిత్రపటాన్ని సంపూర్ణంగా చూపుతుంది. ఇందులో మెజారిటీ ఖైదీలు సమాజంలోని అట్టడుగు స్థాయికి చెందినవారే. వారిపై ఆరోపించిన సాధారణ నేరాలకు ఒకటి లేదా రెండు సంవత్సరాల కంటే ఎక్కువ శిక్ష పడదు, కానీ వారు ఎటువంటి బెయిల్ లేదా విచారణ లేకుండా సంవత్సరాల తరబడి జైళ్లలో మగ్గుతున్నారు. వైద్య సదుపాయం, సాహిత్యం, వార్తా పత్రికలు అందకుండా అడ్డుకోవడం, కుటుంబ సభ్యులు వస్తే వారిని సైతం కలవకుండా నిరోధించడం, చట్టపరమైన హక్కులను కాలరాయడం ద్వారా మౌలిక హక్కుల నుండి వారిని వంచితులను చేస్తున్నారు.

మనం ఈ నరకంలో ఎందుకు బతకాలి?

పాలకులు మమ్మల్ని హింసావాదులనీ, విధ్వంసకులనీ ఆరోపిస్తుంటారు. మరి వారు పరిరక్షిస్తున్న ఈ సమాజం సాగిస్తున్న హింస మాటేమిటి? వారి సామాజిక వ్యవస్థ మానవాళి ఉనికిపై నిరంతరం దాడి సాగించడం లేదా? ప్రతి నిముషం అసంఖ్యాకంగా నాశనమవుతున్న జీవితాల గురించి లేదా అతికష్టం మీద జీవశ్చవాలుగా బతుకుతున్న వాళ్ల గురించి వాళ్లు ఎప్పుడు లెక్కలు తేల్చుతారు? సమాజానికీ, పర్యావరణానికీ వారు సృష్టిస్తున్న చేటుకు ఎక్కడ వారు జవాబు చెబుతారు? మా హింస దీనికి కేవలం జవాబు మాత్రమే. మేం మానవాళిని విధ్వంసం చేస్తున్న వ్యవస్థను, దాని విలువలను, సంస్కృతిని ధ్వంసం చేస్తున్నాం. అంతేకానీ ఇదేదో మతిలేని చర్య కాదు. ఈ దేశ విశాల పీడిత ప్రజారాశుల భాగస్వామ్యం, మద్దతుతో, మా పార్టీ నాయకత్వంలోని పిఎల్‌జిఏ ఒక నూతన ప్రజాస్వామిక వ్యవస్థ నిర్మాణం కోసం ఈ దుర్మార్గ వ్యవస్థను ధ్వంసం చేస్తున్నది. దాని హింస వెనుక ఒక లక్ష్యం ఉంది. అది ప్రజావ్యతిరేకులను, కాలం చెల్లిన సంబంధాలను, వ్యవస్థలను, సంస్థలను రూపుమాపేందుకు భూమిని దున్నుతోంది. అది ప్రజలతో కలిసి ఒక నూతన రాజకీయ అధికారాన్ని, నూతన సామాజిక వ్యవస్థను నిర్మిస్తున్నది. ఇవి ప్రస్తుతం విప్లవ ప్రజా కమిటీలుగా (క్రాంతికారీ జనతన సర్కార్లు, క్రాంతికారీ జన్ కమిటియా లేదా విప్లవ ప్రజా కమిటీల పేర్లతో ప్రాచుర్యంలో వున్నాయి) మధ్య, తూర్పు భారతదేశంలోని గెరిల్లా బేసులలో ప్రాథమిక స్థాయిలో ఉనికిలోకి వస్తున్నాయి.

ఈ నూతన రాజకీయ అధికార కేంద్రాలు ఈ విశాల భూమిలో ఇప్పటికీ చాలా తక్కువగానే ఉన్నాయి. కానీ అవి ఇప్పటికే ఒక అర్థవంతమైన జీవితాన్ని సాధ్యం చేస్తున్నాయి. సహకారం, సమిష్టితత్వపు బలంతో గతిశీలంగా ఉన్నాయి. మానవ సంక్షేమం, అక్కరకు సంబంధించి ఉన్నత విలువలను కలిగి ఉన్నాయి. పీడితులు యజమానులు కావాలనే శతాబ్దాల నాటి కలను అవి నిజం చేస్తున్నాయి. అవి ప్రజలకు భూమిని పంచి ఇస్తున్నాయి. అవి ఆదివాసుల ప్రత్యేక గుణాలను ప్రోత్సహిస్తూ నూతనమైన వాటిని అభివృద్ధి చేసే విధంగా వారిని ప్రోత్సహిస్తున్నాయి. అవి ఆత్మగౌరవంతో కూడిన జీవితాలను గడిపేందుకు దళితులకు తోడ్పతున్నాయి. అవి మహిళలు తమ విముక్తికై సాగించే పోరాటానికి మద్దతును అందిస్తూ వారికి స్థానాన్ని సృష్టిస్తున్నాయి. ఇది భవిష్యత్తు – ప్రజాస్వామిక, సార్వభౌమాధికార, సంయుక్త, ప్రజా గణతంత్ర, స్వయం ఆధారిత, న్యాయమైన, సమానమైన – భారతదేశానికి చేస్తున్న వాగ్దానం. మనం పోరాడడానికి, శిఖరాలను అధిరోహించడానికి సాహసిస్తే దీనిని సాధించడం సాధ్యమే.

ఏమిటి ఈ నూతన సమాజం? అది ఇప్పటికే సాధించింది ఏమిటి?

ఈ గ్రామాలలో భారత రాజ్యం ధ్వంసం చేయబడింది. ప్రజలపై అజమాయిషీ చేసే భూస్వాముల, ఆదివాసీ పెద్దల కాలంచెల్లిన ఆధిపత్యం ముగిసింది. కుల బానిసత్వం ధ్వంసమవుతుంది. కుల నిర్మూలనకు పునాది ఏర్పడుతుంది. ప్రజల రాజకీయ అధికార అంగాలు స్థాపించబడ్డాయి. ప్రజలు ప్రజాయుద్ధం ద్వారా సాధించుకున్న అతి పెద్ద విజయం ఈ నూతన ప్రజాస్వామిక అధికారం. గ్రామ స్థాయిలో 9 నుండి 11 సభ్యులను కలిగి ఉండే విప్లవ ప్రజా కమిటీలు ప్రతి రెండు/మూడు సంవత్సరాలకు ఒకసారి 18 సంవత్సరాలు నిండిన ప్రజలందరూ నేరుగా ఎన్నుకుంటారు. ప్రజలకు వ్యతిరేకంగా, అభివృద్ధినిరోధక రాజ్యానికి, దాని సాయుధ బలగాలకు, గ్యాంగులకు మద్దతుగా ఉండే కొద్ది మందిని దీని నుండి మినహాయిస్తారు. ఓటర్లకు 'వెనక్కు పిలిచే హక్కు' (రైట్ టు రీకాల్) ఉంటుంది. సమాన ప్రాతినిధ్యం ద్వారా మహిళలకు రాజకీయ అధికారంలో సగ భాగంపై హక్కు ఉంటుంది. ప్రజలు సమావేశ హక్కు, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మెలు చేసే హక్కు, ప్రదర్శనలు నిర్వహించే హక్కు, తాము కోరుకున్న విధంగా జీవించే హక్కు, ప్రాథమిక విద్యా హక్కు, ప్రాథమిక వైద్య సౌకర్యపు హక్కు, కనీసం ఉపాధిని పొందే హక్కు మొదలైన అన్ని ప్రాథమిక ప్రజాస్వామిక హక్కులను కలిగి ఉంటారు.

2) రక్షణ, ఫైనాన్స్, వ్యవసాయం, వర్తకం, పరిశ్రమలు, న్యాయ, విద్యా, సాంస్కృతిక, ఆరోగ్య, సామాజిక సంక్షేమ, అటవీ పరిరక్షణ, ప్రజా సంబంధాల విభాగాల ద్వారా ప్రజల జీవితాలకు సంబంధించిన అన్ని విషయాలను ఆర్‌పిసి పట్టించుకుంటుంది.

'దున్నేవారికే భూమి' ప్రాతిపదికన భూమిలేని లేదా నిరుపయోగమైన భూమి ఉన్న రైతాంగానికి ఆర్‌పిసి ద్వారా అటవీ భూములు పంచి ఇవ్వబడ్డాయి. ప్రజలు సంఘటితపడిన చోట మహిళలు భూమిపై సగం యాజమాన్యపు హక్కును కలిగి ఉన్నారు. 'సమాన పనికి

సమాన వేతం' అమలు చేయబడుతున్నది. వారాంతపు సంతలలో విచ్చలవిడి దోపిడిని రూపుమాపేందుకు సంత కమిటీలు పని చేస్తున్నాయి. న్యాయమైన కూలిరేట్లను డిమాండ్ చేస్తూ విజయవంతంగా ప్రజా పోరాటాలు నిర్వహించబడ్డాయి. ప్రజల అవసరాలను తీర్చేందుకై నిధుల సేకరణ పెరిగింది. అటవీ ఉత్పత్తుల సేకరణపై అన్ని రకాల నిషేధాలు, పన్నులు రద్దు చేయబడ్డాయి. అటవీ ఉత్పత్తులను స్వేచ్ఛగా సేకరించుకోవచ్చు, వినియోగించుకోవచ్చు. 'అడవిపై ఆదివాసులకే/స్థానిక ప్రజలకే సర్వాధికారాలు' అనే నినాదం అమలులోకి వచ్చింది. ఆర్‌పిసిల అనుమతి లేకుండా అడవి నుంచి ఎటువంటి రకపు వనరులను అయినా తీసుకుపోవడంపై నిషేధం అమలులో ఉంది. నూతనంగా ప్రవేశించే సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలు, దళారీ కంపెనీలను అడ్డుకోవడం జరిగింది.

ఆర్‌పిసిలు పంటలకు నీటి పారుదల సదుపాయాలను కల్పించడంతో పాటు, పంట దిగుబడిని పెంచడం కోసం, సేంద్రీయ ఎరువు, ఉన్నత నాణ్యత కలిగిన విత్తనాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ పేద రైతాంగం తమ భూములను సాగు చేసుకునేందుకు వీలైన అన్ని మార్గాలలో తోడ్పాటును అందిస్తున్నాయి. పరిస్థితులు అనుమతించిన చోట, ప్రజల జీవన స్థాయిని పెంచే, ప్రజల, పిఎల్‌జిఏ సైనికుల ఆహార అవసరాలను తీర్చే లక్ష్యంతో వ్యవసాయోత్పత్తిని పెంచేందుకు అన్ని రకాల కృషిని సాగిస్తున్నాయి. తద్వారా మార్కెట్‌పై ఆధారపడడాన్ని తగ్గిస్తున్నాయి. ఆర్‌పిసిలు స్వయంగా వ్యవసాయ క్షేత్రాలను స్థాపిస్తున్నాయి. వివిధ ఉత్పాదక కర్తవ్యాలను, సేవలను పరిపూర్తి చేయడం కోసం సహకార టీములను ఏర్పరుస్తున్నాయి. ధాన్యం సహకార సంఘాలు స్థాపించబడుతున్నాయి. ప్రజలకు పోషకారాన్ని కల్పించడం కోసం పండ్ల తోటలు పెంచడం, కూరగాయలను, ఆకు కూరలను పండించడం ఆరంభమైంది. చెరువులలో చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఉత్పత్తిలో పాల్గొనడం పార్టీకి, పిఎల్‌జిఏకు తప్పనిసరి బాధ్యత అయ్యింది.

వర్గ పోరాట అభివృద్ధి, ఆర్‌పిసిల నిర్మాణం ద్వారా ప్రజల సాంస్కృతిక జీవితంలో నూతన పరిణామాలకు ద్వారాలు తెరుచుకున్నాయి. ఆదివాసీ పెద్దలకు వెట్టి చేయడం నిలిచిపోవడంతో ప్రజలు పరస్పర పని/సహాయ టీముల ద్వారా తమ అవసరాలను తీర్చుకోవడం పెరిగింది. ఆదివాసీ ప్రాంతాలలో కొన్ని వారాల పాటు కొనసాగే సామూహిక వేటను క్రమంగా నిరుత్సాహపర్చడం జరిగింది. దీనికి బదులుగా, భూసమతలీకరణ కోసం, వ్యవసాయానికి నీటి పారుదల సౌకర్యాలు సృష్టించడం కోసం శ్రమ శక్తిని వినియోగించడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల దిగుబడి పెంపుకు హామీని ఇస్తున్నారు.

అంధ విశ్వాసాలతో ఆచారాలను, సంప్రదాయాలను పాటించడం వల్ల పరిస్థితులలో మార్పు తీసుకొని రావడంలో ఉత్పత్తికి, ఉత్పత్తి శక్తులకు అవి ఆటంకంగా మారడంతో సాంప్రదాయ వైద్యులతో, పూజార్లతో సమావేశాలు నిర్వహించబడుతున్నాయి. వారికి చర్చల ద్వారా అర్థం చేయించడంతో అవసరమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వినిమయ సంస్కృతిని నిరుత్సాహపర్చడంతో పాటు, బలవంతంగా ఆదివాసులను హిందూ, క్రిస్టియన్ మతాలలోకి మార్పిడి చేయడాన్ని ఆర్‌పిసిలు వ్యతిరేకిస్తున్నాయి. శాస్త్రీయ అవగాహనను, నాస్తికవాదాన్ని అవి బోధిస్తున్నాయి. పెళ్లి, చావు తంతులలో అధికంగా ఖర్చు పెట్టడం తగ్గిపోయింది.

ప్రస్తుతం మహిళలకు మరింత గౌరవం లభిస్తోంది. వర్గ పోరాట అభివృద్ధి, మహిళా సంఘాల నిర్మాణంతో బలవంతపు పెళ్లిళ్లు, గోటుల్ వ్యవస్థ (కొన్ని ఆదివాసీ ప్రాంతాలలో అమలులో ఉండేది) గణనీయంగా తగ్గిపోయాయి. ఇది మహిళలను, యువతులను సామాజిక, మానసిక ఒత్తిళ్ల నుంచి విముక్తి చేసింది.

ప్రజల మౌలిక అవసరాలను నెరవేర్చడంలో భాగంగా పాఠశాలలు తెరువబడ్డాయి. చరిత్రలో మొట్టమొదటిసారిగా, దండకారణ్యంలో, మెజారిటీ ప్రజల మాతృభాష అయిన 'కోయ'లో విద్య బోధించబడుతోంది. ప్రజాస్వామిక-సోషలిస్టు భావాల వెలుగులో సిలబసులు రూపొందించబడ్డాయి. బీహార్-ఝార్ఖండ్‌లలో కూడా, ఆదివాసులు, దళితులు, ఇతర వంచిత సెక్షన్లకు విద్యను అందించేందుకు ప్రత్యేక కృషి సాగుతోంది. ప్రజల మౌలిక అవసరాలు నెరవేర్చడంలో భాగంగా వైద్య సహాయం అందించబడుతోంది. గ్రామాలలో ప్రజా డాక్టర్లను తర్ఫీదు చేసుకోవడం ద్వారా పారిశుధ్యం, తాగునీటి సౌకర్యాలను క్రియాశీలంగా అందుబాటులోకి తీసుకొని వస్తున్నారు. సరైన ఇళ్లు లేనివారికి పరస్పర సహకారంతో ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు.

ప్రభుత్వం ద్వారా విచ్చలవిడిగా అడవుల నరికివేత, విలువైన కలప దొంగతనం, టింబర్ మాఫియా అరికట్టబడ్డాయి. ప్రజలు తమ వ్యవసాయం మరియు ఇంటి అవసరాల కోసం తమ ఇష్టానుసారంగా చెట్లను నరకడం కాకుండా, ఆర్‌పిసిలు ప్రజల అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తున్నాయి. అడవుల నరికివేతను క్రమబద్ధం చేస్తున్నాయి. చేపల వేట, వేసవిలో నీటి వనరుల వద్దకు వచ్చే పక్షుల వేటలో భాగంగా నదులలో విషాన్ని కలపడంపై నిషేధం విధించబడింది. మాంసం అమ్మే వ్యాపార ప్రయోజనాల కోసం సాగించే వేటపై నిషేధం విధించబడింది. తద్వారా అటవీ జంతువుల పరిరక్షణను ప్రోత్సహిస్తున్నారు.

గ్రామ స్థాయి ఆర్‌పిసిలలో ఎంపిక చేయబడిన ప్రతినిధులు ఏరియా ఆర్‌పిసిలను ఏర్పాటు చేస్తున్నారు. అదే విధంగా ఏరియా స్థాయి నుంచి ఎంపిక చేయబడిన ప్రతినిధులు డివిజినల్ (జిల్లా స్థాయి) ఆర్‌పిసిలను ఏర్పాటు చేస్తున్నారు. ఇది విశాల భూభాగానికి ప్రాతినిధ్యం వహిస్తూ అక్కడ ప్రజల రాజకీయ అధికారాన్ని చెలాయిస్తూ నూతనమైనదాన్ని సృష్టిస్తోంది. అది భారత రాజ్యాన్ని ఎదుర్కొంటూ విముక్తి ప్రాంతాల నిర్మాణం వైపుగా, ప్రజా ప్రభుత్వ స్థాపన వైపుగా పురోగమిస్తోంది.

ఇలాంటివన్నీ దీర్ఘకాల ప్రజాయుద్ధ ఫలాలే. మూడు దశాబ్దాలకు పైగా చేసిన కఠోర త్యాగాలు కారణంగా దండకారణ్యం, బీహార్-ఝార్ఖండ్‌లలోని యుద్ధ క్షేత్రాలలో ఇప్పటికే గణనీయమైన పురోగమనం సాధించడం జరిగింది. ఈ రెండు ప్రాంతాలలో నెలకొని వేరు వేరు పరిస్థితులకు అనుగుణంగా ఈ పురోగమనం వేరు వేరు రూపాలు తీసుకున్నప్పటికీ, నూతన ప్రజాస్వామిక విప్లవ రాజకీయాలే వాటిని ఎల్లప్పుడూ నిర్దేశిస్తాయి. బీహార్-ఝార్ఖండ్‌లో కుల-ఫ్యూడలిజం బానిసత్వాన్ని బద్దలుకొట్టేందుకు, అగ్ర కులతత్వ ప్రైవేట్ సైన్యాలను ఓడించేందుకు, భూమిని స్వాధీనం చేసుకొని, పంచేందుకు, క్రాంతికారీ కిసాన్ కమిటీల నాయకత్వంలో వాటిని కేంద్రంగా చేసుకొని

అభివృద్ధికి మార్గం సుగమం చేయడానికి సాయుధ దన్నుతో పట్టుదలతో పోరాడడం జరిగింది. దండకారణ్యంలో, ఆదివాసీ రైతాంగాన్ని సాయుధం చేసి వివిధ పోరాటాల ద్వారా ప్రభుత్వ అటవీ శాఖ ఆధిపత్యాన్ని, ప్రైవేట్ కాంట్రాక్టర్ల ఆధిపత్యాన్ని, కొన్ని ప్రాంతాలలో ఫ్యూడల్ అధిపతుల లేదా ఫ్యూడల్ ఆదివాసీ పెద్దల ఆధిపత్యాన్ని, వారి దోపిడిన ధ్వంసం చేయడానికి పునాదులు వేశారు. పార్టీ, ప్రజా సంఘాలు నిర్మాణమయ్యాయి. విప్లవ సాయుధ బలగాలు, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం, ప్రజా గెరిల్లా సైన్యం మెట్టు మెట్టుగా నిర్మాణమయ్యాయి. బీజరూపంలో ప్రజా అధికారం ఆవిర్భవించింది. 2004లో రెండు ప్రధాన విప్లవ స్రవంతుల విలీనం ద్వారా ఈ విజయాలు, అనుభవాలు, పాఠాలు చేకూరాయి. అది సాహసపేతమైన, శక్తివంతమైన పురోగమనానికి గట్టి పునాదిని వేసింది. దీని ఫలితాలు మీ ముందు ఉన్నాయి.

ప్రజా వ్యతిరేక ప్రాజెక్టులకు, రాజ్య నిర్బంధానికి వ్యతిరేకంగా మా పార్టీ మార్గదర్శకంలో సాగిన శక్తివంతమైన ప్రజా ఉద్యమాల అభివృద్ధి మరో చెప్పుకోదగిన పరిణామం. ఇందులో నందిగ్రామ్, లాల్‌గఢ్, కళింగ నగర్, నారాయణపట్నా ఆందోళనలు నూతన రూపాలను ముందుకు తెచ్చాయి. అవి ప్రజారాశులలో విశాల ఐక్యతను సాధించాయి. మన పార్టీ నాయకత్వంలోని శక్తులు ప్రత్యేక తెలంగాణ కోసం సుదీర్ఘ కాలం పాటు సాగిన పోరాట విజయానికి ఎంతగానో కృషి చేశాయి. అనేక ఇతర ప్రజా ఉద్యమాలకు బలమైన మద్దతును కూడా అందించింది. ఇది రాజ్య నిర్బంధాన్ని తట్టుకోవడంలో, తమలో చీలిక సృష్టించాలనే దాని ప్రయత్నాలను తిప్పికొట్టడంలో వాటికి తోడ్పడింది. ఈ ఆందోళనలన్నింటిలో నీరు, అడవి, భూమి (జల్–జంగల్–జమీన్)పై ప్రజల హక్కు, ఆత్మగౌరవంతో కూడిన జీవితాన్ని గడిపేందుకు వారికి ఉన్న హక్కుల గురించి వక్కాణించబడింది.

ఈ సందర్భంగా, మేం విప్లవోద్యమానికి చెందిన ప్రధాన యుద్ధ జోన్లలో ప్రజలు నిర్వహించిన అసమాన పాత్రను గురించి ప్రత్యేకంగా చెప్పాల్సి ఉంది. శత్రు నిర్బంధాన్ని ప్రధానంగా ప్రజలే భరించారు. వాళ్లే మాకు విశ్వాసాన్ని అందించారు. వారి గొప్ప త్యాగాలు, అపారమైన వారి ఉత్సాహమే లేకపోతే దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని అసాధ్యం అయి ఉండేది. ముందుకు పురోగమించే క్రమంలో ఈ కడు పేదలు, అవమానాలకు గురైనవారే పథనిర్దేశకులైనారు. సమస్త దేశానికీ దేదీప్యమానమైన నమూనాలుగా ఈ చరిత్ర నిర్మాతలను మేం ఎత్తిపడుతున్నాం. వారికి మేం అభినందనలు తెలియజేస్తున్నాం. సెల్యూట్ చేస్తున్నాం. భారత విప్లవానికి ఒకే మార్గదర్శక కేంద్రంగా సిపిఐ (మావోయిస్టు) ఆవిర్భావాన్ని భారతదేశంలోనూ, ప్రపంచ వ్యాప్తంగానూ ప్రజలు స్వాగతించారు. ప్రజలు ఉత్తేజితులు కాగా, ప్రజా శత్రువులు హతాశులయ్యారు. మృత్యుముఖంలో వున్న అన్ని బలగాల వలెనే శత్రు బలగాలు సైతం విప్లవ శక్తులపై మరిన్ని హంతక దాడులు సాగించేందుకై తమ బలగాలను సమీకరించాయి. ఇది పూర్తిస్థాయి దాడి. సిపిఐ (మావోయిస్టు) నాయకులను పట్టుకొని, హత్య గావించే లక్ష్యంతో క్రూర సైనిక బలగాలు ఐక్యం చేయబడ్డాయి. అసహ్యకరమైన అబద్ధాలు, హాస్యాస్పదమైన పుకార్లతో బూటకపు శాంతి చర్చలను ముందుకు తేబడ్డాయి. ప్రజలకు వ్యతిరేకంగా ప్రజలను నిలబెట్టే వెసులుబాటు పథకంతో హంతక ముఠాలు, నిఘా బలగాలు సాయుధం చేయబడ్డాయి.

అయినప్పటికీ భారీ దాడులను ధైర్యంగా ఎదుర్కొంటూ, భారీ నష్టాలను అధిగమిస్తూ పార్టీ, పిఎల్‌జిఏ, ఆర్‌పిసిలు, విప్లవ ప్రజలు దృఢంగా నిలబడ్డారు. జైళ్లలో నిర్బంధించబడిన విప్లవకారులను విముక్తి చేసేందుకై వీరోచితంగా జహానాబాద్ జైలును బద్దలు కొట్టడం, పిఎల్‌జిఏను సాయుధం చేసేందుకై చారిత్రాత్మక నయాగఢ్ ఆయుధాగారం జప్తు, బలమైన దెబ్బలు తీయడం జరిగింది. ఐక్య పార్టీ తన చారిత్రాత్మక ఐక్యతా కాంగ్రెస్–9వ కాంగ్రెస్ (దేశవాప్త పార్టీ ప్రతినిధుల సమావేశం)ను విజయవంతంగా నిర్వహించింది. సైద్ధాంతిక, రాజకీయ ఐక్యత లోతుగా పెంపొంది బలోపేతం అయ్యింది. పార్టీలో సమైక్య భావన ఉన్నత స్థాయికి చేరుకుంది. దాని పోరాట సామర్థ్యం పదునెక్కింది.

భారత పాలకవర్గాలు తమ విప్లవ ప్రతీఘాతుక పథకాలను తిరిగి రూపొందించుకొని 2009 మధ్యలో 'ఆపరేషన్ గ్రీన్ హంట్'ను ప్రారంభించాయి. దానిని రోజు రోజుకూ తీవ్రం చేస్తూ వస్తున్నాయి. వారికి సామ్రాజ్యవాదం ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదం మద్దతు, మార్గదర్శకత్వం ఉన్నది. ఇది 'ప్రజలపై యుద్ధం'. పాశవికమైనది. ఇది పచ్చది కాదు, ఎర్రది. భారత రాజ్యపు కిరాయి మూకల ద్వారా ఊచకోతలకు గురైన ఆదివాసుల, ఇతర ప్రజారాశుల నెత్తురుతో అది ఎర్రగా అయ్యింది. నాశిరకం ఆయుధాలనే కలిగి ఉన్నప్పటికీ, సంఖ్య చాలా తక్కువగా ఉన్నప్పటికీ, తమ చివరి ఊపిరి వరకూ సాహసోపేతంగా పోరాడిన ప్రజల పుత్రులు, పుత్రికల నెత్తురుతో అది ఎర్రగా అయ్యింది. ఇది మానవ వేట. కోవర్టులు, త్రితీయ ప్రస్తుతీ కమిటీ వంటి విప్లవ ప్రతీఘాతుక గ్యాంగులు పార్టీ, పిఎల్‌జిఏ సభ్యులపై విషప్రయోగం చేసి హత్య చేశారు. ఇందులో భాగంగా ప్రజలపై పెద్దెత్తున విచ్చలవిడిగా దాడులు సాగాయి – విప్లవ ప్రతీఘాతుక ముఠాలు, పోలీసు, అర్ధసైనిక బలగాల ద్వారా హత్యలు, లైంగిక అత్యాచారాలు, ఇళ్లను నేలమట్టం చేయడం, లూటీ, పంటల, ధాన్యాగారాల విధ్వంసం, కోళ్లను, ఇతర పెంపుడు జంతువులను దోచుకొని, కోసుకొని తినడం వంటివి కొనసాగాయి. బీహార్, ఝార్ఖండ్, పశ్చిమ బంగ్‌లలో 'కుర్కి జప్తి'గా పేరు పొందిన తీవ్రమైన బ్రిటిష్ వలసవాద అణచివేత సాంప్రదాయాలపై ఆధారపడి మావోయిస్టు ఉద్యమంతో సంబంధం ఉన్న వారి ఇళ్లను, ఆస్తులను కోర్టుల ఆదేశాల మేరకు స్వాధీనం చేసుకున్నారు. దంతేవాడ జిల్లా చింతల్‌నార్ ప్రాంతంలో వాళ్లు నాలుగు గ్రామాలను నేలమట్టం చేసి, హత్యలు–అత్యాచారాలు సాగించిన క్రూరమైన దాడి ఇటీవలి రాజ్య నిర్బంధానికి ఉదాహరణ. మరొకటి బీజాపూర్‌లోని సార్కెన్‌గూడ వద్ద ప్రజా సభపై కాల్పులు, 17 మంది ఊచకోత (ఇందులో ఎక్కువ మంది మహిళలు, పిల్లలు) కోసిన ఘటన. భారత పాలక వర్గాలు, తమ రాజకీయ పార్టీలు తరచుగా ప్రజలకు కనీసం మౌలిక సౌకర్యాలు కల్పించడానికి సైతం నిధుల కొరత ఉందని చెబుతుంటాయి. కానీ, తాము ప్రజలపై సాగిస్తున్న యుద్ధంలో ఇటీవలి టెక్నాలజీని వినియోగించేందుకై కోట్లాది రూపాయలు లెక్కలేకుండా కుమ్మరిస్తున్నాయి. ఇప్పటికే ఐదు లక్షల కిరాయి మూకలను

ఈ యుద్ధంలో మోహరించారు. మరో 50 వేల కేంద్ర, రాష్ట్ర కిరాయి బలగాలు నిర్మాణంలో ఉన్నాయి. వైమానిక దళం డ్రోన్లను సమకూర్చుతోంది. అది ప్రస్తుతం వైమానిక దాడులకు సన్నాహాలు చేస్తోంది. సైన్యం బ్రిగేడ్ స్థాయి కమాండ్‌ను ఏర్పర్చుకొని అక్కడ శిక్షణను ఇస్తోంది. మావోయిస్టు విప్లవానికి వ్యతిరేకంగా సైన్యంలో చాలా వేగంగా ఒక ప్రత్యేక బలగాన్ని నిర్మాణం చేస్తున్నారు.

భారత రాజ్యం మునుపెన్నటి కంటే మరింతగా తెగించి దాడులలో దూకుడుగా ముందుకు వస్తున్నది. అది పిచ్చిగా సాగిస్తున్న ఈ 'ప్రజలపై యుద్ధానికి' సమర్థింపుగా 'ప్రజలకు వ్యతిరేకంగా ప్రజలను నిలపడం' అనే తర్కాన్ని ముందుకు తెచ్చింది. నానాటికీ దేశ పరిస్థితి ఏ విధంగా ఉందనేది బహిర్గతమవుతోంది. జనాభాలో 70 శాతం మంది రోజుకు 20 రూపాయలతోనే బతుకులెల్లదీస్తుండగా, భారతదేశం ప్రపంచ అగ్ర శక్తుల సమాఖ్యలోకి ప్రవేశించబోతోందని పాలకులు చెప్పుకోవడం సిగ్గులేకుండా అల్లిన కథనం తప్ప మరొకటి కాదు. దీనికి పూర్తి భిన్నంగా నూతన సాయుధ శక్తి, నూతన ప్రజా ఉద్యమాలు, నూతన రాజకీయ అధికారం, నూతన సమాజం తూర్పు, మధ్య భారతదేశంలో ఆవిర్భవిస్తున్నాయి. పీడిత ప్రజలలోనే కాకుండా దేశభక్తులు, ప్రగతిశీల శక్తులలోని ఒక విశాలమైన సెక్షన్‌కు కూడా ఇది పెద్దెత్తున ఆకర్షించడం మొదలైంది. అభివృద్ధి పేరుతో సామ్రాజ్యవాద, భారత కార్పొరేట్లు సాగించే మానవ వనరుల, ప్రకృతి వనరుల విధ్వంసానికి, తీవ్రమైన దోపిడి, పీడన, అణచివేతలకు వ్యతిరేకంగా దీనిని నిజమైన ప్రత్యామ్నాయంగా చూడడం మరింతగా పెరుగుతోంది. ఇది ఒక ప్రజాస్వామిక నమూనాను ఎత్తిపడుతుంది. ఇందులో పీడిత వర్గాలు, సామాజిక సెక్షన్లు – కార్మికులు, రైతాంగం, పట్టణ పెట్టీ బూర్జువా వర్గం, మహిళలు, ఆదివాసులు, దళితులు, జాతీయ, మతపరమైన మైనారిటీలు – దళారీ నిరంకుశ బూర్జువా వర్గంతో కుమ్మక్కై సామ్రాజ్యవాదానికి సామాజిక పునాదిగా సేవ చేసే బ్రాహ్మణవాద కులతత్వ ఫ్యూడలిజం ఆధిపత్యం నుంచి, దాని సకల అభివృద్ధినిరోధక విలువల నుంచి విముక్తిని పొందుతారు. భూమిలేని, పేద రైతాంగం భూమిని ఎలా పొందాలో, సమిష్టి శ్రమకు సంబంధించిన బ్రహ్మాండమయిన శక్తిని ఎలా వినియోగించాలో, సాంప్రదాయక విజ్ఞానాన్ని నూతన సమాజపు సేవలో ఎలా నియంత్రించి వినియోగించుకోవాలో, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని, నిజమైన స్థిరమైన అభివృద్ధిని సాధించేందుకు పర్యావరణాన్ని పరిరక్షించడం ఎలా సాధ్యమో అది చూపుతుంది. ఇది నూతన భారతదేశంలో అంతర్గతంగా ఉన్న అపారమైన శక్తిని బీజప్రాయంగా చూపుతుంది. భారత రాజ్యాన్ని ధ్వంసం చేసిన తర్వాత, దాని బూడిదలో నుంచి మాత్రమే నూతన భారతదేశం ఆవిర్భవిస్తుంది. అవును, ఇవన్నీ భారత పాలకుల హతాశకు కారణాలే. ఈ నూతన శక్తి, సమాజం ఉనికిలో ఉన్నన్ని రోజులూ అది వారి శవపేటికల్లో మరో మేకునును దించుతూ వుంటుంది. అందులో తమ చావును వారు చూస్తున్నారు. అందువల్ల, వాళ్లు పిచ్చిగా దాన్ని ధ్వంసం చేయడానికి వేగిరపడుతున్నారు.

ఇంతే కాదు. ఈ ప్రాంతాలలోని వనరులను విదేశీ, భారత కార్పొరేట్లకు అమ్మి వేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే పెద్ద సంఖ్యలో సంతకాలు చేసి ఒప్పందాలు చేసుకుంది. కానీ ప్రజాయుద్ధ పురోగమనం-విస్తరణ ప్రజల భాగస్వామ్యంతో భూమి, నీరు, అడవులపై ప్రజా అధికారం స్థాపన వారి పథకాలను వమ్ము చేశాయి. ప్రస్తుతం వాళ్లు తీవ్రమైన ఒత్తిడిలో ఉన్నారు. సామ్రాజ్యవాద వ్యవస్థ ప్రపంచవ్యాప్త ఆర్థిక సంక్షోభంలో కునారిల్లుతోంది. ఇది భారత ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నది. ఈ సంక్షోభ పరిస్థితి వల్ల ప్రజా శత్రువులు, సామ్రాజ్యవాద ఎంఎన్‌సిలు, భారత దళారులు మరింతగా హతాశులై మనదేశ వనరులను కొల్లగొట్టేందుకు, శ్రామిక వర్గాలను పీల్చిపిప్పి చేసేందుకు పూనుకుంటున్నారు. అందువల్ల, విప్లవిస్తున్న ప్రజలను అణచివేసేందుకు మరింత వేగిరపాటుతో ఎంత నెత్తురు చిందినా వారు లక్ష్యపెట్టడం లేదు.

కిరాయిమూకల బూట్లకింద ప్రజలు నలిగిపోతున్నారు. వాళ్ళుప్రజలను చిత్రవధ చేస్తున్నారు, ఊచకోత కోస్తున్నారు. కానీ వాళ్ళు ఇంతటితోనే ఆగటం లేదు. వాళ్లు 'బహుమతులను' కూడా తీసుకొస్తున్నారు. వాళ్లు అన్ని రకాల గాడ్జెట్లను, బట్టలను, ఆహారాన్ని కుమ్మరిస్తున్నారు. ఆదివాసీ పిల్లలకు ఆశ్రయం కల్పిస్తూ, ఉచిత శిక్షణను అందిస్తున్నారు. వారు వాళ్లను మారుమూల గ్రామాల నుంచి "భారత పర్యటనలకు" తీసుకెళుతున్నారు. అది బూట్లకు, బాయినెట్లకు పూరకంగా నిలిచే "మెత్తని స్పర్శ". ప్రజలలోని ఒక సెక్షన్‌ను మోసగించేందుకు, ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్ నిర్మాణానికి వారిని పునాదిగా చేసుకునేందుకు ఇలా చేస్తున్నారు. అమెరికా సామ్రాజ్యవాదుల, వారి తొత్తుల కపట పథకంలో భాగమే ఇది. వాళ్లు ప్రజల్ని చీల్చడం కోసం సంస్కరణలు, అభివృద్ధి గురించిన వాగ్దానాలతో ముందుకు వస్తున్నారు. దీని లక్ష్యం మావోయిస్టులను ఒంటరి చేయడం, విప్లవోద్యమ అణచివేతను వేగిరపరచడం, నూతన రాజకీయ అధికారాన్ని ధ్వంసం చేయడం, ప్రజాయుద్ధ విస్తరణను అడ్డుకోవడం. ఇదే గనుక జరిగితే వాళ్ల వ్యాపారం తిరిగి సాధారణ స్థితిలోకి వస్తుంది – ప్రజలను ప్రాథమిక హక్కులు, మౌలిక సదుపాయాల నుంచి వంచితుల్ని చేసే, ప్రకృతి వనరులను తెగనమ్మే వ్యాపారం. మీకు రుజువులు కావాలంటే ఝార్ఖండ్‌లోని సరండా వైపు ఒకసారి చూడండి. మొట్టమొదట హఠాత్తుగా, విప్లవ సంస్థలను, ధ్వంసం చేసేందుకు, పిఎల్‌జిఏను తరిమికొట్టేందుకు 10 వేల కంటే మించిన బలగాలతో పూర్తి స్థాయిలో క్రూరమైన దాడిని నిర్వహించారు. తర్వాత అందరికీ మౌలిక సౌకర్యాలను అందిస్తామనే హామీతో ప్రత్యేక సరండా అభివృద్ధి అథారిటీని స్థాపించారు. చివరికి జరిగిందేమంటే – వేలాది హెక్టార్ల ప్రాచీన అడవిని ఇనుప ఖనిజం మైనింగ్ కోసం టాటాకు గుత్తకు అమ్మివేశారు. ప్రకృతి వనరులతో విలసిల్లే ఆ ప్రాంతంలోకి దాదాపు 100 సామ్రాజ్యవాద, దళారీ కార్పొరేషన్లు ప్రవేశించాయి. ప్రజల అసహ్యానికి గురైన పోలీస్‌స్టేషన్ల, ప్రభుత్వ అధికార్ల, స్థానిక దోపిడిదార్ల పాలన పునరుద్ధరించబడింది. భారత రాజ్యం సాగిస్తున్న విప్లవ ప్రతీఘాతుక క్యాంపెయిన్లలోని వాస్తవిక క్రమం ఇది.

భారతదేశంలో విప్లవం ప్రతీఘాతుక విప్లవంతో తలపడుతున్నది. పిఎల్‌జిఏ భారత రాజ్యపు బలాధిక్యత కలిగిన బలగాలను ప్రజాయుద్ధ గెరిల్లా ఎత్తుగడలతో తిప్పికొడుతోంది. శత్రు బలగాల వలే కాక, అది సృజనాత్మకంగా, ఉక్కు దృఢ సంకల్పంతో ప్రజలతో సన్నిహిత సంబంధాలను బలోపేతం చేసుకుంటోంది. భారత రాజ్యం సాగిస్తున్న 'ప్రజలపై యుద్ధానికి' పిఎల్‌జిఏ ఇచ్చిన ధీటైన జవాబే

ముకరం (దండకారణ్యం) వద్ద సిఆర్‌పిఎఫ్‌కు చెందిన మొత్తం కంపెనీ నిర్మూలన. పిఎల్‌జిఏ దీర్ఘకాల ప్రజాయుద్ధంలో, భూభాగాన్ని నియంత్రణలో ఉంచుకోవడం అనేది కాక, విప్లవ సైనిక శక్తిని పరిరక్షించుకోవడం నిర్ణయాత్మకమవుతుంది. పిఎల్‌జిఏ ఈ సూత్రానికి అంటుపెట్టుకొని భారత రాజ్యం సాగించే దాడుల నుంచి తప్పించుకుంటూ దానిని నిరోధిస్తున్నది, ధ్వంసం చేస్తున్నది. అది శత్రువు చిన్న యూనిట్లపై దాడి చేస్తూ, వాడి వలయాన్ని ఛేదిస్తూ భారీ చుట్టివేతలను అది బద్దలు కొట్టింది. పెద్దెత్తున బలగాలు చుట్టిముట్టినప్పుడు ఉపసంహరించుకుంటూ, అవకాశం చిక్కినప్పుడు తన శక్తినంతటినీ కూడగట్టుకొని వాటిని తిప్పికొడుతోంది. తోంగ్‌పాల్ ఆంబుష్ (దండకారణ్యం)లో 15 మంది కిరాయి మూకలు నిర్మూలించబడ్డారు, 20 ఆయుధాలు, పెద్దమొత్తంలో తూటాలు స్వాధీనమయ్యాయి. ఫర్సగావ్ ఆంబుష్ (ఝార్ఖండ్)లో 5 గురు కిరాయి సైనికులు ఖతమయ్యారు, 5 ఆయుధాలు స్వాధీనమయ్యాయి. ఈ ఘటనలు ఒక మావోయిస్టు పార్టీ నాయకత్వంలో సాగే యుద్ధం – దీర్ఘకాల ప్రజాయుద్ధం బలానికి నమూనాలుగా నిలుస్తాయి. తద్వారా అది వేలాదిగా ప్రజలను తన వైపుకు తిప్పుకుంటోంది. భారత రాజ్యం 'క్లియర్' చేశానని చెప్పుకున్న ప్రాంతంలో తోంగ్‌పాల్ ఆంబుష్ జరగడం విశేషం. ఈ సంవత్సరం జనవరి నుంచి జూన్ వరకూ, దేశవ్యాప్తంగా తొమ్మిది రాష్ట్రాలను కవర్ చేస్తూ డిసెంబర్–జనవరి 2013–2014లో, 2014 మార్చిలో సాగిన రెండు తీవ్రమైన అణచివేత క్యాంపెయిన్ల మధ్యలోనే పిఎల్‌జిఏ 39 చర్యలు నిర్వహించింది.

నూతన రాజకీయ బలగానికీ, నూతన ఉద్యమానికీ, అధికారానికీ, నూతన సమాజానికీ వ్యతిరేకంగా భారత రాజ్యపు దాడిని ప్రతిఘటించడం అనేది కేవలం పిఎల్‌జిఏకే పరిమితమైంది కాదు. ప్రజలు పెద్దెత్తున ఇందులో భాగమవుతున్నారు. వారు చర్యలలో, సన్నాహాలలో పాల్గొంటున్నారు, ఆహారాన్ని, షెల్టర్‌ను కల్పిస్తున్నారు, సమాచారాన్ని అందిస్తున్నారు, సప్లైల మెయింటెనెన్స్‌లో సహకరిస్తున్నారు, శత్రువుకు సహకరించేందుకు నిరాకరిస్తున్నారు. ప్రజా మిలీషియా పిఎల్‌జిఏలో చాలా ముఖ్యమైన బలగం. చర్యలలో అది తన పాత్రను పోషించడంతో పాటు, సల్వాజుడుంను, సెంద్ర దాడులను, వివిధ రాష్ట్రాలలో ఇతర విప్లవ ప్రతీఘాతుక హంతక గ్యాంగులను ఓడించడంలో అది అపూర్వమైన పాత్రను నిర్వహించింది. ప్రజలు నిర్బంధాన్ని సాహసోపేతంగా ఎదుర్కొంటూ అమరవీరుల శవాలను స్వాధీనం చేసుకొని, వారికి గొప్పగా అంత్యక్రియలు నిర్వహించిన ఘటనలు అనేకం ఉన్నాయి. కొన్ని సందర్భాలలో అది శత్రు బలగాలు ప్రజలకు పంపిణీ చేసిన సరకులను అన్నింటిని జమ చేసి దగ్ధం చేసింది. దండకారణ్యంలో మినపలో ప్రజలు పిఎల్‌జిఏతో కలిసి వారం రోజులకు పైగా నిరంతరం శత్రువు వెంటపడి వత్తిడి తీసుకొని వచ్చి వాడి సైనిక క్యాంపును మూసివేసుకునేలా చేశారు. హర్రాకోడేర్‌లో చుట్టుపట్ల గ్రామాల్లోని ప్రజలు సంఘటితపడి శాంతియుతంగానే అయినా, దృఢంగా ఆందోళనలను నిర్వహించి నూతనంగా శత్రువు ఏర్పాటు చేసిన క్యాంపును మూసేసేలా చేశారు. ఇందులో మహిళలు ఆదర్శనీయమైన పాత్రను నిర్వహించారు. భారత రాజ్యం సాగించే 'ప్రజలపై యుద్ధానికి' నిరసనగా భారతదేశంలోనూ, విదేశాల్లోనూ పెద్ద సంఖ్యలో మేధావులు, ప్రగతిశీల శక్తులు, ప్రజాస్వామికవాదులు కూడా వీధుల్లోకి వచ్చారు. దాని అత్యాచారాలను బహిర్గతం చేశారు.

**ప్రియమైన ప్రజలారా!**

నూతన సరళీకృత విధానాల ద్వారా మన జీవనోపాధిపై, ఆత్మగౌరవం, ఉనికిని భంగం కలిగించేలా బహుముఖ దాడులతో విదేశీ, భారత కార్పొరేట్ల దోపిడిని తీవ్రతరమవుతున్నది. మెగా ప్రాజెక్టులు, గనులు, విద్యుత్తు కేంద్రాలు, డ్యాములు, ఓడ రేవులు, విమానాశ్రయాలు, సూపర్ హైవేలు, మెట్రోలు, హై–టెక్ సిటీలు, పర్యాటక కేంద్రాలు/ఆశ్రమాలు, ప్రత్యేక ఆర్థిక మండళ్లు మొదలైన వాటి పేరుతో కోట్లాది మంది ప్రజలను తమ నివాస ప్రాంతం నుంచి నిర్వాసితుల్ని చేస్తున్నారు. పాలకుల వినాశకరమైన విధానాలు పర్యావరణ విపత్తులకు దారితీస్తూ, వందలాది మంది ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. వేలాది మంది చిల్లిగవ్వ లేకుండా నిరాశ్రయిలయ్యారు. కార్మికుల హక్కులను హరించి వేసేందుకు పాలకులు ఒక్కో చట్టాన్ని తీసుకు వస్తున్నారు. వారు ఆర్థిక వ్యవస్థలోని మరిన్ని రంగాలను సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు అప్పచెబుతున్నారు. వ్యవసాయ రంగంలోకి లోతుగా విదేశీ పెట్టుబడి, జన్యు శాస్త్ర పరిజ్ఞానంతో తయారు చేసిన మొక్కలు వంటి టెక్నాలజీ చొరబడేలా ఆ రంగాన్ని తీర్చిదిద్దుతున్నారు. రియల్ ఎస్టేట్ 'ల్యాండ్ బ్యాంక్స్', ఎస్ఈజడ్‌లు లాంటి నూతన రూపాల్లో భూమి కేంద్రీకృతమవుతోంది. కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు. బహుళజాతి సంస్థల అధిపతులు ఎంతటి దారుణ నేరాలకు పాల్పడినా వారిని ఇక్కడ విచారించడానికి వీలులేని విధంగా ప్రస్తుతం ఉన్న చట్టాలకు సవరణలు చేస్తున్నారు.

ప్రాజెక్టుల కోసం భూమిని కబ్జా చేసినప్పుడు, భూమికి బదులుగా భూమి కావాలనే ఆక్రోశించే పీడిత రైతాంగపు గోడును పట్టించుకోవడం లేదు. ఈ విలువైన ప్రకృతి వనరును బడా భూస్వాములు గుత్తకు తీసుకుంటున్నారు. వాళ్ల రసాయనిక ఎరువుల, ఇతర ఆధునిక ఉత్పత్తి కారకాల అమ్మకందార్లుగా, వ్యవసాయ వుత్పత్తుల కొనుగోలుదార్లుగా మారుతున్నారు. వారు నేరుగా వడ్డీ వ్యాపారులుగా వ్యవహరిస్తున్నారు లేదా సహకార సంఘాలను నియంత్రిస్తున్నారు. వారు పాలకవర్గ రాజకీయ పార్టీల ఎంఎల్ఏలు, ఎంపిలు, మంత్రులు కూడా. వారు స్థానిక సంస్థలను నియంత్రిస్తారు. పోలీసు బలగాలను ప్రభావితం చేస్తారు. అంటే వారు దళారీ నిరంకుశ బూర్జువా వర్గంతో చేతులు కలపడం ద్వారా రైతాంగంపై, గ్రామీణ పేద ప్రజలపై పూర్తి నియంత్రణను కలిగి ఉంటారు. వారు దేశ ప్రగతికి ఒక పెద్ద ఆటంకంగా ఉన్నారు.

ప్రజలు ఎక్కడ నిరసన తెలియజేసినా క్రూరమైన బలగాలు, నల్లచట్టాలు వారికి జవాబు చెబుతాయి. ఎన్నికల ద్వారా బూటకపు ప్రజాస్వామ్యం అమలులో ఉన్నా, వాస్తవంలో ఫాసిజీకరణ పెరుగుతోంది. ఫాసిస్టు ఆర్ఎస్ఎస్ చేతిలో పనిముట్టు అయిన నరహంతక మోడీ ప్రధాన మంత్రి ఆసనాన్ని అధిష్టించడంతో పాలకవర్గాల నుంచి, వారి సామ్రాజ్యవాద ప్రభువుల నుంచి బ్రాహ్మణవాద హిందూ ఫాసిజానికి నిరంతరాయంగా ప్రోత్సాహం లభిస్తోంది. మతతత్వ హింసను, ప్రత్యేకించి ముస్లిం మైనారిటీలను లక్ష్యంగా చేసుకొని సాగించేందుకు అత్యంత అభివృద్ధి నిరోధక మతదురహంకారాన్ని రెచ్చగొడుతున్నారు. ఒక ప్రపంచ శక్తిగా అవ్వాలనే భ్రమలను సృష్టించడం

ద్వారా సంకుచిత జాత్యహంకారాన్ని రెచ్చగొడుతూ, దేశ దుర్భర బానిసత్వాన్ని కప్పిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. 'హిందూ-హిందూ' భావనను ఆధిపత్యంలోకి తీసుకొని వచ్చేందుకు కపట ఎత్తుగడలను పన్నుతున్నారు. తద్వారా జాతీయ సంస్కృతులను, మతపరమైన వైవిధ్యాలను, దేశపు నామమాత్ర గణతంత్ర వ్యవస్థను రూపుమాపాలని చూస్తున్నారు.

ప్రజల ఆక్రోశం తారాస్థాయికి చేరుకుంటోందని పాలకులకు బాగానే తెలుసు. ప్రతి ఒక్క రాజకీయ పార్టీ కేంద్రంలోనూ లేదా రాష్ట్రాలలోనూ అధికారం చెలాయించినవే లేదా ప్రస్తుతం అధికారంలో ఉన్నవే. వాటి ప్రజావ్యతిరేక, అవినీతికర స్వభావం ఇప్పటికే బహిర్గతమైంది. అవి ఆయా సమయాల్లో ఏదో ఒక సంస్కరణను తీసుకొచ్చినవే. ఇలాంటి సంస్కరణల ద్వారా వారు ప్రజల నోళ్లు మూయించాలని, క్రియాశూన్యతను సృష్టించాలని, తమ దోపిడీ, అణచివేతలను కొనసాగిస్తూ మరింత తీవ్రతరం చేయాలని అనుకుంటున్నారు. ఆ విధంగా ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణల రూపంలో సామ్రాజ్యవాదం భీతిల్లే రీతిలో చొచ్చుకొని వస్తున్నది. ప్రస్తుతం అది "మానవ ముఖం కలిగిన ప్రపంచీకరణ" వేషాన్ని వేసుకుంది. అవును, వాళ్లు మిమ్మల్ని ఇళ్ల నుంచి తన్ని తరిమివేస్తూనే లేదా మిమ్మల్ని ఉద్యోగాల నుంచి తొలగించి వేస్తూనే లేదా మీ పూర్వీకుల భూములలోనే మిమ్మల్ని సజీవంగా పాతిపెడుతూనే వాళ్లు చిరునవ్వులు చిందిస్తూ ఉంటారు. అది వారి 'ప్రజలపై యుద్ధం' ఎత్తుగడలలో భాగమే. మొట్టమొదట వాళ్లు మిమ్మల్ని క్రూరంగా హింసిస్తారు, తర్వాత మీకు బహుమతులు అందిస్తారు.

**ప్రియమైన ప్రజలారా!**

మన దేశం ఒక క్లిష్టమైన కూడలిలో ఉంది. మీరు ఏ మార్గాన్ని అనుసరిస్తారు? ప్రజాయుద్ధ జ్వాలల్ని దేశవ్యాప్తంగా విస్తరించేందుకు ముందుకు పురోగమిస్తారా? లేదా వెనకడుగు వేసి మరింత మోసానికి గురి అవుతూ, మరింత బానిసత్వం వైపు, మరింత వినాశనం వైపు వెళతారా? మీ నిర్ణయం కోసం మేం ఎదురు చూస్తాం. మేం సాగించే పోరాటంలో మీ భవిష్యత్తును గుర్తిస్తారనే విశ్వాసం మాకు ఉంది. చారిత్రాత్మక నక్సల్బరీ సాయుధ రైతాంగ తిరుగుబాటుతో ఆరంభించి ఇప్పటి వరకూ 12 వేలమందికి పైగా కామ్రేడ్స్ మూడు పర్వతాలను ధ్వంసం చేసే మహత్తర లక్ష్యం కోసం తమ ప్రాణాలను ధారపోసి ఆ లక్ష్యాన్ని మనపై మోపారు. ఈ పోరాట క్రమంలో ఇంకా అనేక మంది అత్యంత ఉన్నత త్యాగాలను చేయాల్సి వస్తుందని మాకు తెలుసు. కమ్యూనిస్టులమైన మేం త్యాగాలు చేసేందుకూ, ప్రజలకు సేవ చేసేందుకూ, దేశాన్ని విముక్తి చేసేందుకు ఎన్నడూ వెనుదీయం. మన ప్రజలకు, దేశానికి శత్రువులైన వారిని అంతిమంగా ధ్వంసం చేసే రోజు కోసం ఎంతో కాలంగా మేం ఎదురు చూస్తున్నాం. ఆ రోజు త్వరగా వచ్చేలా చేయాలి. సామ్రాజ్యవాదులను తరిమికొట్టాలి. మన సకల జాతుల, తెగల సమగ్రమైన, సమానమైన అభివృద్ధిని సాధించే స్వయం ఆధారిత భవిష్యత్తు నిర్మాణంతో మనం ఆరంభిద్దాం. ఉజ్వలమైన మన పార్టీ యొక్క ఈ పదవ వార్షికోత్సవాన్ని దేశంలోని ప్రతి గెరిల్లా జోన్‌లో, ప్రతి ఎర్ర ప్రతిఘటన ప్రాంతంలో, ప్రతి గ్రామంలో, ప్రతి పట్టణంలోనూ, విదేశాల్లోనూ విప్లవోత్సాహంతో జరిపి మన ప్రజాయుద్ధ సందేశాన్ని వినిపించండి. మన విప్లవోద్యమాన్ని దృఢసంకల్పంతో ముందుకు తీసుకుపోండి.

☆ సిపిఐ (మావోయిస్టు) పదవ వార్షికోత్సవాన్ని విప్లవోత్సాహంతో జరపండి!

☆ నూతన ప్రజాస్వామిక భారతదేశాన్ని నిర్మించేందుకై ఈ మహత్తర ఉత్సవంలో మాతో భాగస్వాములవ్వండి!

☆ సిపిఐ (మావోయిస్టు), పిఎల్‌జిఏలలో చేరండి! అవి మీవే!

☆ భారతదేశంలో సాగుతున్న ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయండి, విస్తరించండి, పురోగమింపజేయండి!

☆ సాయుధ వ్యవసాయ విప్లవ జ్వాలల్ని విస్తరింపజేయండి!'

☆ భారత రాజ్యం సాగిస్తున్న 'ప్రజలపై యుద్ధం' – 'ఆపరేషన్ గ్రీన్ హంట్'ను వ్యతిరేకించండి, ప్రతిఘటించండి, ఓడించండి!

☆ భారత రాజ్యపు ప్రజా వ్యతిరేక, దేశాన్ని తెగనమ్మే విధానాలకు వ్యతిరేకంగా కోట్లాదిగా మేల్కొనండి, సంఘటితంకండి, వాటిని తిప్పికొట్టండి!

☆ బ్రాహ్మణవాద హిందూ ఫాసిస్టు మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమైక్యంగా ఉద్యమించండి!

☆ మీ భవిష్యత్తును మీ చేతుల్లోకి తీసుకునేందుకు సాహసించండి!

విప్లవాభివందనాలతో

కేంద్ర కమిటీ

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు

సెప్టెంబర్ 1, 2014

# కార్మికవర్గ అంతర్జాతీయతావాద పతాకాన్ని సమున్నతంగా ఎత్తిపడదాం!

# ‘భారతదేశ ప్రజాయుద్ధానికి మద్దతుగా అంతర్జాతీయ కాన్ఫరెన్స్’

# విజయవంతం అయిన సందర్భంగా మా లాల్‌సలాం!!

**(2012 నవంబర్ 24న హాంబర్గ్‌లో భారత దేశ ప్రజాయుద్ధానికి మద్ధతుగా జరుగుతున్న అంతర్జాతీయ కాన్ఫరెన్సుకు మనపార్టీ కేంద్రకమిటీ కార్యదర్శి పంపిన సందేశం)**

ప్రియమైన కామ్రేడ్స్,

మొదటగా మా పార్టీ సిపిఐ (మావోయిస్టు), ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పీఎల్‌జీఏ), విప్లవ ప్రజా కమిటీలు (ఆర్పీసీలు), విప్లవ ప్రజాసంఘాలు, భారతదేశ విప్లవ ప్రజానీకం ల తరఫున భారతదేశ నూతన ప్రజాస్వామిక విప్లవానికి ప్రపంచవ్యాప్త సంఘీభావాన్నీ, మద్దతునూ కూడగట్టడానికీ, 2012 నవంబర్ 24న హాంబర్గ్ లో ‘భారతదేశ ప్రజాయుద్ధానికి మద్దతుగా అంతర్జాతీయ కాన్ఫరెన్స్’ ను విజయవంతం గావించడానికీ గొప్ప కృషిని చేపట్టిన భారతదేశంలోని, ఇతర దేశాల్లోని అన్ని పార్టీలకూ, సంస్థలకూ, వ్యక్తులకూ మేం మా మన:పూర్వకమైన విప్లవాభినందనలు, హృదయపూర్వకమైన లాల్‌సలాములు తెలియజేస్తున్నాం.

హాంబర్గ్ కాన్ఫరెన్స్ లో సిసలైన అంతర్జాతీయతావాద స్పిరిట్ తో మీరు ఇచ్చిన సందేశాలూ, ఉపన్యాసాలూ ప్రపంచ సోషలిస్టు విప్లవపు ఈ యుద్ధరంగంలో అంటే భారతదేశంలో వర్గ శత్రువులతో భీషణంగా పోరాడుతున్న పీడిత ప్రజలకూ, కామ్రేడ్స్ కూ అవసరమైన నైతిక మద్దతును అందించాయి. మీ అందరికీ తెలిసినట్లే ఇక్కడ అత్యంత తీవ్రమైన నిర్బంధ పరిస్థితులు రోజురోజుకూ మరింతగా తీవ్రతరమౌతూ విస్తరిస్తూ కొనసాగుతున్నాయి. అందువల్ల మేం సకాలంలో మీ సందేశాలను అందుకోలేకపోయాం. అందినవి కూడా చాలా ఆలస్యంగా అందాయి. మీ సహృదయపూర్వకమైన కృషికి స్పందించడంలో జరిగిన ఈ ఆలస్యానికి మేం నిజంగా ఎంతో చింతిస్తున్నాం.

హాంబర్గ్ కాన్ఫరెన్స్ లో యువత, విద్యార్థులూ, మహిళలూ, సాంస్కృతిక కార్యకర్తలూ క్రియాశీలంగా పాల్గొన్నారనే విషయం మాకు ప్రత్యేకించి ఎంతో ఆనందాన్ని కలిగించింది. ప్రపంచంలోని మూలమూలల్లో జరిగిన క్యాంపెయిన్ ల నివేదికలు మాలో సంతోషాన్నీ, ఉత్సాహాన్నీ రేకెత్తించాయి. అన్నిటికంటే ఎక్కువగా ఈ మొత్తం సంఘీభావం మమ్మల్ని ప్రపంచ కార్మికవర్గం పట్ల, అలాగే ప్రపంచ సోషలిస్టు విప్లవంలో మా పాత్ర విషయంలో మరింత నమ్రతగా, బాధ్యతాయుతంగా భావించేలా చేసింది. మేము కూడా ఈ క్యాంపెయిన్ లో భాగమై, ముఖ్యమైన పాత్రను పోషించాల్సి ఉండింది కానీ మున్నెన్నడూ లేనంతటి శత్రుదాడిలో మేమా పాత్ర పోషించలేకపోయాం.

మేం మా ఉన్నత నాయకత్వాన్ని కోల్పోయి దు:ఖంలో మునిగి ఉన్న సమయాల్లో – అది 1999లో కామ్రేడ్స్ శ్యాం, మహేశ్, మురళి లు అమరులైనప్పుడు గావచ్చు, ఇటీవల కామ్రేడ్స్ ఆజాద్, కిషన్‌జీ లను మేం కోల్పోయినప్పుడు గావచ్చు – మీరు మాకు మీ చేయూతనందించారు. వారంతా మా విప్లవపు గొప్ప నాయకులు. వీరందరినీ సామ్రాజ్యవాదుల మద్దతుతో భారత పాలకవర్గాలు దారుణంగా హత్య చేశాయి. “భారతదేశంలో మావోయిస్టుల పోరాటం మన పోరాటం, వారికి జరిగిన నష్టం మనకు జరిగిన నష్టం” అంటూ మీరు వక్కాణించడం మా హృదయాలలో అంతర్జాతీయతావాదంతో కూడిన సాంత్వనను నింపింది. మా దు:ఖాన్ని అధిగమించి మొక్కవోని దీక్షతో పురోగమించడానికి ఇది ఎంతో అవసరమైనది.

ప్రపంచవ్యాప్త విప్లవాల్లోనూ, భారతదేశ విప్లవంలోనూ అమరులైనవారందరినీ గౌరవించే మార్గం ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్ని తీవ్రతరం చేయడంలో భాగంగా భారతదేశంలోని ప్రజాయుద్ధానికి మద్దతును రెట్టింపు చేస్తూ కార్మికవర్గ అంతర్జాతీయత కోసం కృషి చేయడం అని మీరు సరిగా పేర్కొన్నారు. మీరు నిర్ధారించినట్టే హాంబర్గ్ కాన్ఫరెన్స్ మీ నిబద్ధతను నెరవేర్చడంలో మరో ముందడుగుగా ఉండిందని మేమూ విశ్వసిస్తున్నాం.

భారత ప్రభుత్వం దాని ప్రజలపై చేపట్టిన యుద్ధాన్ని మీరు న్యాయమైన ఆగ్రహంతో నిరంతరాయంగా ఖండిస్తూ, నిరసిస్తూ, దానిని తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. వివిధ పార్టీలూ, సంస్థలూ, వ్యక్తులూ, వివిధ దేశాల కార్మికవర్గం, ప్రజలూ వ్యక్తం చేస్తున్న ఈ అంతర్జాతీయ సంఘీభావాన్ని విప్లవోద్యమ ప్రాంతాల ప్రజలు మన:స్ఫూర్తిగా గుర్తు చేసుకుంటున్నారు. ఎందుకంటే ఎవరైనాగానీ ప్రజల ఏ సిసలైన ఉద్యమానికైనా అందించాల్సింది సరిగ్గా ఇలాంటి మద్దతునే.

భారతదేశంలోని ప్రజాయుద్ధానికి మద్దతుగా మీరు ప్రపంచవ్యాప్త క్యాంపెయిన్ లను, ప్రత్యేకించి సామ్రాజ్యవాద భూతం నడిగడ్డనే చేపట్టారు. ఈ దేశాలన్నీ మీలోని అధికశాతం మంది విప్లవ కృషి కొనసాగిస్తున్న దేశాలు. దీని ప్రాధాన్యతను ప్రపంచ విప్లవ తుఫాను కేంద్రాల్లో ఒకటైన మా దేశంలోని పోరాడే ప్రజలూ, మేమూ ఎంతగానో గుర్తిస్తున్నాం.

మీరు అందిస్తున్న ఈ మద్దతునూ, సంఘీభావాన్నీ మేం ఎంతో విలువైనదిగా భావిస్తూ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇతర పోరాడే పార్టీలకూ, సంస్థలకూ, ప్రజలకూ సరిగా ఇలాంటి మద్దతునూ, సంఘీభావాన్నీ మా వంతుగా అందిస్తామని దృఢంగా వక్కాణిస్తున్నాం. ఇటువంటి సంఘీభావం, తాము ఒంటరిగా పోరాడడం లేదనే గొప్ప ఆత్మవిశ్వాసాన్నీ, హామీనీ పోరాడే ప్రజలకు కలిగిస్తుంది. అది మనందరం ఎదుర్కొంటున్న ఉమ్మడి శత్రువును, అంటే సామ్రాజ్యవాదులనూ, వారి కీలుబొమ్మలూ/తైనాతీలనూ, ప్రపంచవ్యాప్తంగా

వున్న అన్ని రకాల విప్లవ ప్రతీఘాతకులనూ మరోసారి సూటిగా ఎత్తిచూపిస్తుంది. అది ప్రజల, బలగాల పోరాటదీక్షను పెంపొందించి దృఢంగా ఉద్యమాన్ని పురోగమింపజేయడానికి వారికి దోహదపడుతుంది. మా పార్టీ, పీఎల్‌జీఏ, ఆర్పీసీలు, విప్లవ ప్రజాసంఘాలు, విప్లవ ప్రజానీకం, మా దేశంలోని అన్ని పురోగామి, ప్రజాస్వామిక శక్తులూ సరిగ్గా ఇలాంటి ఐక్యతనూ, సంఘీభావాన్నే దేశంలోనూ, అంతర్జాతీయ స్థాయిలోనూ కోరుకుంటున్నారు. ప్రజాయుద్ధాన్ని పరిరక్షించుకుంటూ పురోగమింపజేయడంలో ఇది ఎంతో ముఖ్యమైనది.

భారతదేశంలో కొనసాగుతున్న ప్రజాయుద్ధానికి సంఘీభావాన్ని ప్రకటించిన ప్రతి పార్టీ, సంస్థ ఈ కర్తవ్యాన్ని తమ తమ దేశాల్లోని విప్లవాల సందర్భంలోనే కాక, ఇతర విప్లవాలకు సంఘీభావాన్ని ప్రకటించే సందర్భాల్లో కూడా అత్యంత ప్రముఖమైనదిగా గుర్తించారు. తమ, తమ దేశాల్లోని విప్లవాన్ని పురోగమింపజేయడమే ఇతర దేశాల్లో జరుగుతున్న అలాంటి విప్లవాలకు సంఘీభావం ప్రకటించే అత్యుత్తమ మార్గం అనే స్పిరిట్ ఈ కాన్ఫరెన్స్ లో అత్యంత ప్రస్ఫుటంగా వ్యక్తమైంది. మాకు దీనితో సంపూర్ణంగా ఏకీభావం వుంది. భారతదేశంలోని మావోయిస్టులమైన మేం కూడా ఇదే స్పిరిట్ తో పని చేస్తున్నాం. సిసలైన విప్లవకారుల నేతృత్వంలో నడిచిన నక్సల్బరీ సాయుధ రైతాంగ తిరుగుబాటు కాలం నుండి కూడా మా ఆచరణకు ఇది కొండగుర్తుగా ఉండింది.

నక్సల్బరీ వారసత్వాన్ని ముందుకు కొనిపోతున్న మా పార్టీ మేం కొనసాగిస్తున్న నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని ప్రపంచ సోషలిస్టు విప్లవంలో అంతర్భాగంగానూ, మా పార్టీని ప్రపంచ కార్మికవర్గ అగ్రగామిలో అంటే కమ్యూనిస్టు పార్టీలో ఒక విభాగంగానూ, పీఎల్‌జీఏ ని ప్రపంచ కార్మికవర్గ సైన్యంలో ఒక డిటాచ్‌మెంట్ గానూ, ఇక్కడ మేం స్థాపిస్తున్న విప్లవ ప్రజా కమిటీలను ప్రపంచ కార్మికవర్గ నియంతృత్వంలో లేదా ప్రపంచ సోషలిస్టు రాజ్యంలో ఒక విడదీయరాని భాగంగానూ ఎల్లప్పుడూ భావిస్తూ వస్తోంది. మా విప్లవంలో ప్రజలూ, కామ్రేడ్సూ చేస్తున్న విలువైన, ఊహకందని త్యాగాలు ప్రతి ఒక్క దేశంలోనూ అసంఖ్యాకమైన ప్రపంచ సోషలిస్టు విప్లవ అమరవీరులు చేసిన గొప్ప త్యాగాల్లో అంతర్భాగం. ఈ అవగాహనతోనే నక్సల్బరీ నాటి నుండి పని చేస్తూ వచ్చిన భారతదేశంలోని వేర్వేరు సిసలైన విప్లవ ప్రవంతులు ఇతర దేశాల్లో కొనసాగుతుండిన విప్లవాలకూ, ప్రజా ఉద్యమాలకూ మద్దతుగా సంఘీభావ క్యాంపెయిన్ లను చేపడ్తూ వచ్చాయి. వీటిలో అత్యంత ప్రముఖమైనవి వియత్నాం, లావోస్, కంపూచియాలలోని విప్లవాలకూ, పాలస్తీనా, శ్రీలంక తమిళులు మొదలైనవారి జాతి విముక్తి పోరాటాలకూ, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ వంటి దేశాల ప్రజా ప్రతిఘటనలకూ మద్దతుగా చేపట్టినవి. మా సంఘీభావ క్యాంపెయిన్ లలో ఇటీవలిది 2013 ఏప్రిల్ 22 నుండి 28 వరకూ ఫిలిప్పీన్స్ నూతన ప్రజాస్వామిక విప్లవానికి మద్దతుగా మా పార్టీ చేపట్టిన సంఘీభావ క్యాంపెయిన్.

ఇటువంటి సంఘీభావ క్యాంపెయిన్ లు ఆయా విప్లవోద్యమాల పురోగమనం నుండే బలాన్ని పొంది నిలకడగా సాగుతాయనీ, అలాగే ఆ విప్లవోద్యమాలు ఇటువంటి సంఘీభావ క్యాంపెయిన్ ల నుండి అత్యావశ్యకమైన నైతిక, భౌతిక బలాన్నీ పొందగల్గుతాయనీ మా పార్టీ విశ్వసిస్తున్నది. వాటి మధ్యనున్న అంతర్ సంబంధాన్ని నేడు నెలకొన్న ప్రపంచ పరిస్థితుల్లో విప్లవకారులందరూ గుర్తించాలి. ఆ గుర్తింపు వల్లే హాంబర్గ్ కాన్ఫరెన్స్ ఆ దిశగా సరైన అడుగులు వేయగల్గిందని మాకు అవగతమైంది.

'ప్రజలపై యుద్ధం'గా అత్యంత సరిగ్గా అభివర్ణించబడిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరిట భారత పాలకవర్గాలు చేపట్టిన దేశవ్యాప్త బహుముఖ దాడి, దానిలో భాగంగా ప్రతీఘాతుక కేంద్ర, రాష్ట్ర కిరాయి సాయుధ బలగాలు చేసిన అసంఖ్యాకమైన పాశవిక అత్యాచారాలూ భారతదేశంలోనూ, ప్రపంచంలోనూ కూడా విభిన్న ప్రాపంచిక దృక్పథాలు గల అనేక వర్గాల, సెక్షన్ల విశాల ప్రజానీకాన్ని ఆగ్రహోదగ్రులను చేసింది. తక్షణం అది పెద్దెత్తున నిరసనలకూ, దాని తక్షణ ఉపసంహరణను డిమాండ్ చేయడానికీ దారితీసింది. విప్లవ, ప్రజాస్వామిక, పురోగామి శక్తులు భారతదేశ పోరాడే ప్రజలకు మద్దతుగా దేశంలోనూ, అంతర్జాతీయంగానూ అంతర్జాతీయ క్యాంపెయిన్ లు నిర్మించడానికీ, దాడిని ఆపమని భారత ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికీ నిరంతరాయంగా కృషి చేశాయి. ప్రపంచవ్యాప్త కమ్యూనిస్టు విప్లవ శక్తులు కూడా భారతదేశంలోని ప్రజాయుద్ధానికి ఒక అంతర్జాతీయ సంఘీభావ ఉద్యమాన్ని నిర్మించడానికి సరైన విధంగా చొరవను చూపాయి. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను నిలిపివేయడానికి తీసుకున్న క్యాంపెయిన్, భారతదేశంలో ప్రజాయుద్ధానికి మద్దతుగా నిర్మిస్తున్న సంఘీభావ ఉద్యమం పరస్పర పూరకాలుగా ఉంటాయి. భారత విప్లవానికి మద్దతుగా నిర్మిస్తున్న ఉద్యమంలో ఆపరేషన్ గ్రీన్‌హంట్ వ్యతిరేక కార్యక్రమాలు విడదీయరాని భాగం కావాలి. ఎందుకంటే శత్రువు చేపట్టిన దేశవ్యాప్త బహుముఖ దాడిని ఓడించడం మన ముందు తక్షణ కర్తవ్యంగా ఉంది. భారతదేశంలోని ప్రజాయుద్ధానికి మద్దతుగా నిలుస్తున్న కమ్యూనిస్టు శక్తులు ఆపరేషన్ గ్రీన్‌హంట్ వ్యతిరేక క్యాంపెయిన్ ను బలోపేతం చేయడానికీ, నిర్మాణక్రమంలో ఉన్న విశాలమైన ప్రపంచవ్యాప్త సామ్రాజ్యవాద వ్యతిరేక ఫ్రంట్ ను బలోపేతం చేసే దృష్టితోనూ సాధ్యమైనంత విశాలమైన ప్రాతిపదికన సామ్రాజ్యవాద వ్యతిరేక, ప్రజాస్వామిక, విప్లవ శక్తులను సమీకరించడానికి కృషి చేయడం ఈనాటి అవసరం అని మా పార్టీ విశ్వసిస్తున్నది. ప్రపంచవ్యాప్త కమ్యూనిస్టు శక్తులు మరింత బలోపేతం కావడం అనేది భారత విప్లవం కూడా మరింత బలమైన మద్దతును పొందడానికి దారి తీస్తుంది.

సామ్రాజ్యవాదం ఇప్పటిదాకా దాని చరిత్రలోకెల్లా అత్యంత తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. మరోవైపు కార్మికవర్గ పోరాటాలూ, ఇతర పీడిత వర్గాల, సెక్షన్ల ప్రజల పోరాటాలు, జాతి విముక్తి పోరాటాలు, అర్ధ-వలస, అర్ధ-భూస్వామ్య దేశాల్లోని ప్రజాయుద్ధాలూ పెంపొందుతున్నాయి. ప్రపంచ సోషలిస్టు విప్లవంలో రెండు ప్రవంతులైన అర్ధ-వలస, అర్ధ-భూస్వామ్య లేదా నయావలస దేశాల్లోని నూతన ప్రజాస్వామిక విప్లవాలూ, పెట్టుబడిదారీ-సామ్రాజ్యవాద దేశాల్లోని సోషలిస్టు విప్లవాలూ వివిధ స్థాయిల్లో పురోగమిస్తున్నాయి. మార్క్సిజం-లెనినిజం-మావోయిజాన్ని తమ మార్గదర్శక సిద్ధాంతంగా రోజురోజుకూ మరింతమంది ప్రజలు స్వీకరిస్తున్నారు. సామ్రాజ్యవాదులూ, వెనుకబడిన దేశాల్లోని వారి తైనాతీ/కీలుబొమ్మ పాలకులూ, అన్ని రకాల విప్లవ ప్రతీఘాతుకులూ ప్రపంచంలోని పీడిత ప్రజల, జాతుల ఉమ్మడి శత్రువులనే విషయాన్ని ప్రజలు మరింతగా గ్రహిస్తున్నారు. అందుకని వారు పోరాట శ్రేణుల్లోకి మరింత

పెద్ద సంఖ్యలో వచ్చి చేరుతున్నారు. ప్రపంచంలోని అన్ని మౌలిక వైరుధ్యాలూ, ప్రతి దేశంలో అంతర్గతంగా ఉన్న మౌలిక వైరుధ్యాలూ రోజురోజుకూ పదునెక్కుతూ తీవ్రతరమవుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, ప్రపంచ పరిస్థితి విప్లవానికి అత్యద్భుతంగా ఉన్నది. అందుకని ప్రపంచంలో ఎల్లెడలా కమ్యూనిస్టుల ముందున్న అత్యంత ప్రముఖమైన కర్తవ్యం – పీడిత ప్రజలను రాజకీయంగా సమీకరించి సంఘటితపరచడానికీ, స్వీయాత్మకమైన శక్తులను బలోపేతం చేయడానికీ ఈ అద్భుతమైన పరిస్థితిని అత్యంత ప్రతిభావంతంగా వినియోగించుకోవడం. ఎందుకంటే ఒక బలమైన కార్మికవర్గ పార్టీ, సంఘటిత ప్రజానీకం మాత్రమే విప్లవాన్ని విజయవంతం చేయగలవు.

ప్రపంచ పెట్టుబడిదారీ విధానం నానాటికీ మరింత లోతుగా కూరుకుపోతున్న నేటి ఆర్థిక సంక్షోభం పెట్టుబడిదారీ విధానంలోని అంతర్గత వైరుధ్యాలను మొత్తంగా తీవ్రతరం చేస్తూ బ్రహ్మాండమైన ప్రజా ఉద్యమాలకూ, తిరుగుబాట్లకూ, విప్లవాలకూ దారి తీస్తోంది. మన మహోపాధ్యాయుడు లెనిన్ విశ్లేషించినట్టుగా సామ్రాజ్యవాదం ఇప్పటికే మరణశయ్య మీద ఉన్నది. ప్రస్తుత సంక్షోభం ఆ వాస్తవాన్ని మరింత కొట్టొచ్చేటట్టుగా నిరూపిస్తోంది. అసమానతలుండే పెట్టుబడిదారీ ప్రపంచంలో, సంక్షోభం కూడా వివిధ దేశాల్లో అసమానంగానే వ్యక్తీకరించబడుతుంది. అందుకని మన కమ్యూనిస్టులం విశ్వజనీన సిద్ధాంతాన్ని, అంటే మార్క్సిజం–లెనినిజం–మావోయిజాన్ని మన, మన దేశాల్లోని నిర్దిష్ట ఆచరణకు అన్వయించాలి. మన విప్లవాలను విజయవంతం చేయాలంటే మన సన్నాహాలు లేదా ఆచరణ కూడా అందుకు అనుగుణంగా వుండాలి. మీరందరూ సరిగా ఎత్తిచూపినట్టే, పెట్టుబడిదారీ దేశాల్లో కార్మిక, విద్యార్థి, యువజన, మహిళా మొదలైన ఉద్యమాలను పెంపొందించాలి. అలాగే ప్రతి కార్మికవర్గ పార్టీకీ ఇతర దేశాల్లోని ప్రజాయుద్ధాలకు మద్దతు నివ్వడం విడదీయలేని అత్యంత ప్రముఖమైన అంతర్జాతీయ కర్తవ్యంగా ఉంటుంది.

ఈ కాన్ఫరెన్సును ఆర్గనైజ్ చేయడానికి చొరవ చూపి, దానిని విజయవంతం గావించిన అన్ని సోదర పార్టీలు, సంస్థలు మాపై ఉంచిన గొప్ప విశ్వాసానికి స్పందనగా – మేం తీవ్రమైన ఉన్నత స్థాయి నష్టాలూ, కొన్ని ప్రాంతాలను కోల్పోవడం వంటివి జరిగినా ప్రపంచ సోషలిస్టు విప్లవ అమరవీరుల కలలను సాకారం చేయడానికి భారతదేశ విప్లవాన్ని నిలబెట్టి, బలోపేతం చేసి పురోగమింపజేస్తామని మరోసారి ప్రతిన బూనుతున్నాం.

ఈ అంతర్జాతీయ కాన్ఫరెన్సు సామ్రాజ్యవాదానికీ, భారత పాలకవర్గాలకూ చెంపపెట్టుగా ఉంటూనే, మరోవైపు భారతదేశంలోని నూతన ప్రజాస్వామిక విప్లవం పట్లా, ప్రపంచ సోషలిస్టు విప్లవం పట్లా విశాల కార్మికవర్గ, పీడిత తాడిత ప్రజారాశులలో గొప్ప ఆశల్ని పెంపొందిస్తుంది. ఈ నేపథ్యంలో మేం మరోసారి మీ అందరి ముందూ ప్రపంచ సోషలిస్టు విప్లవ మహోన్నత అమరవీరుల అత్యున్నత ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిన బూనుతున్నాం. అత్యంత కష్టభూయిష్టమైన, దీర్ఘమైన, మలుపులూ, వంకలూ గల మార్గం గుండా పయనిస్తున్న మా పార్టీ, భారత విప్లవ ప్రజానీకాల పోరాట దీక్షను ఎలాంటి ఫాసిస్టు నిర్బంధాలూ అణచివేయలేవని ప్రకటిస్తున్నాం. అన్ని రకాల ఇక్కట్లనూ రెట్టించిన దృఢనిశ్చయంతో అధిగమిస్తూ, త్యాగాలను చేస్తూ మేం అంతిమ విజయం సాధించేవరకూ ముందుకే పయనిస్తాం. ఇది అంతర్జాతీయ కార్మికవర్గానికీ, భారత విప్లవ స్నేహితులూ, శ్రేయోభిలాషులందరికీ మా వాగ్దానం.

- *కార్మికవర్గ అంతర్జాతీయత వర్ధిల్లాలి!*
- *ప్రపంచవ్యాప్త అంతర్జాతీయ కార్మికవర్గ, విప్లవ, ప్రజాస్వామిక శక్తుల, పీడిత జాతుల, ప్రజల ఐక్యత వర్ధిల్లాలి!*

విప్లవాభివందనాలతో

గణపతి

ప్రధాన కార్యదర్శి

సి.పి.ఐ (మావోయిస్టు)

**'సర్వం ప్రజల కోసమే' అను సూత్రం, 'ప్రజలకు బాధ్యత వహించాలనే ' సూత్రం 'ప్రజల శక్తిలో విశ్వాసం వుంచాలనే' సూత్రం, 'ప్రజల నుంచి నేర్చుకోవాలనే ' సూత్రం - ఈ నాలుగు మన ప్రజా పంథా సూత్రాలు. అగ్రగామి దళం ప్రజల విషయంలో పాటించవలసిన సూత్రాలు ఇవి. ఇట్టి ఖచ్చితమైన సూత్రాలతోనే మన కామ్రేడ్స్ తమ కార్యకలాపాలలో నాయకత్వం వహించడంలోనూ స్పష్టమైన ప్రజాపంథా అలవర్చుకోగల్గుతారు'**

**- (సి.పి.సి 7వ కాంగ్రెస్‌లో ప్రవేశ పెట్టబడిన నిర్మాణం నుండి)**

# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## ఆంధ్రా - ఒడిశా సరిహద్దు ప్రాంత కమిటీ

### నల్లమలలో ఎదురు కాల్పులు బూటకం. పోలీసుల కోవర్టు చర్యలో కామ్రేడ్ అశోక్, కా॥ భారతి, కా॥ విమలలు మృతి చెందారు. మృతులైన ముగ్గురు కామ్రేడ్స్‌కు ఎ.ఒ.బి ఎస్.జడ్.సి విప్లవ జోహార్లు తెలియచేస్తున్నది!

జూన్ 1,గురువారం నాడు ప్రకాశం, గుంటూరు, మహబూబ్‌నగర్ జిల్లాల సరిహద్దు ప్రాంతం, కృష్ణానది ఒడ్డున ఉన్న పాలుట్ల సమీపంలోని మురారికురవ వాగు వద్ద పోలీసులతో జరిగిన ఎదురు కాల్పులలో అశోక్, భారతి, విమలలు చనిపోయారనీ, శ్రీనివాస్ అలియాస్ విక్రమ్ గాయాలతో తప్పించుకున్నాడని గుంటూరు ఐ.జి సునీల్ కుమార్ విలేఖరులతో చెప్పాడు. సంఘటన స్థలంలో ఎ.కె 47, ఎస్.ఎల్.ఆర్, 302 రైఫిల్ దొరికినట్లు ప్రకటించాడు.

మొదటగా ఐ.జి సునీల్ కుమార్ చేసిన ప్రకటన పచ్చి అబద్ధమని తెలియజేస్తున్నాం. నల్లమలలో ఎదురు కాల్పులు జరగలేదు. జరిగింది బూటకపు ఎదురు కాల్పులు మాత్రమే. పోలీసులు మోసపూరితంగా ఆ ముగ్గురు కామ్రేడ్స్‌ను పట్టుకొని ఘోరంగా చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారు. వాస్తవంగా ఆ కామ్రేడ్స్ వద్ద ఎ.కె, ఎస్.ఎల్.ఆర్ లాంటి ఆటో, సెమి ఆటో రైఫిల్స్ లేవు. చనిపోయిన తరువాత ఎ.కె, ఎస్.ఎల్.ఆర్‌లు వారి వద్ద ఉండటమంటే అవి పోలీసులు పెట్టినవే. పోలీసులు పారిపోయాడని చెప్తున్న నాలుగవ వ్యక్తి విక్రమ్ విషయం సందేహాస్పదంగా వుంది. ఆయన గతంలో మహబూబ్‌నగర్ జిల్లాలో పార్టీ పనిచేసినప్పటికీ, అరెస్టు అయి పోలీసు ఏజెంట్‌గా మారాడని భావిస్తున్నాం. ఇతడి ద్వారానే పోలీసులు కోవర్టు చర్యకు పాల్పడి వుండవచ్చునని భావిస్తున్నాము.

మేము చెప్తున్న విషయాలు వాస్తవాలేనని నిరూపించేందుకు మరి కొన్ని విషయాలను ప్రజలముందుంచుతున్నాము. 2006లో పార్టీ నల్లమలలో బలహీనపడి ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసింది. అయితే ఆ సమయంలో కా॥ బాబురావు (అశోక్) నల్లమలను వదిలి వచ్చేందుకు సిద్ధపడలేదు. అక్కడే చెంచు ఆదివాసీల జీవితాలలో మార్పు తెచ్చేందుకు కృషి చేస్తూ, పార్టీ తిరిగి వచ్చే లోపు ప్రజలలో పార్టీకి పునాదులు ఏర్పరుస్తానని మాట్లాడాడు. పార్టీ ఎత్తుగడల అవసరాల గురించి చర్చించినప్పటికీ, అక్కడి ప్రజలతో ఆయనకున్న అవినాభావ సంబంధం రీత్యా వాళ్ళను వదిలి రావడాన్ని సెంటిమెంటల్‌గా తీసుకొన్నాడు. చివరికి అక్కడే ఉండిపోవడానికి నిశ్చయించుకొన్నాడు. ఆయనతో పాటు ఆయన సహచరి కా॥ భారతి మరో కా॥ విమల ఒక టీంగా అక్కడే ఉండిపోయారు. ఆ నాటికి వారి వద్ద 303 రైఫిల్స్ మాత్రమే ఉన్నాయి. అవి కూడా తమ ఆత్మరక్షణ కోసమే వుంచుకొన్నారు.

అప్పటినుండి గడిచిన 8 సంవత్సరాలుగా వారు చెంచు ఆదివాసీ ప్రజల సమస్యలను పట్టించుకొంటూ, ప్రజలను జాగృతం చేసే కార్యక్రమాన్ని మాత్రమే చేపట్టారు. ఈ కాలంలో చిన్న పాటి గెరిల్లా చర్య కూడా చేపట్టలేదు. అయితే ప్రజలను జాగృతం చేస్తే కూడా దోపిడీ వర్గాలకూ, వారి కావలి కుక్కలైన పోలీసులకు గిట్టదనీ, వారి నుండి దాడులుంటాయని భావించిన ఈ టీం కామ్రేడ్స్ అత్యంత రహస్యంగా ఉంటూనే, తమ ఆత్మ రక్షణ కోసం 303 రైఫిల్, తపంచా వంటి ఆయుధాలు పట్టుకొని తిరుగుతున్నారు. ఈ టీంలోకి 4వ వ్యక్తి ఎప్పుడు వచ్చాడు? పోలీసులు ఇంత అకస్మాత్తుగా ఈ కోవర్టు ఆపరేషన్‌ను ఎందుకు నిర్వహించారు? ఈ ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే మారిన రాజకీయ పరిణామాలలో చూడాల్సి ఉంటుంది.

చంద్రబాబు అధికారంలోకి వస్తూనే నక్సలైట్లను అణచివేయడం, ప్రపంచ బ్యాంకు అభివృద్ధి నమూనాను అడ్డూ అదుపు లేకుండా అమలు చేయడం అనే తన పాత ఎజెండాను అమలు చేసేందుకు సమాయత్తం అయినాడు. ఈ విధాన పరమైన నిర్ణయంలో భాగంగానే నల్లమలలో పోలీసులు ఒక కుట్ర పూరిత పథకం ప్రకారం దాడి చేసి ముగ్గురు కామ్రేడ్స్‌ను హత్య చేసారు. చంద్రబాబు ప్రభుత్వం చేసిన ఈ హత్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ హత్యలను ఖండించమని ప్రజాస్వామిక వాదులకు, మేధావులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

పోలీసులు ఒక వైపున అత్యంత కిరాతకంగా మా ముగ్గురు కామ్రేడ్స్‌ను హత్యగావించి దానిపై బూటకపు ప్రచారం చేస్తుంటే, మరోవైపు హోం మంత్రి చిన్న రాజప్ప శాంతి చర్చలకు పిలుపు నిస్తున్నాడు.జన జీవన స్రవంతిలో కలసిపోవాలని ఆదేశిస్తున్నాడు.ఈ పిలుపులు, ఆదేశాలు రాష్ట్రంలోని శ్రామిక ప్రజలకు వారికి నాయకత్వం వహిస్తున్న సి.పి.ఐ మావోయిస్టు పార్టీకి బెదిరింపుగానే భావిస్తున్నాం.

ఇటువంటి బెదిరింపులను శ్రామిక ప్రజలు వారికి నాయకత్వం వహిస్తున్న మా పార్టీ ఏ మాత్రం లెక్క చేయరనీ, వర్గ పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తూ అమరులైన వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని తెలియజేస్తూ ఈ హత్యలకు కారకులైన తెలుగుదేశం నాయకులు తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నాం. చంద్రబాబు ప్రభుత్వం ఫాసిస్టు చర్యలను ఖండించవల్సిందిగా ప్రజలను, ప్రజాస్వామిక వాదులను విజ్ఞప్తి చేస్తున్నాం.

**చంద్రమౌళి**

**సెక్రటరీ**

**సి.పి.ఐ (మావోయిస్టు)**

23-6-2014 **ఎ.ఒ.బి స్పెషల్ జోనల్ కమిటీ**

అమరుల చరిత్ర

# మన్నెం ప్రజలకు పున్నమి చంద్రుడై దోపిడీ పాలకవర్గాలకు అల్లూరి వారసుడై అజరామరంగా నిలిచిపోయిన కా॥ శరత్ అమర్ రహే !




బలమైన వర్గ పోరాటం వున్న చోట నిజమైన కార్మికవర్గ నాయకత్వం ఏర్పడుతుంది. నిజమైన కార్మికవర్గ నాయకత్వం ఏర్పడిన చోట వర్గపోరాటం మరింతగా సంఘటిత పడి విస్తృతమవుతుంది. ఈ గతితార్కిక సంబంధాన్ని కన్నవరానికి, శరత్‌కు మధ్య అన్వయించుకోవచ్చు. కన్నవరం ప్రాంతంలో రాజ్యాన్ని సవాలు చేస్తూ ప్రజలు నిర్వహించిన వీరోచిత వర్గపోరాటం గొప్ప విప్లవ నాయకుడిగా శరత్‌కు జన్మనిస్తే, శరత్ నాయకత్వంలో కన్నవరం ప్రాంత ప్రజలు సాయుధ వర్గపోరాటాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్ళి విప్లవ ప్రజాకమిటీని నిర్మించుకున్నారు. ఈ మొత్తం క్రమంలో శరత్ విప్లవ ప్రస్థానం నల్లేరు మీద బండిలా సాఫీగా సాగలేదు. కుటుంబం రూపంలో కష్టాలు, కన్నీళ్ళు ఆయన్ని వెనక్కు లాగుతుంటే, ప్రజల వేదనలు, ఆకాంక్షలు విప్లవ మార్గం వైపు నడిపించాయి. పేదరికం, నిరక్షరాస్యత, వెనుకబాటుతనం తనలోని విప్లవ సామర్థ్యానికి పరిమితులేర్పరుస్తుంటే, వర్గపోరాట కార్యాచరణ, కార్మికవర్గ రాజకీయాలు ఆయనలో పురోగామి భావాలను పెంపొందించడమే కాకుండా గొప్ప సమర్థత గల విప్లవ నాయకునిగా తయారుచేసాయి. ఇక రాజ్యం దాని కిరాయి హంతక మూకలైన ఎస్ఐబి, గ్రేహౌండ్స్ పోలీసు బలగాలు ప్రారంభం నుండి శరత్‌ను నిర్మూలించాలని తీవ్రంగా ప్రయత్నించాయి. శరత్‌ను లొంగదీయటమో లేదా చంపటమో లక్ష్యంగా చేసుకుని పని చేసేందుకు ప్రభుత్వం మోసకారి, క్రూరుడు అయిన పోలీసు అధికారి వెంకట్రావును ప్రత్యేకంగా కేంద్రీకరింప చేసింది. ఈ బహుముఖ దాడి సైతం శరత్ ఉద్యమ సంకల్పాన్ని వీసమెత్తు కూడా కదిలించలేక పోయింది. ఆయన ప్రజలతో తాదాత్మ్యం చెందితే, ప్రజలు ఉక్కుకోటలా మారి ఆయన్ని అనేక పోలీసు దాడుల నుండి రక్షించారు. రెండు దశాబ్ధాలుగా మెట్టు మెట్టుగా, కఠినమైన మలుపులతో కొనసాగిన ఈ విప్లవ ప్రస్థానం శరత్‌ను గొప్ప విప్లవ నాయకుడిగా ప్రజలకు అందించింది. అయితే రాజ్యంతో ప్రేరేపించబడి 'కల్కి భగవాన్‌ల' ముసుగులో వున్న విప్లవ ప్రతిఘాతుక ముఠా అక్టోబరు 19న శరత్‌ను ఒంటరి చేసి ఘోరంగా హత్య గావించారు. ఈ నష్టం మనకు వెంటనే కోలుకోలేనిదే.

**విప్లవ ప్రస్థానం :**

కా॥శరత్ అసలు పేరు సింధేరి చిన రంగారావు. విశాఖపట్నం జిల్లా కొయ్యూరు మండలం కన్నవరం గ్రామంలో కువ్వి తెగకు చెందిన దిగువస్థాయి మధ్య తరగతి కుటుంబంలో 35 ఏళ్ళ క్రితం జన్మించాడు. అతనికి భార్య, 5ఏళ్ళ కొడుకు ఉన్నాడు. కా॥శరత్ అన్నయ్య(కా॥జాంబ్రి-ప్రభాకర్) కూడా విప్లవోద్యమంలో పనిచేస్తూ అమరుడైనాడు. చాలా సహజంగానే శరత్‌పై అన్నయ్య ప్రభావం పడింది. మరొకపక్క ఈస్ట్ డివిజన్ ఉద్యమానికి కన్నవరం గ్రామం మొదటి నుండి ఆయువు పట్టుగా ఉండటం కూడా కా॥శరత్ విప్లవోద్యమం వైపు అడుగులు వేయడానికి దోహదపడింది. అలా చిన్నప్పటి నుండి విప్లవ కార్యచరణకు దగ్గరవుతూ క్రమంగా బాలల సంఘంలో చేరి పని చేసాడు. ఊరిలో బాలలందరిని సమీకరించి ఐక్యం చేయడం, పార్టీ గ్రామానికి వస్తే సహకరించడం వంటి కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనేవాడు. సభలు, సమావేశాలు, ప్రచార క్యాంపెయిన్లలో చురుగ్గా పాల్గొంటూ, తన రాజకీయ అవగాహనను విస్తృతం చేసుకున్నాడు.

తదనంతరం గ్రామ రక్షక దళం సభ్యుడయ్యి ప్రజలకు రక్షణ కల్పించడంలో, తెగ పెత్తందార్లను నిలదీయడంలో, చురుకైన పాత్ర పోషించాడు. ఆదివాసీ రైతాంగ పంటలకు, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలకై జరిగిన పోరాటాలకు నాయకత్వం వహించాడు.

జల్, జంగల్, జమీన్‌పై ఆధికారం కోసం ఆదివాసీలందర్ని ఒక్కటి చేసి కదిలించాడు. 1/70చట్టం అమలు కోసం బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా ఆదివాసీలను కదిలించాడు. దళాల్లోకి యువతీ-యువకులు రిక్రూట్ అవటాన్ని అడ్డుకుంటున్న తెగ పెత్తందార్ల కుటిల నీతిని ఎండగట్టి భర్తీని పెంచడంలో ఎనలేని కృషి చేసాడు.

2002లో శతృవు కన్నవరంపై దాడి చేసి కామ్రేడ్ శరత్‌ను ఆరెస్ట్ చేసాడు. ఇంటరాగేషన్ పేరుతో ఎన్ని చిత్రహింసలు పెట్టినా శరత్ దృఢంగా నిలిచి శత్రువుతో తలపడి నిలిచాడు. ఏనాడు శత్రువుకు భయపడలేదు, లొంగలేదు. అదే పోరాట పటిమను రెండున్నర సంవత్సరాల జైలు నిర్భంధంలో కూడా కొనసాగించాడు. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల(2004 చర్చల సమయంలో)లో జైలు నుండి విడుదల అయ్యాడు. ఆ తర్వాత అమరుల బంధు మిత్రుల సంఘంలో కొనసాగడమేకాక, ఇంకా తన విప్లవ కార్యచరణను మెరుగు పరుచుకుంటూ గ్రామ పార్టీ కమిటీ (జి.పి.సి) సభ్యుడిగా, సెక్రటరీగా, అనతి కాలంలోనే ఆర్.పి.సి అధ్యక్షునిగా కూడా క్రియాశీలకంగా పని చేస్తూ, ఆర్.పి.సి కర్తవ్యాలు అమలు చేయడంలో విశేష కృషి చేసాడు. ఆర్.పి.సి పరిధిలో భూమి లేని నిరుపేదలకు భూములు పంపిణీ చేయడం, వ్యవసాయంలో మెరుగుదల తీసుకురావడం, భూములకు సాగు నీరు అందించడం, ప్రజలకు త్రాగునీటి సౌకర్యం కల్పించడం వంటి అనేక మౌళిక సమస్యల పరిష్కారం కోసం ప్రజలను సమీకరించడం, చైతన్య పరచడం, సంఘటితం చేయడం, పరస్పరం సహకరించుకోవడం,

సమిష్టిగా కృషి చేయడం వంటి పద్ధతులను అమలు చేసాడు. ఒక మాటలో విప్లవ ప్రజా కార్యకలాపాల మెరుగుదల కోసం విసుగు, విరామం లేకుండా పని చేసాడు. ఆయన నిరంతర కృషి వల్ల ఆర్.పి.సిలు కొంత పుంజుకున్నాయి. ఈ స్థితి మారి మరింత మెరుగైన స్థితిలోకి వెళితే అది సత్ఫలితాలనిస్తుంది. కానీ దాన్ని మొగ్గలోనే తుంచేయడం ప్రభుత్వ లక్ష్యం. అందుకే కన్నవరం అర్.పి.సిని దెబ్బ తీయడంపై శత్రువు కేంద్రీకరణ బాగా పెంచాడు. ఆర్.పి.సి పరిధిలోని గ్రామాలపై దాడులు తీవ్రతరం చేసాడు. అక్రమ అరెస్టులు, బూటకపు సరెండర్లకు పాల్పడ్డాడు. 2007 సం॥లో కన్నవరం గ్రామ పొలిమేరలో ముగ్గురు మిలీషియా సభ్యులను శత్రువు కౄరంగా కాల్పులు జరిపి హత్య చేసాడు. ఇంకొక పక్క శతృవు శరత్ కుటుంబంపై తీవ్రమైన వత్తిడి తీసుకువచ్చాడు. శరత్ లొంగిపోవాలనీ, లేదంటే వాళ్ళ అన్నయ్య మాదిరి ఏదో ఒక రోజు తమ చేతిలో చావాల్సిందేననీ పదే పదే హెచ్చరికలు, నోటీసులు జారీ చేస్తూ వచ్చాడు. ఇటువంటి పరిస్థితుల్లో కూడా ఏ మాత్రం బెదరకుండా మొక్కవోని ధైర్యంతో నిర్బంధాలను ఎదుర్కొంటూ వచ్చాడు. ఒక సందర్భంలో కన్నవరం గ్రామంపై దాడి చేయడానికి శతృవు గ్రామ సమీపంలోని అడవిలో వచ్చి ఉన్నాడనే సమాచారం తెలిసి, గ్రామ మిలీషియాను కదిలించి, సాంప్రదాయక ఆయుధాలతో శతృవు మకాంపై ఆకస్మికంగా దాడి చేసాడు. శత్రువుకు ఊహించని ఘటన ఎదురు కావడంతో బెంబెలెత్తిపోయి పరుగులు తీసాడు. ఈ క్రమంలో ఒక ఇన్సాస్ మ్యాగ్జైన్‌ను మిలీషియా స్వాధీనం చేసుకుంది. ఇలాంటి అనేక మిలీషియా చర్యల్లో పాల్గొంటూ వాటికి నాయకత్వం వహించాడు.

2004 'శాంతి చర్చల' అనంతరం మునుపెన్నడు లేనంత స్థాయిలో ఫాసిస్టు నిర్బంధం తీవ్రతరం కావడంతో ఏరియాలో దళం ఎక్కడా కాలూనలేని పరిస్థితి నెలకొన్నది. అటువంటి పరిస్థితిలో ఏరియాలో ఉన్న మిలీషియాను వెంట బెట్టుకొని శతృ నిర్బంధం మధ్యనే ప్రజలను, ప్రజా సంఘాలను కలుస్తూ వారికి ధైర్యం చెబుతూ విప్లవోద్యమం వైపు నిలబెట్టడంలోనూ, ప్రజలనుండి గెరిల్లాలను వేరుచేసి దెబ్బతీయాలనే శతృ కుట్రలను ఓడించడంలోనూ అలుపెరుగని కృషి చేసాడు. గ్రామాల్లో శతృ ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేయడంలో చురుకైన పాత్ర వహించాడు. అదే విధంగా గ్రేహౌండ్స్ బలగాలకు కూంబింగ్ ఆపరేషన్లలో గైడ్‌గా పని చేస్తున్న హోంగార్డు బస్తుదు(బాలరాజు) ని ఖతం చేయడానికి తగిన పథకాన్ని రూపొందించి, విజయవంతం చేయడంలో ముఖ్య పాత్ర పోషించాడు. 2009లో జరిగిన డివిజన్ ప్లీనంలోనూ, కా॥శరత్ చురుకైన పాత్ర వహించాడు. ఆటు స్థితిలో ఉన్న ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడానికి చేయవలసిన కృషి గురించి విస్తృతంగా చర్చించాడు. ఇదే సమయంలో ఏరియాలో విప్లవోద్యమాన్ని నిర్మూలించే లక్ష్యంతో ప్రజల ప్రత్యామ్నాయ రాజ్యాధికార అంగాలైన విప్లవ ప్రజా కమిటీలను ధ్వంసం చేయడానికి ప్రభుత్వం కుట్రపూరితంగా అనేక పథకాలు రూపొందించింది. దీంట్లో భాగంగా కన్నవరం ఆర్.పి.సిని దెబ్బతీయడానికి పోలీసులు గ్రామంలో నెట్‌వర్కును ఏర్పరిచారు. అంతే కాకుండా విప్లవ ప్రజా కమిటీ అధ్యక్షురాలిని తమకు అనుకూలంగా మార్చుకొని, ఆమె ద్వారా మొత్తం ఆర్.పి.సి పరిధిలోని వారందరినీ లొంగిపోయేలా కుట్రలు పన్నారు. అలా ప్రజల ప్రత్యామ్నాయ రాజ్యాధికారం దెబ్బతిని పోవడానికి, ప్రజా సంఘాలు, మిలీషియా లొంగుబాట్లకు కారణమైన చిన్నక్క(ఆర్.పి.సి అధ్యక్షురాలు)ను ప్రజాకోర్టులో నిలదీయడంలో ఆమెకు ఏరియా బహిష్కరణ శిక్ష విధించడంలో కా॥శరత్ ముందున్నాడు. అలాగే శతృ ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌లో భాగంగా గ్రామంలో ఇన్‌ఫిల్ట్రేషన్ చేయబడ్డ బాత్రిని ఖతం చేయడంలో కీలక పాత్ర వహించాడు. తీవ్ర నిర్బందం మధ్యనే, దెబ్బతిన్న నిర్మాణాలను పునరుద్ధరించడానికి గాలికొండ ఏరియా వ్యాప్తంగా జరుగుతున్న కృషికి నాయకత్వం వహించాడు. నూతనంగా నిర్మాణాలు చేయడానికి కృషి చేసాడు. నిత్య నిర్బంధం మధ్యనే ప్రజలను కదిలించడానికి కృషి చేసాడు.

కా॥శరత్ తీవ్రమైన శతృ నిర్బంధాన్ని ఎదుర్కొంటూ, విప్లవోద్యమంలో పంతొమ్మిదేళ్ళ పాటు పని చేసి అంచెలంచెలుగా ఎదిగి అనేక బాధ్యతలు నిర్వహించాడు. 2000 నుండి 2008 వరకు గ్రామ పార్టీ సభ్యుడిగా, కార్యదర్శిగా పని చేసాడు. 2009లో ఏరియా కమిటీ సభ్యుడిగా ఎంపికై గాలికొండ ఉద్యమానికి నాయకత్వం వహించాడు. 2013లో జరిగిన ఈస్ట్ డివిజన్ ప్లీనంలో డివిజన్ కమిటీ సభ్యుడిగా ఎన్నుకోబడినాడు. ఈ ఎన్నిక తరువాత జిల్లా కమిటీలో సభ్యుడిగా వుంటూనే, మరోవైపు ఉద్యమ అవసరాల రీత్యా గాలికొండ ఏరియా కమిటీకి కూడా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాడు. కా॥శరత్ తన విప్లవ జీవితంలో ఎక్కువ కాలం గాలికొండ ప్రాంతంలో పని చేసాడు. ఈ ప్రాంతంలోని ప్రజలకు పిల్లల నుండి పెద్దల వరకూ అందరికీ సుపరిచితుడు. ఈ ప్రాంత ప్రజలపై, గ్రామాలపై, భౌగోళిక స్థితిగతులపై మంచిపట్టు ఉండేది. ఇటీవల కాలంలో విశాఖ జిల్లా గూడెం కొత్తవీధి మండలంలో ఎ.పి.ఎఫ్.డి.సి ఆధ్వర్యంలో ఉన్న కాఫీతోటల ఆక్రమణ స్వాధీన పోరాటంలో ప్రజలకు తోటలు పంచడంలో, ఈ పోరాటానికి వ్యతిరేకంగా నిలబడి పోలీసు బలగాల అండతో ప్రజలపై దాడులకు పాల్పడిన రేంజర్ మాధవరావు మజ్జిని ఖతం చేయడంలో ముందు పీఠిన నిలిచి నాయకత్వం వహించాడు. కాఫీ తోటల ఆక్రమణ స్వాధీన పోరాటంపై శతృ చేపట్టిన దుష్ప్రచారాన్ని ఎండగట్టడానికి ప్రజలను విస్తృతంగా కదిలించాడు.

విప్లవ యుద్ధాన్ని నడిపించే నాయకత్వానికి మిలటరీ పరిజ్ఞానం తప్పనిసరి. ఈ అవగాహనకు అనుగుణంగా తన మిలటరీ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి కా॥శరత్ 2013లో సెంట్రల్ మిలటరీ క్యాంపులో పాల్గొన్నాడు. అక్కడ పొందిన మిలటరీ పరిజ్ఞానాన్ని క్రింది క్యాడర్‌కి అందించడంలో భాగంగా 2013 ఆగస్టులో మల్కనగిరి, ఈస్ట్ డివిజన్ సంయుక్తంగా నిర్వహించిన మిలటరీ క్యాంపుకు ఇన్‌స్ట్రక్టర్‌గా మిలటరీ శిక్షణ అందించాడు. 2014లో ఈస్ట్ డివిజన్ క్యాడర్‌కు నిర్వహించిన మిలటరీ క్యాంపుకు కూడా ఇన్‌స్ట్రక్టర్‌గా బాధ్యతలు నిర్వహించాడు.

విప్లవ ప్రజా కమిటీలు నిర్మించి పని చేయించడంలో మన అనుభవాలు, గుణపాఠాలు చర్చించుకొని ఒక స్పష్టమైన అవగాహనతో పని చేయడానికి మన జోన్‌లో నిర్వహించిన ఆర్.పి.సి వర్కుషాపులో పాల్గొని విస్తృతంగా చర్చించాడు.

ఈ క్రమంలోనే కోరుకొండ ఏరియాలో జరుగుతున్న కాఫీ, బాక్సైట్ పోరాటాలకు అడ్డుగా వున్న సంజీవరావును ప్రజల డిమాండ్ మేరకు ఈస్ట్ డివిజన్ కమిటీ ఖతం చేయాలని తీర్మానించింది.

సంజీవరావు గత కొన్ని సంవత్సరాల నుండి కల్కిభగవాన్ మత ముసుగులో ఎస్ఐబి పోలీసులకు ఏజెంట్‌గా పని చేస్తూ వచ్చాడు. ఇతడిని పార్టీ, ప్రజలు అనేక మార్లు హెచ్చరించడంతో పాటు ప్రజాకోర్టులు నిర్వహించి శిక్షలు కూడా విధించారు. అయినా వీడు మారలేదు. పైగా వీడికి పై స్థాయిలో గురువుగా వున్న గుదలం వీధి సింహాచలం పర్యవేక్షణలో తమ విచ్చిన్న కార్యకలాపాలను తీవ్రతరం చేసారు. ఈ నేపథ్యంలోనే సంజీవరావును ఖతం చేయాలని డివిసి తీర్మానించింది. ఈ తీర్మానాన్ని అమలు చేయడంలో భాగంగా కా॥శరత్ మరో కామ్రేడ్ కలిసి సంజీవరావు బృందం ఆచూకీ తెలుసుకుని, వారిని అడ్డగించి సంజీవరావును ఖతం చేసి, ఆ బృందంలో వున్న సింహాచలాన్ని ప్రజల మధ్య పెట్టి తప్పులను ఒప్పించాలని కోరుకొండ సంతకు తీసుకెళ్ళారు. ఆ సమయానికి ప్రజలెవరు అక్కడ లేకపోవడంతో పాటు తనకు తగినంత రక్షణ లేదు. ఒక్క కామ్రేడ్‌నే తోడు తీసుకెళ్ళాడు. అయితే అప్పటికే సంజీవరావు చావు వార్త తెలిసిన వాడి ముఠా శరత్‌పై దాడి చేసేందుకు ఆయుధాలతో అక్కడికి చేరుకున్నారు. ఈ విషయాన్ని అర్థం చేసుకోలేక పోయిన శరత్ వచ్చిన వారు ఘర్షణకు దిగుతుంటే ప్రజలనే ఉద్దేశ్యంతో నచ్చచెప్పేందుకు ప్రయత్నిస్తూ వచ్చాడు. ఇదే అదనుగా వారు శరత్‌పై దాడి చేసి హత్య చేసారు. ఇదే సమయంలో అందుబాటులో ఉండి శరత్‌కు రక్షణ కల్పించేందుకు వచ్చిన కాఫీ ఆక్రమణ పోరాట కమిటీ అధ్యక్షుడు కా॥గణపతిని కూడా ఆ ముఠా హత్య చేసింది. మరో కామ్రేడ్ నాగేశ్వరరావును తీవ్రంగా గాయపరిచి చనిపోయాడని గడ్డ (వాగు)లో పారవేసారు.

ఇలా రాజకీయ నిజాయితీ, విప్లవ సమర్థతలు గల విప్లవ నేతను, మరీ ముఖ్యంగా అత్యంత వెనకబడిన ఆదివాసీ తెగ నుండి ఎదిగి వచ్చిన పీడిత వర్గం నేతను ఎ.ఒ.బి ఉద్యమం కోల్పోయింది. ఈ నష్టం వెంటనే పూడ్చుకోగలిగినది కాదు. కా॥శరత్‌లోని చురుకుదనాన్ని, పట్టుదలనూ, నిర్మాణ దక్షతనూ, సాహసాన్ని పుణికిపుచ్చుకోవడం ద్వారానే కా॥శరత్‌లేని లోటును పూడ్చుకోగలం. కా॥శరత్ తదితర ఎందరో అమరుల ఆశయాలను నెరవేర్చగలం. ఇదే కా॥శరత్‌కు మనం ఇచ్చే నిజమైన నివాళి. ఆయన స్వస్థలం కన్నవరంలో పెద్ద ఎత్తున ఆశయ దీక్షతో జరిగిన అంతిమ యాత్ర ఆయన స్ఫూర్తి కొనసాగుతుందని మరోకసారి రుజువు చేసింది.

# నల్లమల అమరులు కా॥ అశోక్, కా॥ భారతి, కా॥ విమలలకు విప్లవ జోహార్లు!

చంద్రబాబు తిరిగి అధికారంలోకి రాగానే బూటకపు ఎన్‌కౌంటర్లు ప్రారంభించాడు. 23-06-2014న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేపట్టిన రోజునే నల్లమలలో కా॥ అశోక్, కా॥ భారతి, కా॥ విమలలను తన ఫాసిస్టు పోలీసు మూకల ద్వారా హత్య గావించాడు. ఈ హత్యలు రాష్ట్రంలో ఫాసిస్టు పాలనతో పాటు విధ్వంసకర ప్రపంచ బ్యాంకు అభివృద్ధి నమూనాకు తెర లేపాయి.



కా॥ అశోక్ అసలు పేరు జానా బాబురావు. ఆయన స్వగ్రామం ప్రకాశం జిల్లా, పుల్లల చెరువు మండలంకు చెందిన వూట్లసంఘం. వాళ్ళు ప్రారంభంలో నెల్లూరు జిల్లా వాస్తవ్యులైనప్పటికీ, బ్రతుకుతెరువు పోరాటంలో నల్లమల అటవీ ప్రాంతమైన వూట్లసంఘానికి చేరారు. అశోక్ కుటుంబం అట్టడుగు యానాది ఆదివాసీ తెగకు చెందినది. దీంతో ఆయన కుటుంబం సమాజంలోని ఆధిపత్య వర్గాల, కులాల దోపిడీ, పీడనలకు గురవుతూ వచ్చింది. ఇటువంటి పరిస్థితులలోనే గుంటూరు జిల్లా పార్టీ నేతృత్వంలో 1980ల చివరన గెరిల్లా దళం ఆ ప్రాంతానికి వెళ్ళింది. ఆ దళానికి ప్రారంభంలోనే అశోక్ పరిచయమయ్యాడు. అప్పటినుండి ఆయన జీవితం క్రమంగా విప్లవం వైపు ఆకర్షించబడుతూ వచ్చింది. దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా, పీడిత వర్గం వైపు దృఢంగా నిలబడుతూ వచ్చాడు. పార్టీ కలిసే నాటికి అశోక్‌కు వివాహమైంది. అశోక్ సహచరి కూడా పార్టీ రాజకీయాలకు ప్రభావితమైంది. దీంతో వాళ్ళిద్దరూ గ్రామంలో పార్టీ కార్యకలాపాలకు కేంద్రమయ్యారు. ఆ సమయంలో పుల్లల చెరువు ఏరియాలో దళం ఆధారపడ దగిన ముఖ్యమైన కామ్రేడ్స్‌గా వీళ్ళను చెప్పుకోవచ్చు. అశోక్ పార్టీకి పరిచయమైంది మొదలు సొంత జీవితం కన్న విప్లవ కార్యకలాపాలకే అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చాడు. గ్రామంలో రైతు కూలీ సంఘం, మహిళా సంఘాల నేర్పరిచి అనేక కార్యక్రమాలు చేపట్టాడు. ప్రజలను విప్లవ రాజకీయాలతో చైతన్యపరుస్తూ, ప్రజల మధ్య వచ్చిన సమస్యలను పరిష్కరిస్తూ, వారిని సంఘటితం పరిచాడు. తన గ్రామానికి చుట్టూ వున్న అటవీ భూములను ఆక్రమించడంలో ప్రజలకు నాయకత్వం వహించాడు.

ఈ క్రమంలో పార్టీ అనేక ఒడిదుడుకుల మధ్య ఆ ప్రాంతానికి దళాన్ని పంపలేక పోయినప్పటికీ, అశోక్ ఆ ప్రాంత ప్రజలలో పార్టీనీ, విప్లవాన్నీ పదిలంగా కాపాడుతూ వచ్చాడు. 1990ల చివరలో పార్టీ పిలుపునందుకొని పూర్తికాలం కార్యకర్తగా భర్తీ అయ్యాడు. ఆ తదుపరి ఆయన సహచరితో పాటు పిల్లలు కూడా పార్టీ, పి.ఎల్.జి.ఎలలోకి భర్తీ అయ్యారు.

పార్టీలోకి పూర్తికాలం కార్యకర్తగా భర్తీ అయిన తర్వాత అశోక్ కార్యక్షేత్రం నల్లమల ప్రాంతం అయ్యింది. నల్లమల ప్రాంతంలో పని చేయడమంటే ఉన్నతమైన చైతన్యం అవసరం. నల్లమల అటవీ ప్రాంతం భౌగోళికంగా కఠినమైన పరిస్థితులతో కూడుకుని ఉన్న ప్రాంతం. ఆ ప్రాంతంలో కఠినమైన రాళ్ళతో కూడుకొని ఉన్న ఎత్తయిన కొండలతో ఒక్కోసారి గంటల తరబడి నడిచినా నీళ్ళు దొరకని పరిస్థితి ఉంటుంది. ఇక అక్కడ నివసించే చెంచు ఆదివాసీల పరిస్థితి దేశంలో ఏ ఆదివాసీ ప్రాంతంలో లేనంతా అధ్వాన్నంగా ఉంటుంది. ఒక కాలంలో చింతపండులో బూడిద కలుపుకొని వుండలు చేసి ఆహారంగా తీసుకుంటారు. ఇటువంటి పరిస్థితులున్న చోట నెగ్గుకు రావడం అంటే సాధారణమైన విషయమేమి కాదు. ఉన్నత చైతన్యం అవసరం. ఇటువంటి పరిస్థితులున్న చోట అశోక్ పార్టీ నాయకత్వానికి ఆధారపడ దగిన, నమ్మకమైన కామ్రేడ్‌గా పని చేసాడు.

1993, 94 సంవత్సరాలలో ప్రకాశం జిల్లా, పుల్లలచెరువు, ఎర్రగొండపాలెం, మండలాల్లో జరిగిన భూ ఆక్రమణ పోరాటాలలో ప్రజలను కదిలించాడు. గారపెంట, చెన్నాయిపాలెం, అక్కపాలెం, మర్రివేముల, మురికిమళ్ళ గ్రామాలలో ప్రజలకు భూములను పంచడంలో తనవంతు పాత్రను నిర్వహించాడు. ముఖ్యంగా ఆ కాలంలో జరిగిన పుల్లరి వ్యతిరేక పోరాటంలో గ్రామ గ్రామానికి తిరిగి మేకలు కొనుకొనే వారిని సంఘటిత పరిచి ఫారెస్టు వాళ్ళకు వ్యతిరేకంగా సంఘటిత పరిచాడు. 2000 సంవత్సరానికి ముందు చెంచు ఆదివాసీ రైతాంగాన్ని సంఘటిత పరిచేందుకు నిర్మించిన ప్రత్యేక దళంలో ఏరియా కమిటీ సభ్యుడిగానూ, డిప్యూటీ కమాండర్‌గానూ ఉంటూ ప్రత్యేక కృషి సల్పాడు. ముఖ్యంగా అంకమ్మగూడెం, అల్లిపాలెం, దద్దనాల, బిళ్ళగొంది, గుట్టలచేను, పాలుట్ల గ్రామాలలో విప్లవ సంస్కరణలు చేపట్టి ప్రజలకు అండగా నిలిచాడు. అశోక్ ఒక వైపున ప్రజలను విప్లవంలోకి సమీకరిస్తూనే సాహిత్య కృషి కూడా చేసాడు. తాను కొద్దిపాటిగా చదువుకున్నప్పటికీ, నిరంతరం అధ్యయనం చేస్తూ తన సిద్ధాంత, రాజకీయ జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకొన్నాడు. అమరులపై కవితలు, వివిధ సంఘటనలపై స్పందనలు రాసేవాడు.

ఇక ఆయన పని విధానానికి వస్తే పార్టీ ఇచ్చిన ఏ పనినైనా, ఏ సమయంలోనైనా, ఎటువంటి ఊగిసలాట లేకుండా చేసేవాడు. ఆయనకు ఏరియాపైనా పూర్తి పట్టు ఉండేది. దారులు ఏ మాత్రం వాడకుండా కొండలకు అడ్డుగా ప్రయాణించేవాడు. గంటల తరబడి నీళ్లు లేకపోయినా దాహం అనేవాడు కాదు. పెరుగుతున్న వయస్సులో సైతం శారీరకంగా చేసే పనులలో యువకుల కన్న ముందుండటం అందరినీ ఆశ్చర్యపరిచేది. ఇక అక్కడి ప్రజలతో ఆయన సంబంధం విడదీయలేనిది. ఒక్కొక్కసారి అది శుద్ధ మానవతావాదంగా కూడా ఉండేది. కొన్ని సందర్భాలలో స్థానిక ప్రజల నుండి కొద్దిమంది ద్రోహులుగా మారి వర్గ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పని చేస్తున్నప్పుడు వారు వచ్చిన పునాదిని దృష్టిలో పెట్టుకుని వారిని ఉపేక్షించాలని కోరుకునేవాడు. కానీ చివరికి ప్రజల తీర్పును, పార్టీ నిర్ణయాలను శిరసావహించేవాడు.

అయితే ఆయనలో వర్గ శత్రువుపైన విపరీతమైన కసి కూడా వుండేది. మిలటరీ కార్యకలాపాలలో చురుకుగా ఉండేవాడు. ఎర్రగొండపాలెం పోలీస్‌స్టేషన్ రెక్కీలో కీలకమైన పాత్రను నిర్వహించడమే కాకుండా అస్సాల్ట్ టీంలో సభ్యుడిగా ఎంపికయ్యాడు. ఆ దాడిలో గ్రెనేడ్ పేలి అశోక్ తీవ్రంగా గాయపడ్డాడు. అయినప్పటికీ నిబ్బరంగా ఉండి, తనతోటి కామ్రేడ్స్‌కు ధైర్యం చెబుతూ కాలినడకనే చాలా దూరం ప్రయాణించాడు. దీంతో రక్తస్రావం అధికం కావడంతో తోటి కామ్రేడ్స్ ఆయనను మోసుకొచ్చారు. గాయం తీవ్రంగా వుండటంతో, అమరుడు కృష్ణన్న (ఎస్.సి.ఎమ్) సూచనలతో గెరిల్లా డాక్టర్లు ఆయనకు ట్రీట్‌మెంట్ చేసారు. ఇటువంటి పరిస్థితులలో సైతం ఏ మాత్రం నిబ్బరం కోల్పోకుండా గాయాన్ని నయం చేసుకుని తిరిగి యథావిధిగా తన కార్యకలాపాలలోకి వెళ్ళారు. ఈ రెయిడ్‌కు ముందు జరిగిన శ్రీశైలం, సున్నిపెంట పోలీసు స్టేసన్లపై జరిగిన జంట రెయిడ్‌లలో కూడా చురుకుగా పాల్గొన్నాడు.

2004లో వై.ఎస్.ఆర్ ప్రభుత్వం అనుసరించిన కుట్ర పూరిత పద్ధతుల వలన శాంతి చర్చలు విఫలం కాగా నిర్బంధం మునుపెన్నడూ లేనంత తీవ్ర స్థాయికి చేరింది. ప్రభుత్వ సాయుధ దాడిలో పార్టీ, పి.ఎల్.జి.ఎలు తీవ్రంగా నష్టపోయాయి. ఈ పరిస్థితులలో 2006లో ఆ ప్రాంతాన్ని తాత్కాలికంగా ఖాళీ చేయాలనీ పార్టీ నిర్ణయించింది. పార్టీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని అశోక్ సరిగా అర్థం చేసుకోలేక పోయాడు. అక్కడే ఉండి పని చేయాలని బలంగా నిర్ణయించుకున్నాడు. ఇందుకు ఆ ప్రాంత ప్రజలతో ఆయనకు ఏర్పడిన బలమైన సంబంధం ఒక కారణంగా చెప్పుకోవచ్చు. దీంతో పార్టీ ఎత్తుగడలలో భాగంగా ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని సరిగా అర్థం చేసుకోలేక పోయాడు. అక్కడి ప్రజలను వదిలి రాలేకపోవడానికి ఆయనలో సెంటిమెంట్ బలంగా పని చేసింది.

చివరికి నల్లమల నుండి మిగిలిన బలగాలను ఉపసంహరించు కున్నాము. కానీ అశోక్, భారతి, విమలలు అక్కడే పని చేసేందుకు నిర్ణయించుకొని ఆగిపోయారు.

కా॥ భారతి నల్లమల ప్రాంతంలో పేద చెంచు కుటుంబంలో జన్మించింది. ఆమెది మహబూబ్‌నగర్ జిల్లా అప్పర్ ప్లాట్ ఏరియా. చిన్నతనంలోనే ఆమెకు వివాహం జరిగింది. కొద్ది కాలంలోనే అది విచ్ఛిన్నమై పోవటం కూడా జరిగింది. ఒక ఆదివాసీ మహిళగా ఆమె చిన్నతనం నుండి ఆనేక ఆధిపత్యాలను ఎదుర్కొంటూ వచ్చింది. సమాజం, కుటుంబం, పితృస్వామ్యం, కులం ఇలా రకరకాల ఆధిపత్యాలతో పాటు శ్రమ దోపిడీని కూడా ఎదుర్కొంటూ వచ్చింది. ఈ క్రమంలోనే అప్పర్ ప్లాట్ ఏరియాలో ఎగసిన వర్గ పోరాట మంటలు ఆమెకు వెలుగుదారి చూపాయి. ఆ విధంగా ఆమె 2005లో పి.ఎల్.జి.ఎలోకి భర్తీ అయింది. ఆ తర్వాత రాష్ట్ర కమిటీకి చెందిన రక్షణ దళంలోకి వచ్చింది. ఈ క్రమంలోనే అమరురాలయ్యేవరకు అశోక్‌తో కలిసి నల్లమలలో విప్లవ కార్యకలాపాలు కొనసాగించింది.

కా॥ విమల విప్లవాల ఖిల్లా అయిన మెదక్‌లో ఒక పేద రైతుకూలీ కుటుంబంలో జన్మించింది. చర్చల సందర్భంగా రాష్ట్ర వ్యాపితంగా ఏర్పడిన విప్లవ వాతావరణంలో పి.ఎల్.జి.ఎలోకి భర్తీ అయింది. పార్టీ పిలుపునందుకుని నల్లమల అటవీ ప్రాంతంలో దళ సభ్యురాలిగా తన కార్యకలాపాలను ప్రారంభించింది. 2007 నుండి అశోక్, భారతిలతో కలిసి నల్లమల అటవీ ప్రాంతంలో చెంచు ఆదివాసీలను సంఘటిత పరిచే కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటూ అమరురాలయ్యే వరకు విప్లవానికి ఎనలేని కృషి చేసింది.

ఈ ముగ్గురు కామ్రేడ్స్ నల్లమలలో తిరిగి మరో విప్లవ వెల్లువను సృష్టించేందుకు తీవ్రంగా కృషి చేసారు. ఆ ప్రాంతమంతటా పార్టీ ప్రతినిధులుగా ప్రజలలో గుర్తింపు పొందటమే కాకుండా, విప్లవంలో ప్రజల కార్యాచరణను అభివృద్ధి చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో కొద్దిమందిని భర్తీ చేసుకున్నట్లుగా అర్థం అవుతున్నది. ఈ పరిస్థితిని ప్రమాద సంకేతంగా భావించిన చంద్రబాబు అధికారంలోకి రాగానే మన కామ్రేడ్స్‌ను అంతమొందించేందుకు తన చట్టబద్ధ హంతక ముఠా అయిన పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసాడు. దీంతో పోలీసులు కుట్రపూరితంగా నిరాయుధులైన ముగ్గురు కామ్రేడ్స్‌ను పట్టుకొని హత్య చేసారు. ఆ ముగ్గురు కామ్రేడ్స్ భౌతికంగా మనకు దూరమైనా నల్లమలలో ఆ కామ్రేడ్స్ వెదజల్లిన విప్లవ బీజాలు తప్పకుండా మొలకెత్తుతాయి.

# పీడిత వర్గ ప్రియతమ పుత్రుడు కామ్రేడ్ పాంగి రతన్ (మంగరాజు)కు అరుణారుణ జోహార్లు

కామ్రేడ్ మంగరాజు (పాంగి రతన్) ఒడిశా రాష్ట్రం, మల్కనగిరి జిల్లా, కుడుములగుమ్మ బ్లాక్, పిట్టమఱ్రి గ్రామంలో ఒక నిరుపేద కుటుంబంలో పుట్టాడు. అమరుడయ్యే నాటికి అతని వయస్సు 31 సంవత్సరాలు. అతను ప్రాథమిక విద్య(ఒడియా భాషలో)ను అభ్యసించాడు.



పిట్టమఱ్రి గ్రామంపై పార్టీ ప్రభావం ఉండేది. ఆ కారణంగా చిన్నప్పటి నుండి విప్లవ రాజకీయాల పట్ల జిజ్ఞాస, ప్రజల పట్ల ప్రేమ ఉన్న మంగరాజు పార్టీ నాయకత్వంలోని ఆదివాసీ విప్లవ రైతుకూలీ సంఘం (ఎ.వి.ఆర్.సి.ఎస్)లో చేరాడు. 1996 నుండి ఇందులో చురుకైన పాత్ర పోషిస్తూ వచ్చాడు. రైతుకూలీ సంఘం కార్యకలాపాలలోనూ, రాజకీయ ప్రచార క్యాంపెయిన్లలోను చురుకుగా పాల్గొనేవాడు. ఈ క్రమంలోనే 1998 చివరలో ఒడిశా–ఆంధ్రా ఔటు పోస్టులపై దాడి చేసి ఆయుధాలు స్వాధీనం చేసుకోవాలని పార్టీ నిర్ణయించింది. అందులోభాగంగా ఈస్ట్ డివిజన్ పరిధిలోని బొడిగడ్డ–బోడ్‌పడా ఔట్ పోస్టులపై ఏక కాలంలో దాడి చేయాలనీ నిర్ణయించింది. దీనికనుగుణంగా రెక్కీలు నిర్వహించడానికి మంగరాజు రూట్‌గైడ్‌గా వ్యవహరించాడు. అంతే కాకుండా ఈ క్యాంపులకు చేరాలంటే, బలిమెల నదిని పడవల ద్వారా దాటాల్సి ఉంటుంది. కాబట్టి పడవ నడిపే డ్రైవర్‌గా ఇలా పలు బాధ్యతలు స్వీకరించి, ఆ జంట రైయిడ్స్‌ను సక్సెస్ చేయడంలో క్రియాశీలకమైన పాత్ర పోషించాడు.

1999లో పార్టీ పిలుపునందుకొని కోరుకొండ దళంలో చేరి, దళ సభ్యుడిగా ఉంటూ పార్టీ కార్యకలాపాలన్నింటిలో ఉత్సాహంగా పాల్గొనేవాడు. ఆనాటికి మన వద్ద తెలుగు సాహిత్యమే ఉండటంతో, తాను తెలుగు భాష నేర్చుకునేందుకు కేంద్రీకరించాడు. తన ప్రయత్నం ఫలించి విప్లవ సాహిత్యం అధ్యయనం చేస్తూ క్రమంగా పార్టీ రాజకీయాలను అవగతం చేసుకున్నాడు. తనతో వచ్చినవారిలో కొద్దిమంది పార్టీ క్రమశిక్షణ, పని విధానం కఠినంగా ఉన్నాయని భావించి వెళ్ళిపోగా, విప్లవోద్యమంలోని ఆటుపోట్లను, నిర్బంధాలను ఎదుర్కొంటూ ఎంతో క్రమశిక్షణతో చివరి వరకు నిలబడ్డాడు. మంగరాజు తీవ్రమైన శత్రు నిర్బంధం ఎదుర్కొంటూ, విప్లవోద్యమంలో పదిహేను ఏళ్ళ పాటు పని చేసి, అంచెలంచెలుగా ఎదిగి, అనేక బాధ్యతలు చేపట్టాడు. 1999నుండి 2002 వరకు కోరుకొండ దళ సభ్యుడిగా పని చేసాడు. 2002లో ఏరియా కమిటీ సభ్యుడిగా కో–ఆప్ట్ అయి కోరుకొండ ఏరియా కమిటీలో పని చేసాడు. 2003లో మాచ్‌ఖండ్ ఎల్.ఒ.ఎస్ బాధ్యతలు చేపట్టాడు. అయితే ఆచరణలో దళం ఆ ఏరియాలో ఫంక్షన్ కాలేదు. కొరాపుట్ మల్టీపుల్ రైయిడ్ సన్నాహాల్లో పాల్గొంది. తదుపరి ఆ దళం రద్దయింది. 2004లో గుర్తేడు ఏరియా కమిటీలో భాగమై చిత్రకొండ ఎల్.జి.ఎస్ కమాండర్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. 2006లో జరిగిన ఎ.ఒ.బి కాన్ఫరెన్స్ ఉద్యమం తాత్కాలిక సెట్‌బ్యాక్‌కు గురయ్యిందని గుర్తించింది. ఆ తదుపరి 2007లో జరిగిన పార్టీ కాంగ్రెస్ కూడా ఇదే విషయం గుర్తించింది. వెనకపట్టు పట్టిన పరిస్థితిలో ఉద్యమం అవలంబించ వలసిన ఎత్తుగడలను కాంగ్రెస్ రూపొందించి అందించింది. అందులో భాగంగా ఎ.ఒ.బిలో ప్లాటూన్ల నిర్మాణం చేపట్టింది. ఈ మార్పులలో భాగంగా మంగరాజు విశాఖ డివిజన్ ప్లాటూన్‌లో భాగమై యాక్షన్ టీంకు కమాండర్ అయ్యాడు. తదుపరి 2007లో సి.ఆర్.సి నాయకత్వంలో ఏర్పడిన 1వ కంపెనీలో భాగమయ్యాడు. 2010లో అరెస్టు అయ్యే నాటికి 1కంపెనీ మొదటి పి.ఎల్‌కు డిప్యూటీగా ఉన్నాడు.

మంగరాజు తన విప్లవ జీవితంలో ఎక్కువ కాలం ఈస్ట్ డివిజన్‌లో పని చేసాడు. సి.ఆర్.సి పరిధిలో 1వ కంపెనీలో భాగమయ్యాక, స్వల్ప కాలమే అయినప్పటికీ మల్కనగిరి డివిజన్, కోరాపుట్ డివిజన్‌లలో కూడా పని చేసాడు. ఈస్ట్ డివిజన్‌లోని ప్రజలందరికీ సుపరిచితుడు. ఈ ప్రాంత ప్రజలపై, గ్రామాలపై, భౌగోళిక పరిస్థితులపై అతనికి మంచి పట్టు ఉంది.

ఈ ప్రాంతంలో ప్రజలు పండించే అపరాలకు, వాణిజ్య పంటల పెట్టుబడులకు వ్యాపారులు విపరీతమైన వడ్డీలతో అప్పులు ఇచ్చి తక్కువ రేటుకు దిగుబడులను కొనుగోలు చేసేవారు. ఇలా అడ్డగోలు దోపిడీకి పాల్పడుతున్న చిత్రకొండ, చింతపల్లి, గూడెం షావుకార్లను జనంలో నిలదీసి, వడ్డీలను నియంత్రించడంలో మంగరాజు చురుకైన పాత్ర వహించాడు. అంతే కాకుండా రైతులు ఉత్పత్తి చేసే వ్యవసాయ ఉత్పత్తులకు, అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలకై పోరాటాలను నిర్మించడంతో పాటు వాటికి నాయకత్వ వహించాడు. ఈ గిట్టుబాటు ధరల పోరాటం ఈస్ట్ డివిజన్‌లో ప్రతి సంవత్సరం కొనసాగేది.

జల్, జంగల్, జమీన్‌పై అధికారం కోసం, బాక్సైట్ గనుల తవ్వకాలకు వ్యతిరేకంగా ఆదివాసీ గూడేలన్నింటిని ఏకం చేసి కదిలించాడు. జి.సి.సి అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగానూ, ఆదివాసీలు సేకరించే అటవీ ఉత్పత్తులతో పాటు వ్యవసాయ వుత్పత్తులను కూడా జి.సి.సినే కొనుగోలు చేయాలనీ, 1/70 చట్టం అమలుకూ, ఆదివాసీ స్వయం ప్రతిపత్తి కోసం ఆదివాసీ సంఘాలను కదిలించి అనేక సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాడు. ఆదివాసీ తెగ పెత్తందార్లకు వ్యతిరేకంగా పోరాటాలను చేపట్టి వాటికి నాయకత్వం వహించాడు. పోరాటాలకు లొంగిరాని మొండి ఘటాలైన, చువ్వపల్లి, బానందూళి, కర్లమడ, దూళిపుట్ పెత్తందార్లను శిక్షించడంలోనూ ముందు భాగాన నిలిచాడు.

విప్లవోద్యమ సమూల నిర్మూలనకై దోపిడీ పాలక వర్గాలు

తలపెట్టిన, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఓడించడంలో భాగంగా వివిధ మిలటరీ చర్యల్లో చురుకైన పాత్ర వహించాడు. ఈ ఫాసిస్టు దాడికి వ్యతిరేకంగా పార్టీ ఇచ్చిన  పిలుపును విజయవంతం చేయడానికై ఎ.ఒ.బిలో చేపట్టిన అన్నీ టి.సి.ఒ.సి క్యాంపెయిన్లలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ  పాల్గొన్నాడు.

శత్రు ఆయుధాలను స్వాధీనం చేసుకుని, పి.ఎల్.జి.ఎను సాయుధం చేయాలనే లక్ష్యంలో భాగంగా జోన్‌లో నిర్వహించిన దాదాపు అన్ని రైయిడ్స్‌లో పాల్గొన్నాడు. జోన్ బయట జరిగిన చారిత్రాత్మక నయాగడ్ ఆపరేషన్(ఆపరేషన్ రోప్ వే)లో కూడా పాల్గొన్నాడు. పాల్గొన్న అన్ని రైయిడ్స్ లోనూ తనకు అప్పగించిన కర్తవ్యాలను పట్టుదలతో, అంకితభావంతో నిర్వహించేవాడు. ఆయా సందర్భాలలో ఎలాంటి తొట్రుపాటుకు గురికాకుండా ఎంతో ధైర్యంగా, సాహసంగా శత్రువుతో తలపడేవాడు. రెక్కీలు నిర్వహించడంలో పార్టీ రూపొందించిన పని పద్ధతులకు కట్టుబడి ఉంటూ, శత్రువుకు ఏ మాత్రం అనుమానం కలగకుండా వ్యవహరించడం, సాధారణ ప్రజలలో ఒకరిగా కలసిపోవడం వంటి అనేక మెలకువలను ఉపయోగించి శత్రు ఆనుపానులు తెలుసుకోవడంకై ప్రత్యేక శ్రద్ధ వహించేవాడు. నయాగడ్ ఆపరేషన్ చేపట్టడానికి అవసరమైన సన్నాహాలు చేపట్టడంలో భాగంగా ఆ ప్రాంతానికి పోయి, అక్కడి ప్రజలతో సంబంధాలు ఏర్పరచుకోవడంతో పాటు వారితో మమేకం అవుతూ, వారి విశ్వాసం చూరగొనడంలో కూడా సఫలీకృతుడయ్యాడు. దామన్‌జోడిలో నాల్కోపై చేపట్టిన దాడి సందర్భంగా కూడా ఆ కంపెనీలో కూలీలతో కలసిపోయి పని చేసుకుంటూ, నిరంతరం శత్రు కదలికలను గమనిస్తూ సమాచారం సేకరించే కర్తవ్యాన్ని చేపట్టాడు. బలిమెల ఆపరేషన్ సందర్భంగా చేపలు పట్టేవాడి వేషంలో శత్రువుకు సంబంధించిన సమాచారం ఆంబుష్ పార్టీకి అందించి, ఆ దాడి విజయవంతం కావడంలో కీలక భూమిక పోషించాడు.

2003లో జరిగిన కోరుకొండ ఏరియా కమిటీ ప్లీనంలో, అదే సంవత్సరం జరిగిన డివిజన్ కమిటీ ప్లీనంలోనూ, కామ్రేడ్ మంగరాజు చురుకైన పాత్ర పోషించాడు. 2006లో డివిజన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొని ఆటుస్థితిలో ఉన్న(అప్పటికీ తనకు స్పష్టత లేనప్పటికీ) ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడానికి చేయవలసిన కృషిని గురించి చర్చించాడు. కేవలం చర్చించడమే కాకుండా మార్క్సిస్టు ప్రాథమిక సూత్రాలను, పార్టీ విధానాలనూ, పాలసీలనూ, పార్టీ డాక్యుమెంట్లను లోతుగా అర్థం చేసుకోవడానికి కృషి చేసేవాడు.

2010లో టి.సి.ఒ.సి సందర్భంగా ఒక యాక్షన్ కోసం రెక్కీ నిర్వహించి మోటారు సైకిల్‌పై తిరిగి వస్తుండగా, జి.కె వీధిమండలం ఏబులం దగ్గర రోడ్ ఓపెనింగ్ పార్టీ (పోలీసు బలగం) ఎదురైంది. ఆ బలగంతో పాటు మాజీ నక్సలైట్ ఒకడు ఉన్నాడు. అతను మోటరు సైకిల్‌పై వెళ్తున్న కామ్రేడ్ జయపాల్, మంగరాజులను గుర్తుపట్టి పోలీసులకు చెప్పాడు. దాంతో పోలీసులు వెంటనే అప్రమత్తమై వారికంటే ముందున్న మరో రోడ్ ఓపెనింగ్ పార్టీకి సమాచారం అందించడంతో వాళ్ళు ఆ కామ్రేడ్స్ ఇద్దరిని అరెస్టు చేసారు. తదనంతరం పార్టీ రహస్యాలు, దళం కదలికలు గురించి, నాయకత్వం గురించి చెప్పమని ఎన్నో చిత్రహింసలు పెట్టారు. అయినప్పటికీ శతృవు ఎదుట మంగరాజు దృఢంగా నిలిచాడు. అదే పోరాట పటిమను 5సంవత్సరాలు జైలు నిర్భందంలో కూడా కొనసాగించాడు. జైలు నాలుగు గోడల మధ్య ఉంటూ, రాజకీయ ఖైదీల హక్కుల కోసం, సాధారణ ఖైదీల సమస్యల కోసం, జైలు అధికారుల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా గొంతెత్తి నినదించాడు. పలు రూపాల్లో నిరసన వ్యక్తం చేసాడు. న్యాయస్థానంలో న్యాయమూర్తులు (జడ్జీలు) అవలంభిస్తున్న ఫాసిస్టు పద్ధతులకు వ్యతిరేకంగా కోర్టు లోపల, వెలుపల నిరసనను వ్యక్తం చేసేవాడు. పార్టీ రహస్యాలను రాబట్టాలన్న శత్రు ప్రయత్నాలు విఫలమవ్వడంతో వాళ్ళు పరోక్ష పద్ధతులలో అతనిని హింసించడానికి పథకం పన్నారు. పోలీసులు వాయిదాల సమయంలో జైలు నుండి కోర్టులకు తీసుకెళ్ళేటప్పుడు వేధింపులకు గురి చేయడం, నీ గురించి పార్టీ రకరకాలుగా (ఇన్‌ఫార్మర్‌గా మారాడనీ, లొంగిపోయాడనీ, పార్టీ సమాచారం చెప్పాడనీ) ప్రచారం చేస్తుందని నమ్మ బలికారు. వాయిదాల అనంతరం తిరిగి జైలుకు తీసుకువస్తే అక్కడ ములాఖత్‌లు పెట్టి వేధించారు. పోలీసుల  వేధింపులు ఒకవైపు, మరోవైపు కోర్టులు బెయిల్స్ మంజూరు చేయకపోవడంతో కా॥ మంగరాజు మానసిక అంశాతికి గురై అనారోగ్యం పాలయ్యాడు. సుమారు 3మాసాలు చికిత్స తీసుకున్నాక మాములు స్థితికి వచ్చాడు. అయినా శతృ వైఖరిలో ఎలాంటి మార్పు రాకపోగా, వాడి ప్రయత్నాలు మరింత తీవ్రతరం చేసాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై 2014 జూన్‌లో జైలులోనే కామ్రేడ్ మంగరాజు తుది శ్వాస విడిచాడు. ఎంతటి నిస్సహాయ పరిస్థితులలోనైనా, అననుకూల పరిస్థితిలలోనైనా మనం నిలబడాల్సింది ప్రజల పక్షాన, ప్రజా పోరాటాల పక్షాన అంటూ, ఇందులో  ఏమరుపాటు ఉండకూడదనీ, ప్రజలకు విప్లవం అవసరం ఉంది కనుక అది విజయవంతమై తీరుతుందనీ, ఏ రోజుకైనా ప్రజలదే విజయం అని చివరి క్షణం వరకు విప్లవం పట్ల తన అచంచల విశ్వాసాన్ని ప్రకటించాడు. కష్టమైన పని కూడా ఎంతో ఇష్టంతో చేసేవాడు. అందరితో కలివిడిగా ఉండేవాడు. అన్ని స్థాయిల పార్టీ శ్రేణులతో సన్నిహితంగా ఉండేవాడు. ఒక సీనియర్ కామ్రేడ్‌గా తన అనుభవాన్ని పార్టీకీ అందిచాడు. ఇలా తనకున్న సమర్థతల ద్వారా పార్టీకీ, ప్రజలకు పలు రకాల సేవలందించిన కామ్రేడ్ మంగరాజు ప్రజల, పార్టీ శ్రేణుల హృదయాల్లో ఒక మరచిపోలేని జ్ఞాపకంగా ఎప్పటికీ నిలిచిపోతాడు. పార్టీకి అత్యంత ప్రీతిపాత్రమైన అట్టగుడు సామాజిక వర్గం (ఒడియా డొంబొ-దళిత్-తెలుగు వాల్మీకి) నుండి వచ్చిన క్రమశిక్షణ గల కార్యకర్తను, ఉద్యమ అవసరాలు తీర్చే పీడిత వర్గ నాయకుడిని ఎ.ఒ.బి ఉద్యమం కోల్పోయింది. అతను ఆచరించి చూపిన కార్యాచరణనూ, ఆదర్శాలను కొనసాగిస్తూ నూతన ప్రజాస్వామిక విప్లవానికి బాటను సుగమం చేయడమే కామ్రేడ్ మంగరాజుకు మనమిచ్చే నిజమైన నివాళి.

# కా॥ ఎర్రాల్ (లాలు) అమర్ రహే !

కా॥ ఎర్రాల్ మల్కనగిరి జిల్లా మన్యంకొండ పంచాయితీ మంగపాడు గ్రామంలో ఆదివాసీ(కోయ)కుటుంబంలో పుట్టాడు. ఆ ప్రాంతంలో భూములకు సరైన నీటి వసతి లేక పంటలు పండక ప్రతి సంవత్సరం కరువుతో అర్ధాకలితో అక్కడి ప్రజలు బ్రతికేవారు. కూలీ పనుల కోసం ఆంధ్రకు వలస వెళ్ళేవారు. అంతేకాకుండా స్థానిక పెత్తందార్ల(పొట్టేరుకు చెందిన పెద్దాల్)ఆధిపత్యానికి, కౄరత్వానికి దోపిడీకి బలయ్యేవారు. అందులో ఎర్రాల్ కుటుంబం ఒకటి.



అయితే ఇంకొకవైపు పార్టీ నాయకత్వంలోని సంఘం ప్రజలకు సంబంధించిన అనేక సమస్యలపై (తూనికాకు, వెదురు, కూలీ రేట్ల పెంపుదల...)ఆందోళనలు చేపట్టడంతో పాటు గ్రామ పెద్దాల్‌లకు వ్యతిరేకంగా పోరాటం చేసింది. అంతే కాకుండా కలిమెల, మోటు పోలీస్టేషన్లపై పి.ఎల్.జి.ఎ దాడులు చేసింది. వీటన్నింటి నుండి ప్రేరణ పొందిన కా॥ ఎర్రాల్ గ్రామ మిలీషియాలో సభ్యుడిగా చేరి అనతి కాలంలోనే పార్టీ పిలుపుతో ఇల్లు వదిలి జన మిలీషియాలో భాగం అయి అనేక మిలిటెంట్ చర్యలలో భాగం పంచుకున్నాడు. 2005లో పూర్తికాలం కార్యకర్తగా మోటు దళ సభ్యుడయ్యాడు. మెకానికల్ రంగంపై తన ఆసక్తిని గమనించిన పార్టీ 2006లో ఎ.ఒ.బి టెక్నికల్ దళంలోకి కా॥ ఎర్రాల్‌ను బదిలి చేసారు. కా॥ ఎర్రల్ ఇంటిదగ్గర చదువుకోనప్పటికీ పార్టీలోకి వచ్చిన తరువాత కష్టపడి చదువు నేర్చుకున్నాడు. ఆ వెలుగులో టెక్నికల్ విషయాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ పి.ఎల్.జి.ఎకోసం తుపాకులను తయారు చేసే ప్రక్రియలో భాగం అయ్యాడు. వివిధ అంబుష్‌లలో పోలీసుల దగ్గర నుండి స్వాధీనం చేసుకున్న తుపాకులలో విరిగిపోయిన వాటిని రాత్రి, పగలు శ్రమించి బాగుచేసేవాడు.

మిలీషియాకు బూబిట్రాప్స్ తయారు చేయడం, పేల్చుడంపై ట్రైనింగ్ ఇచ్చాడు. శ్రమకోర్చి అనేక బరువులు మోసేవాడు. మెకానికల్ సామాగ్రిని అత్యంత భద్రంగా దాచి పెట్టేవాడు. ఎంత కష్టమైన పనినైనా, ఎంత దూరమైనా, ఏ సమయంలోనైన మారుమాట చెప్పకుండా పార్టీ ఆదేశాన్ని పాటించేవాడు. అతని పనితీరును గుర్తించిన పార్టీ 2008లో కా॥ ఎర్రాల్‌ను ఎ.సి.ఎమ్‌గా ప్రమోట్ చేసింది.

ఆర్గనైజేషన్ రంగంలోనూ అనుభవం సంపాదించడంకై 2012లో గుమ్మ ఎ.సిలోకి కా॥ ఎర్రాల్‌ను బదిలీ చేసింది. అక్కడ పని చేస్తున్న క్రమంలో ప్రజలలో భాగమయ్యాడు. వారిని కదిలించడంలో ముందుండేవాడు. తరువాత వుద్యమ అవసరాల రీత్యా కలిమెల ఏరియాకు బదిలీ చేయడమైనది.

ఈ క్రమంలోనే కొయిర్‌పుట్ బ్లాక్ మడకపోదర్ పంచాయితీ దాడాపుట్ గ్రామ పరిసర అటవీ ప్రాంతం లోని మకాంపై శత్రువు విచక్షణా రహితంగా జరిపిన కాల్పుల ఘటనలో కవర్ నుండి క్రిందికి పోయే క్రమంలో తూటా తగిలి కా॥ ఎర్రాల్ అమరుడయ్యాడు.

వెనుకబడిన ఆదివాసీ తెగ నుండి వచ్చి క్రమశిక్షణ, అంకితభావం కల్గిన కార్యకర్తగా ఎదిగిన కా॥ ఎర్రాను కోల్పోవడం ఎ.ఒ.బి ఉద్యమానికి తీరని నష్టం. మొక్కవోని ధైర్య సాహసాలతో శత్రు దాడులను, కుట్రలను ఓడిస్తూ విప్లవోద్యమాన్ని అభివృద్ధి చేయడం ద్వారా అనేక మంది ఎర్రాలను సృష్టించగలుగుతాం. ఆ విధంగా చేయడం మాత్రమే మనం కా॥ ఎర్రాకు ఇచ్చే ఘనమైన నివాళి.

# నారాయణపట్నా నిప్పురవ్వ కా॥ హుల్కా పూర్ణోకు విప్లవ జోహార్లు !

నారాయణపట్నా భూమి ఆందోళనలో ఎదిగి వచ్చిన యువకెరటం, జన మిలీషియా కమాండర్ కా॥ పూర్ణో. భూస్వాములు, పోలీస్ ఇన్‌ఫార్మర్లు, పెత్తందార్లపై తీవ్రమైన వర్గకసితో ఉంటూ కౄరమైన వారిని నిర్మూలించడంలో ముందుండేవాడు. ఆ క్రమంలోనే "లాటి" అనే శాంతి సంఘం గూండా, పోలీసు ఏజెంటును ఖతం చేయడానికై వెళ్ళి ఒక ద్రోహి ఇచ్చిన సమాచారం వల్ల 2014 ఏప్రిల్ 22న నారాయణపట్నా నడి బొడ్డున బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేయబడ్డాడు. ప్రజల అభిమానాన్ని చూరగొని ఇన్‌ఫార్మర్లకు కంటి మీద కునుకు లేకుండా చేసిన కా॥ పూర్ణో అమరత్వం నారాయణపట్నా ఉద్యమానికి ఆశనిపాతం వంటిది.

కోరాపుట్ జిల్లా నారాయణపట్నా బ్లాక్ బసనాపుట్ గ్రామంలో కా॥ పూర్ణో(30) జన్మించాడు. తనకు భార్య, ముగ్గురు పిల్లలు వున్నారు. కా॥ పూర్ణో బాల్యం నుండి తండ్రితో పాటు జంతువుల వేటలో పాల్గొంటూ తుపాకీ కాల్చడంలో నైపుణ్యం సాధించాడు. ఆ ప్రాంతంలో వేటగాడుగా కా॥ పూర్ణోకు మంచి పేరుంది. ఆదివాసీలకు సారా అప్పులిచ్చి దీనికి బదులుగా భూములు లాక్కొని వారిని జీతగాళ్ళుగా, బికారులుగా చేసిన భూస్వాములు ఈ ప్రాంతంపై తమ దోపిడీ అణచివేతలను కొనసాగించారు. ఈ దోపిడీ అణచివేతలు ఇక్కడి ప్రజలతో పాటు కా॥ పూర్ణోలో కూడా భూస్వామ్య వ్యతిరేక చిచ్చు రేపాయి. 2004 నుండి 2009 వరకు జరిగిన భూపోరాటం అంచెలంచెలుగా ఎగసి 3వేల ఎకరాలలో ఎర్రజెండా ఎగిరింది. భూస్వాముల భూముల్లో, పేదల నాగళ్ళు దున్నడం ప్రారంభమయ్యి భూములు ప్రజల పరమయ్యాయి. ఈ పోరాటంలో భూస్వాములకు, పోలీసులకు వ్యతిరేకంగా "గెనువాబాహిని" పేరుతో 3వేల మంది సాయుధ మిలీషియా సాంప్రదాయక ఆయుధాలతో బరిగీసి నిల్చింది.

"గెనువాబాహిని" రూపకల్పనలో పొడపొదర్, బలియపుట్ గ్రామాలు ప్రధాన భూమిక నిర్వహించగా బసనపుట్ గ్రామం కూడా

తన వంతు పాత్ర నిర్వహించింది. అందులో భాగంగా ఆ గ్రామ మిలీషియా కమాండర్‌గా కా॥ పూర్ణొ అగ్రభాగాన నిలిచి పోరాటాన్ని కొనసాగించాడు. ఉద్యమ నాయకత్వాన్ని దెబ్బతీసే లక్ష్యంతో భూస్వామ్య వర్గం పోలీసులను అరెస్టులకు ఉసి గొల్పింది. ఉద్యమ ప్రధాన నాయకత్వంతో పాటు బసనపుట్ గ్రామ సంఘ నాయకత్వం మొదటిసారి జైలు నిర్బంధాన్ని అనుభవించారు. కా॥ పూర్ణొ ఆ నిర్బంధాన్ని ఖండిస్తూ ఆదివాసీలను, యువతను పోరాటాల్లోకి కదిలించాడు. ఉద్యమ అణచివేతలో భాగంగా పొడపదర్, బసనాపుట్, నారాయణపట్నాలలో బి.ఎస్.ఎఫ్ క్యాంపులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆ ప్రాంత ప్రజలపై ఊపిరి సలవ నివ్వని నిర్బంధం ఆరంభమయింది. ఉద్యమాన్ని రక్షించుకోవడానికి జె.ఎమ్.ఎస్‌లో చేరాలనే పిలుపు నందుకొని 2012లో కా॥ పూర్ణొ అందులో చేరాడు. కార్పెట్ సెక్యూరిటీ మధ్యనే జన మిలీషియా (జె.ఎమ్.ఎస్) కార్యకలాపాలు కొనసాగాయి. అనతి కాలంలోనే జె.ఎమ్.ఎస్ కమాండర్‌గా ఎదిగి కా॥ కాత్రు పేరుతో పని చేసాడు. పోలీసుల కళ్ళు కప్పి ఎందరో ఇన్‌ఫార్మర్లను శిక్షించాడు. బిగ్‌గన్స్ ఏర్పాటు చేసి పోలీసులను దెబ్బతీసే ప్రయత్నం చేసాడు. బలిపట్ట గ్రామానికి చెందిన భూస్వాములను ఖతం చేసాడు. రిక్రూట్‌మెంట్ క్యాంపెయిన్‌లో భాగంగా అనేక మంది యువతీ యువకులను మిలీషియాలో చేర్పించాడు. పోలీసులు అతన్ని లొంగదీసుకోవడానికి చేసిన ప్రయత్నాలన్నింటిని తిప్పి కొట్టాడు. తన అన్నయ్య కొడుకు మరణించిన సందర్భంలో కూడా చలించకుండా వారి మరణానికి రాజ్యానిదే బాధ్యత అంటూ తీవ్రమైన వర్గ కసిని ప్రదర్శించాడు. ఈ విధంగా కొనసాగిన అతని విప్లవ కార్యాచరణ ఉద్యమాభివృద్ధికి ఎంతగానో దోహదపడింది. అందరిలో ఉన్నట్లే కా॥ పూర్ణొలో కూడా పాజిటివ్-నెగటివ్ అంశాలు ఉన్నాయి. ఉద్యమం వెనుకంజ వేయడాన్ని గతితార్కిక పద్ధతిలో విశ్లేషించుకోకుండా నిరాశకు లోనయ్యాడు. నిర్బంధం కారణంగా దళ కదలికలకు పరిమితులు ఏర్పడటంతో శత్రువులను నిర్మూలించాలనే కసితో ఒంటరిగా పోయి ఇన్‌ఫార్మర్లను శిక్షిస్తానని ప్రతిపాదించాడు. ఆ నిర్ణయం సరైంది కాదని పార్టీ నచ్చ చెప్పినప్పటికీ వంటరిగానే వెళ్ళాడు. ఆ క్రమంలోనే శతృవు చేతికి చిక్కి అమరుడయ్యాడు. తుదికంటా నారాయణపట్నాలో ఉద్యమాన్ని రక్షించుకోవడానికి శతృవుతో పోరాడి తన రక్తాన్నర్పించి ఎర్రజెండాను మరింత ఎరుపెక్కించాడు. నమ్మిన ఆశయాల కోసం ఎంతో ధైర్య సాహసాలను, మిలిటెన్సీని, భూస్వామ్య వ్యతిరేకతను ప్రదర్శించిన కా॥ పూర్ణొను ఆదర్శంగా తీసుకుంటూ వినమ్రంగా జోహార్లు అర్పిద్దాం.



## కాఫీ పోరాట నాయకుడు, మన్యం పోరుబిడ్డ కా॥ గణపతి అమర్ రహే !

కామ్రేడ్ పలాసి గణపతి (40 సంవత్సరాలు) విశాఖపట్నం జిల్లా, పెదబయలు మండలం, పెదలంక గ్రామంలో ఒక దిగువ మధ్య తరగతి కుటుంబంలో పుట్టాడు. చిన్నతనంలో ప్రాథమిక విద్యనభ్యసించాడు. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

గతంలో పెదలంక గ్రామం ఉద్యమ ప్రభావిత ప్రాంతంగా వుండేది. చిన్నప్పటి నుండి ఆ ప్రాంతంలో విప్లవ కార్యకలాపాలకు ఆకర్షితుడైన గణపతి పెరిగి పెద్దవాడైన తర్వాత దళంలో భర్తీ అయి దళ సభ్యుడిగా 1990 నుండి 1993 వరకు పని చేసాడు. ఈ 3సం॥లు పార్టీ కార్యక్రమాలన్నింటిలోనూ క్రియాశీలకంగా పాల్గొన్నాడు. ఇదే సమయంలో అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వంలో జనార్ధన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా వున్న సమయంలో మావోయిస్టు పార్టీనీ, దాని అనుబంధ సంఘాలపై నిషేధం విధించాడు. పార్టీపై, ప్రజలపై యుద్ధం ప్రకటించి, తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగించాడు. మారిన పరిస్థితులను చైతన్యవంతంగా అర్థం చేసుకోలేని బలహీనత కారణంగా ఉద్యమానికి దూరమయ్యాడు. అయితే పార్టీ, ప్రజల పట్ల ఉన్న ప్రేమ, విశ్వాసాల కారణంగా పూర్తిగా తెగతెంపులు చేసుకోలేక, పార్టీ సంబంధాల్లో వుంటూనే గ్రామ స్థాయిలో పని చేయడానికి తన సంసిద్ధతను వ్యక్తం చేసాడు. ఆ విధంగా చింతపల్లి మండలం, బలపం పంచాయితీ పరిధిలోని సబ్బపల్లి గ్రామంలో తన బంధువుల ఇంటి వద్ద ఉంటూ సంఘం కార్యకలాపాల్లో పాల్గొంటూనే, పార్టీ ఇచ్చిన రాజకీయ, మిలటరీ, ప్రచార క్యాంపెయిన్లలో చురుకుగా పాల్గొనేవాడు.



ఏజెన్సీలో షావుకార్ల, వ్యాపారుల దోపిడికి అడ్డు, అదుపు లేకుండా సాగుతుండేది. అతి చౌకధరలకు కొనుగోళ్ళు, తప్పుడు కుంచాలు, తప్పుడు తూకాలతో, అలవికాని మోసంతో తీవ్ర దోపిడి నడుస్తుండేది. దీనికి వ్యతిరేకంగా విప్లవ సంఘాల పోరాట పిలుపుకు ఏజెన్సీ అంతా ఒక్కటై నిలిచింది. పలుగు, పార, కత్తి, కొడవళ్ళ చేతబూని దోపిడీని చీల్చి చెండాడారు. మండల కేంద్రాల్లో వందల, వేల ధర్నాలు, సభలు జరిపి ఆందోళన చేసారు. కోరుకొండ సంతలో నర్సీపట్నం షావుకారు ఎర్రబాబు లారీని తగులబెట్టారు.జిమాడుగుల, అన్నవరం వ్యాపారులను ప్రజల ముందు విచారించి దేహశుద్ధి చేసారు. అనేక మంది దుర్మార్గులకు, దోపిడీదారులకు బుద్ధి చెప్పారు. ఈ పోరాటాలకు గణపతి ముందు పీఠిన నిలిచి నాయకత్వం వహించాడు. 1/70 చట్టం అమలుకు, బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా ఆదివాసీలను కదిలించి, పోరాటాలు నిర్మించాడు.

ప్రజలను పోరాట మార్గం నుండి తప్పించడానికి గిరిజనోద్ధరణ పేరుతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన జి.సి.సి, ఐ.టి.డి.ఎలు తేనె పూసిన కత్తులనీ, వాటి నిజస్వరూపాన్ని విప్లవ ప్రజానీకంలో విస్తృతంగా ప్రచారం చేసి బహిర్గతం చేసే కృషి చేయడంతో పాటు జి.సి.సి మోసాలకు, అవినీతికి వ్యతిరేకంగా ప్రజలను పోరాట బాటలో నడిపించాడు.

నాడు బ్రిటన్ సామ్రాజ్యవాద స్కీమ్‌గా మన్యంలో ప్రారంభమైన కాఫీతోటలు నేడు అమెరికా సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకై విస్తరించబడుతున్నాయి. 1980ల నాడు 10వేల హెక్టార్లలో ఉన్న కాఫీ తోటలు నేడు లక్షల హెక్టార్లకు విస్తరించనున్నాయి. ఈ కాఫీ తోటల ద్వారా ప్రభుత్వం కోట్లాది రూపాయలు గడిస్తుండగా, హిందుస్తాన్ లీవర్, ఐ.టి.సి లాంటి ఎమ్.ఎన్.సిలు బ్రూ, నెస్‌కేఫ్ రకరకాలు బ్రాండ్ నేమ్‌లతో కాఫీ పొడిని విక్రయిస్తూ వందల కోట్లు ఆర్జిస్తున్నాయి. ఆదివాసీల భూములను ఆక్రమిస్తూ ఆ భూములలో వారిని కూలీలుగా మార్చిన సామ్రాజ్యవాదుల, దోపిడీ పాలకవర్గాల కుట్రలకు విరుగుడుగా కాఫీ తోటల ఆక్రమణ పోరాటానికి పార్టీ పిలుపునిచ్చింది. ఆ పిలుపునందుకుని బలపం పంచాయితీ ప్రజలు పోరాట కమిటీలు ఏర్పరచుకున్నారు. అలా ఏర్పడిన పంచాయితీ స్థాయి పోరాట కమిటీలో కా॥గణపతి సభ్యుడిగా ఉంటూ పోరాటానికి నాయకత్వం అందించాడు. పోరాటాన్ని నీరుగార్చాలని రివిజనిస్టు సి.పి.ఐ నాయకత్వం చేసిన ప్రయత్నాలను వమ్ముచేసి పార్టీ పంథాకు, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా పోరాటాన్ని నడిపించడంలో కీలక పాత్ర పోషించాడు. ఆ క్రమంలో పోరాటాన్ని విఫలం చేయడానికి పోలీసులతో కుమ్మక్కైన స్థానిక సి.పి.ఐ నాయకుడు గబ్బాడ చిట్టిబాబుని ప్రజాకోర్టులో పెట్టి విచారించి, ఏరియా బహిష్కరణ శిక్షను ప్రజలు విధించారు. అంతేకాకుండా ఇతని స్థిర, చరాస్తులను ప్రజల పరం చేయడంలో గణపతి ముఖ్య భూమికను పోషించాడు. కాఫీ పోరాటాన్ని అడ్డుకోవడానికి ప్రభుత్వం పోలీసులను దింపి అరెస్టులు చేసింది. నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ జరిగిన అనేక ప్రజాందోళనలకు గణపతి నాయకత్వం వహించాడు. నిర్బంధంలో ముఖ్యమైన నాయకత్వం అరెస్టు కావడంతో, పోరాట కమిటీ ప్రధాన బాధ్యతలను చేపట్టాడు. ఈ కాలంలోనే దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ కంపెనీ అయిన ఎస్.ఆర్‌కు వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టి మిలిటెంట్ పోరాటానికి శ్రీకారం చుట్టాడు. అందులో భాగంగా కిరండాల్ నుండి విశాఖపట్నం వరకు ఉన్న పైపులైను ద్వారా ఖనిజ సంపద (ఇనుము) తరలించడాన్ని సంఘటితంగా అడ్డుకున్నారు. అనేక సార్లు పైపులైనును ధ్వంసం చేసారు. ధ్వంసమైన పైపులైను పున:నిర్మాణానికి పూనుకున్న కంపెనీ అధికార్లకు దేహశుద్ధి చేసారు. వారి వెహికిల్స్‌ను ధ్వంసం చేసారు. పాలకుల మైనింగ్ పాలసీలు త్రిప్పికొట్టడంలో భాగంగా జిందాల్, అన్‌రాక్ కంపెనీల బాక్సైట్ తవ్వకాలను తీవ్రంగా ప్రతిఘటిస్తూ నడుస్తున్న మిలిటెంట్ ప్రజాందోళనలకు గణపతి నేతృత్వం వహించాడు.

1995లో ఏర్పడిన గ్రామరాజ్య కమిటీలు 2001 నుండి విప్లవ ప్రజా కమిటీలుగా అభివృద్ధి చెందాయి. తమ గ్రామంలో ఏర్పడిన గ్రామరాజ్య కమిటీలో రక్షణ శాఖ బాధ్యుడిగా విధులు నిర్వర్తించాడు. పార్టీ నేతృత్వంలో జరిగిన అనేక సంస్థాగత క్యాంపులకు గ్రామరక్షక దళాల సభ్యులను సమీకరించి, రక్షణ కల్పించే బాధ్యతలను కూడా సమర్థవంతంగా నిర్వర్తించాడు. తమ గ్రామ రాజ్య పరిధిలోని గ్రామాలపై దాడులకు, అరెస్టులకు తెగబడిన ప్రత్యేక పోలీసు బలగాలను ప్రజలను సమీకరించి అడ్డుకున్నాడు. పార్టీ నాయకత్వంలో జరిగిన అనేక ప్రతిఘటన క్యాంపెయిన్లలో పరోక్షంగా, ప్రత్యక్షంగా పాల్గొన్నాడు. 1998లో లోతుగడ్డ బ్రిడ్జి వద్ద జరిగిన ఆంబుష్‌లో పాల్గొన్నాడు. ఈ ఆంబుష్ విజయవంతమై 7గురు పోలీసులు చనిపోయారు. రిట్రీట్ సమయంలో శత్రువుతో జరిగిన కాల్పులలో గాయపడిన కామ్రేడ్స్‌ను సురక్షిత ప్రాంతానికి తరలించడంలో గణపతి బాధ్యతాయుతంగా వ్యవహరించాడు.

కాఫీ పోరాటం ఉధృతమైన నుండి నిర్బంధం మరింత తీవ్రమైంది. అటువంటి పరిస్థితిలో వుద్యమాన్ని రక్షించుకోవడానికి కాఫీ పోరాటాన్ని సంఘటిత పరుస్తూ, ప్రజలను ఐక్యపరుస్తూ, ప్రజా వ్యతిరేకుల కుయుక్తులను ఎదుర్కొంటూ పోరాటాన్ని అభివృద్ధి పథంలో నడిపించాడు. సుదీర్ఘ కాలంగా విప్లవోద్యమాచరణతో పెనవేసుకొని పోయిన గణపతి జీవితం, ఉద్యమమంతో పాటు అనేక ఎగుడు దిగుడులను, ఓటములను, విజయాలను చవి చూసింది. ఏనాడు పార్టీ, ప్రజల ప్రయోజనాలకు భిన్నంగా వ్యవహరించలేదు సరికదా పార్టీ, ప్రజలకు అత్యంత ఆప్తుడిగా, మంచి కార్యకర్తగా విశ్వాసాన్ని చూరగొన్నాడు. ఈ కాలంలోనే అక్టోబరు 19-2014న రాజ్యప్రేరేపిత విప్లవ ప్రతీఘాతకులు కా॥శరత్‌పై దాడి చేస్తుండగా, వారి బారి నుండి ఆ కామ్రేడ్‌ను రక్షించే క్రమంలో తాను కూడా హత్యకు గురయ్యాడు. పీడిత ప్రజల విముక్తి లక్ష్యంగా ప్రజలకు సేవ చేస్తూ నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి తన చివరి రక్తపుబొట్టు నేల రాలే వరకు పోరాడుతూ నేలకొరిగాడు. గణపతిలోని అంకితభావం, తన వర్గం ఎడల అతనికున్న ప్రేమ, చురుకుదనాన్ని, పట్టుదలనూ, సాహసాన్ని పుణికిపుచ్చుకోవడం ద్వారానే గణపతి లేని లోటును పూడ్చుకోగలం. కామ్రేడ్ గణపతి, శరత్ తదితర ఎందరో అమరుల ఆశయాలను నెరవేర్చగలం. ఇదే కా॥గణపతికి మనం ఇచ్చే నిజమైన నివాళి.

**సరైన ప్రాపంచిక దృక్పథం, సిద్ధాంత రాజకీయ విషయాలలో పరిపక్వత, ఆచరణ నుండి నేర్చుకుంటూ నిరంతరం వివిధ రంగాలలో జరిగే మార్పులను అధ్యనం చేస్తూ విశాల ప్రజారాశులపై, పార్టీ శ్రేణులపై ఆధారపడి పరిస్థితికి తగిన నిర్ణయాలు చేసి యావత్తు పార్టీలోకి నిర్ణయాలు తీసుకుని పోయి వారిని కదిలించి అమలు జరిపించగలిగే కార్మికవర్గ దృఢత్వం కలిగి వున్న నాయకత్వం వున్నప్పుడు విప్లవ విజయం గ్యారంటీ అవుతుంది.**

**-మావో**

# ఈస్ట్ డివిజన్

**నిప్పులు చెరిగే నిర్బంధం మధ్యే జులై 28 అమరుల సంస్మరణ:**

జూలై 28 అమరుల సంస్మరణ వారోత్సవాల సభలను ఆటంకపరిచేందుకు శతృవు గాలికొండలో ఏరియా డామినేషన్‌ను చేపట్టాడు. అయినప్పటికీ పత్రిక ప్రకటనలు మొదలుకొని బ్యానర్లు, కరపత్రాలు, పోస్టర్లతో కూడిన ప్రచారం ఏరియా అంతటా జరిగింది. 2013లో కా॥ బి.కె సంస్మరణార్థం నిర్మించిన స్థూపం ఆవిష్కరింపబడక పోవడంతో స్థూపావిష్కరణ ఈ సంవత్సరం జరుగుతుందనే అంచనాతో శతృవు కన్నవరం గ్రామంపైనే కేంద్రీకరించాడు. రెండు రోజులు గ్రామంలోనే మకాం వేసాడు. డామినేషన్ ఆపరేషన్‌ను 5రోజుల పాటు కొనసాగించాడు. అంతటి డామినేషన్‌లో సైతం పి.ఎల్.జి.ఎ ప్రజల మధ్యనే వుంటూ శతృ కదలికలను అధ్యయనం చేసింది. శతృ బలగాల కదలికలను ఎప్పటికప్పుడు ప్రజలపై ఆధారపడి తెలుసుకుంటూ వారి తిరుగు ప్రయాణం ప్రారంభం కాగానే పాకెట్ ప్రజలను సమీకరించి కన్నవరంలో కా॥ బి.కె స్థూపాన్ని ఆవిష్కరించి సంస్మరణ సభను జరిపారు. ఈ సభకు సుమారు 300 మంది ప్రజలు హాజరయ్యారు. అలాగే ఎర్రగడ్డ పాకెట్‌లో ఎ.వి.ఆర్.సి.ఎస్ చొరవతో 200 మంది ప్రజలతో సంస్మరణ సభ జరిగింది. ప్రభుత్వం, పోలీసులు నిరంతరం చేస్తున్న దుష్ప్రచారం, నిర్బంధాన్ని తిప్పికొడుతూ ఈ సభలను విజయవంతం చేసిన ప్రజలు అమరుల త్యాగం వృధా కాదని రుజువు చేసారు.

**ఆగష్టు 15ను చీకటి దినంగా పాటించిన ప్రజలు :**

గాలికొండ ఏరియాలో ఆగష్టు 15ను నిరసన దినంగా పాటించాలని ప్రచారం చేసేందుకు పాకెట్ ఏ.వి.ఆర్.సి.ఎస్, ఎమ్.పి.ఎస్ నిర్మాణాల నుండి ఎంపిక చేయబడిన శక్తులతో రెండు ప్రచార క్యాంపెయిన్ బృందాలు ఏర్పడి 5 రోజుల పాటు దేవరాపల్లి నుండి పెదవలస వరకు ప్రచారం నిర్వహించారు. ఈ ఏడాది ఆగష్టు 15 నిరసన దినం ప్రచారాన్ని బాక్సైటు తవ్వకాల వ్యతిరేక ప్రచారంతో జోడించారు. వాడవాడల నల్లజెండాలు ఎగరవేసి బూటకపు స్వాతంత్ర్యాన్ని ఎండగట్టాలనీ పిలుపునిస్తూ పోస్టర్ల ద్వారా ప్రచారాం చేసారు. పత్రికలకు ప్రకటనలు విడుదల చేసారు. పార్టీ పిలుపునందుకున్న ప్రజాసంఘాలు, మన్యం పితూరీ సేన ఏరియాలో మూడు పాఠశాలల్లోనూ రెండు హాస్టళ్ళ వద్ద నల్లజెండాలు ఎగురవేశాయి. మూడు మండల సెంటర్ల వద్ద నల్ల బ్యానర్లను కట్టి నిరసన తెలిపారు.

**సెప్టెంబరు 21, పార్టీ జన్మదిన వేడుకలు :**

2014 సెప్టెంబరు 21 పార్టీ ఆవిర్భావ, దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శతృవు పార్టీ కార్యక్రమాలను ఆటంకపరిచేందుకు కూంబింగ్, ఏరియా డామినేషన్ ఆపరేషన్‌లను చేపట్టాడు. దీనికి ముందు నెలలో బాక్సైట్ వ్యతిరేక భారీ బహిరంగ సభ విజయవంతం కావడంతో పార్టీ జన్మదిన వేడుకలను ఆటంకపరిచేందుకు సి.ఆర్.పి.ఎఫ్, ఎ.పి.ఎస్.పి, గ్రేహౌండ్స్ బలగాలతో 6 మండలాలను కవర్ చేస్తూ భారీ సైనిక అభియాన్‌ను చేపట్టాడు. ఇంతటి తీవ్ర నిర్బందంలో కూడా పార్టీ పిలుపునందుకున్న ప్రజలు మిలీషియాతో కలసి 5 సెంటర్లలో పోస్టర్లు వేసి, బ్యానర్లను కట్టారు. ఏరియా కమిటీ పత్రికా ప్రకటనను విడుదల చేసింది. సెప్టెంబరు 26న గాలికొండ ఏరియా పార్టీ కమిటీ నాయకత్వంలో రెండు పాకెట్లకు చెందిన మన్యం పితూరి సేన కార్యకర్తలు, మరొక పాకెట్‌కు చెందిన విప్లవ ప్రజానీకం మొత్తం 200 మంది జమై ఈ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కొంతమంది కార్యకర్తలను పార్టీ సభ్యులుగా గుర్తిస్తూ క్యాండిడేట్ మెంబర్‌షిప్‌ను ఇవ్వడం జరిగింది. నిత్య నిర్బంధం మధ్యనే ప్రజలు పార్టీ జన్మదినాన్ని అత్యంత అంకితభావంతో, పట్టుదలతో జరుపుకున్నారు.

**బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా :**

గత పదిహేనేళ్ళుగా నలుగుతూ వస్తున్న బాక్సైట్ సమస్య నేడు పాలకవర్గాలు తీసుకున్న నిర్ణయం వల్ల ప్రజల జీవన్మరణ సమస్యగా తిరిగి ముందుకొచ్చింది. దాంతో ఏరియా పార్టీ కమిటి ప్రణాళికా బద్ధంగా ప్రజా సంఘాలకు ఈ సమస్యపై అధ్యయన తరగతులు నిర్వహించింది. దాంతో పాటు సభ నిర్వహణకై ప్రజా సమీకరణ, ప్రచారం, ప్రసంగాలు, ఆహార ఏర్పాటు, మీడియా...వంటి విషయాలపై లోతుగా చర్చించి నిర్ణయాలు తీసుకుంది. ఆగస్టు 25వ తేదీన వేకువ జామునుండే ప్రజలు సభాస్థలికి చేరుకోవడం ప్రారంభమయ్యింది. రెండు మండలాల నుండి సుమారు 1200 మంది హాజరైన ప్రజలలో అత్యధికులు సాయుధంగా ఉన్నారు. సభకు మన్యం పితూరిసేన బృందాలు సాయుధంగా వంతుల వారిగా రక్షణ కల్పించారు. సభా ప్రాంగణాన్ని ఎర్రజెండాలతో, బ్యానర్లు, ప్లకార్డులతో అందంగా తీర్చి దిద్దారు. ఎ.వి.ఆర్.సి.ఎస్ అధ్యక్షతలో జరిగిన ఈ సభలో ఆపరేషన్ గ్రీన్‌హంట్ నిర్బంధంపైనా, బాక్సైట్ తవ్వకాలపైనా వక్తలు ప్రసంగించిన ఉపన్యాసాలు శ్రోతలను ఆకట్టుకున్నాయి. వక్తలు మాట్లాడుతూ ప్రజలంతా ప్రజాసంఘాలలో చేరాలనీ, ప్రజా రాజ్యాధికారం దిశగా పయనించాలనీ, మన్యం పితూరీ సేనలో చేరి సాయుధంగా బాక్సైట్ తవ్వకాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా హాజరైన ఈ సభ రాష్ట్ర వ్యప్తంగా పత్రికలలోనూ, 5టీవీ ఛానళ్ళలోను ప్రసారమయింది.

**విప్లవ ప్రతీఘాతుకుడు, పోలీసు ఇన్‌ఫార్మర్ నరేశ్‌ను ఖతం చేసిన పి.ఎల్.జి.ఎ :**

నరేశ్ అసలు పేరు ముువ్వల లచ్చు, ఎండకోట గ్రామం. 2001లో పూర్తికాలం కార్యకర్తగా దళంలోకి రిక్రూట్ అయ్యాడు. 2005లో ఎ.సిలోకి ప్రమోట్ అయి 6 నెలల పాటు కమాండర్‌గా పని చేసాడు. శతృ నిర్బంధానికి తాళలేక 2005 చివర్లో శతృవు ముందు మోకరిల్లాడు. అలా మోకరిల్లిన నాటి నుండి శతృ పంచనే ఉంటూ విప్లవ ప్రతిఘాతుకునిగా పరిణమించాడు. ముఖ్యంగా వై.రామవరం సంతలో స్పాటర్‌గా ఉంటూ అనేక మంది విప్లవ ప్రజానీకాన్నీ, కర్యకర్తలనూ, నాయకత్వాన్ని శతృవుకు పట్టించాడు. కొన్ని ముఖ్యమైన ఆపరేషన్‌లలో కూంబింగ్ పార్టీలకు రూట్ గైడ్‌గానూ, గ్రామాలపై శతృవు చేసిన దాడుల సందర్భంగానూ పోలీసులతో కలిసి వచ్చేవాడు. ఒక మాటలో చెప్పాలంటే పలకజీడి ప్రాంత విప్లవ

ప్రజానీకానికి కంటకంగా తయారయ్యాడు. ప్రజల నుండి వస్తున్న బలమైన డిమాండ్ మేరకు వాడిని నిర్మూలించాలని గాలికొండ ఏరియా కమిటీ చేసిన ప్రతిపాదనను ఈస్ట్ డివిజనల్ కమిటీ ఆమోదించింది. ఆ ప్రాంతానికి వెళ్ళిన ఎల్.జి.ఎస్‌కు వాడు బంధువుల ఇంటికి వచ్చి ఉన్న విషయం ప్రజల ద్వారా తెలిసింది. దాంతో అతనిని అదుపులోకి తీసుకొని విచారించడంతో నేరాలు రుజువయ్యాయి. అందువల్ల విప్లవ ప్రతిఘాతుకుడు, పోలీసు ఇన్‌ఫార్మరయిన నరేశ్‌కు మరణశిక్ష విధించడమైనది.

# మల్కనగిరి డివిజన్

**శత్రునిర్బంధాన్ని గేలిచేస్తూ అమర వీరుల వారోత్సవాన్ని విజయవంతం చేసిన ప్రజలు :**

అమర వీరుల వారోత్సవాలను పురస్కరించుకొని ప్రచార టీంలు జూలై 25 నుండి ఏరియా అంతటా విస్తృతంగా తిరుగుతూ కరపత్రాలు, పోస్టర్లు, బ్యానర్ల ద్వారా ప్రచారం చేసారు. నిత్యం రోడ్లపై పోలీసులు తిరుగుతూ బ్యానర్లు తొలగించేవారు. అయితే వారు మరలిన వెంటనే మరల బ్యానర్లు వేసేవారు. శత్రువు ఏరియా డామినేషన్‌లో భాగంగా వేలాది మంది బి.ఎస్.ఎఫ్, ఎస్.ఒ.జి, కోబ్రా బలగాలను సమీకరించి ఏరియాలోని ఆర్.పి.సి గ్రామాల పరిధిలో కూంబింగ్‌లు నిర్వహించాడు. రాత్రి, పగలు తేడా లేకుండా గ్రామాల్ని చుట్టుముట్టి అరెస్టులు చేయడం, కొట్టడం, సరెండర్లకై నోటీసులు పంపడం చేసాడు. మరోవైపు సామాన్లు పంచాడు. ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ అమరులను స్మరించుకునేందుకు ప్రజలు పెద్ద ఎత్తున కదిలారు. అందులో భాగంగా నాగులూరు గ్రామంలో కా॥ శిరీష స్థూపాన్ని నిర్మించి ఆవిష్కరించిన సభలో 1500 మంది, పొట్టేరు గ్రామంలో కా॥ శారద స్థూపావిష్కరణ సభలో 700 మంది, ప్రజలు పాల్గొన్నారు. శీలకోట అమరుల స్థూపాలను మర్రిగట్ట, టేకుగూడ, శీలకోటలలో నిర్మించారు. ఎద్దుగొండలో అమరుల స్థూపం నిర్మించినప్పటికీ భారీ వర్షాల కారణంగా అది కూలిపోయింది. ఈ గ్రామాలతో పాటు సుద్దకుంట వద్ద జరిగిన సభలలో 400-500 మంది, ఈలకట్టలో అమరుల స్థూపం వద్ద 3 వేల మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ సభలలో అమరుల త్యాగాలను ఎత్తిపడుతూ చేసిన ఉపన్యాసాలు, పాటలు, నినాదాలు ప్రజలను ఉత్తేజ పరిచాయి. అన్ని సభలోనూ అమరుల కుటుంబాలను పరిచయం చేస్తూ వారికి ప్రజల నుండి సేకరించిన బట్టలు, డబ్బులు పంపిణీ చేసారు. కుటుంబానికి రెండు మొక్కలు ఇచ్చి (100) నాటించారు. శీలకోట గ్రామంలో ప్రజలు, పార్టీ భాగస్వామ్యంతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌కు శీలకోట అమరుల పేరు పెట్టారు. ప్రజలు శత్రు నిర్బంధాన్ని, సంస్కరణల్ని తిప్పికొడుతూ,అమరుల ఆశయాలను ఎత్తిపడుతూ వారోత్సవాలు విజయవంతం చేసారు.

**రాజకీయఖైదీల విడుదల కోసం :**

ఆగస్టు 15ను బ్లాక్‌డేగా పాటించాలనీ, రాజకీయ ఖైదీల విడుదల కోసం ఆ రోజున బంద్ పాటించాలనీ, మల్కనగిరి డివిజన్ కమిటీ పిలుపు మేరకు ఆగస్టు 5నుండి 15వరకు వివిధ కార్యక్రమాలు జరిగాయి. రాజకీయ ఖైదీల విడుదల కోసం కలిమెల ఎ.సి పరిధిలో ఒక కమిటీని నిర్మాణం చేసారు. మర్రిగట్ట గ్రామంలో జరిగిన సభకు 300 మంది ప్రజలు హాజరయ్యారు. ఈ సభకు మీడియా కూడా రావడంతో విస్తృత ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా ప్రజలు భద్రతా దళాలు ప్రజలపై అమలు చేస్తున్న జులుంను తీవ్రంగా ఖండిస్తూ 'తాము పుట్టి పెరిగిన అడవిలో స్వేచ్ఛగా తిరగడానికి వీలు లేనప్పుడు స్వాతంత్ర్యం ఎలా వచ్చిందని' ప్రశ్నించారు. సుద్దకుంట గ్రామంలో 300 మందితోనూ, పొడియా బ్లాక్‌లోని వుంద్రుకొండ గ్రామంలో 5వేలమందితో జరిగిన సభలో కాగాడాల ప్రదర్శన చేసి నవీన్ పట్నాయక్, మోడీల దిష్టిబొమ్మలను దగ్ధం చేసారు. అలాగే మట్టేరు గ్రామంలో 3వేల మందితో ప్రదర్శన, మీటింగ్ జరిగింది. ఈ సభలలో బాధిత కుటుంబాలకు వ్యవసాయ పనులలో సహకరించాలని ఆర్.పి.సిలు నిర్ణయించాయి. పొడియా బ్లాక్‌లో ఖైదీల కుటుంబాల కోసం వసూలు చేసిన నిధులను వారికి అందించారు.

ఈ కార్యక్రమాలకు ముందుగానే కరపత్రాలు, బ్యానర్లు, పోస్టర్ల ద్వారా విస్తృత ప్రచారం చేయడం ద్వారా, విద్యా సంస్థలకు, ప్రభుత్వ సంస్థలకు, వ్యాపారులకు విజ్ఞప్తి చేయడం ద్వారా వివిధ సెక్షన్‌ల ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. అనేక పాఠశాలలో నల్ల జెండాలు ఎగురవేసారు. పార్టీ పిలుపును విజయవంతం చేసారు.

**పార్టీ దశాబ్ది ఉత్సవాలను (సెప్టెంబర్ 21)విజయవంతం చేసిన ప్రజలు :**

స్థానికంగా పార్టీ, విప్లవ ప్రజా కమిటీలు, మిలీషియా, వివిధ ప్రజా నిర్మాణాలు కలిసి సి.పి.ఐ(మావోయిస్టు) పార్టీ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని సెప్టెంబర్ 21 నుండి 30 వరకు విభిన్న కార్యక్రమాలను చేపట్టారు. అందులో భాగంగా మర్రిగట్ట, టేకుగూడ, సుద్దకుంట పాకెట్‌లలో మీటింగులు జరిగాయి. పప్పులూరు పంచాయితీ సరిగట్టలో జరిగిన మీటింగులో 1500 మంది, ఆలూరుకోటలో 300 మంది, బందగూడలో 1900 మంది, గుముకలో 300 మంది చొప్పున పాల్గొన్నారు. అన్ని సభలలోనూ జి.ఎన్.ఎస్ పాటలు, నృత్యాలు, నాటికల ద్వారా పార్టీ ప్రాముఖ్యతను ప్రజలకు అర్థం చేయించింది. ప్రజలు తమ ఇండ్లపై, అడవిలోని పెద్ద కొండలపై ఎర్ర జెండాలను ఎగురవేసారు. ఒక రోజున ఆదివాసీ సాంప్రదాయం ప్రకారం "థింసా", "డాకా" నాటికలను ప్రదర్శించారు. మరొక రోజు సామూహికంగా వంటలు చేసుకొని భోజనాలు చేసారు. చివరి రోజున ఊరేగింపుగా బయలుదేరి సభలు నిర్వహించారు. ఆ సభలలో ఆర్.పి.సి అధ్యక్షులు ప్రసంగిస్తూ జనతన సర్కారులను రక్షించుకోవాలనీ, మిలీషియాను పటిష్టవంతం చేయాలనీ, శత్రు కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాలు ప్రజల చైతన్యాన్ని మరో మెట్టు ఎదిగించడానికి ఉపయోగపడ్డాయి.

**ఆధార్ కార్డు సెంటర్‌పై మిలీషియా దాడి :**

కలిమెల బ్లాక్ మర్రిగట్ట గ్రామంలో ఆధార్ కార్డు బయోమెట్రిక్ రిజిస్ట్రేషన్ కేంద్రంపై 15 మంది మిలీషియా సభ్యులు దాడి చేసారు.

ఆధార్ కార్డు కార్యక్రమం నిలిపివేయాలని సుప్రీం కోర్టు చెప్పినప్పటికీ దీన్ని కొనసాగించడం వెనుక దోపిడీ పాలక వర్గాల, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయనీ, ప్రజల వ్యక్తిగత సమాచారానికి భద్రత లేకుండా పోవడంతో పాటు పోలీసు నిర్బంధం పెరుగుతుందనే వాస్తవాలను అక్కడ ఉన్న ప్రజలకు, అధికారులకు అర్థం చేయించారు. ప్రజల ప్రయోజనాలకు భంగకరమైన ఈ ప్రక్రియను పార్టీ వ్యతిరేకిస్తుందనీ తెలియజేస్తూ 4కంప్యూటర్లు, 2 బ్యాటరీలు, 2 ఇన్‌వర్టర్‌లు, వెబ్ కెమెరాలు, ఫింగర్ ప్రింట్ బాక్సులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు పార్టీ లేఖను యు.ఐ.డి అధికారులకు అందజేయడంతో పాటు పత్రికా ప్రకటన ఇచ్చారు.

### లంచగొండి అధికారులకు వ్యతిరేకంగా గొంతెత్తిన ప్రజ :

కలిమెల బ్లాక్‌లోని పిల్లలు పాఠశాల ప్రవేశానికి అవసరమైన కుల, స్థానికత, ఆర్థిక సర్టిఫికెట్లకై అనేక అవస్థలు పడుతున్నారు. వీటిని జారీ చేయాల్సిన తహసిల్దార్, ఇతర ఉద్యోగులు ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వీటి కోసం భూమి పట్టా కావాలనీ, పట్టా వున్నప్పటికీ శిస్తూ కట్టలేదనీ, మొత్తం శిస్తు చెల్లించాలనీ...వగైరా కారణాలు చూపుతూ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. లంచాలు ఇచ్చిన వారికి ఏ ఆటంకాలు కల్పించకుండా ఇస్తున్నారు. సర్టిఫికెట్లు లేని కారణంగా అనేక మంది పిల్లలు ఈ సంవత్సర విద్యా కాలాన్ని కోల్పోయారు.

కలిమెల ప్రభుత్వ హాస్పిటల్‌లో పని చేస్తున్న డాక్టరు అవినీతి, పిల్లల అమ్మకం మొదలగు ఆరోపణలపై పనిష్మెంట్‌పై బదిలీ అయి వచ్చాడు. తన పాత పద్ధతులను కొనసాగిస్తూ ప్రజలకు సరైన వైద్య సౌకర్యాలు కల్పించడం లేదు. డెలివరీ కేసులను లంచం ఇస్తేనే చేస్తాననడం, మందులను అమ్ముకోవడం, లంచాలు ఇచ్చిన వారికి వైద్యం చేయడం, మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించడం చేస్తున్నాడు.

ఈ క్రమంలో తహసిల్దార్, డాక్టర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలనీ, భూమి పట్టా లేకున్నా సర్టిఫికెట్లు ఇవ్వాలనీ, అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బొడిగడ్డ, తెల్లరాయి, బెజ్జంగివాడ, గంపకొండ, మన్యంకొండ, నల్గొండి పంచాయితీ గ్రామాలకు చెందిన బెంగాలీ, ఒడియా, ఆదివాసీ ప్రజానీకం 3వేల మంది జమై కలిమెల సంత నుండి బి.డి.ఓ ఆఫీసుకు ర్యాలీగా వెళుతుండగా ర్యాలీకి అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో కొందరు నాయకులు బి.డి.ఓ ఆఫీసుకు వెళ్ళి డిమాండ్ల పత్రం అక్కడ ఉన్న అధికారులకు ఇచ్చి సమస్యలు పరిష్కారం కాకుంటే మరల పోరాటం చేస్తామని హెచ్చరించి వెనుదిరిగారు. ఈ ర్యాలీకి భయపడిన పై అధికారులు సెలవులపై వెళ్ళిపోయారు. నిర్బంధ పరిస్థితిలో కూడా ఇలా ర్యాలీ చేయడం ప్రజల యొక్క చైతన్యాన్ని, ధైర్యాన్ని పెంచడంతో పాటు పోలీసులు, ప్రభుత్వంపై కసిని పెంచడానికి వుపయోగపడింది.

### ఇన్‌ఫార్మర్లు, ప్రజా పీడకుల ఖతం కార్యక్రమాలు :

#### బోదెల్‌గ్రామ పెత్తందారు(పెద్దాల్) :

బోదెల్ గ్రామంలోని గ్రామ పెత్తందారయిన (పెద్దాల్) దేవాల్ అనేక సం॥ల నుండి ప్రజలపై పెత్తనం చెలాయించడం, గ్రామంలోని సంఘ నాయకత్వాన్ని బెదిరించడం, గ్రామానికి వచ్చిన దళానికి కనీసం అన్నం కూడా పెట్టకుండా ప్రజల్ని కంట్రోల్ చేయడం, మహిళల్ని దళాల దగ్గరకి రాకుండా అసభ్యంగా మాట్లాడటం చేసేవాడు. అంతే కాకుండా సంఘ నాయకత్వంపై కక్ష కట్టి దాడులు చేయించడం, చేపల చెరువులపై తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ చెరువుల నుండి వచ్చే ఆదాయాన్ని తానే మింగి వేసేవాడు. దీన్ని వ్యతిరేకిస్తూ ప్రజలు పెద్దాల్‌కు దేహశుద్ధి చేసారు. తిరిగి 2010లో సంఘం వాళ్ళను బెదిరించడం చేస్తుంటే సంఘ నాయకత్వంలో ప్రజలు వాడికి తీవ్రంగా దేహశుద్ధి చేయడం జరిగింది. 2013 నాటికి గ్రామంలో ఆర్.పి.సిని నిర్మించుకొని ప్రజల ఆధిపత్యంతో అన్ని కార్యకలాపాలు సాగుతుండేవి. దీన్ని సహించలేక అనేకసార్లు ఆర్.పి.సి సభ్యులను బెదిరించేవాడు. 2013లో గంపకొండ, ఎమ్.వి21, చింతవాడలలో పోలీసు క్యాంపులు రావడంతో ప్రజలపై పోలీసులు దాడులు, నిర్బంధం పెరిగి ఆర్.పి.సి నిర్మాణం బలహీనపడింది. ఇదే అవకాశంగా తీసుకొని పోలీసుల బలంతో మిలీషియా, సంఘ సభ్యులను బెదిరించి సరెండర్స్, అరెస్టులు చేయించేవాడు. తిరిగి గ్రామంలో ఆధిపత్యం చెలాయించేవాడు. చిన్నటేకుగూడ, పెద్ద టేకుగూడ గ్రామాల ప్రజలు బొదెల్ దాటి వెళ్ళాలంటే వీడి భయంతో బెజ్జంకివాడ సంతకు వెళ్ళడం బంద్ పెట్టుకున్నారు. బొదెల్ గ్రామ ప్రజలు టేకుగూడ వైపు బంధువులను కలిసేందుకు వెళ్తే మీరు అన్నలను కలవడానికే వెలుతున్నారని బెదిరించేవాడు. ఆర్.పి.సి అధ్యక్షురాలిగా ఉన్న కామ్రేడ్ పొదియా వీడి బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకున్నది.

గ్రామపెద్దాల్‌గా ఉన్న దేవాల్‌కు గంగాల్ (ఇన్‌ఫార్మర్)తోడు కావడంతో వీరి ప్రజా వ్యతిరేక కార్యకలాపాలు మరింత ఊపందుకున్నాయి. తన పద్ధతులు మార్చుకోవాలని పలుమార్లు హెచ్చరిస్తూ దేహశుద్ధులు చేసినప్పటికీ తన ప్రవర్తనలో మార్పు రాకపోగా మరింత నష్టదాయకంగా పరిణమించాడు. ఈ పరిస్థితులలో గ్రామ ప్రజల సమక్షంలో ప్రజా పంచాయితీ నిర్వహించి వీడిని ఖతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలనుండి 100మంది ప్రజలు పాల్గొన్నారు.

### పోలీసు ఇన్‌ఫార్మర్ మదనొ :

మల్కనగిరి జిల్లా, కలిమెల బ్లాక్ తెల్లరాయి పంచాయితీ కొరంజిగూడ గ్రామంలోని మదనొ పోలీసు ఇంటలిజెన్సీ వాడితో సంబంధంలో ఉంటూ దళం వచ్చినప్పుడు సమాచారం చేరవేస్తూ ఉండేవాడు. కొందలగూడ గ్రామంలోని సంఘం వాళ్ళ సమాచారం ఇవ్వడంతో వారిని కలిమెలలో పోలీసులు పట్టుకొని ప్రశ్నించడంతో తమ పేర్లు తప్పుగా చెప్పి తప్పించుకున్నారు. దళం వాడి ఊరిలో మకాం వేసినప్పుడూ, దళం కొరంజిగూడ నుండి వెళ్ళేటప్పుడు సమాచారం ఇచ్చేవాడు. దళం ఎక్కువ రోజులు అక్కడ మకాం వేయకపోవడం వల్ల నష్టం జరగలేదు. పార్టీనీ, సంఘ నాయకత్వాన్ని దెబ్బతీయడానికి అతను చేస్తున్న ప్రయత్నాలకు అడ్డుకట్ట వేయడానికై కొరంజిగూడ, కొందలగూడ గ్రామ ప్రజల సమక్షంలో ప్రజాకోర్టు నిర్వహించడమైనది. ప్రజలకు, పార్టీకి మదనొ చేస్తున్న నష్టాలు, నేరాలు రుజువు కావడంతో అతనికి మరణశిక్ష విధించడం జరిగింది.

### పొట్టేరు గ్రామ పెద్దాల్ :

కలిమెల బ్లాక్ మన్యంకొండ పంచాయితీ, పొట్టేరు, మంగుగూడ గ్రామాల పెద్దాల్ 1998 నుండి సంఘానికి వ్యతిరేకంగా

వుంటూ వస్తున్నాడు. 2003లో సమిష్టి చేపల చేరువులోని చేపల్ని తాను ఒక్కడే అమ్ముకొని ఫలసాయం పొందాడు. ఇది సరైనది కాదని ఎన్నిసార్లు నచ్చచెప్పినా వినకపోవడంతో ప్రజలంతా కలిసి దేహశుద్ధి చేసారు. అప్పటి నుండి పార్టీకీ, సంఘానికి వ్యతిరేకంగా వుంటూ సంఘ నాయకత్వాన్ని అరెస్టు చేయించడం, మరల తనే విడుదల చేయించి తెచ్చి వారిని తన కంట్రోల్‌లో పెట్టుకోవడం చేసేవాడు. సంఘం అధ్యక్షుడు కా॥ పొదియాల్ వీడి కార్యకలాపాలను వ్యతిరేకించినందుకు పోలీసులను తీసుకువచ్చి ఇంట్లో నిద్రిస్తున్న కా॥ పొదియాల్‌ను చంపించి వేసాడు. 2011లో పార్టీ వీడిని శిక్షించడానికి ప్రయత్నించగా తప్పించుకున్నాడు. చివరికి ఇతడి భార్యసైతం పెద్దాల్ పోలీసులతో సంబంధాలలో ఉన్నాడనీ, ఎల్లప్పుడు తనని హింసిస్తుంటాడనీ దళానికి రిపోర్టు చేసింది. దాంతో పెద్దాల్ ఆమెను హత్య చేసి ఎస్.పి దగ్గరకు వెళ్ళి నక్సలైట్‌లు హత్య చేసారని రిపోర్టు చేసాడు. దీనికి ఎస్.పి. స్పందిస్తూ కేసు ఎమ్.వి 79 పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుంది, కాబట్టి అక్కడ రిపోర్టు చేయమని చెప్పాడు. ఎమ్.వి 79 పోలీసులు వచ్చి ఎంక్వైరీ చేయగా విషయం అర్థమై పెద్దాల్‌ను జైలుకు పంపారు. ఈ కేసులో ఏ మాత్రం సంబంధం లేని మరో నలుగుర్ని ఇందులో ఇరికించారు. జైలునుండి విడుదలైన తరువాత కూడా పెద్దాల్ ప్రవర్తనలో మార్పు రాలేదు. కా॥ ఎర్రాల్(లాలు) సంస్మరణ సభను మంగుగూడలో పెట్టగా ఇతను రాత్రికి రాత్రే ఎమ్.వి 79 పోలీస్‌స్టేషన్‌కు పోయి సమాచారం అందించడంతో తెల్లవారుజామునకే పోలీసులు ఆ గ్రామాన్ని చుట్టుముట్టారు. అంతకు ముందే దళం అక్కడ నుండి వెళ్ళిపోవడంతో ప్రమాదం తప్పింది. అమరురాలు కా॥ శారదకు స్మారక స్థూపం కట్టిన సంఘం వారిపై పోలీసులకు సమాచారం ఇవ్వడం వల్ల వారు ఇల్లు వదిలి అడవిలో ఉండే పరిస్థితి ఏర్పడింది.

ఈ పరిస్థితుల్లో ప్రజాభిప్రాయం మేరకు వీడిని ఖతం చేయడం జరిగింది.

**నామగొండ గూండా ఇర్మాల్ :**

ఈ ప్రాంతంలో 2004 వరకు మన సంఘ కార్యకలాపాలు క్రియాశీలకంగా ఉండటంతో పెద్దాల్‌ల యొక్క ఆధిపత్యానికి స్థానం లేకుండా పోయింది. సంఘ నాయకత్వం అక్రమ అరెస్టుల వల్ల, దీర్ఘకాలం జైలులో ఉండటం వల్ల తిరిగి పెద్దాల్ కుటుంబానికి చెందిన ఇర్మాల్ ఆధిపత్యం చెలాయిస్తూ వస్తున్నాడు. పంచాయితీలు నిర్వహించి, మేకలు, గొడ్లు ఫైన్ వేసి ప్రజల్ని దోపిడీ చేసేవాడు. ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తూ పోలీసు కేసులు పెట్టిస్తానని బెదిరించేవాడు. గ్రామంలోని ఒక వితంతు మహిళా భూమిని ఆక్రమించి ఆమెను కొట్టి ఊరి నుండి వెళ్ళగొట్టాలని ప్రయత్నం చేసాడు. వీడి గుండాగిరితో విసిగిపోయిన ప్రజల డిమాండ్ మేరకు వీడిని ఖతం చేయడం జరిగింది.

**ఇన్‌ఫార్మర్ మున్నా:**

పొడియా బ్లాక్ మట్టేరు పంచాయితీ ఎర్రబామ్మపాతు గ్రామంలోని మున్నా పోలీసుల సంబంధంలో ఉంటూ దళం, సంఘాల సమాచారాన్ని పోలీసులకు ఇచ్చేవాడు. సంతలకు పోతున్న ప్రజలపై, వారు కొంటున్న సామాన్లపై నిఘా పెట్టి సమాచారం సేకరించేవాడు. దళం మీటింగ్ అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చత్తీస్‌ఘడ్, ఒడిశా పోలీసులు సంయుక్తంగా కూంబింగ్‌లు నిర్వహించి దళం ఆచూకీ చెప్పమంటూ ప్రజల్ని కొట్టేవారు. వాడిని శిక్షించటానికి అనేక మార్లు ప్రయత్నం చేసి చివరకు సంతలోనే వీడిని ఖతం చేయడం జరిగింది

# శ్రీకాకుళం-కోరాపుట్ డివిజన్

**దేహశుద్ధులు :**

గుమ్మండి పాకెట్‌లో ప్రజావ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కొద్దిమందిని స్థానిక పార్టీ 4-6-2014 రాత్రి గుమ్మండి గ్రామంలో (పైగుమ్మండి, క్రిందిగుమ్మండి) ప్రజలలో పెట్టి విచారించి శిక్షలు విధించింది. వివరాలు...గుమ్మండి పంచాయితీ ప్రజలందరూ ఎన్నికల బహిష్కరణ పిలుపునిచ్చి పత్రికలకు స్టేట్‌మెంట్ ఇవ్వగా కొద్దిమంది పెత్తందార్లు, రాజకీయ పార్టీల కార్యకర్తలు (బి.జె.డి., కాంగ్రెస్) ప్రజలకు తెలియకుండా బి.జె.డి. తరపున 9 వేలు, కాంగ్రెస్ తరపున 5 వేలు, ఒక్కో పోలింగ్ బూత్‌కు 14 వేల రూ॥ల చొప్పున డబ్బులు తీసుకున్నారు. ప్రజలకెవరకీ తెలియకుండా తిన్నారు. ఎన్నికలలో ప్రచారం చేయటంతో పాటు ఓట్లు వేయకపోతే ప్రభుత్వ పథకాలు ఏమి లభించవనీ, పెద్ద ఎత్తున పోలీసు బలగాలు వస్తాయనీ, కొడతారనీ, అరెస్టులు చేస్తారనిఇలా రకరకాల దుష్ప్రచారాలతో ప్రజలను బెదిరించి, ఒత్తిడి తెచ్చి ఓట్లు వేయించారు. అలా డబ్బులు తిన్న వాళ్లలో పై గుమ్మండి దివాకర్ (బికాస్ సంస్థ తరపున కాంట్రాక్టు పనులు చేస్తాడు), క్రిందిగుమ్మండి కొసమ (నారాయణపట్నాలో పోలీసులతో ఉంటున్న రంజు అనే పాత సంఘ నాయకుడు)తో కలిసి ఓట్ల డబ్బులు తీసుకుని దాచుకున్నాడు. వీరిని ప్రజల ముందు పెట్టి దేహశుద్ధి చేయగా తప్పు ఒప్పుకొని డబ్బులు తెచ్చి ప్రజలకు ఇచ్చారు. వీళ్లు బయట ప్రాంతాలకు పోరాదని కండిషన్స్ పెట్టి హెచ్చరించారు.

-రెల్లి (దీసరి), దాడయ్య, గుల్ల వీళ్లు ముగ్గురూ సంఘానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. ఇదే సమస్య విషయంలో గతంలో ఒకసారి దాడయ్య, గుల్లాలకు దేహశుద్ధి చేసి హెచ్చరించినా కొంత కాలం కంట్రోల్‌లో వుండి, మళ్లీ సంఘం బలహీనపడటంతో ప్రజలపై ఆధిపత్యం, పెత్తనం చెలాయించటం మొదలు పెట్టారు. దాంతో వీళ్ల ముగ్గురికీ కూడా ప్రజల ముందే దేహశుద్ధి చేసి హెచ్చరించారు.

-సారా తీసుకొచ్చి గ్రామంలో అమ్ముతున్న వాళ్ల పేర్లు ప్రకటించి వాళ్లందరూ వెంటనే సారా అమ్మటాన్ని మానుకోకపోతే సీరియస్ చర్యలకు గురికావలసి ఉంటుందని చెప్పి, ప్రజల ముందు వాళ్ల తప్పును ఒప్పించి హెచ్చరించి విడిచిపెట్టారు.

–ఆంద్రి, అల్లమ (మాజీ సంఘ నాయకులు పారిపోయి కొంత కాలం నారాయణపట్నా, ఆంధ్రలో వుండి తిరిగి వచ్చి గ్రామంలో వుంటున్నారు)లను ప్రజల ముందు విచారించి కండిషన్స్ పెట్టి, వాళ్ల దగ్గర వున్న సెల్‌ఫోన్స్ ను స్వాధీనం చేసుకుని, తప్పు ఒప్పించి విడిచి పెట్టారు.

చాలా కాలం తర్వాత పార్టీ ఈ పంచాయితీ గ్రామంలో మీటింగ్ పెట్టడం మంచి ప్రభావం వేసింది. ఇప్పటికే ఈ ప్రాంతంలో పార్టీకి, సంఘానికి వ్యతిరేకంగా జరుగుతున్న దుష్ప్రచారం వల్ల ప్రజల్లో భయాలు, గందరగోళాలు నెలకొని వున్న పరిస్థితుల్లో పార్టీ నిర్వహించిన ఈ మీటింగుల వల్ల గ్రామంలో సానుకూల వాతావరణం ఏర్పడింది. ఇది జరిగిన తరువాత చుట్టు పక్కల గ్రామాల్లో కూడా ఓట్ల డబ్బులు తెచ్చుకొని తిన్నవాళ్లంతా డబ్బులన్నీ ప్రజలకు ఇచ్చేస్తామని ప్రజా సంఘాల నాయకుల చుట్టూ తిరిగి, ఆ డబ్బుల్ని ప్రజలకు అప్పచెప్పారు.

### మసానమండ సునీతకు :

మసానమండ గ్రామానికి చెందిన సునీత గతంలో పార్టీలో పని చేసి ఇంటికి వెళ్ళి పోయింది. తర్వాత అరెస్టయి బెయిల్‌పై విడుదలై వచ్చింది. అయితే అరెస్టు సందర్భంగా బలహీనపడి పార్టీ సమాచారం శతృవుకు తెలపడంతో పాటు విడుదలై వస్తున్నప్పుడు నారాయణపట్నాలోని టుటు మహంతి, (కాంట్రాక్టర్) దొయితరి (ఎస్.పి.ఒ)లతో సంబంధాలు ఏర్పరచుకున్నది. అంతే కాకుండా గతంలో మసానమండ గ్రామసంఘ నాయకుడిగా, ఆర్.పి.సి అధ్యక్షుడిగా పని చేసిన సంబ్ర ఫోన్ నంబర్ వారికి ఇచ్చింది. దాంతో వారు సంబ్రకు నిత్యం ఫోన్ చేస్తూ అతనిని పోలీసులకు అనుగుణంగా మార్చి వేసారు. ఈ విషయాలేవి ఏరియా కమిటీ దృష్టిలో లేవు. 2013 డిసెంబర్‌లో సంబ్రను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తర్వాత అతని గురించి ఎలాంటి సమాచారం లేదు. అతను పోలీసులతో కలిసి గ్రామాలకు వస్తున్నాడని కొన్ని గ్రామాల ప్రజలు చెప్పినప్పటికీ అతని కుటుంబ సభ్యులు మాత్రం అదంతా దుష్ప్రచారం అని పార్టీకి తెలియజేసి అతనికై ఆందోళన చెందారు. కుటుంబ సభ్యులు చెప్పినది నిజమేనని నమ్మిన ఏరియా కమిటీ కొరాపుట్‌లో కలెక్టర్ ఆఫీసు వద్ద ధర్నా చేయమని 2వేల రూపాయలు ఇచ్చింది. 2014 మార్చిలో ఆ గ్రామానికి పార్టీ పోయినప్పుడు సంబ్ర జైలులో ఉన్నాడనీ, కలిసి వచ్చామని అతని కుటుంబం తెలిపింది. ఆ రోజు సునీత, లక్ష్మీ (సంబ్ర మరదలు) పార్టీకి తెలియకుండా నారాయణపట్నా సంతకు వెళ్ళారు. అదేరోజు రాత్రి దళం రోడ్డు దాటడానికి పోగా రోడ్డుకు అవతల పోలీసులు ఆంబుష్‌లో ఉన్న విషయం ప్రజల ద్వారా తెలుసుకొని వెనక్కి మరలి పోయారు. తిరిగి 2014 జూన్‌లో ఆ ప్రాంతానికి పోయినప్పుడు సంబ్ర జైలులో లేడనీ, కొరాపుట్‌లో పోలీసులతో కలిసి ఉంటున్నాడని తెలిసింది. కుటుంబ సభ్యులు కూడా అతనిని కలిసి వస్తున్నారని తెలిసింది. సంబ్ర భార్యను అడగగా నిజమేనని ఒప్పుకొని ఆమెతో పాటు లాలు అనే వ్యక్తి, మరికొందరు పోలీసులతో సంబంధంలో ఉన్న విషయం తెలిపింది. దీంతో పైమసానమండ, క్రిందిమసానమండ, కంబిపాయ్ గ్రామాల ప్రజలముందు ఆమెను హాజరు పర్చి సంబ్ర పోలీసులతో సంబంధాలు వదులుకొని వచ్చి గ్రామంలో ఉండాలనీ, ఆమె కూడా గ్రామం విడిచి ఎక్కడకు పోరాదని ఆంక్షలు విధించారు. మీటింగ్ ముగించుకొని దళం పోతుండగా దారిలో దుంబగూడ–గౌద్రగూడ రోడ్డుపై పోలీసులు ఉన్నారని తెలిసింది. దాంతో సునీత, లాలుల గురించి ఎంక్వయిరీ చేయగా వారు ఉదయమే నారాయణపట్నా వెళ్ళినట్లు తెలిసింది. తిరిగి 13-6-2014 రాత్రి మసానమండ గ్రామానికి పోగా లాలు పారిపోయాడు. సునీతను అదుపులోకి తీసుకోగా పోలీసులతో తను చేసుకున్న ఒప్పందాలను చెప్పడంతో పాటు సంబ్ర పోలీసులతో ఉంటూ ఎంత మందిని సరెండర్ చేయించింది తెలియచేసింది. సునీతను ప్రజల ముందు హాజరు పర్చి వారి తీర్పు ప్రకారం దేహశుద్ధి చేయడంతో పాటు సంబ్ర, సునీత, లాలు కుటుంబాలు గ్రామం విడిచి పోవాలని హెచ్చరించారు.

### పోలీసు ఇన్‌ఫార్మర్ల ఇండ్లు ధ్వంసం :

బొరిగి పంచాయితీలో ఆర్.పి.సి. అధ్యక్షుడిగా పని చేసిన మల్లేష్ (లెల్లిపాయ్), రమేష్ (మంజరిగూడ), బొరిగి గ్రామానికి చెందిన రుహిణి అనే వాడితో కలిసి 2013 ప్రారంభంలో విజయనగరం పోలీసుల వద్ద సరెండర్ అయ్యారు. ఆ తరువాత కొంత కాలం నారాయణ పట్నాలో వుండి తిరిగి గ్రామానికి వచ్చారు. వారిని కలిసి మాట్లాడటానికి దళం అనేక సార్లు ప్రయత్నించగా ఆ పాకెట్‌లోకి దళం వచ్చిన సమాచారం తెలిసి పారిపోతున్నారు. ఇప్పటికే 3, 4 సార్లు ఆ గ్రామాల్లో మీటింగ్స్ పెట్టి వీళ్లు పద్ధతి మార్చుకోవాలని, పార్టీని కలిసి తప్పులు ఒప్పుకొని, పార్టీ, ప్రజలు పెట్టిన కండిషన్స్‌కు కట్టుబడి వుండాలని, ఎక్కడకూ తిరగరాదని చెప్పడం జరిగింది. కానీ వీళ్లు దాన్ని ఖాతరు చేయకుండా, నారాయణపట్నం, విజయనగరం, పార్వతిపురం తిరగటం, త్రాగటం, ప్రజలను బెదిరించటం చేస్తూనే వున్నారు. వీళ్లతో పాటు నేలబద్ర గ్రామానికి చెందిన కొసమ అనేవాడు కూడా పార్టీకి వ్యతిరేకంగా ప్రచారం చేయటం, పుకార్లు పుట్టించటం, ప్రజలను భయ భ్రాంతులకు గురి చేయటం వంటి పనులు చేసి నారాయణపట్నం పారిపోయి కొంత కాలం వుండి తిరిగి వచ్చి గ్రామంలో వుంటున్నాడు. రమేష్, మల్లేష్‌లు ఇచ్చిన సమాచారంతో 2-8-2014 న పోలీసులు కాత్ర (లెల్లిపాయ్ మిలీషియా) అనే కామ్రేడ్‌ను అరెస్టు చేసి అతడి వద్ద నున్న పార్టీ దంపులను స్వాధీనం చేసుకుని 4 రోజుల తరువాత విడిచి పెట్టారు. ఈ విషయాలన్నీ చుట్టు పక్కల గ్రామాల ప్రజలతో దళం చర్చించి 10-8-2014 న మంజరిగూడ, లెల్లిపాయ్, నేలబద్ర గ్రామాలకు వెళ్లేటప్పటికి ఎప్పటిలాగే రమేష్, మల్లేష్, కొసమలు మళ్లీ పారిపోయారు. దాంతో ఆ గ్రామాల్లో మీటింగులు పెట్టి ప్రజలకు విషయం అర్థం చేయించడంతో ఈ ముగ్గురి ఇండ్లలో వున్న సామాగ్రినంతా బయటపడేసి ఇండ్లను ధ్వంసం చేయడంతో

పాటు ఈ కుటుంబాలు గ్రామాలు ఖాళీ చేసి వెళ్లిపోవాలని తీర్పునిచ్చారు.

**ఖతం కార్యక్రమాలు :**

**ఉత్తర (ఆశిష్ సావంత)**

టాకుబెడ్డ గ్రామానికి చెందిన ఉత్తర బి.జె.డి. కార్యకర్తగా కాంట్రాక్టర్‌గా పనులు చేసి డబ్బుల్ని స్వాహా చేయడం, దేబో (దేబో అనేవాడు గతంలో అస్సాం రైఫిల్స్‌లో పని చేసి అక్కడ ఒక మహిళను తీసుకుని పారిపోయి వచ్చి ఇక్కడ సిమిలిగూడ పోలీసుల లింక్‌లో వున్నాడు) సంబంధాలలో వుండి పోలీసు ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తూ పార్టీ సమాచారాన్ని అందించటం చేస్తున్నాడు. గతంలో గాసి ఈ ఏరియాలోపని చేస్తున్నప్పుడు, ఆ తరువాత కూడా పార్టీ అనేక సార్లు హెచ్చరించినా వీడు తన పద్ధతులను మార్చుకోకపోగా గాసీను అరెస్టు చేయించటంలో కూడా భాగమయ్యాడు. అప్పటి నుండి వీడు ఎక్కువ శాతం సిమిలిగూడలోనే వుంటూ అప్పుడప్పుడు గ్రామానికి వస్తున్నాడు. చుట్టు పక్కల గ్రామాల్లో యువకులను ఎస్.పి.ఓ.లుగా, ఇన్‌ఫార్మర్లుగా తయారు చేయటానికి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాడు. పార్టీ కంటి ఏరియాలోకి అడుగు పెట్టిన వెంటనే సమాచారాన్ని తెలుసుకొని గ్రామానికి రాకుండా సిమిలిగూడలోనే వుంటూ, శత్రువుకు సమాచారం చేరవేస్తున్నాడు. అంతే కాకుండా గత ఎన్నికల్లో కూడా ఈ పంచాయితీ (కంటి) ప్రజలు ఎన్నికలను బహిష్కరిస్తే వీడు బి.జె.డి కార్యకర్తగా ఎలక్షన్ రోజు బైక్‌పై అన్ని గ్రామాలకు తిరిగి కొన్ని గ్రామాల ప్రజలను బెదిరించి, పుకార్లు సృష్టించి బలవంతంగా ఓట్లు వేయించాడు. 21-6-2014 రాత్రి వీడిని టాకుబెడ్డ గ్రామంలోనే పట్టుకొని, ప్రజల ముందు విచారించి వారి ఆమోదం మేరకు ఖతం చేయడమైనది.

## కోమన్న ఖతం, ఫారెస్టు బిల్డింగ్ ధ్వంసం :

బందుగాం బ్లాక్ దశిని గ్రామానికి చెందిన కోమన్న గతంలో బందుగాం ఛసిమూలియా సంఘం (అర్జున్ సంఘం)లో వుండి ప్రజలపై పెత్తనం చెలాయించేవాడు. పార్టీ నాయకత్వంలో నారాయణపట్నాలోని ఛసిమూలియా సంఘం కార్యక్రమాలు ఊపందుకున్న తరువాత వీడికి ఒకసారి ప్రజల్లో పెట్టి దేహశుద్ధి చేసి హెచ్చరించడం జరిగింది. కొంత కాలం లొంగి వున్నట్లుగా ప్రజల ముందు నటిస్తూ రహస్యంగా పోలీసు సంబంధాలను కొనసాగిస్తున్నాడు. నారాయణపట్నా ఏరియాలో సంఘం బలహీనపడటంతో మళ్లీ వీడి కార్యకలాపాలు ఊపందుకున్నాయి. ప్రజలు పోరాడి సాధించుకున్న భూమిని తిరిగి వీడు స్వాధీనం చేసుకుని సాగుచేయటం, ప్రజలను బెదిరించటం, పార్టీకి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేయటం, పార్టీ సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోలీసులకు అందించటం చేస్తున్నాడు. బందుగాం పోలీసులు రెగ్యులర్‌గా వీడి గూడ (పాక)కు రావటం, బ్రాందీ, సారా తాగటం చేస్తున్నారు. పోలీసులు కూంబింగ్‌లకు లోపలి గ్రామాలకు వచ్చే ముందు తప్పని సరిగా వీడిని కలిసి సమాచారం తెలుసుకుని వస్తున్నారు. తిరిగి వెళ్లేటప్పుడు కూడా కలిసి వెళు తున్నారు. వీడి విషయమై స్థానిక ఆర్.పి.సి. పాకెట్ ప్రజలతో, సంఘ నాయకులతో చర్చించగా కోమన్నకు మరణశిక్ష విధించాలనీ కోరడంతో పాటు దశిని వద్ద కొత్తగా నిర్మాణం చేస్తున్న ఫారెస్టు బిల్డింగ్‌ను కూడా ధ్వంసం చేయాలనీ, లేదంటే నిర్మాణం పూర్తయితే లోపలి గ్రామాల ప్రజలు అటవీ ఉత్పత్తులను అమ్ముకోలేరనీ, మళ్లీ పాత ఫారెస్టు దోపిడీ మొదలు అవుతుందని అభిప్రాయపడ్డారు. దాంతో 20-7-14 రాత్రి పి.ఎల్.జి.ఎ ఆ పాకెట్ గ్రామాల మిలీషియాను కదిలించి ఫారెస్టు బిల్డింగు ధ్వంసం చేయటంతో పాటు, కోమన్నను ఖతం చేసి వాడి బైక్‌ను కూడా తగులబెట్టారు.

## నందపూర్ ఏరియా :

**స్ఫూర్తిదాయకంగా జరిగిన అమరుల వారోత్సవాలు :**

నందపూర్ ఏరియాలో అమరుల సంస్మరణార్థం 13చోట్ల బహిరంగ సభలు జరిగాయి. ఈ సందర్భంగా 2000 కరపత్రాలను పంచడంతో పాటు 200పోస్టర్లు కూడా వేసారు. దీంతో ప్రింట్ మీడియాలో కూడా విస్తృతమైన ప్రచారం జరిగింది. అమరులు కామ్రేడ్ శ్యామ్, దుంబ్రిలకు చెందిన స్థూపాల నిర్మాణంకై ప్రజలు ఇంటికి 100రూ॥ చొప్పున చందాలు వేసుకుని 5 అడుగుల ఎత్తు ఉండే స్థూపాలను నిర్మించారు. స్థూపాలు నిర్మించిన ప్రతిచోట చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు అత్యధిక సంఖ్యలో బారులు తీరి, ఎర్రజెండాలు, బ్యానర్లు చేతపట్టి ఊరిగింపుగా బయలుదేరి స్థూపాల ఆవిష్కరణ, జెండా ఆవిష్కరణలు చేసి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. కామ్రేడ్ శ్యామ్, దుంబ్రి, గంటిల గురించిన వక్తల ఉపన్యాసాలతోనూ, గొనొ నాట్యో సంఘొ వారి సాంస్కృతిక కార్యకలాపాలతోనూ, సభ మధ్యలో ప్రజలు చేసే నినాదాలతోనూ సభా ప్రాంగణాలు హోరెత్తిపోయాయి. ఈ ప్రాంతంలో మొదటిసారిగా జరిగిన ఈ సభలు ప్రజలలో కొత్త సాంప్రదాయానికి పునాదులు వేయడంలో పాటు నూతనోత్సాహాన్ని కలిగించాయి.

**ఇన్‌ఫార్మర్ తవుడు-సింహాలు ఖతం :**

నందపూర్ ఎ.సి పరిధిలో గొల్లూరు పంచాయితీకి చెందిన తవుడు, సింహలు అనే ఇద్దరు వ్యక్తులు ప్రభుత్వ పథకాలు, కాంట్రాక్టులను వుపయోగించుకొని పెత్తందార్లుగా తయారయ్యారు. ఈ పంచాయితీకి తవుడు మాజీ సర్పంచ్ కాగా సింహాలు ప్రస్తుత సర్పంచ్‌కు సోదరుడు. ఈ ప్రాంతంలో పార్టీ పని చేయడం గిట్టని వీరు పార్టీ వ్యతిరేక ప్రచారాన్ని, కార్యకలాపాలను కొనసాగించారు. పోలీసులతో సంబంధాలు పెట్టుకున్నారు. 4-3-2014న మునగల వలస గ్రామంలో కామ్రేడ్స్ శ్యాం, దుంబ్రిలకు తవుడు మోసపూరితంగా తన ఇంటిలో షెల్టర్ ఇచ్చి వారి సమాచారాన్ని పోలీసులకు అందచేసారు. పోలీసులు ఆ గ్రామంపై దాడి చేసి కామ్రేడ్స్ శ్యాం, దుంబ్రిలను అతి దారుణంగా హత్య చేసారు. అనంతరం ప్రజలు ఎన్‌కౌంటర్‌కు కారకులు వారేననీ, వారిని శిక్షించాలని డిమాండ్ చేసారు. దాంతో పి.ఎల్.జి.ఎ ఈ ఇద్దరినీ ప్రజాకోర్టులో పెట్టి విచారించింది. ప్రజల ముందు వారు చేసిన తప్పులను అంగీకరించారు. వారికి మరణశిక్ష విధించాలనీ ప్రజలు

తీర్పు నివ్వడంతో పి.ఎల్.జిఎ దానిని అమలు చేసింది. నిర్భందంలో వున్న పీడిత ప్రజానీకానికీ ఈ ఘటన ఎంతో ధైర్యానిచ్చింది.

**ప్రజా వ్యతిరేకి జీవన్‌పట్నాయక్ ఖతం :**

పొట్టంగి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేస్తున్న జీవన్‌పట్నాయక్ మైదాన ప్రాంతం నుండి వచ్చి సుంకి (పంచాయతీ)లో స్థిరనివాసం ఏర్పరచుకున్నాడు. ఇతను గత 30 సం॥రాలుగా ప్రభుత్వ పథకాలను, కాంట్రాక్టులను సొంత ప్రయోజనాలకు ఉపయోగించుకొని ఆస్తులు కూడబెట్టాడు. ప్రభుత్వ అధికారులకు లంచాలిచ్చి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన అనేక మంది ఆదివాసీల భూములను ఆక్రమించుకొని పట్టాలు కూడా పొందాడు. ఈ ప్రాంతంలోని సిమెంట్ ఫ్యాక్టరీ యజమాన్యానికీ అనుకూలంగా ఉంటూ ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక కార్యకలాపాలకు మద్దతునిస్తున్నాడు. సుంకిలోని మోటార్ ట్రాన్స్‌పోర్ట్ సంఘానికి అధ్యక్షునిగా ఉంటూ కార్మికులపై అణచివేత పద్ధతులకు పాల్పడుతున్నాడు. తనకు ఆటంకం అని భావించిన ఇతర బూర్జువా రాజకీయ నేతలను, కార్యకర్తలను వివిధ పద్ధతులలో హత్య చేయడం ఇతనికి వెన్నతో పెట్టిన విద్య. అంతే కాకుండా గూండాలతో కలిసి పార్టీ పేరు చెప్పి లక్షల రూపాయలు వసూలు చేసాడు. ఇతని దోపిడీ దౌర్జన్యాలు ప్రజలు భరించలేనంత స్థాయికి చేరుకున్నాయి. మరోవైపు ఈ ప్రాంతంలో పార్టీ ప్రజలతో మమేకం కావడం, ప్రజలు సంఘటిత పడటం తన కార్యకలాపాలకు ఆటంకం అని భావించి పార్టీని నిర్మూలించేందుకు అనేక కుట్రలకు పాల్పడ్డాడు. అందులో భాగంగానే పోలీసు క్యాంపు ఏర్పాటు చేయాలనీ ప్రతిపాదిస్తూ పోలీసులకు అన్నీ రకాల సహాయాన్ని అందిస్తూ వచ్చాడు. ఇటువంటి పరిస్థితులలో ఇతనిని శిక్షించాలనీ ప్రజల నుండి పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తూ వచ్చింది. ప్రజల డిమాండ్ మేరకు సెప్టెంబర్–2014న పి.ఎల్.జి.ఎ వీడిని ఖతం చేసింది. ఈ ఘటన దళారీ కాంగ్రెస్ నేతలకు, గూండాలకు భయాన్ని కల్గించగా పీడిత ప్రజలకు ఎనలేని సంతోషాన్ని కల్గించింది.

# ఎమ్.కె.వి డివిజన్

**అమరులకు విప్లవ నివాళులర్పించిన ప్రజానీకం :**

పెదబయలు ఏరియా పరిధిలో జూలై28 అమరవీరుల వారోత్సవాలను ఈ సంవత్సరం కూడా ప్రజలంతా విప్లవ సాంప్రదాయాలతో జరుపుకొన్నారు. తీవ్రమైన శత్రు నిర్బంధంలో సైతం గిన్నెలకోట, కోంద్రు, గిన్నెగరువు, జామ్‌గూడ పాకెట్‌ల బహిరంగ సంస్మరణ సభలు జరిగాయి. రోడ్ల పరిసర ప్రాంతాలలో గ్రామాల వారిగా సభలు జరిగాయి. ఈ సంవత్సరం జూలై నెలంతా ఎడతెరిపి లేని వర్షాలను సైతం లెక్క చేయకుండా ప్రజలందరూ విప్లవ సాంప్రదాయాల ప్రకారం కొత్త స్థూపాలను నిర్మించడం, పాత వాటిని పునర్నిర్మించడం, రంగులు వేయడం, జెండాలు ఎగురవేయడం చేసారు. పాకెట్స్ వారిగా పోస్టర్లు వేయడం, బ్యానర్లు కట్టడం, క్యాంపెయిన్‌లు నిర్వహించడం ద్వారా విస్తృత ప్రచారం చేసారు. భారీ వర్షాలకు పెద్ద ఎత్తున పొంగిపొర్లుతున్న గడ్డల(వాగుల)ను సైతం లెక్క చేయకుండా, మహిళలు, పురుషులు వందలాది మంది విప్లవ ప్రజానీకం సభలకు హజరయ్యారు. ఒడిశా పరిధిలో గల గ్రామాల మీద నిరంతరం శత్రుదాడులు జరుగుతున్నప్పటికీ పి.ఎల్.జి.ఎ రక్షణలో దూల్‌పుట్, నేరేడుపల్లి, సింగవరం పాకెట్స్ ప్రజలు అమరవీరుల సంస్మరణ సభలను జరుపుకున్నారు.

సభలలో ఎర్రని జెండాలు, బ్యానర్లతో విప్లవ సాంప్రదాయాల ప్రకారం మౌనం పాటిస్తూ, అమరుల పాటలు పాడుతూ అమరులను స్మరించుకున్నారు. ఎ.వి.ఆర్.సి.ఎన్‌లనుండి, గ్రామపార్టీ కమిటీలనుండి కామ్రేడ్స్ వక్తలుగా విప్లవ ప్రసంగాలు చేసారు. అమరుడు కామ్రేడ్ నరేందర్‌తో తమకున్న సంబంధాలను ప్రజలు జ్ఞాపకం చేసుకుంటూ ఆయనకు వినమ్రంగా జోహర్లర్పించారు. తనతోపాటు అమరులు దుంబ్రి, శిరీష, మంగరాజులకు మరియు ఎ.ఒ.బి, బి.జె, డి.కె అమరులందరికీ తలవంచి వినమ్రంగా స్మరించుకొన్నారు.

ఈ సంవత్సరం సభలకు హజరయిన వారందరూ అమరుల కుటుంబాలకు ఆర్థిక సహాయంగా గ్లాసు బియ్యం, 2నుండి10 రూపాయల వరకు ఇచ్చారు. దీంతో ఈ ఏరియా పరిధిలో అమరులైన కా॥ లక్ష్మణ్ (పార్టీ సానుభూతి పరుడు), కా॥ అంజిత (పి.ఎమ్), కా॥ చంటి (దళ సభ్యుడు), కా॥ శాంతి (పి.ఎమ్)ల కుటుంబ సభ్యులకు ఈ మొత్తం సహాయాలను అందించడం జరిగింది.

ఈసారి విశాఖ జిల్లా పోలీసు అధికారులు వారోత్సవాలను విఫలం చేసేందుకు బహిరంగంగానే పేపర్లో బెదిరింపు హెచ్చరికలు చేసినప్పటికీ, శత్రు నిర్బంధ దూకుడును సైతం లెక్క చేయకుండా గత మూడున్నర దశాబ్దాలనుండి పాటిస్తూ వస్తున్న వారోత్సవాలను ఈసారి కూడా ప్రజలు ఏరియాలో విజయవంతం చేసి అమరులకు నిజమైన నివాళులు అర్పించారు.

**రాజకీయ ఖైదీల విడుదలకై డిమాండ్ :**

పెదబయలు ఏరియా, రాళ్ళగడ్డ పంచాయితీలో గల నాలుగు పాకెట్ కమిటీల, మరియు స్థానిక దళం నేతృత్వంలో 13–9–14న రాజకీయ ఖైదీల న్యాయమైన పోరాటాలకు సంఘీభావంగా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అక్రమ అరెస్టులకు నిరసనగా భారీ బహిరంగ సభ జరిగింది. ఈ సభకు నాలుగు పాకెట్‌లకు చెందిన 1100 మంది ప్రజలు హాజరయ్యారు. ఇందులో 45% మంది మహిళలు వున్నారు. ఈ సభకు ముందు స్థానిక దళం పాకెట్ల వారీగా కోర్ కమిటీల మీటింగులు వేసి విప్లవ ప్రజానీకాన్ని బహిరంగ సభకు వచ్చే విధంగా రాజకీయంగా మోటివేట్ చేసింది.

పార్టీ పిలుపునందుకున్న ప్రజానీకం ఉదయం 11 గంటల కల్లా సభాస్థలికి చేరుకున్నారు. అనంతరం చేపట్టిన ర్యాలీలో బ్యానర్లు చేతపట్టి "రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలనీ, ఆదివాసీలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలనీ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్బంధానికి వ్యతిరేకంగా ఒడియా, తెలుగు భాషలలో నినాదాలు చేసారు. విప్లవ నినాదాలతో ఆ ప్రాంతమంతా మారు మ్రోగింది. జెఎన్‌ఎమ్ కళాకారుల విప్లవ పాటల, నృత్యాలతో సభను ప్రారంభించారు. దళ సభ్యులు కువీ, తెలుగు, ఒడియా

భాషలలో విప్లవ ప్రసంగాలు చేసారు.

సభ నిర్వహణలో భాగంగా ఒడిశా, ఆంధ్రా విలేకర్లను పిలవడం జరిగింది. అరెస్టయిన వారి కుటుంబ సభ్యులు విలేకర్లతో అక్రమ అరెస్టుల గురించి, ఆర్థిక, ఇతర సమస్యల గురించి తెలియ చేసారు. ఖైదీల విడుదలకు డిమాండ్ చేసారు. సభకు హాజరైన ప్రజలు వారికి మద్దత్తుగా నినాదాలు చేస్తూ ఇంటికి 10 రూపాయల చొప్పున (మొత్తం రూ॥5000) ఆర్థిక సహాయాన్ని అందించారు. విజయవంతం అయిన ఈ సభ ప్రజలలో మంచి ప్రభావాన్ని వేయడంతో పాటు బాధితులకు భరోసానిచ్చింది.

**ఘనంగా పార్టీ దశాబ్ది ఉత్సవాలు :**

పెదబయలు ఏరియా కమిటీ పరిధిలోగల గిన్నెలకోట, గిన్నెగరువు, కోంద్రు పాకెట్ ప్రజలు ఐక్యంగా 30-9-14న పార్టీ దశాబ్ధి ఉత్సవాల సందర్భంగా బహిరంగ సభను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సభకు సుమారుగా 500 మంది విప్లవ ప్రజానీకం (30% మహిళలు) హాజరయ్యారు. స్థానిక పార్టీ పిలుపు మేరకు ప్రజలు ఆదివాసీ సాంప్రదాయక వాయిద్య పరికరాలతో తండోపతండాలుగా, ఉత్సాహంగా సభాస్థలికి చేరుకున్నారు. జె.ఎన్.ఎమ్ కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలతో సభ ప్రారంభమయ్యింది. ముందుగా పార్టీ జెండాను ఎగురవేసి 2 నిముషాలు మౌనం పాటించి అమరులకు నివాళులర్పించారు. సభాధ్యక్షులుగా, ముఖ్య వక్తలుగా ఏ.వి.ఆర్.సి.ఎస్, ఎమ్.పి.ఎస్‌ల నుండి కొద్దిమంది నాయకత్వ కామ్రేడ్స్ సమర్థవంతంగా బాధ్యత నిర్వహించారు. ప్రజా పోరాటాలు, పార్టీ నాయకత్వంలో ప్రజలు సాధించుకున్న విజయాలు...వంటి అంశాలపై ప్రసంగించారు. చివరిలో థింసా నృత్యాలతో స్థానిక కళాకారులు ప్రజలను అలరించారు. విప్లవ నినాదాలతో ముగిసిన ఈ సభ విజయవంతం కావటం ఈ ప్రాంతంపై మంచి ప్రభావం పడింది.

**బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా కదం తొక్కిన ప్రజానీకం:**

19-9-14న పెదబయలు ఏరియా, జి.మాడుగుల మండలంలోని సుర్మతి, భీరం, కుడుముసారా, కిల్లంకోట, బొయితిలి, ఇంజెరి, జాముగూడ, బూసుపుట్, బొంగరం, గిన్నెలకోట, గుల్లెలు, లింగేటి పంచాయితీల నుండి 8 వేల మందికి పైగా ప్రజలు మద్దిగరువు సెంటర్‌గా భారీ ర్యాలీ నిర్వహించారు. బాక్సైట్ తవ్వకాలు (ఐటిడిఏ ద్వారా) జరుపుతామనే ప్రభుత్వ నిర్ణయానికి, అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా, రాజకీయ ఖైదీల విడుదలకు బ్యానర్లు చేతపట్టి నిర్వహించిన ఈ ర్యాలీలో అత్యధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

18-9-14 గురువారం సంత రోజున 70 మంది పోలీసులు మద్దిగరువుకు వచ్చి మెడికల్ క్యాంపు పెట్టి వెళ్ళిన 24 గంటలు గడవక ముందే, భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా అన్ని సెక్షన్ల ప్రజలు హాజరైనారు. ఈ సభ నిర్వహణ విషయం ఏరియాలోని ప్రజానీకానికి ముందుగా తెలిసినప్పటికీ శత్రువుకు సమాచారం అందకుండా చేసి సభను విజయవంతం చేసారు.

బాక్సైట్ గనుల తవ్వకాలకు వ్యతిరేకంగా జరిగిన ఈ భారీ ర్యాలీ బొంగరం నుండి సూరిమెట్ట మీదుగా బొయితిలి వరకు ( సుమారు 4 కిమీ ) జరిగింది. ఎర్రజెండాలు, బ్యానర్లుతో మహిళలు ముందు భాగాన నడవగా మిగతా వారంతా నినాదాలతో వారితో కదం కలిపారు. 5 గంటల పాటు ఆ ప్రాంతమంతా నినాదాల హోరుతో దద్దరిల్లి పోయింది. ఇంతటి ప్రజావెల్లువలో స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా కదిలి రాక తప్పలేదు. ర్యాలీకి ఇబ్బంది కలుగకుండా వాహన చోదకులు స్వచ్ఛందంగా తమ పనులను బందు పెట్టుకుని ర్యాలీకి మద్దతు తెలిపారు. కొన్ని వాహనాలను ప్రజలే బంద్ చేయాల్సి వచ్చింది. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ర్యాలీ సాయంత్రం 4 గంటల వరకూ జరిగినా శత్రువుకు కనీస సమాచారం లేకపోవడం విశేషం.

'మావోయిస్టులకు సిద్ధాంతాలు లేవనీ, ప్రజల మద్దతు కోల్పోయారనీ, మావోయిస్టు రహిత జిల్లాగా విశాఖ నిలుస్తుందని' ఢంకాలు కొట్టుకునే జిల్లా పోలీసులకు ఈ ర్యాలీ చెంపపెట్టు అయింది. ఏరియా వ్యాప్తంగా ఈ ర్యాలీ ప్రజలలో మంచి ప్రభావం వేసింది. మరీ ముఖ్యంగా ఈ ర్యాలీ విజయవంతానికి అన్ని పాకెట్స్ ఏ.వి.ఆర్.సి.ఎస్‌లు బాధ్యతాయుతంగా వ్యవహరించారు. ఇలాంటి ర్యాలీలు మండల సెంటర్లలోనూ, క్రమం తప్పకుండా జరగాలనీ ప్రజలు డిమాండ్ చేసారు.

**మిత్ర వైరుధ్యాన్ని సామరస్యంగా పరిష్కరించిన ప్రజాకోర్టు :**

పెదబయలు ఏరియా గిన్నెలకోట పాకెట్ ఎ.ఆర్.సి.ఎస్ కమిటీ నాయకత్వంలో 21-7-2014న సమస్యల పరిష్కారానికై ప్రజాకోర్టు జరిగింది. దీనికి 120 మంది ప్రజలు హజరయ్యారు. వర్షాల కారణంగా ప్రజాకోర్టు జరుగుతుందా? జరగదా? అనే సంఘనాయకత్వ సందిగ్ధాన్ని పటాపంచలు చేస్తూ ప్రజలు మరియు ముఖ్యంగా మహిళలు ప్రజాకోర్టుకు హజరయ్యారు.

చింతగరువు, లందులు గ్రామాల మధ్య గత దశాబ్దిన్నర కాలంగా భూమి సమస్య(5ఎకరాలు) ఉంది. అనేకమార్లు పరిష్కారానికై పంచాయితీ ప్రజాప్రతినిధుల, పెద్ద మనుషుల నాయకత్వంలో ప్రయత్నించినప్పటికీ పరిష్కారం కాకపోగా సమస్య మరింత పెరిగింది. దీంతో సమస్య ఎ.వి.ఆర్.సి.ఎస్ పాకెట్‌కమిటీ దృష్టికి వచ్చింది. కమిటీ విస్తృతంగా చుట్టుపక్కల ప్రజల నుండి, రెండు గ్రామాల పెద్దమనుషుల నుండి భూముల వివరాలు, వాస్తవాలు సేకరించి ప్రజాకోర్టులో పరిష్కరించింది. ప్రజల మధ్య వస్తున్న భూమి సమస్యలను సంఘం మిత్రవైరుధ్యంగా గుర్తించి ఇరు పక్షాలకు న్యాయం జరిగేలా పరిష్కరించి ప్రజాకోర్టుకు హాజరయిన ప్రజల ఆమోదాన్ని, మన్ననలను పొందింది.

ఈ ప్రజాకోర్టులో బొంగ్‌జాంగ్ గ్రామంలో జరిగిన హత్యకేసును కూడా పాకెట్ ప్రజలు పరిష్కరించుకోవడం జరిగింది. బొంగ్‌జాంగ్ గ్రామంలో జరిగిన మొగనాలు గొడవలు మూలంగా గత నాలుగు నెలలకాలంలోనే రెండు హత్యలు జరిగాయి. ఈ వరుస హత్యలతో ఆ గ్రామంతో సహ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా భయాందోళనలకు గురయ్యి పాకెట్ కమిటీని ఆశ్రయించారు. కమిటీ ప్రజాకోర్టు ద్వారా ఈ సమస్యను పరిష్కరించింది. బొంగ్‌జాంగ్ గ్రామంలో మరల ఇటువంటివి జరగరాదని హెచ్చరిస్తూనే మొగనాలు గొడవలపై విద్య గరుపుతూ, బాల్యవివాహాలకు, బలవంతపు పెళ్ళిళ్ళకు, బహుభార్యత్వానికి వ్యతిరేకంగా అందరూ బాధ్యతాయుత పోరాటం చేయాలని, దానికై గ్రామగ్రామాన ఎ.వి.ఎమ్.ఎస్‌లు బలోపేతం చేయడం అత్యంత అవశ్యకమని ప్రజలకు సంఘనాయకత్వం పిలుపునిచ్చింది. హత్యచేసిన కుటుంబం (పురుషులు మాత్రమే) మూడు సంవత్సరాల పాటు గ్రామ పొలిమేరలు దాటి బయటకు వెళ్ళరాదని, వెళితే శిక్ష కఠినంగా వుంటుందనీ తీర్పునిస్తూ ప్రజలందరి ముందు తప్పులను

ఒప్పించడం జరిగింది. నేరస్తులు పశ్చాత్తాపం పడేలా, మరోసారి తప్పు జరగకుండా వుండేలా చెప్పిన ఈ తీర్పుకు ప్రజలందరీ ఆమోదముద్ర పడింది.

ప్రజాకోర్టులో మెజారిటీ ప్రజల ఆమోదంతో ఈ సమస్యలు పరిష్కారం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేసారు. సంఘాల మీద సంఘం నాయకత్వం మీద మరింతగా విశ్వాసాన్ని పెంచుకున్నారు. ఈ ప్రజాకోర్టు ద్వారా ఏరియాలో కూడా మంచి ప్రభావం పడింది.

### కిల్లంకోట ప్రజా కోర్టులో పోలీసు ఇన్‌ఫార్మర్ ఖతం, స్థానిక సర్పంచ్‌పై ఆంక్షలు :

21-8-14 తేదిన పెదబయలు ఏరియా కిల్లంకోట గ్రామంలో పంచాయితీ స్థాయి ప్రజాకోర్టు జరిగింది. ఈ ప్రజాకోర్టుకు 250 మంది ప్రజలు (120 మంది మహిళలు) హాజరయ్యారు. ప్రజాకోర్టు జరుగుతున్న రోజు మూడు బ్యాచీలుగా గ్రేహౌండ్స్ మూకలు చుట్టు ప్రక్కల గ్రామాల్లో వున్నప్పటికీ ప్రజలు భయపడకుండా ఎమ్.పి.ఎస్(మన్యం పితూరి సేన) రక్షణలో ప్రజాకోర్టు నిర్వహించుకున్నారు. స్థానిక ప్రజలు తమకు అత్యంత అవసరమైన సంతకు పోకుండా ప్రజాకోర్టుకు హాజరై విషయాలను ప్రజాస్వామిక పద్ధతులలో చర్చిస్తూ ప్రజాకోర్టును విజయవంతం చేసారు.

జి. మాడుగుల మండలం కిల్లంకోట కాలనీకి చెందిన బచ్చెల బాలక్రిష్ణ (35) 2011 నుండి పోలీసు ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తున్నాడు. తను ఒక మర్డర్ కేసులో నిందితునిగా వుండటం, తన సమీప బంధువులు పోలీసు కానిస్టేబుళ్ళుగా పనిచేస్తూ వుండటం మొదలైన కారణాల వల్ల బాలకృష్ణ పోలీసుల సంబంధాలలోకి వెళ్ళాడు. 2012 నాటికే కూంబింగ్‌లకు వచ్చిన బ్యాచీలను రహస్యంగా కలవడం, తిండి ఏర్పాట్లు చేయడం వంటివి చేసేవాడు. ఈ ఆరోపణలపై పార్టీ బాలక్రిష్ణను విచారించి హెచ్చరించి వదిలిపెట్టింది. అయితే ఆ ప్రాంతంలో గత సంవత్సరన్నర కాలం నుండి దళం కదలికలు తగ్గటంతో పార్టీ హెచ్చరికలను బేఖాతరు చేస్తూ కూంబింగ్‌లకు వచ్చిన బ్యాచీలకు దారులు చూపించడం, రహస్యంగా కలిసి మాట్లాడడం, లోకల్ పోలీసులకు అంబలి ఏర్పాట్లు చేయడం, ఏరియా పరిధిలో గల సంఘ, మిలీషియా నాయకత్వ వివరాలను, కదలికలను పోలీసులకు తెలియచేస్తుండేవాడు. వారానికి లేదా మూడు రోజులకొక సారి జి. మాడుగుల పోలీసుల వద్దకు వెళుతూ ఏరియా విషయాలు రిపోర్టు చేసేవాడు. సి.ఐ శివమణితో ప్రత్యక్ష సంబంధాలు నెరపుతూ సమాచారం ఆధారంగా డబ్బులను పొందేవాడు.

ఈ మధ్య కాలంలో కూడా తన పాత వ్యవహార శైలిని వదులుకోకపోవడంతో పాటు సంఘ నాయకత్వపు ఇళ్ళను చూపించడం, అరెస్టులు చేయించడంతో (తడకల్, కిల్లంకోట, చిలకపనస గ్రామస్థుల అరెస్టులకు ప్రత్యక్ష, పరోక్ష కారకుడయ్యాడు) ప్రజలు తనపై పార్టీకి ఫిర్యాదు చేసారు.దానితో పార్టీ అతనిని అదుపులోకి తీసుకుని ఇంటరాగేషన్ చేయగా తన తప్పులను అంగీకరించాడు. ప్రజాకోర్టులో ప్రజలంతా అతనికి మరణశిక్ష విధించాలనే తీర్పునిచ్చారు. దానిని పిఎల్‌జిఏ అమలు చేసింది. బాలక్రిష్ణ చర్యలకు ప్రోత్సాహం తెలిపిన అతని భార్యను హెచ్చరించి వదిలి పెట్టడం జరిగింది.

### ఇదే ప్రజాకోర్టులో

కిల్లంకోట పంచాయితీ సర్పంచ్‌గా గెలిచిన పండన్నను సంవత్సర కాలం క్రితం ప్రజాకోర్టులో పెట్టి హెచ్చరించి వదిలి పెట్టడం జరిగింది. ఎన్నికలలో పాల్గొనేందుకు పార్టీ ఆమోదం తెల్పిందని ప్రజలను తప్పుదారి పట్టించాడు. ఈ విషయం ప్రజలలో పెట్టి రాజీనామా చేయించడం జరిగింది. కొంతకాలం పాటు పదవికి దూరంగా వున్నప్పటికీ మరల దానిని చేపట్టి కార్యకలాపాలు కొనసాగించాడు. దాంతో మరల ప్రజాకోర్టులో పెట్టి విచారించడంతో తన తప్పులను ఒప్పుకుని మరోసారి క్షమాపణలు కోరాడు. పండన్న బూర్జువా రాజకీయాలకు దూరంగా ఉండాలనీ, తనపై ప్రజలకు నమ్మకం కలిగేంత వరకు గ్రామం విడిచి వెళ్ళరాదనీ, బయటి అవసరాలకై భార్యపై ఆధారపడాలనీ హెచ్చరిస్తూ తీర్పునిచ్చారు. పై రెండు చర్యలు ప్రజా వ్యతిరేకులకు హెచ్చరికగా నిలవగా స్థానిక ప్రజలకు ఊరటనిచ్చి విప్లవోద్యమంపై విశ్వాసాన్ని ఇనుమడింప చేసాయి.

### కల్కి గూండాల దాడిని ఖండిస్తూ అమరులకు నివాళులర్పించిన పెదబయలు ఏరియా ప్రజలు :

19-10-2014న జరిగిన కల్కి గుండాల దాడిని ఖండిస్తూ పెదబయలు ఏరియా కమిటీ నేతృత్వంలో 13-11-14న జరిగిన ర్యాలీ, భహిరంగ సభలో 1800మంది ప్రజలు (మహిళలు 500 మంది) పాల్గొన్నారు. కోరుకొండ ఘటన అనంతరం "ప్రజల్ని రక్షించే పేరుతో" హంతకులను రక్షించేందుకు శత్రువు ఏరియా వ్యాప్తంగా పెద్ద ఎత్తున బలగాలను మొహరించాడు. అయినప్పటికీ తమ ప్రియతమ నేతలను స్మరించుకొనేందుకు ప్రజలు వెనకాడకుండా భహిరంగ సభ జరుపుకున్నారు. సభకు ముందుగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలిలో "కల్కి గుండాల దాడి నశించాలి, పోలీసుల దుష్ప్రచారం నశించాలి. అమరులకు జోహార్లు" అంటూ ప్రజలు చేసిన నినాదాలతో ఆ ప్రాంతం మారుమోగిపోయింది. విప్లవ సాంప్రదాయం ప్రకారం అమరులు కా॥ శరత్, కా॥ గణపతిలను స్మరించుకుంటూ జరిగిన సభలో వారి త్యాగాలు, పోరాటాల గురించి ప్రజలకు వివరించారు. వీటితో పాటు ఎస్.ఐ.బి ఏజెంట్లయిన సంజీవరావు, గుదలం వీధి సింహాచలంల కాఫీ పోరాట వ్యతిరేక కార్యకలాపాలనూ, మతం ముసుగులో వారు చేస్తున్న ప్రజా వ్యతిరేక చర్యలనూ, పోగేసిన అక్రమ సంపాదన పైనా, పోలీసులతో వారికి గల సంబంధాలను గురించి అర్థం చేయించారు. అంతే కాకుండా పోలీసుల కుట్రలు, దుష్ప్రచారం గురించి కూడా వివరించారు. ఈ సభలకు హాజరైన విలేకర్లతో ప్రజలు, ప్రజా సంఘాల కార్యకర్తలు కల్కి గుండాల దాడి, పోలీసుల విష ప్రచారాన్ని ఖండిస్తూ మాట్లాడారు. శతృవు ఎన్ని కుటిల ఎత్తుగడలకు పాల్పడినప్పటికీ, ప్రజల హృదయాలలో పార్టీకీ, దాని నాయకత్వానికి గల స్థానాన్ని తుడిచి పెట్టడం ఏ మాత్రం సాధ్యం కాదని ఈ సభ నిరూపించింది.

పై సభ జరిగిన వారం రోజులకు సారాపల్లి, కిల్లంకోట ప్రాంత ప్రజలతో మరో సభను జరుపుకున్నారు. ఈ సభకు 1500 మంది ప్రజలు హాజరైనారు. ప్రభుత్వ పోలీసు ప్రాయోజిత మీడియా కోరుకొండ ఘటనను 'మావోయిస్టులపై ఆదివాసీల తిరుగుబాటు'గా వర్ణిస్తూ, మవోయిస్టులకు మనుగడ కష్టమనీ కల్పిత కథనాలను

వెలువరిస్తుంటే, క్షేత్రస్థాయిలో జరిగిన ఈ ప్రజా సమీకరణలు వారి దుష్ప్రచారాన్నీ, కుటిలత్వాన్ని పటాపంచలు చేసాయి.

**ప్రజావ్యతిరేకి సాయిబో ఖతం :**

పెదబయలు ఏరియాలోని బిడియాగూడ పాకెట్ గతంలో పార్టీకి అనుకూలంగా ఉండేది. 2012లో అటగూడ బిఎస్ఎఫ్ క్యాంపు ఏర్పడిన తరువాత నిర్బంధం పెరిగి ఆర్.పి.సి ఇతర నిర్మాణాలు దెబ్బతిన్నవి. ఇదే అదనుగా గాసీ, కళా సాయిబో (అన్నదమ్ములు)లు హోంగార్డులుగా చేరి ఉద్యమ అణచివేతలో శతృవుకు సహకరించేవారు. దీనిని ప్రజలు పార్టీ దృష్టికి తేగా 2013లో ప్రజాకోర్టు నిర్వహించి వారిని గ్రామ బహిష్కరణ చేసారు. అప్పటి నుండి వారు మరింత క్రూరంగా మారి పోలీసులతో కలసి వచ్చి గ్రామాలపై దాడులు చేసేవారు. దీంతో ఆ ప్రాంత ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వచ్చి మరల పార్టీకి ఫిర్యాదు చేసారు. 2014 జూన్ నెలలో మరోసారి ప్రజాకోర్టు నిర్వహించి శిబోని నిర్మూలించడం జరిగింది. ఈ చర్య పీడిత ప్రజలపై మంచి ప్రభావం వేసింది.

---

**(53వ పేజి తరువాయి)**

ప్రియమైన కామ్రేడ్స్...

సామ్రాజ్యవాదం ఇప్పటిదాకా దాని చరిత్రలో కెల్ల అత్యంత తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. మరోవైపు కార్మికవర్గ పోరాటాలు, ఇతర పీడిత వర్గ, సెక్షన్ల, ప్రజల పోరాటాలు, జాతి విముక్తి పోరాటాలు, అర్ధ భూస్వామ్య అర్ధవలస దేశాలలోని ప్రజా యుద్ధాలు పెంపొందుతున్నాయి. ఎమ్.ఎల్.ఎమ్‌ను మార్గదర్శక సూత్రంగా రోజురోజుకు మరింత మంది ప్రజలు స్వీకరిస్తున్నారు. సామ్రాజ్యవాదులూ, వెనకబడిన దేశాలలోని వారి తైనాతీలు/కీలుబొమ్మ పాలకులూ, అన్ని రకాల విప్లవ ప్రతీఘాతుకులు ప్రపంచంలోని పీడిత ప్రజల, జాతుల ఉమ్మడి శత్రువులనే విషయాన్ని ప్రజలు మరింతగా గ్రహిస్తున్నారు. ఈ పరిణామాలన్ని రోజు రోజుకు పెరుగుతున్న విప్లవ పరిస్థితిని తెలియజేస్తున్నాయి. ఈ పరిస్థితిని సద్వినియోగ పరుచుకోవాలంటే బోల్షివిక్ పత్రికను ఒక తర్ఫీదు కేంద్రంగా మలుచుకోవాలి. అందుకు ప్రతి కార్యకర్త పత్రికను చదవడం, చదివించడం, అభిప్రాయాలను తెలియజేయడంతో పాటు ఇతర కర్తవ్యాలను విధిగా అమలు చేయాలి. ముఖ్యంగా పత్రికను ప్రజలలోకి తీసికెళ్ళి విప్లవ సూత్రాలను ప్రజల కార్యచరణగా మలచేందుకు ప్రత్యేక కృషి చేయాలి.

---

**బూర్జువా రాజ్యంగ యంత్రంలోని ముఖ్యమైన అంగం సాయుధ బలగాలేననీ పార్లమెంటు కాదనీ రెండవ ప్రపంచ యుద్ధం తరువాత జరిగిన ఘటనలు కూడా స్పష్టపరిచాయి. పార్లమెంటు బూర్జువా పరిపాలనకు మేలి ముసుగు మాత్రమే. అందువల్ల పార్లమెంటరీ వ్యవస్థను నిలబెట్టుకోవడమా లేక రద్దుచేయడమా, పార్లమెంటుకు అధికారాలివ్వడమా లేక తక్కువ అధికారాలివ్వడమా ఏ రకమైన ఎన్నికల పద్ధతి అనుసరించాలి, అనే సమస్యల మధ్య దేన్ని బూర్జువా వర్గం ఎన్నుకుంటుందనే దాన్ని ఆ వర్గ పరిపాలనా అవసరాలు, ప్రయోజనాలు నిర్ణయించుతాయి.**

**సైనిక-నిరంకుశాధికార యంత్రాంగాన్ని బూర్జువా వర్గం కంట్రోల్ చేస్తున్నంత కాలమూ కార్మిక వర్గం - పార్లమెంటులో స్థిరమైన మెజారిటీ సంపాదించకుండానైనా పోతుంది లేదా ఆ స్థిరమైన మెజారిటీ ఆధారపడ వీలులేనిదిగానైనా తయారవుతుంది. పార్లమెంటరీ పంథా ద్వారా సోషలిజాన్ని సాధించడం పూర్తిగా అసంభవం. అవి కేవలం మోసపు మాటలే**

**- లెనిన్**

# బోల్షివిక్ పత్రికను సమిష్టి ప్రచార కర్తగానూ, సమిష్టి ఆందోళన కర్తగానూ, సమిష్టి ఆర్గనైజర్‌గానూ మలుచుకుందాం!

బోల్షివిక్ పత్రికకు సంబంధించి ఇది నాల్గవ సంచిక. నిత్య నిర్బంధంలో పత్రికను తేవడం ఒక ముఖ్యమైన రాజకీయ కర్తవ్యంగా చేపట్టి, మనం 6 నెలలకు ఒక బులిటెన్ చొప్పున పత్రికను తెస్తున్నాం. మన పత్రికలో వస్తున్న సిద్ధాంత, రాజకీయ వ్యాసాలు మన శ్రేణులను, ప్రజలను విద్యావంతం చేసేందుకు దోహదపడుతున్నాయి. వివిధ ప్రాంతాల నుండి పత్రికకు వస్తున్న పోరాట వార్తలు, పత్రికా ప్రకటనలు, కరపత్రాలు, నివేదికలు ఇస్తున్న సమాచారం ద్వారా ఒక ప్రాంతం వారు మరో ప్రాంతానికి సంబంధించిన సమాచారాన్ని తెలుసుకోగల్గుతున్నారు. ఒకరి అనుభవాలను మరొకరు అందిపుచ్చుకో గల్గుతున్నారు. ముఖ్యంగా అమరుల జీవిత చరిత్రలు మనలో విప్లవతత్వాన్ని పెంచుతూ కార్యాచరణలో దృఢంగా నిలబడి పురోగమించేందుకు ప్రేరణగా నిలుస్తున్నాయి.

పైన చెప్పుకొన్నట్లుగా పత్రిక ద్వారా కొన్ని విప్లవ ప్రయోజనాలను పొందుతున్నప్పటికీ, పత్రికను మనం అనుకున్న రాజకీయ లక్ష్యం దిశగా తీసుకురావాలంటే మనం అధిగమించాల్సిన సమస్యలు చాలానే ఉన్నాయి. కొన్ని ప్రాంతాల నుండి పత్రికకు సమాచారం (పోరాట వార్తలు, కరపత్రాలు, నివేదికలు) అందటం లేదు. కొన్ని చోట్ల నుండి వచ్చే పోరాట వార్తలు చాలా అస్తవ్యస్తంగా ఉంటున్నాయి. పోరాట వార్తలు ఏ ప్రాంతానికి, ఏ కాలానికి చెందినవో పేర్కొనడం లేదు. పోరాట వార్తలు పంపే కామ్రేడ్స్ గతంలో క్రాంతి పత్రికలో వచ్చిన మార్గదర్శక సూత్రాలను తప్పని సరిగా పాటించాలి. పత్రిక ముద్రణలోనూ, పంపిణీలోనూ బలహీనతలు, పరిమితులు వున్నాయి. అవసరమైనన్ని కాపీలు ముద్రించలేక పోతున్నాము. దీంతో పత్రికను గ్రామ స్థాయి, సంఘాల దాకా తీసుకెళ్ళలేక పోతున్నాము. పత్రిక అందిన చోట అధ్యయనం సరిగా జరగడం లేదు. ఈ బలహీనతలను, పరిమితులను అధిగమించేందుకు మనం నిర్వహిస్తున్న బోల్షివీకరణ క్యాంపెయిన్‌లో పత్రికను ఒక శక్తివంతమైన సాధనంగా మలచాలి. ముఖ్యంగా రోజు రోజుకు తీవ్రతరమవుతున్న విప్లవ పరిస్థితులలో ప్రజలను సంఘటితం పరిచి స్వీయాత్మ శక్తులను పెంచేందుకు పత్రికను సమిష్టి ప్రచార కర్తగానూ, సమిష్టి ఆందోళన కర్తగానూ, సమిష్టి ఆర్గనైజర్‌గానూ మలుచుకోవాలి. ఇందుకు ప్రతి కార్యకర్త తన వంతు కర్తవ్యాన్ని విధిగా నిర్వహించాలి.

మన పార్టీ క్యాడర్లు, కార్యకర్తలు తమ కర్తవ్య నిర్వహణలో భాగంగా పత్రికతో సజీవ సంబంధాన్ని ఏర్పర్చుకోవాలి. సజీవ సంబంధం అంటే వారు తమ కార్యక్షేత్రాల నుండి వివిధ విషయాలకు చెందిన సమాచారాన్నీ, పోరాట అనుభవాలను ఎప్పటికప్పుడు పత్రికకు పంపడంతో పాటు పత్రికలో వచ్చే సిద్ధాంత, రాజకీయ, ఎత్తుగడల పరమైన విషయాలను అధ్యయనం చేయడంతో పాటు ఆచరణకు మార్గదర్శకంగా ఎంచుకోవడమనే. ఇక నిర్దిష్టంగా చూసినప్పుడు ఆయా ప్రాంతాలకు చెందిన పార్టీ క్యాడర్లు స్థానిక తెగ, భూస్వామ్య ఆధిపత్య వ్యవస్థల స్వరూప స్వభావాలనూ, ప్రజల జీవన పరిస్థితులనూ, ప్రభుత్వ చట్టాలు, పథకాలు అమలులో జరుగుతున్న నిర్లక్ష్యాన్నీ, బహుళజాతి సంస్థల చొరబాటును నివేదికల రూపంలో పత్రికకు పంపాలి. పాలక వర్గాల ప్రజా వ్యతిరేక, సామ్రాజ్యవాద అనుకూల విధానాలనూ, పోలీసుల అణచివేతనూ దుష్ప్రచారాన్ని ఖండిస్తూ ఇచ్చిన పత్రికా ప్రకటనలనూ, ముద్రించిన కరపత్రాలను పంపాలి. అంతే కాకుండా దోపిడీ పాలక వర్గాలకూ, వారి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను సంఘటితపర్చి చేపట్టిన మిలిటెంట్ పోరాట అనుభవాలనూ, అందులో ప్రజలు నిర్వహించిన చురుకైన, సృజనాత్మకమైన పాత్రను పోరాట వార్తలుగా రాసి పంపాలి. వ్యవసాయ విప్లవాన్ని పురోగమింప జేయడంలో భాగంగా చేపడుతున్న విప్లవ సంస్కరణల రిపోర్టులను కూడా పంపాలి.

ఇలా పంపడం ద్వారా ఒక ప్రాంతంలోని సమాచారాన్ని, అనుభవాలను పత్రిక ద్వారా మరో ప్రాంతంలోని క్యాడర్లు తెలుసుకోగల్గుతారు. ఇలా తెలుసుకోవడం ద్వారా నూతన అనుభవాలను తమ ప్రాంతంలో అన్వయించుకోవడంతో పాటు బోల్షివిక్ స్ఫూర్తితో పోటీ పడి పని చేయడం పెరుగుతుంది. ఆర్గనైజర్లు పనిలో నైపుణ్యతను సాధించగల్గుతారు. అంతే కాకుండా వైవిధ్యం కల్గిన వివిధ అనుభవాలను ఎస్.జడ్.సి క్రోడీకరించి విప్లవ పురోగమనానికి అవసరమైన నూతన ఎత్తుగడలను రూపొందించి పత్రిక ద్వారా పార్టీ శ్రేణులకు అందించగల్గుతుంది.

మరో ముఖ్యమైన విషయమేమిటంటే బోల్షివీకరణ క్యాంపెయిన్‌లో భాగంగా మీకు వచ్చిన విలువైన అనుభవాలను పత్రికకు రాసి పంపాలి. ఉదాహరణగా ఇక్కడ ఒక సంఘటనను ప్రస్తావించుకుందాం. 1985లో ఎన్.టి.ఆర్ తెలుగుదేశం ప్రభుత్వం విప్లవోద్యమంపై ప్రకటించిన అప్రకటిత యుద్ధంలో మన ఆర్గనైజర్ల టీం(1+2)లు ప్రజలను కలవలేకపోయాయి. ఆ పరిస్థితులలో ఆహారం వండుకోవడం, వివిధ రూపాలలో సంపాదించుకోవడం జరిగింది. ఇలా కొన్ని రోజులు గడిచిన తరువాత ప్రజలకు దూరంగా వుండటం రక్షణ రీత్యా, నిర్మాణ రీత్యా సరైంది కాదని కామ్రేడ్స్ గుర్తించి ఒక ప్రాంతంలోని ఆర్గనైజర్ల టీంలు రోజు రాత్రి 8 గంటల తర్వాత గ్రామంలోని పేదల వాడలకు చేరుకొని ఒక దళ సభ్యుడు సెంట్రీ చేస్తుండగా మిగతా ఇద్దరు భుజం పైన కండువాలను పట్టుకొని ఇంటింటికి తిరిగి అన్నం అడుక్కున్నారు. అప్పటిదాకా ప్రజలు తమ కంటిపాపల్లో దాచుకున్న తమ బిడ్డలకు కన్నీరు కార్చుతూనే అన్నం పెట్టారు. పోలీసుల అమానుష చర్యలను ఖండించారు. ఇలా 20 రోజులు గడిచే సరికి ప్రజలు మన కామ్రేడ్స్‌ను రహస్యంగా తమ ఇళ్ళలోకి ఆహ్వానించారు. రక్షణ కల్పించి ఆహారం ఇచ్చారు. ఆ రోజుల్లో మన కామ్రేడ్స్ నిర్బంధంలో సైతం ప్రజల్ని అంటిపెట్టుకొని ఉండటానికి బోల్షివిక్ స్పిరిట్‌తో చేసిన కృషి, తదనంతరం పెరిగిన ఉద్యమానికి ఎంతో తోడ్పడింది. ఈ సందర్భంగా ఏ.పి రాష్ట్రకమిటీ ఆ కామ్రేడ్స్‌కు ప్రత్యేకంగా అభినందనలు తెలియచేసింది. ఇటువంటి సంఘటనలు మీ అనుభవంలోకి వస్తే, మీ కమిటీ ద్వారా పత్రికకు పంపాలి. ఇటువంటి అనుభవాలను ఎస్.జడ్.సి సాధారణీకరించి (మిగతా భాగం 52వ పేజీలో)